సాక్షి

సత్యమేవ జయతే

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 184

మంగళవారం 19-3-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'



'సూరీడు' నిప్పులు చెరిగేదెప్పుడు?

మరో 3 రోజుల్లో ఐపీఎల్.. నిలకడలేమితో సన్‌రైజర్స్ హైదరాబాద్ - 12లో



ఐడీబీఐపై ఫెయిర్‌ఫాక్స్ కన్ను


నగదు రూపేణా కొనుగోలుకు రెడీ.. ఆర్థిక శాఖతో సంప్రదింపులు షురూ - 13లో



'శక్తి' అంతమే విపక్షాల లక్ష్యం

'శక్తి' అంతమే తమ లక్ష్యమన్న కాంగ్రెస్ నేత రాహుల్ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ స్పందిస్తూ శక్తి ఉపాసనే తమ సంకల్పమన్నారు.

వివరాలు 6లో ▸



బాండ్ల నంబర్లేవి?

ఎన్నికల బాండ్ల వివరాల వెల్లడిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీరుపై సుప్రీంకోర్టు మరోసారి మండిపడింది.

వివరాలు 6లో ▸



ఈడీ విచారణకు కేజ్రీవాల్ డుమ్మా

మద్యం స్కామ్ కేసులో ఈడీ విచారణకు పలుమార్లు గైర్హాజరైన ఢిల్లీ సీఎం కేజ్రీవాల్.. జల మండలి కేసులోనూ హాజరవ్వలేదు.

వివరాలు 6లో ▸



మూడో ప్రపంచ యుద్ధమే..!

రష్యా అధ్యక్షుడిగా పుతిన్ ఐదోసారి ఎన్నికయ్యారు. నాటో, రష్యా మధ్య ఘర్షణ చెలరేగితే ప్రపంచయుద్ధానికి దారి తీస్తుందన్నారు.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్‌చెక్

అది మీ బాబు రూటు

- చంద్రబాబు తప్పులను జగన్‌పై రుద్దడానికి రామోజీ విష కథనం
- 2014 ఓటర్ల జాబితాలో 35 లక్షల దొంగ ఓట్లు
- 2019లో సేవామిత్ర యాప్ ద్వారా వైఎస్సార్‌సీపీ ఓట్ల తొలగింపునకు కుట్ర
- ఈసీకి ఫిర్యాదుతో తిరిగి చేర్చిన 31,97,473 ఓట్లు
- 99.9% స్వచ్ఛతతో జాబితా
- సీఈసీ రాజీవ్ స్పష్టీకరణ

10లో

27 నుంచి బస్సు యాత్ర

ఇడుపులపాయ నుంచి వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచార భేరి

శ్రీకారం చుట్టనున్న సీఎం వైఎస్ జగన్

- సిద్ధం సభలు నిర్వహించిన నాలుగు జిల్లాల్లో మినహా మిగతా జిల్లాల్లో బస్సు యాత్ర
- 21 రోజులపాటు ఇచ్ఛాపురం వరకు కొనసాగింపు.. ప్రతి రోజూ ఒక జిల్లాలో ఉదయం వివిధ వర్గాల ప్రజలతో సమావేశం
- ప్రభుత్వ పనితీరు మరింత మెరుగవ్వడం కోసం వారి నుంచి సలహాలు, సూచనల స్వీకరణ.. సాయంత్రం సభకు ఆ పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి తరలిరానున్న పార్టీ శ్రేణులు
- బస్సు యాత్ర పూర్తయ్యే వరకు ప్రజా క్షేత్రంలోనే ముఖ్యమంత్రి
- ఇప్పటికే నాలుగు సిద్ధం సభలు సూపర్ హిట్
- 175 శాసనసభ, 24 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థుల ఖరారు
- 58 నెలల్లో చేసిన మంచిని వివరించనున్న వైఎస్ జగన్
- 2014లో ఇచ్చిన హామీలు అమలు చేయని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి.. ఇప్పుడు అదే కూటమి మళ్లీ మోసం చేయడానికి వస్తోందని ప్రజలను అప్రమత్తం చేయనున్న జననేత
- ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యేలోగా తొలి విడత ప్రచారం పూర్తి చేసేలా ప్రణాళిక

2లో



• మేమంతా సిద్ధం

ప్రతి గ్రామానికి వెళ్లండి.. ప్రజల ఆశీర్వాదం తీసుకోండి

- ఎన్నికల షెడ్యూల్‌తో అభ్యర్థులకు సరిపడా సమయం
- అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి
- సిద్ధం సభల తరహాలో బస్సు యాత్ర సభలు విజయవంతం కావాలి
- పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తల సమావేశంలో సీఎం దిశానిర్దేశం

2లో



ఆదివారం జరిగిన చిలకలూరిపేట సభలో జనం లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

కూటమి ఆశలు పటాపంచలు

మూడు పార్టీల అనైతిక కలయికకు ప్రజా స్పందన కరవు

తాడేపల్లిగూడెం, చిలకలూరిపేట సభలు రెండూ అట్టర్ ఫ్లాపే

- కాపు, కమ్మ సామాజికవర్గాలు బలంగా ఉండే ప్రాంతాలైనా ప్రయోజనం శూన్యం
- చిలకలూరిపేట సభ జరిగిన తీరుపై మూడు పార్టీల నాయకులు, కార్యకర్తల్లో నైరాశ్యం
- ప్రధాని మోదీకి సభలో అవమానం
- జనం వచ్చారని చెప్పుకోవడానికి రోడ్డుపై కార్లు అడ్డంపెట్టి ట్రాఫిక్‌జామ్ చేసిన నేతలు
- 2,500 ఆర్టీసీ బస్సులు అడిగి.. ఆఖరి నిమిషంలో 1,540 బస్సులు క్యాన్సిల్
- మైక్ టవర్లపై కార్యకర్తలను ఎక్కించి టీడీపీ అతి.. చురకలు వేసిన ప్రధాని
- ఐదేళ్ల క్రితం విడిపోయి ఇప్పుడెందుకు కలిశారో చెప్పలేక పోతున్న మూడు పార్టీల నేతలు
- తాడేపల్లిగూడెం సభలో సీఎం జగన్‌పై తిట్ల దండకానికే పరిమితం
- చిలకలూరిపేటలో మోదీపై బాబు, పవన్ పొగడ్తలు, సీఎం జగన్‌పై అవే విమర్శలు.. రాష్ట్ర అభివృద్ధికి ఏం చేస్తారో ఒక్క మాటా చెప్పలేదు
- షర్మిల అంశంలో భిన్న వైఖరి

5లో

నీట్ దరఖాస్తులో

సవరణలకు అవకాశం



- దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్, తదితర వైద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్ యూజీ ఆన్‌లైన్ దరఖాస్తులో సవరణ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమైంది. దీని కోసం బుధవారం అర్ధరాత్రి 11:59 గంటల వరకు ఎన్‌టీఏ గడువు ఇచ్చింది. దీంతో విద్యార్థులు తమ ఆన్‌లైన్ దరఖాస్తులను మరోసారి పరిశీలించి మార్పులు, చేర్పులు చేసుకోవడానికి అవకాశం లభించింది.

14లో

పోలింగ్ శాతం పెంచండి

గతంలో తక్కువ శాతం నమోదైన పోలింగ్ కేంద్రాలు.. అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలు గుర్తించండి

- ఓటర్ల భాగస్వామ్యం పెంచేందుకు ప్రణాళికలు అమలుచేయండి
- పట్టణ ప్రాంతాల ఓటర్లు, యువత ఉదాసీనతపై దృష్టిపెట్టండి
- 2019 లోక్‌సభ ఎన్నికల్లో దేశంలోని పట్టణాల్లో కేవలం 67.4 శాతమే పోలింగ్
- అప్పట్లో రాష్ట్రంలోని 17 అసెంబ్లీ నియోజకవర్గాల్లో తక్కువ పోలింగ్
- ఆ ఎన్నికల్లో ఏపీలో 79 శాతం పోలింగ్.. ఇప్పుడు 83 శాతం లక్ష్యం
- సీఈఓలు, జిల్లాల ఎన్నికల అధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశం



సాక్షి, అమరావతి: త్వరలో జరగనున్న లోక్‌సభ, వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని వీలైనంత ఎక్కువగా పెంచేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో దేశంలోని పట్టణ ప్రాంతాల్లో ఉన్న ఓటర్లు, యువత పోలింగ్‌కు రాకుండా ఉదాసీనంగా వ్యవహరించడంతో ఆ ప్రాంతాల్లో కేవలం 67.4 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. ఇప్పుడు జరగనున్న ఎన్నికల్లో ఆయా ప్రాంతాల్లో పోలింగ్ శాతం పెంచడాన్ని కేంద్ర ఎన్నికల సంఘం సవాల్‌గా తీసుకుంది. ఇందులో భాగంగా.. తీసుకోవాల్సిన చర్యలపై అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు, జిల్లాల ఎన్నికల అధికారులకు పలు ఆదేశాలు జారీ చేసింది. గత ఎన్నికల్లో

మిగతా 10వ పేజీలో ▶


టీడీపీ బీసీల వ్యతిరేక పార్టీ



మీడియాతో మాట్లాడుతున్న రావూరి ఈశ్వరరావు

- అందుకే మా కుటుంబాన్ని రోడ్డున పడేసింది
- రూ.340 కోట్లు విలువ చేసే ఫ్యాక్టరీని మూయించారు
- నలుగురు నేతలు నన్ను దారుణంగా అవమానించారు
- మీడియా సమావేశంలో ప్రముఖ పారిశ్రామికవేత్త రావూరి ఈశ్వరరావు ఫైర్
- టీడీపీకి రాజీనామా.. వైఎస్సార్‌సీపీలో చేరిక

5లో



అభ్యర్థులు దొరక్క అగచాట్లు

పొత్తులు, సమీకరణలతో నాన్చుతున్న చంద్రబాబు

- ఎంపీ సీట్ల విషయంలో టీడీపీ అధినేత మల్లగుల్లాలు
- పార్టీ నేతల్లో పెరిగిపోతున్న అసహనం
- ఏలూరు, నరసాపురం, రాజంపేట, కర్నూలు, నంద్యాల, చిత్తూరు తదితర ఎంపీ స్థానాలపై గందరగోళం
- కొన్నిచోట్ల ఎమ్మెల్యే అభ్యర్థులూ దొరక్క ఆందోళన..
- బీజేపీ సీట్లపైనా తేల్చలేకపోతున్న బాబు
- నిర్ణయాలు తీసుకోలేకపోతున్న అధినేత తీరుపై కారాలు నూరుతున్న నేతలు

3లో



పొత్తు పెట్టుకున్న తర్వాత కూడా ఆయన మీద మీకు ఇంకా కక్ష ఎందుకు సార్!

మరికొంతకాలం 'ఈవీ'లకు ఊరట

ఈనెల 31తో ముగుస్తున్న ఫేమ్-2 పథకం స్థానంలో ఈ-మొబిలిటీ ప్రమోషన్ స్కీమ్



- విద్యుత్ వాహనాల కోసం రూ. 500 కోట్లతో కేంద్రం కొత్త పథకం
- ఏప్రిల్ 1 నుంచి జూలై చివరి వరకూ కొనే వాహనాలకు వర్తింపు
- టూ వీలర్లకు రూ. 25 వేలు, త్రీ వీలర్లకు రూ. 50 వేల వరకూ ప్రయోజనం.. దేశానికే ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్ ఈవీ విధివిధానాలు

సాక్షి, అమరావతి: ఎలక్ట్రిక్ వెహికల్స్(ఈవీ)ను కొనాలనుకునేవారికి కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈ నెలాఖరుతో ఫేమ్-2 పథకం ముగుస్తున్న తరుణంలో మరో కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్రమోషన్ స్కీమ్ పేరుతో తీసుకువచ్చిన ఈ పథకానికి రూ.500 కోట్లు కేటాయించింది. మార్చి 31తో ఫేమ్-2 పూర్తవగానే ఏప్రిల్ 1 నుంచి కొత్త పథకం అమలులోకి వస్తుందని కేంద్ర పునరుత్పాదక విద్యుత్ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ పథకం ఈ ఏడాది జూలై చివరి వరకూ అమలులో ఉండనుంది. దీని ప్రకారం కొత్తగా విద్యుత్ వాహనాలు కొనుగోలు చేసే వారికి

మిగతా 10వ పేజీలో ▶



బాపట్ల జిల్లా మేదరమెట్ల సమీపంలో జాతీయ రహదారిపై యుద్ధ విమానాల ల్యాండింగ్ సందర్భంగా సుఖోయ్ విన్యాసం

రహదారే.. రన్‌వే

బాపట్ల జిల్లా మేదరమెట్ల వద్ద జాతీయ రహదారిపై యుద్ధ విమానాల ల్యాండింగ్ సక్సెస్

- ట్రయల్ రన్ వేసిన సుఖోయ్ 30, హాక్, ఏఎన్-32, డార్నియర్ విమానాలు
- పటిష్ట భద్రత మధ్య విజయవంతంగా ల్యాండింగ్, టేకాఫ్
- సంతోషం వ్యక్తం చేసిన వైమానిక దళ అధికారులు

14లో

జనసేన దుకాణం క్లోజ్!



- ఉత్తరాంధ్రలో జనసేన కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు విశాఖలోని మాధవధారలో ఏర్పాటు చేసిన ఆ పార్టీ కార్యాలయం మూతపడింది. ఇప్పుడక్కడ ఆ భవన యజమాని టు లెట్ బోర్డు కూడా పెట్టారు. పార్టీ కార్యాలయ ఖర్చును భరించేందుకు స్థానిక నేతలెవరూ ముందుకు రాక పోవడం, కనీసం అద్దె కూడా చెల్లించక పోవడంతోనే భవనం యజమాని ఖాళీ చేయించినట్టు సమాచారం.

10లో

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

మా బతుకులకు చింతలేదు



మాది అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండలం డి.పోలవరప్పాడు. మా గ్రామంలో మాకు కొద్దిపాటి భూమి ఉంది. కడుపు నింపుకోవడానికి నా భార్య రామయ్యమ్మతో కలిసి కూలి పనుల కోసం వలస వెళ్లేవాళ్లం. వచ్చిన సొమ్ముతో కుటుంబ పోషణ జరిగేది. జగనన్న ప్రభుత్వం వచ్చాక మా పేద కుటుంబాన్ని నవరత్నాల పథకాలు ఎంతో ఆదుకున్నాయి. రైతు భరోసా కింద ఏటా నాకు అందిన రూ.13,500 సొమ్మును జీడి మామిడి తోట సాగుకు ఉపయోగించా. దిగుబడి బాగుండడంతో అప్పులు తీర్చేశా. దీంతో పాటు నాకు ప్రతి నెలా వైఎస్సార్ పింఛన్ వస్తోంది. నా భార్య డ్వాక్రా గ్రూపు సభ్యురాలు. ఆమెకు చేయూత పథకం కింద నాలుగు విడతల్లో రూ.75,000 జమయింది. నా కుమార్తె సావిత్రి నాలుగో తరగతి చదువుతోంది. ఏటా అమ్మఒడి సొమ్ము వచ్చింది. నా బిడ్డకు జగనన్న విద్యా కానుక ద్వారా పుస్తకాలు, బ్యాగులు, షూ తదితర సామగ్రి అందుతోంది. సీఎం జగనన్న వల్ల మా కుటుంబానికి కలిగిన మేలు ఎప్పటికీ మరిచిపోం. మా బతుకులకు ఎటువంటి చింతా లేదు. మళ్లీ ఆయనే సీఎంగా రావాలి.

– వంతల బిరసయ్య, డి.పోలవరప్పాడు
(సింగిరెడ్డి శ్రీనివాసరావు, విలేకరి, అడ్డతీగల)

సొంతింటి కల నెరవేరింది



నా భర్త 30 ఏళ్ల క్రితమే వదిలేశాడు. విశాఖ పట్నంలోని 89వ వార్డు నాగేంద్ర కాలనీలో ఉంటున్న అక్క ఇంటి వద్దే నివసిస్తున్నాను. మా అక్కకు చిన్న టీ దుకాణం ఉంది. అక్కడే పని చేస్తూ జీవిస్తున్నా. నాకు ఒక పాప. పాపను ట్రిబుల్ ఐటీ చదివించాను. ఇపుడు ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. గత ప్రభుత్వంలో నాకు ఏ ప్రయోజనం అందలేదు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒంటరి మహిళ పింఛను రూ.3,000 వస్తోంది. చేయూత ద్వారా రూ.18,750 అందుకున్నా. ఇప్పుడు నాకు ఇంటి స్థలం వచ్చింది. ఇంటి నిర్మాణం జరుగుతోంది. ఆ ఇంటి విలువ సుమారు రూ.35 లక్షలు ఉంటుందని చెబుతున్నారు. నా ఇంటి కల జగనన్న వల్లే నెరవేరింది.

– షేక్ అన్నపూర్ణ, నాగేంద్ర కాలనీ 89వ వార్డు, విశాఖపట్నం సిటీ
(చింతాడ వెంకటరమణ, విలేకరి, గోపాలపట్నం)

కూలి పని మానేసి వెల్డింగ్ షాపు పెట్టుకున్నా



మాది పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం తేతలి. షాపులో కూలిగా పని చేసుకునే నేను సొంతంగా షాపు పెట్టుకునే స్థాయికి ఎదిగాను. ఇదంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాల పుణ్యమే. ఏడో తరగతి వరకూ చదువుకున్న నేను 2019 వరకు ఒక వెల్డింగ్ షాపులో రోజువారీ కూలీగా పనిచేశా. నాకు భార్య, ముగ్గురు పిల్లలు. డ్వాక్రా సంఘంలో సభ్యురాలిగా ఉన్న నా భార్య నాగ వెంకట జ్యోతికి రూ.70 వేల రుణం మంజూరైంది. ఆ సొమ్ముతోపాటు మరికొంత జత చేసి మా ఊళ్లోనే గీతిక వెల్డింగ్ షాపు పేరుతో సొంతంగా పనులు చేయడం ప్రారంభించా. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాల ద్వారా మా కుటుంబానికి చేకూరిన రూ.36 వేలు, సున్నా వడ్డీ ద్వారా వచ్చిన రూ.5,028.. షాపు నడపడానికి అవసరమైన పెట్టుబడిని సమకూర్చాయి. ఆ తర్వాత జగనన్న కాలనీలో ఇంటి స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం మంజూరైంది. ఇంటి స్థలం విలువతో కలిపి జగనన్న ప్రభుత్వ హయాంలో నాకు మొత్తం రూ.5.47 లక్షల మేర ప్రయోజనం చేకూరింది.

– గారపాటి నాగరాజు, తేతలి
(కె.కృష్ణ, విలేకరి, తణుకు టౌన్)

27 నుంచి బస్సు యాత్ర

సాక్షి, అమరావతి: పేదింటి భవిష్యత్తును మరింత గొప్పగా మార్చేందుకు.. మరోసారి చారిత్రక విజయాన్ని సొంతం చేసుకుని అధికారంలోకి రావడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 27న వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ నుంచి ప్రచార భేరి మోగించనున్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్ వద్ద నివాళులు అర్పించి.. ఎన్నికల సంగ్రామానికి 'మేమంతా సిద్ధం' పేరుతో బస్సు యాత్రకు శ్రీకారం చుట్టనున్నారు. ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు దాదాపు 21 రోజులపాటు బస్సు యాత్ర కొనసాగనుంది. పార్టీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేయడానికి సిద్ధం సభలు నిర్వహించిన నాలుగు జిల్లాలు (విశాఖపట్నం, ఏలూరు, అనంతపురం, బాపట్ల) మినహా మిగతా జిల్లాల్లో బస్సు యాత్ర జరగనుంది. ప్రతి రోజూ ఒక పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో బస్సు యాత్ర కొనసాగనుంది. ఈ యాత్రలో ఉదయం పూట వివిధ వర్గాలు, రంగాల ప్రజలతో సీఎం జగన్ సమావేశమవుతారు. ప్రభుత్వ పనితీరును మరింతగా మెరుగు పర్చుకోవడానికి సలహాలు, సూచనలు స్వీకరిస్తారు. కొందరు పార్టీ కార్యకర్తలను, అభిమానులను కూడా కలుస్తారు. సాయంత్రం పార్లమెంట్ నియోజకవర్గంలో బహిరంగ సభ ఉంటుంది. ఆ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ఈ సభకు తరలి రానున్నారు. బస్సు యాత్ర ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యే వరకు సీఎం జగన్ పూర్తిగా ప్రజలతో మమేకం కానున్నారు. యాత్రలోనే ఎక్కడికక్కడ విడిది చేయనున్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశామని చెబుతూ.. ప్రతి ఇంటికీ మేలు చేశామని వివరించనున్నారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో 2014లో వ్యవసాయ రుణాల మాఫీ, డ్వాక్రా రుణాల మాఫీ, ఇంటికో ఉద్యోగం లేదా నెలకు రూ.2 వేల నిరుద్యోగ భృతి వంటి వాటితోపాటు 650 హామీలు ఇచ్చిన చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి.. వాటిని అమలు చేయకుండా మోసం చేయడాన్ని కూడా ప్రజలకు విశదీకరించి చెప్పనున్నారు. అప్పట్లో మోసం చేసిన కూటమి మరోసారి జట్టుకట్టి మళ్లీ వస్తోందంటూ ప్రజలను అప్రమత్తం చేయనున్నారు. మీ బిడ్డ ప్రభుత్వం వల్ల మీ ఇంటికి మంచి జరిగి ఉంటే.. మీ బిడ్డకు అండగా నిలవాలని ప్రజలకు విజ్ఞప్తి చేయనున్నారు.

ఇడుపులపాయ నుంచి వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచార భేరి



కదనోత్సాహంలో పార్టీ శ్రేణులు

ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన సీఎం జగన్.. గత 58 నెలల్లో డీబీటీ రూపంలో 2.70 లక్షల కోట్లు, నాన్ డీబీటీ రూపంలో రూ.1.79 లక్షల కోట్లు వెరసి రూ.4.49 లక్షల కోట్ల ప్రయోజనాన్ని 87 శాతం కుటుంబాలకు చేకూర్చారు. విద్య, వైద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో విప్లవాత్మక సంస్కరణల ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపారు. గ్రామ, వార్డు సచివాలయాలు–వలంటీర్ల వ్యవస్థ, జిల్లాల పునర్ వ్యవస్థీకరణ ద్వారా గుమ్మం వద్దకే ప్రజలకు ప్రభుత్వ సేవలను అందిస్తున్నారు. చేసిన మంచిని ప్రతి ఇంటా వివరించి.. ఆశీర్వాదం తీసుకోవడానికి చేపట్టిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. గత 58 నెలల పాలనలో వచ్చిన విప్లవాత్మక మార్పులు ప్రతి నియోజకవర్గం, ప్రతి గ్రామం, ప్రతి ఇంటా కనిపిస్తున్నప్పుడు 175కు 175 శాసనసభ, 25కు 25 లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించడం సుసాధ్యమేనని సీఎం జగన్.. శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ భీమిలి, దెందులూరు, రాప్తాడు, మేదరమెట్లలో నిర్వహించిన సిద్ధం సభలకు సముద్రంతో పోటీ పడుతూ జనం హాజరయ్యారు. రాప్తాడు, మేదరమెట్ల సభలు రాష్ట్ర చరిత్రలో అతి పెద్ద ప్రజా సభలుగా నిలిచాయి. ఎన్నికలకు ముందే వైఎస్సార్‌సీపీ ప్రభంజనం 'సిద్ధం' సభల్లో కళ్లకు కట్టినట్లు కన్పించడంతో పార్టీ శ్రేణులు కదనోత్సాహంతో కదం తొక్కుతున్నాయి.

క్లీన్ స్వీప్ లక్ష్యంగా అడుగులు

టీడీపీ–జనసేన–బీజేపీ శ్రేణులు నైతిక స్థైర్యం కోల్పోయి కకావికలమైతే.. వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్ కనిపిస్తోంది. ఈ దశలో సీఎం జగన్ బస్సు యాత్ర వారిలో మరింత ఉత్సాహాన్ని నింపనుంది. క్లీన్ స్వీప్ లక్ష్యంగా ముఖ్యమంత్రి అడుగులు ముందుకు వేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులను 'మేం సిద్ధం .. మా బూత్ సిద్ధం.. ఎన్నికల సమరానికి మేమంతా సిద్ధం' పేరుతో గ్రామ స్థాయి నుంచి మరింత పటిష్టంగా ఎన్నికలకు సన్నద్ధం చేసేలా సీఎం జగన్ దిశా నిర్దేశం చేస్తారు. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18న విడుదల కానున్న నేపథ్యంలో, ఆలోగా తొలి దశ ప్రచారంగా బస్సు యాత్ర పూర్తి చేయాలని నిర్ణయించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడ్డాక మలి విడత ప్రచారాన్ని చేపట్టనున్నారు.

టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి కకావికలు

వైఎస్సార్‌సీపీ సిద్ధం సభలు సూపర్ హిట్ కావడంతో టీడీపీ శ్రేణులు కకావికలమయ్యాయి. జననేతతో టీడీపీ పొత్తు లెక్క తేలాక, రెండు పార్టీలు ఉమ్మడిగా తాడేపల్లిగూడెంలో నిర్వహించిన జెండా సభ జనం లేక అట్టర్‌ఫ్లాప్ కావడంతో ఆ పార్టీల శ్రేణులు నైతిక స్థైర్యం కోల్పోయాయి. ఈ క్రమంలోనే ఒకే రోజు 175 శాసనసభ, 24 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసిన సీఎం వైఎస్ జగన్.. అందులో వంద స్థానాలు అంటే 50 శాతం స్థానాలను బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాలకు ఇవ్వడంతో ఆ వర్గాల్లో హర్షాతిరేకాలు మిన్నంటాయి. శాసనసభ, లోక్‌సభ నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఇంటింటా ప్రచారం చేస్తూ ప్రజా క్షేత్రంలో దూసుకెళ్తున్నారు. మరో వైపు నైతిక స్థైర్యం కోల్పోయిన శ్రేణుల్లో ధైర్యాన్ని నింపేందుకు ఢిల్లీ వెళ్లి బీజేపీ పెద్దల కాళ్లావేళ్లా పడి ఆ పార్టీతో పొత్తు కుదుర్చుకున్నాక.. మూడు పార్టీలు కలిసి చిలకలూరిపేటలో నిర్వహించిన ప్రజాగళం సభలో ప్రధాని మోదీ పాల్గొన్నప్పటికీ జనం మొహం చాటేయడంతో అట్టర్ ఫ్లాప్ అయ్యింది. దాంతో మూడు పార్టీల కార్యకర్తలే కాదు నేతలూ పూర్తిగా డీలాపడ్డారు.

ఉద్యాన 'ఘనం'..

గతంతో పోలిస్తే భారీగా పెరిగిన ఉద్యాన పంటలు

- ప్రభుత్వ ప్రోత్సాహంతో ఉద్యాన పంటల వైపు రైతులు
- 2019–23 మధ్య 7.49 లక్షల ఎకరాల్లో కొత్తగా ఉద్యాన పంటల సాగు
- అత్యధికంగా 1.69 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్..
- 1.26 లక్షల ఎకరాల్లో కొత్తగా మామిడి తోటలు..
- 84 వేల ఎకరాల్లో కొత్తగా బత్తాయి తోటలు..
- సన్న, చిన్నకారు రైతులకు ప్రోత్సాహకాలు, రాయితీలు
- లాభసాటి కాని వ్యవసాయ, వాణిజ్య పంటల నుంచి మళ్లింపు



సాక్షి, అమరావతి : రాష్ట్రాన్ని ఉద్యాన హబ్‌గా తీర్చిదిద్దేందుకు గడిచి నాలుగున్నరేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషి సత్ఫలితాలిచ్చింది. ముఖ్యంగా సాగు విస్తీర్ణం తగ్గకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూనే లాభసాటి కాని వ్యవసాయ, వాణిజ్య పంటల స్థానంలో ఉద్యాన పంటలు విస్తరించేలా ప్రోత్సహించడంలో సఫలీకృతమైంది. రాష్ట్రంలో 2018–19 నాటికి 42.51 లక్షల ఎకరాల్లో సాగవుతున్న ఉద్యాన పంటలు నేడు 45.76 లక్షల ఎకరాల్లో సాగవుతున్నాయి. 4.23 లక్షల ఎకరాల్లో పాత తోటలను పునరుద్ధరించగా, కొత్తగా 3.25 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చాయి. అలాగే, 2018–19 నాటికి 305 లక్షల టన్నులున్న దిగుబడులు 2022–23లో 368.83 లక్షల టన్నులు రాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 380 లక్షల టన్నులు దాటే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఫ్రూట్‌బౌల్‌గా గుర్తింపు పొందిన ఆంధ్రప్రదేశ్.. కొబ్బరి, బొప్పాయి, టమోటాలో మొదటి స్థానం, బత్తాయి, అరటి, వంగ, మిర్చి, ఆయిల్‌పామ్‌లో రెండో స్థానం, మామిడి, ఉల్లి, జీడిపప్పులో మూడో స్థానంలో ఉంది. టీడీపీ హయాంలో సంప్రదాయ పంటలైన మామిడి, జీడిమామిడి, సపోటా, బొప్పాయి వంటి పంటలను ఉపాధి హామీ పథకం కింద ప్రోత్సహించే వారు. ఏడాదికి 50వేల ఎకరాలు సాగులోకి రావడం గగనంగా ఉండేది. పంటల మార్పిడిని ప్రోత్సహించాలన్న ఆలోచన కూడా చేయలేదు.

బోర్ల కింద ఉద్యాన పంటలు..

మరోవైపు.. పంటల వారీగా అమలుచేసిన ఏరియా ఎక్స్‌పాన్షన్ (విస్తరణ) ప్రాజెక్టులు కూడా సత్ఫలితాలిచ్చాయి. పెద్దఎత్తున రాయితీలు, ప్రోత్సాహకాలిచ్చి ప్రోత్సహించడంతో లాభసాటి కాని వ్యవసాయ, వాణిజ్య పంటలు సాగుచేసే రైతులు ఉద్యాన పంటల వైపు మళ్లారు. రాయలసీమ జిల్లాల్లో బోర్ల కింద వేరుశనగ, వరి స్థానంలో అరటి, బత్తాయి, బొప్పాయి, దానిమ్మ, మామిడి.. దక్షిణ కోస్తా జిల్లాల్లో పొగాకు, సుబాబుల్, యూకలిప్టస్ స్థానంలో నిమ్మ, బత్తాయి, అరటి, మామిడి.. కృష్ణా, గోదావరి రీజియన్‌లో మొక్కజొన్న, చెరకుతో పాటు బోర్ల కింద వరి స్థానంలోనూ ఆయిల్‌పామ్, కొబ్బరి, కోకో, జామ, ఉత్తర కోస్తా జిల్లాల్లో క్యాసిరినాతో పాటు బోర్‌వెల్స్ కింద వరి స్థానంలో ఆయిల్ పామ్, జీడిమామిడి, కొబ్బరి తోటలను విస్తరించగలిగారు. గతంతో పోలిస్తే అంతర పంటల సాగు కూడా పెరిగింది.

పెరిగిన ఆయిల్‌పామ్, మామిడి తోటలు..

పంటల మార్పిడి ద్వారా ఈ ఐదేళ్లలో వరుసగా 2019–20లో 1,36,628 ఎకరాలు, 2020–21లో 1,44,298 ఎకరాలు, 2021–22లో 1,56,173 ఎకరాలు, 2022–23 1,58,532 ఎకరాలు, 2023–24లో 1,58,532 ఎకరాల చొప్పున పంటల మార్పిడి ద్వారా ఈ ఐదేళ్లలో 7,54,163 ఎకరాలు కొత్తగా సాగులోకి వచ్చాయి. ప్రధానంగా 1.69 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్, 1.26 లక్షల ఎకరాల్లో మామిడి, 92వేల ఎకరాల్లో జీడిమామిడి, 84వేల ఎకరాల్లో బత్తాయి, 51వేల ఎకరాల్లో అరటి, 36వేల ఎకరాల్లో కూరగాయలు, 33వేల ఎకరాల్లో కోకో, 25 వేల ఎకరాల్లో కొబ్బరి, 24వేల ఎకరాల్లో జామ, 22వేల ఎకరాల్లో పూలతోటలు, 19 వేల ఎకరాల్లో నిమ్మ, 12వేల ఎకరాల్లో దానిమ్మతో పాటు నేరేడు, సపోటా, డ్రాగన్ ఫ్రూట్, చింత, సీతాఫలం వంటి పంటల సాగు విస్తరించింది. ఎకరాకు రూ.15వేల చొప్పున రూ.1,123.82 కోట్లకు పైగా ఖర్చుచేశారు.

ఫలించిన పంటల మార్పిడి..

సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు లాభసాటి కాని వ్యవసాయ, వాణిజ్య పంటల స్థానే ఉద్యాన పంటలను ప్రోత్సహించాం. ఐదేళ్లలో రికార్డు స్థాయిలో పంటల మార్పిడి ద్వారా 7.49 లక్షల ఎకరాలు సాగులోకి తీసుకురాగా, వీటిలో 3.25 లక్షల ఎకరాలు కొత్తగా సాగులోకి వచ్చాయి. 4.23 లక్షల ఎకరాల్లో పాత పంటల స్థానే కొత్త పంటలు సాగులోకి వచ్చాయి. వివిధ స్కీమ్‌ల ద్వారా అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలవల్లే ఇది సాధ్యమైంది.

– డాక్టర్ ఎస్ఎస్ శ్రీధర్, కమిషనర్, ఉద్యాన శాఖ

రాయితీలు.. ప్రోత్సాహకాలతో..

ఈ 57 నెలల్లో కొత్తగా 269 ఉద్యాన రైతు ఉత్పత్తిదారుల సంఘాల(ఎఫ్‌పీఓ)ను ఏర్పాటుచేశారు. 143 ఎకరాల్లో షేడ్‌నెట్స్‌కు రూ. 10.52 కోట్లు, 24.55 ఎకరాలలో పాలీహౌస్‌ల నిర్మాణంకోసం రూ. 3.68 కోట్లు ఖర్చుచేశారు. ఈ నాలుగున్నరేళ్లలో 29.83 ఎకరాల్లో కూరగాయల రైతులకు రూ.75.70 లక్షలు, 172.65 ఎకరాల్లో పువ్వులు సాగుచేసే రైతులకు రూ.5.85 కోట్లు చొప్పున ఆర్థిక చేయూతనిచ్చారు. కోత అనంతర నష్టాలను నివారించేందుకు ఎఫ్‌పీఓల కోసం ప్రత్యేకంగా 940 ఉద్యాన సేకరణ కేంద్రాలతోపాటు 340 కోల్డ్‌స్టోరేజ్‌ల నిర్మాణం చేపట్టారు. ఇందులో భాగంగా.. ఇప్పటికే 462 కలెక్షన్ సెంటర్లు, 84 కోల్డ్‌రూమ్స్‌ను ఎఫ్‌పీఓలకు అందించారు. 2,905 మంది రైతులకు వ్యక్తిగతంగా ప్యాక్‌హౌస్‌లను నిర్మించి ఇచ్చారు. వీటి ద్వారా 2.44 లక్షల టన్నుల అదనపు సామర్థ్యం ఏర్పడింది.

ప్రతి గ్రామానికి వెళ్లండి.. ప్రజల ఆశీర్వాదం తీసుకోండి

- ఎన్నికల షెడ్యూల్‌తో అభ్యర్థులకు సరిపడా సమయం
- అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి
- సిద్ధం సభల తరహాలో బస్సు యాత్ర సభలు విజయవంతం కావాలి
- పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తల సమావేశంలో సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం



సాక్షి, అమరావతి : ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూలుతో అభ్యర్థులకు మరింత సమయం లభించిందని, ప్రతి గ్రామ సచివాలయాన్ని సందర్శించి.. ప్రజల ఆశీర్వాదం తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశా నిర్దేశం చేశారు. ఈ వెసులుబాటును అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సోమవారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తలతో సీఎం జగన్ సమావేశమయ్యారు. మే 13న ఎన్నికల పోలింగ్ జరుగుతున్నందున అభ్యర్థులకు సరిపడా సమయం ఉందన్నారు. ఈ సమయాన్ని చక్కగా వినియోగించుకోవాలన్నారు. తమ నియోజకవర్గం పరిధిలోని ప్రతి గ్రామ సచివాలయాన్ని సందర్శించి.. వీలైనంత ఎక్కువ మంది ప్రజలను కలిసేలా అభ్యర్థులు కార్యక్రమాలు రూపొందించుకోవాలని సూచించారు. దీనిపై అభ్యర్థులకు మార్గ నిర్దేశం చేయాలని ప్రాంతీయ సమన్వయకర్తలను ఆదేశించారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా 81 అసెంబ్లీ నియోజకవర్గాల్లో, 18 పార్లమెంటు నియోజకవర్గాల్లో మార్పులు చేశామన్నారు. అభ్యర్థులకు ఇప్పుడున్న సమయం చాలా చక్కగా ఉపయోగపడుతుందన్నారు. ఆయా నియోజకవర్గాల్లోని పార్టీ శ్రేణులు, నాయకత్వాన్ని సంఘటిత పరిచి, వారిని ఏకతాటిపైకి తీసుకువచ్చి కలిసికట్టుగా ముందుకు సాగాలని దిశా నిర్దేశం చేశారు. 175కు 175 శాసనసభ, 25కు 25 లోక్‌సభ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు నడవాలని లక్ష్య నిర్దేశం చేశారు. ఈ దిశగా కలిసి వచ్చే ప్రతి అంశాన్నీ వినియోగించుకుని, ఘన విజయాలు నమోదు చేయాలని పిలుపునిచ్చారు. ప్రాంతీయ సమన్వయకర్తలు ఎప్పటికప్పుడు తమ తమ ప్రాంతాల్లో పరిస్థితులను తెలుసుకుంటూ అభ్యర్థులకు చేదోడు, వాదోడుగా నిలవాలని సూచించారు. బస్సు యాత్రను విజయవంతం చేయడానికి అన్ని రకాలుగా సిద్ధం కావాలని ఆదేశించారు. బస్సు యాత్రలో భాగంగా జరిగే సభలు.. సిద్ధం సభల తరహాలోనే చరిత్రాత్మకం కావాలని దిశా నిర్దేశం చేశారు.

వైఎస్సార్‌సీపీలోకి విశాఖ టీడీపీ సీనియర్ నేత గంపల

సతీసమేతంగా సీఎం వైఎస్ జగన్ సమక్షంలో పార్టీలో చేరిక

సాక్షి, అమరావతి: విశాఖపట్నం టీడీపీ సీనియర్ నేత గంపల వెంకటరామచంద్రరావు(వాడబలిజ సామాజికవర్గం), ఆయన సతీమణి సంధ్యారాణిలు వైఎస్సార్‌సీపీలో చేరారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో సోమవారం వారు పార్టీలో చేరారు. విశాఖపట్నం టీడీపీ సౌత్, ఈస్ట్ ఎలక్షన్ ఇన్‌చార్జిగా రామచంద్రరావు పనిచేశారు. గతంలో ఏపీసీసీ జాయింట్ సెక్రటరీగా, ఏపీసీసీ ఓబీసీ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేసిన రామచంద్రరావు.. సెన్సార్ బోర్డు మెంబర్‌గా, పోర్ట్ ట్రస్ట్ డైరెక్టర్‌గా కూడా పనిచేశారు.



సీఎం జగన్ సమక్షంలో పార్టీలో చేరిన డాక్టర్ కంచర్ల అచ్యుతరావు



గంపల దంపతులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

వైఎస్సార్‌సీపీలోకి డాక్టర్ కంచర్ల

విశాఖపట్నానికి చెందిన డాక్టర్ కంచర్ల అచ్యుతరావు సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. గతంలో ప్రజారాజ్యం పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన ఆయన.. ప్రస్తుతం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆరిలోవ ప్రాంతంలో పట్టున్న నేతగా గుర్తింపు పొందారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, వైజాగ్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గన్నమని వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

భారీ ప్రచారానికి సీఎం వైఎస్ జగన్ సిద్ధం



సాక్షి, అమరావతి: ఎన్నికల నేపథ్యంలో ఏపీ లో భారీ ప్రచారానికి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్ సిద్ధం అయ్యారని ఆ పార్టీ కార్యక్రమాల కో ఆర్డినేటర్, పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం వెల్లడించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్నినానితో కలసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 'మేమంతా సిద్ధం' పేరిట సీఎం జగన్ బస్సు యాత్ర చేపట్టనున్నారని, సిద్ధం సభలు నిర్వహించిన 4 జిల్లాలు/పార్లమెంటు నియోజకవర్గాలు మినహా మిగిలిన జిల్లాల్లో యాత్ర కొనసాగుతుందని చెప్పారు. ఈ మేరకు ప్రణాళిక రూపొందించామని ఈ నెల 27న బస్సు యాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. ఇప్పటికే పార్టీ శ్రేణులను ఎన్నికల సమరానికి సన్నద్ధం చేసే ప్రక్రియలో భాగంగా సిద్ధం పేరుతో 4 భారీ బహిరంగ సభలు నిర్వహించామన్నారు. వీటికి లక్షలాది మంది ప్రజలు తరలివచ్చి, సీఎం జగన్ పరిపాలన పట్ల మద్దతు ప్రకటించారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో పార్టీ కార్యకర్తలను, నాయత్వాన్ని సమాయత్తం చేయడానికి 'మేము సిద్ధం..మా బూత్ సిద్ధం' పేరిట కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం – ఎన్నికల సమరానికి మేమంతా సిద్ధం' లక్ష్యంతో బస్సు యాత్ర కొనసాగుతుందన్నారు. ఈ యాత్ర ప్రతి రోజూ ఒక జిల్లాలో/పార్లమెంటు నియోజకవర్గంలో కొనసాతుందన్నారు. బస్సు యాత్రకు సంబంధించిన మరిన్ని వివరాలను ఈ నెల 19న వెల్లడిస్తామని ఎమ్మెల్సీ తలశిల రఘురాం వెల్లడించారు.

కేన్సర్ కొమ్ము వంచేలా!

- ప్రత్యేక చర్యలు చేపట్టిన ఏపీ సర్కార్
- దేశంలో ఏటా రెండు లక్షలకు పైగా రొమ్ము కేన్సర్ కేసులు
- 2019–23 మధ్య 8.37 లక్షల కొత్త కేసులు వెలుగులోకి
- 2023లో 2.21 లక్షల కేసులు, 8 వేల మరణాలు



సాక్షి, అమరావతి: మహిళల్లో చాపకింద నీరులా కమ్ముకొస్తున్న బ్రెస్ట్ (రొమ్ము) కేన్సర్ నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీనిపై అవగాహన లేకపోవడంతో మహిళల్లో కొందరు ఈ కేన్సర్ బారినపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధి సోకిన వారిలో దాదాపు 60 శాతం మంది వ్యాధి ముదిరిన తర్వాతే వైద్యుల వద్దకు పరుగు తీస్తున్నారు. ఈ పరిస్థితిని గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామస్థాయిలో కేన్సర్ స్క్రీనింగ్ ప్రారంభించింది. ప్రభుత్వాస్పత్రుల్లో రొమ్ము కేన్సర్ నిర్ధారణ సదుపాయాలను మెరుగుపరిచింది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద కేన్సర్ బాధితులందరికీ ఉచితంగా వైద్యసేవలు అందిస్తోంది. ఏఎన్ఎంలు, సీహెచ్‌వోలు, ఫ్యామిలీ డాక్టర్ల ద్వారా ఈ జబ్బు లక్షణాలతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళల్లో అవగాహన కల్పిస్తున్నారు.

దేశవ్యాప్తంగా పెరుగుతున్న బాధితులు

దేశంలో ఏటా రెండు లక్షల మందికి పైగా మహిళలు రొమ్ము కేన్సర్ బారిన పడుతున్నారు. ఈ విషయాన్ని ఇటీవల కేంద్ర ఆరోగ్య శాఖ లోక్‌సభలో వెల్లడించింది. నేషనల్ కేన్సర్ రిజిస్ట్రీ ప్రోగ్రామ్ గణాంకాల ప్రకారం 2019 నుంచి 2023 మధ్య దేశంలో 8,37,935 మంది మహిళలు రొమ్ము కాన్సర్ బారినపడ్డట్టు వెల్లడైంది. వీరిలో 3.92 లక్షల మంది బాధిత మహిళలు మృత్యువాత పడ్డారు. గత ఏడాదిలోనే దేశంలో 2,21,579 మంది మహిళల్లో ఈ జబ్బు కొత్తగా నిర్ధారణ కాగా.. 82,429 మంది మరణించినట్టు గణాంకాలు చెబుతున్నాయి. 2023లో దేశంలోనే అత్యధికంగా యూపీలో 30,781, తమిళనాడులో 15,931, బిహార్‌లో 15,555 చొప్పున కొత్త కేసులు వెలుగు చూశాయి. ఇదిలా ఉండగా ఏపీలో 11,921 కేసులు గత ఏడాది నమోదయ్యాయి. పక్కనున్న కర్ణాటకలో 14,484, తెలంగాణలో 8,066, కేరళలో 8,874 చొప్పున కొత్త కేసులు వెలుగు చూశాయి. రాష్ట్రంలోని పరిస్థితులను గమనించిన ప్రభుత్వం కేన్సర్‌ను తొలి దశలోనే గుర్తించి తక్షణ చికిత్సలు చేయించడం ద్వారా కేన్సర్ నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టింది.

రెండు జిల్లాల్లో పైలెట్ కార్యక్రమం

కేన్సర్ నియంత్రణ చర్యల్లో భాగంగా పెద్దఎత్తున స్క్రీనింగ్ చేపట్టి ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించి చికిత్సలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా మరణాలను అరికట్టేలా ప్రణాళికలు రచించాం. ఇప్పటికే కేన్సర్ స్క్రీనింగ్ పైలట్ కార్యక్రమం అనకాపల్లి, తిరుపతి జిల్లాల్లో అమలవుతోంది. భవిష్యత్‌లో రాష్ట్రవ్యాప్తంగా స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ప్రభుత్వం విస్తరించబోతోంది.

– ఆర్.రమేశ్‌బాబు, నోడల్ అధికారి రాష్ట్ర కేన్సర్ నియంత్రణ కార్యక్రమం

వాడిపోతున్న 'పొత్తు'తిరుగుడు పూలు

కూటమిలో ఎగసిపడుతున్న సీట్ల చిచ్చు.. టీడీపీ, జనసేన, బీజేపీలకు నిరసన సెగ

రాష్ట్రవ్యాప్తంగా రోడ్డెక్కుతున్న పార్టీల శ్రేణులు

తలలు పట్టుకుంటున్న అధిష్టానవర్గాలు



ఉప్పలగుప్తంలో కంచాలు వాయిస్తున్న జనసేన వీర మహిళలు



సత్యవేడులో సమావేశమైన టీడీపీ అసంతృప్త నేతలు

సత్యవేడు(తిరుపతి జిల్లా)/మదనపల్లె/ఉప్పలగుప్తం/దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ)/కపిలేశ్వరపురం(మండపేట)/కందుకూరు/సాక్షి,అమలాపురం: మండుతున్న ఎండలకు తోడు ఎన్డీఏ కూటమిలో సీట్ల చిచ్చు ఎగసిపడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ పార్టీ శ్రేణుల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీలకు నిరసన సెగ తగులుతోంది. కార్యకర్తలు రోడ్డెక్కి మరీ అధిష్టానాల తీరును ఎండగడుతున్నారు. ఏం చేయాలో పాలుపోక ఆయా పార్టీలు కిందామీదా పడుతున్నాయి. తిరుపతి జిల్లా సత్యవేడు అసెంబ్లీ స్థానంలో టీడీపీ అభ్యర్థిగా కోనేటి ఆదిమూలంను తమపై రుద్దవద్దని తెలుగు తమ్ముళ్లు నిరసన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం సత్యవేడులోని బేరిశెట్టి కల్యాణ వేదికలో సమావేశం పెట్టి మరీ అభ్యర్థిని మార్చాలని అధిష్టానానికి అల్టిమేటం జారీ చేశారు. తమను ఐదేళ్లపాటు ఇబ్బంది పెట్టిన ఆదిమూలంతో కలిసి పనిచేయలేమని తెగేసిచెప్పారు.

- అన్నమయ్య జిల్లా మదనపల్లె నియోజకవర్గంలో కూటమి ఉమ్మడి అభ్యర్థిగా ఏడాదిక్రితం టీడీపీలో చేరిన వ్యక్తికి ఇవ్వడంపై ఆ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి ఆనంద్ నాయకత్వంలో అంకిశెట్టిపల్లె పంచాయతీ శివనగర్‌లోని ఆయన స్వగృహంలో టీడీపీ, బీజేపీ, జనసేన ప్రధాన నాయకులంతా సోమవారం రహస్యంగా సమావేశమయ్యారు. మెజార్టీ వర్గాలను కాదని మైనార్టీకి సీటు ఇవ్వడం తగదని పేర్కొన్నారు. తమలో ఎవరు ఒకరం పోటీలో ఉంటామని స్పష్టం చేశారు. సమావేశంలో టీడీపీ ఇన్‌చార్జ్ దొమ్మలపాటి రమేష్, జనసేన రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రాందాస్‌చౌదరి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగవాన్ పాల్గొన్నారు.
- విశాఖ దక్షిణం జనసేనలో సీటు చిచ్చురేగింది. పార్టీ ప్రకటించకుండా తానే అభ్యర్థినని ప్రచారం చేసుకుంటున్న వంశీకృష్ణ శ్రీనివాస్‌పై 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్, దక్షిణ నియోజకవర్గ జనసేన నాయకుడు డాక్టర్ మూగి శ్రీనివాస్ మండిపడ్డారు. సోమవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రజల్లో ఉన్న నాయకులకు పార్టీ అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వంశీకృష్ణ ఎమ్మెల్యే అభ్యర్థిగా పనికి రారని, స్థానికేతరులను ప్రజలు ఆదరించరని స్పష్టం చేశారు. కార్పొరేటర్లు సాధిక్, కందుల నాగరాజు, మత్స్యకార నాయకుడు డాక్టర్ మూగి శ్రీనివాస్‌లో ఎవరికైనా టికెట్ ఇవ్వాలని కోరారు.
- అమలాపురం అసెంబ్లీ సీటును పొత్తుల్లో భాగంగా టీడీపీకి కేటాయిస్తారనే ప్రచారం జరగడంతో జనసేన నాయకులు, మహిళా కార్యకర్తలు సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. గొల్లవిల్లి, ఉప్పలగుప్తం ప్రధాన సెంటర్లలో కంచాలపై గరిటెలు మోగిస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. టీడీపీకి కేటాయిస్తే తాము సహకరించబోమని హెచ్చరించారు.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట నియోజకవర్గంలో 43 గ్రామాలు ఉండగా.. దాదాపు 30 గ్రామాల్లో జనసేన, టీడీపీ మధ్య విభేదాలున్నాయని జనసేన ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ పేర్కొన్నారు. మండపేటలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం ఆయన కార్యకర్తలతో సమావేశమయ్యారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఇన్నాళ్లూ పార్టీ కోసం పనిచేసిన తమకు సరైన ప్రాధాన్యం ఇస్తామని పవన్ నుంచి స్పష్టమైన హామీ వస్తేనే టీడీపీకి సహకరిస్తామని స్పష్టం చేశారు. లీలాకృష్ణకు ఎమ్మెల్సీ లేదా రాజ్యసభ సభ్యుడిగా అవకాశం ఇస్తామని హామీ ఇవ్వాలని కార్యకర్తలు డిమాండ్ చేశారు.
- కందుకూరు టికెట్‌ను టీడీపీ ఇంటూరి నాగేశ్వరరావుకు కేటాయించడంతో ఆ పార్టీ అసమ్మతి నేత ఇంటూరి రాజేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆత్మీయ సమావేశం పేరుతో బలప్రదర్శనకు దిగారు. పార్టీ కష్టకాలంలో ఉండగా అండగా నిలిచానని, పంచాయతీ ఎన్నికల్లో పోటీకి ఎవరూ ముందుకు రాకపోతే తాను అండదండలు అందించి అభ్యర్థులను నిలబెట్టానని పేర్కొన్నారు. టికెట్ విషయంలో అధిష్టానం పునరాలోచించాలని డిమాండ్ చేశారు. ఇంటింటి ప్రచారం చేపట్టి తన బలమేమిటో పార్టీ అధిష్టానానికి చూపిస్తానని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యేలు పోతుల రామారావు, శివరాంల మద్దతూ తనకే ఉందని రాజేష్ బహిరంగంగా ప్రకటించడం గమనార్హం.

మిత్రపక్షాల్లో అసహనం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం లోక్‌సభ స్థానానికి అభ్యర్థి ఎవరనే విషయాన్ని టీడీపీ తేల్చడం లేదు. ఇది తేలితేనే కానీ అమలాపురం, పి.గన్నవరం అసెంబ్లీ స్థానాలపై స్పష్టత రానుంది. దీంతో మిత్రపక్షాల్లో అసహనం వ్యక్తమవుతోంది. అమలాపురం ఎంపీ స్థానాన్ని జీఎంసీ బాలయోగి కుమారుడు గంటి హరీష్ ఆశిస్తున్నారు. ఆయన స్థితిమంతుడు కాదనే నెపంతో అసెంబ్లీకి పంపించాలని బాబు యోచిస్తున్నారు. దీనికి హరీష్ ఒప్పుకోవడం లేదు. ఎంపీగా కొత్తగా పార్టీలో చేరిన పాము సత్యశ్రీ లేదా గుంటూరుకు చెందిన పారిశ్రామికవేత్త రమేష్ ప్రసాద్‌లలో ఒకరిని ఎంపిక చేయాలని పార్టీ తలుస్తోంది. హరీష్‌ను పి.గన్నవరం, అమలాపురం అసెంబ్లీ స్థానాల్లో ఒకదానికి పంపాలని చూస్తోంది. పి.గన్నవరానికి టీడీపీ అభ్యర్థిగా మహాసేన రాజేష్‌ను తొలి జాబితాలోనే ప్రకటించినా సర్వత్రా వ్యతిరేకత రావడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆయన పోటీ నుంచి తప్పుకున్నారు. ఈ సీటు ఆశిస్తున్న బీజేపీ తన అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమాను దాదాపుగా ఎంపిక చేసింది. అమలాపురం సీటు ఆశిస్తున్న జనసేన శెట్టిబత్తుల రాజబాబు, డీఎంఆర్ శేఖర్‌లలో ఒకరిని బరిలో దింపాలని భావిస్తోంది. అయితే టీడీపీ అమలాపురం అసెంబ్లీ నుంచి హరీష్‌ను బరిలో దింపాలని చూస్తుందనే ప్రచారంతో జనసేన శ్రేణుల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.

అభ్యర్థులు దొరక్క అగచాట్లు..

పొత్తులు, సమీకరణాలతో నాన్చుతున్న చంద్రబాబు

ఎంపీ సీట్ల విషయంలో టీడీపీ అధినేత మల్లగుల్లాలు



సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను ఒకేసారి ప్రకటించి ప్రజల్లోకి వెళ్లేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓ పక్క అన్ని ఏర్పాట్లూ చేసుకుంటుంటే టీడీపీ అధినేత చంద్రబాబు మాత్రం ఇంకా అభ్యర్థుల ఎంపికపైనే అగచాట్లు పడుతున్నారు. కొన్ని ఎమ్మెల్యే స్థానాలతోపాటు ఎంపీ స్థానాలకూ ఇప్పటివరకు అభ్యర్థులను ఎంపిక చేయకపోవడంతో టీడీపీలో అసహనం పెరిగిపోతోంది. ఇన్నాళ్లూ పొత్తుల కోసం ఎదురుచూసి, ఇప్పుడు సీట్ల సర్దుబాటు కోసం తమ పార్టీ అధినేత నానా హైరానా పడుతూ నిర్ణయాలు తీసుకోలేకపోవడంపై ఆ పార్టీ నేతలు కారాలు నూరుతున్నారు. ప్రధానంగా ఎంపీ అభ్యర్థులు తేలకపోవడంపై పార్టీలో తీవ్ర నైరాశ్యం నెలకొంది. మొన్నటివరకు అభ్యర్థులు దొరక్క బయటవారి కోసం, డబ్బున్న వారి కోసం చంద్రబాబు ఎదురుచూశారు. చివరికి ఎలాగోలా కొందరికి గేలం వేసి పట్టుకోగలిగినా ఇంకా చాలా సీట్లకు అభ్యర్థులు లేక చంద్రబాబు తలపట్టుకుంటున్నారు.

సీమలో అభ్యర్థుల కొరత..

ప్రధానంగా రాయలసీమలో ఎంపీ అభ్యర్థుల కోసం ఆయన నానా ఇబ్బందులు పడుతున్నారని పార్టీ నేతలు చెబుతున్నారు. ఉదా..

- సొంత జిల్లా చిత్తూరు ఎంపీ అభ్యర్థిని కూడా ఎటూ తేల్చలేకపోతున్నారు. ఐఆర్ఎస్ అధికారి ప్రసాదరావు ఇక్కడ పోటీచేస్తారని చెబుతున్నా ఆయన పేరును బాపట్లకూ పరిశీలిస్తున్నారు. దీంతో ఆయన రెండు పడవలపై కాళ్లు వేసి ఎటు వెళ్లాలో తెలీక సతమతమవుతున్నారు. చంద్రబాబు కూడా ఏదీ నిర్ణయించకుండా నాన్చుతున్నారు.
- హిందూపురం, అనంతపురం సీట్ల విషయంలోనూ ఇదే పరిస్థితి. సరైన నేత దొరక్క హిందూపురం స్థానాన్ని మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథికి ఇవ్వాలని భావిస్తున్నా ఆయన ఒప్పుకోకపోవడంతో అయోమయం నెలకొంది. తనకు ఎమ్మెల్యే సీటు కావాలని ఆయన ఒత్తిడి చేస్తున్నారు.
- ఇక అనంతపురం స్థానం నుంచి మాజీమంత్రి కాల్వ శ్రీనివాసులును పోటీకి దింపాలని మొదట భావించినా తర్వాత నిర్ణయం మార్చుకుని ఆయనకు ఎమ్మెల్యే సీటు ఖరారు చేశారు. ప్రస్తుతం ఇక్కడ నుంచి ఎవరిని బరిలోకి దింపాలనే దానిపై చంద్రబాబు తేల్చుకోలేకపోతున్నారు.
- అలాగే, మొన్నటివరకు నంద్యాల అభ్యర్థి కోసం అన్వేషణ కొనసాగించి ఎట్టకేలకు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కుమార్తె శబరిని తీసుకొచ్చి ఆమెకు సీటివ్వాలని భావిస్తున్నారు. కానీ, స్థానికంగా దీనిపై పార్టీ నేతల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

కడపపై కుట్రలు..

ఇక కడప ఎంపీ స్థానంలో తన కుట్ర రాజకీయాల్ని ప్రయోగించడానికి చంద్రబాబు శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యోదంతాన్ని తనకు అనుకూలంగా మలుచుకుని వైఎస్సార్‌సీపీ ఓట్లు చీల్చడానికి ఆయన పన్నుతున్న కుయుక్తులపై పార్టీలోనే విస్మయం వ్యక్తమవుతోంది. ఈ వ్యవహారం ద్వారా లబ్ధిపొందేందుకు వివేకానందరెడ్డి కుటుంబం నుంచి ఒకరిని ఇండిపెండెంట్‌గా పోటీచేయించి మద్దతివ్వాలనే ఆలోచన చేసినట్లు ప్రచారం జరిగింది. ఒక దశలో సునీతకు సీటిచ్చి పోటీచేయించాలని కూడా చూశారు. కానీ, ఎలాగూ ఓడిపోయే సీటు కాబట్టి ఇక్కడ వైఎస్ జగన్‌పై బురదజల్లే రాజకీయాన్ని ఆయన ప్రణాళికాబద్ధంగా అమలుచేస్తున్నారు. మరోవైపు.. రాజంపేట స్థానం నుంచి ఎవరిని పోటీ దింపాలో అర్థంకాని పరిస్థితిలో చంద్రబాబు ఉన్నట్లు తెలుస్తోంది. టీడీపీకి ఏమాత్రం పట్టులేని ఈ స్థానాన్ని బీజేపీకి కేటాయించాలని చూసినా ఆ పార్టీ ఒప్పుకోలేదనే ప్రచారం జరుగుతోంది. దీంతో ఇప్పుడు మళ్లీ అభ్యర్థి కోసం వెతుకుతున్నారు.

బీజేపీకిచ్చే సీట్లపై స్పష్టత కరువు

బీజేపీకి ఆరు ఎంపీ సీట్లు కేటాయించినా అవి ఏ స్థానాలనే దానిపైనా ఇంకా స్పష్టత రాలేదు. నరసాపురం, ఏలూరు, అనకాపల్లి, విశాఖపట్నం సీట్లపై ప్రతిష్టంభన ఏర్పడింది. నరసాపురం, ఏలూరులో ఏది బీజేపీకి కేటాయించాలనే దానిపై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. నరసాపురం సీటును కేటాయిస్తే బీజేపీలో చేరి పోటీచేయడానికి రఘురామకృష్ణరాజు చేస్తున్న ప్రయత్నాలపై ఆ పార్టీ నీళ్లు చల్లినట్లు తెలుస్తోంది. నరసాపురం బదులు ఏలూరు స్థానం కోసం బీజేపీ పట్టుబడుతోందనే ప్రచారం కూడా జరుగుతోంది. అలాగే, విశాఖ, అనకాపల్లి స్థానాల్లో ఏది బీజేపీకి ఇస్తారనే అంశం తేలడంలేదు. బీజేపీ విశాఖను కోరుతుండగా, అనకాపల్లి తీసుకోవాలని టీడీపీ చెబుతుండడం ఇబ్బందికరంగా మారింది. దీంతో అభ్యర్థులు దొరక్క కొన్నిచోట్ల, పొత్తులవల్ల మరికొన్నిచోట్ల ఎంపీ స్థానాలపై చంద్రబాబు ఏ నిర్ణయం తీసుకోలేకపోతున్నారు.

కడపలో పడకేసిన టీడీపీ

- పోటీ చేయలేనని చంద్రబాబుకు తేల్చిచెప్పిన శ్రీనివాసులరెడ్డి
- కొత్త అభ్యర్థి అన్వేషణలో టీడీపీ అధిష్టానం
- తెరపైకి మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి?



సాక్షి ప్రతినిధి, కడప/సాక్షి ప్రతినిధి, అనంతపురం/సాక్షి ప్రతినిధి, విజయవాడ/సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: టీడీపీకి కడప లోక్‌సభ స్థానంలో అభ్యర్థి కరువయ్యారా.. ఓడిపోయే స్థానంలో పోటీకి ఆ పార్టీ నాయకులు విముఖత వ్యక్తం చేస్తున్నారా.. అంటే అవుననే విశ్లేషకులు చెబుతున్నారు. టీడీపీ అభ్యర్థిగా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి పోటీలో ఉంటారని ఇంతకాలం జిల్లా నేతలు భావించారు. అయితే ఈమారు ఎన్నికల్లో తాను కడప పార్లమెంట్‌కు పోటీ చేయలేనని అధినేత చంద్రబాబుకు వాసు తేల్చిచెప్పినట్లు సమాచారం. కడప అసెంబ్లీ బరిలో తన సతీమణి విజయం కోసం ప్రత్యేకంగా కృషి చేయాల్సిన అవసరమూ లేకపోలేదని చెప్పుకొచ్చినట్లు తెలుస్తోంది. దీంతో తెరపైకి మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డిని తీసుకొస్తే ఎలా ఉంటుందని టీడీపీ ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఆ మేరకు సోమవారం టీడీపీ ఐవీఆర్ఎస్ ఫోన్ సర్వే కూడా చేపట్టింది. కడప పార్లమెంట్ సీటు వైఎస్ కుటుంబానికి కంచుకోట. 1989లో తొలిసారి వైఎస్సార్ గెలుపుతో ప్రారంభమైన విజయప్రస్థానం అప్పటి నుంచి అప్రతిహతంగా కొనసాగుతూ వస్తోంది. వైఎస్ కుటుంబసభ్యులు క్రమం తప్పకుండా పదిసార్లు విజయం సాధించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఒకే ఒక్కసారి 1984లో మాత్రమే డాక్టర్ డీఎన్ రెడ్డి విజయం సాధించారు. 1989 నుంచి వరుసగా నాలుగు సార్లు వైఎస్సార్ ఎంపీగా విజయం సాధించారు. తర్వాత వైఎస్ వివేకానందరెడ్డి, వైఎస్ జగన్, ప్రస్తుత ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలను క్రమం తప్పకుండా జిల్లా ప్రజానీకం ఆదరించారు. 2024లో మరోమారు వైఎస్ అవినాష్‌రెడ్డి కడప ఎంపీ అభ్యర్థిగా పోటీకి సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా బరిలో దిగేందుకు నాయకులు వెనుకాడుతున్నారు. ఇంతకాలం పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి పోటీ చేస్తారని భావించినా సోమవారం మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి అభ్యర్థిత్వంపై టీడీపీ ఐవీఆర్ఎస్ సర్వే చేపట్టింది.

కమలాపురం కలిసివస్తుందనే దిశగా..

వీరశివారెడ్డి టీడీపీ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిస్తే కమలాపురం నియోజకవర్గంలో ఉపయోగం ఉంటుందనే దిశగా ఆ పార్టీ అధిష్టానం యోచిస్తున్నట్లు సమాచారం. పదేళ్లుగా ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉన్న వీరశివా రెడ్డి పోటీ వల్ల ఆయన వర్గం ఎన్నికల్లో పటిష్టంగా పనిచేయగలదనే దిశగా ఆలోచిస్తున్నట్లు తెలిసింది. కమలాపురంలో ఇప్పటికే టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డికి కాకుండా ఆయన తనయుడు పుత్తా చైతన్యరెడ్డి అభ్యర్థిత్వాన్ని పార్టీ ఖరారు చేసింది. ఈనేపథ్యంలో ఎంపీగా వీరశివారెడ్డిని బరిలో నిలిపితే ఏమేర ఉపయోగం ఉంటుందని తర్జనభర్జనలో ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు కాంగ్రెస్ అభ్యర్థిగా పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పోటీలో నిలిస్తే టీడీపీ తరఫున ఎవరిని నిలిపితే ఆమెకు ప్రయోజనకారిగా ఉంటుందనే దిశగానూ ఆలోచిస్తున్నట్లు సమాచారం. టీడీపీ ఓట్లు చీలిస్తే ఉపయోగమా? లేక తక్కువ ఓట్లు తెచ్చుకునే అభ్యర్థిని బరిలో నిలిపితే కాంగ్రెస్ అభ్యర్థి షర్మిలకు ప్రయోజనమా? అనే దిశగానూ బాబు యుక్తులు పన్నుతున్నట్లు ఆ పార్టీ సీనియర్ నేత ఒకరు చెప్పుకొచ్చారు. అందులోభాగంగా అటు శ్రీనివాసులరెడ్డి, ఇటు వీరశివారెడ్డి పేర్లతో సోమవారం ఐవీఆర్ఎస్ ఫోన్ సర్వే నిర్వహించినట్లు తెలుస్తోంది.

బీసీ నేతల అసంతృప్తి

అనంతపురం జిల్లాలో బీసీల్లోని సీనియర్ నేతలు చంద్రబాబు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేనేత వర్గానికి చెందిన నిమ్మల కిష్టప్ప బాబు తమను వాడుకుని వదిలేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పెనుకొండ నియోజకవర్గానికి చెందిన మరో సీనియర్ నేత బీకే పార్థసారథి వర్గమూ బాబుపై అసంతృప్తిగా ఉంది. ఇక పుట్టపర్తి సీటును పల్లె రఘునాథరెడ్డి కోడలికి టికెట్ ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. 2014లో వైఎస్సార్‌సీపీ తరఫున కదిరి ఎమ్మెల్యేగా గెలిచి తర్వాత టీడీపీలోకి వెళ్లిన చాంద్‌బాషాకు ఈ దఫా మొండిచేయి చూపడంతో ముస్లింలూ ఆ పార్టీపై మండిపడుతున్నారు. చాంద్‌కు టికెట్ ఇవ్వకుండా నకిలీ డీడీల కేసుల్లో శిక్ష పడిన కందికుంట ప్రసాద్ కుటుంబానికి ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నారు. కళ్యాణ దుర్గం టికెట్ కోసం పోటీపడిన ఉన్నం హనుమంతరాయ చౌదరి, ఉమామహేశ్వర నాయుడిని కాదని బాబు బడా కాంట్రాక్టర్ అమిలినేని సురేంద్రబాబును తెరమీదకు తేవడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గుంతకల్లు టికెట్‌ను వైఎస్సార్‌సీపీ బహిష్కృత నేత గుమ్మనూరు జయరామ్‌కు ఇస్తే అసమ్మతి రేగుతుందని టీడీపీ భయపడుతోంది. అనంతపురం అర్బన్ సీటునూ అసమ్మతి సెగతో పెండింగ్‌లో పెట్టింది.

శ్రీకాకుళంలో సిగపట్లు

ఉమ్మడి జిల్లాలోని పలాస, ఎచ్చెర్ల, పాతపట్నం, శ్రీకాకుళం నియోజకవర్గాలకు టీడీపీ అభ్యర్థుల్ని ఇప్పటివరకు ఖరారు చేయలేదు. ఈ నాలుగు నియోజకవర్గాల్లోనూ ఆ పార్టీని వర్గపోరు వేధిస్తోంది. పలాసలో గౌతు శిరీషకు చెక్ పెట్టాలని ఆ పార్టీ నాయకులే చూస్తున్నారు. పాతపట్నంలో కలమట వెంకటరమణ, మామిడి గోవిందరావు సిగపట్లు పడుతున్నారు. శ్రీకాకుళంలో గుండ లక్ష్మీదేవి, గొండు శంకర్ మధ్య యుద్ధమే జరుగుతోంది. ఎచ్చెర్ల, శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గాలపై బీజేపీ కన్నేసింది. ఈ మూడింటిలో ఏదో ఒకటి కేటాయించాలని పట్టుపడుతోంది. జనసేన కూడా పాతపట్నం, ఎచ్చెర్ల, పలాసల్లో ఒక సీటును ఆశిస్తోంది.


కొలికపూడి మాకొద్దు బాబూ..!

ఎన్టీఆర్ జిల్లా తిరువూరు టీడీపీ అభ్యర్థి కొలికపూడి శ్రీనివాస్ తమకొద్దని ఆ పార్టీ నేతలు టీడీపీ అధిష్టానానికి అల్టిమేటం జారీ చేస్తున్నారు. ఆయన చరిత్ర చూస్తే ఆది నుంచి వివాదాస్పదమే. ఆయన అభ్యర్థిత్వం ఖరారైన తర్వాత తిరువూరు నియోజకవర్గంలో ఆయన వ్యవహార శైలి సొంత పార్టీ నేతలకూ మింగుడు పడడం లేదు. మూడునెలల తరువాత రాష్ట్రంలో వైఎస్సార్ విగ్రహాలన్నీ కూల్చివేస్తామని శ్రీనివాస్ వ్యాఖ్యానించడంతో ప్రజల నుంచి ప్రతిఘటన ఎదురైంది. తాగునీటి సమస్యపై పాదయాత్ర పేరుతో రెండు కిలోమీటర్లు కూడా నడవకుండానే హడావుడి చేయడం, డ్రెయినేజీలో ఉన్న కప్పలను పట్టి కూర వండి పంపిస్తాను తినండి అంటూ మున్సిపల్ అధికారులను కించపరచడం, ఆర్యవైశ్యుల సమావేశంలో మిగతా కులాలను కించపరిచేలా మాట్లాడడం, పదో తరగతి పరీక్ష కేంద్రంలోకి వెళ్లి ప్రచారం చేసి, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడంతో ఆయన తీరుపై నేతలు విసిగిపోయారు. ఈయన మాకొద్దు బాబు..! అంటూ చంద్రబాబుకు ఫిర్యాదు చేసినట్లు చర్చ సాగుతోంది. గత ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసిన జవహర్, ఇక్కడ మళ్లీ పోటీ చేయాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం.

క్లుప్తంగా...

ఏపీ ప్రభుత్వ పనితీరును ప్రశంసించిన మోదీ

- ప్రజాగళం సభ విఫలం
- వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి



నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్రంలో ప్రతిపక్ష కూటమి(టీడీపీ, జనసేన, బీజేపీ) ఆదివారం చిలకలూరిపేటలో ప్రజాగళం పేరుతో నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని మోదీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పనితీరును ప్రశంసించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో గృహ నిర్మాణం, మంచినీటి సరఫరా, ఆరోగ్యానికి సంబంధించిన విభిన్న పథకాలు ప్రభుత్వ యంత్రాంగం సమర్థంగా అమలు చేస్తోందని ప్రధాని కొనియాడటం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ట్రాక్ రికార్డుకు అద్దం పడుతోందని తెలిపారు. ప్రతిపక్ష కూటమి నిర్వహించిన ప్రజాగళం సభ పూర్తిగా విఫలమయ్యిందని, ప్రజల అంచనాలను ఏ మాత్రం అందుకోలేకపోయిందని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. సభలో కొత్త వాగ్దానాల ఊసేలేదని, పాత వాగ్దానాలకు సంబంధించి ఎలాంటి తీర్మానం లేదని, అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి ప్రస్తావనే లేదన్నారు. మొత్తంగా ప్రజా సమస్యలు అర్థం చేసుకోవడంలో కూటమి పూర్తి వైఫల్యం చెందిందని పేర్కొన్నారు.

సీఎం జగన్ ఓట్లడిగే ధైర్యమిచ్చారు..

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సైదాపురం (తిరుపతి జిల్లా): ఇంటింటికీ వెళ్లి ధైర్యంగా ప్రజలను ఓట్లడిగే సత్తాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీ శ్రేణులకు ఇచ్చారని మంత్రి, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలోని ఎన్‌జీఆర్ భవనం వద్ద సోమవారం వెంకటగిరి నియోజకవర్గస్థాయి వైఎస్సార్‌సీపీ విస్తృత సమావేశం నిర్వహించారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో వివక్ష లేని పాలనతో ప్రతి ఇంటా సంక్షేమ పథకాలు అందించామన్నారు. జన్మభూమి కమిటీలతో దోచుకున్న టీడీపీ నాయకులకు ప్రతి ఇంటికీ వెళ్లే అవకాశం లేకుండా పోయిందని తెలిపారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త అహర్నిశలు శ్రమించాలని కోరారు. తిరుపతి ఎంపీ అభ్యర్థి గురుమూర్తి, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, వెంకటగిరి నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన కొలికపూడి

ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



తిరువూరులోని పదో తరగతి పరీక్ష కేంద్రంలో టీడీపీ అభ్యర్థి శ్రీనివాసరావు

తిరువూరు: ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారు. సోమవారం పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నప్పటికీ తిరువూరులోని శ్రీనిధి స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలోకి అధికారులు ఆయనను అనుమతించడంపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. పిల్లల తల్లిదండ్రులను సైతం నిబంధనల మేరకు గేటు వరకే అనుమతించే అధికారులు, టీడీపీ అభ్యర్థి పచ్చ చొక్కాతో లోపలికి ప్రవేశించి తిరిగినా పట్టించుకోకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పదో తరగతి పరీక్ష కేంద్రంలోకి తన అనుచరులతో ప్రవేశించిన కొలికపూడి శ్రీనివాసరావుపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రంజాన్, ఉగాది పండుగలకు ఆప్కో వస్త్రాలపై ఆఫర్లు

సాక్షి, అమరావతి: రంజాన్, ఉగాది పండుగల సందర్భంగా ఆప్కో వస్త్రాలపై ఆఫర్లు ఇవ్వనున్నట్లు ఆప్కో వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.పావనమూర్తి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆప్కో వస్త్రాలపై 30 శాతం రాయితీ, ఎంపిక చేసిన వస్త్రాలపై 50శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. చేనేత ప్రపంచంలో ఆధునిక వెరైటీలకు శ్రీకారం చుడుతూ ప్రత్యేక వస్త్ర శ్రేణిని అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. యువతను ఆకర్షించేలా నూతన డిజైన్లతో సరికొత్త వస్త్రాలకు రూపకల్పన చేశామని తెలిపారు. రాష్ట్ర చేనేత జౌళి శాఖ కార్యదర్శి కె.సునీత ప్రత్యేకంగా పలు చేనేత చీరలను డిజైన్ చేయడం విశేషమని వివరించారు. చేనేత సొసైటీ నుంచి 80ఎస్-80ఎస్ నంబర్ నూలుతో తయారు చేసిన కాటన్ చీరలపై లేస్ వర్క్ డిజైన చేసిన నూతన వెరైటీలను ఆప్కో షోరూమ్‌లలో అందుబాటులో ఉంచామని ఆయన తెలిపారు. తక్కువ బరువు, మెత్తదనంతో చేతి మగ్గంపై తయారైన ఈ చీరలు ఆధునికతకు ఆనవాలుగా ఉంటాయని పావనమూర్తి వివరించారు.

ఎస్వీ జూలో బెంగాల్ టైగర్ మృతి

తిరుపతి మంగళం/శెట్టూరు: శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శనశాల(ఎస్వీ జూపార్క్)లోని పుట్టి యానిమల్ రెస్క్యూ సెంటర్‌లో పెరుగుతున్న ఏడు సంవత్సరాల ఆరు నెలల వయస్సు ఉన్న మగ పులి(బెంగాల్ టైగర్) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందింది. ఈ పులి 2016లో తిరుపతి జూలో జన్మించిందని, దీనికి పుట్టుకతోనే రెండు కళ్లు కనిపించవని జూ క్యూరేటర్ సెల్వం తెలిపారు. అలాగే కిడ్నీ, బ్రెయిన్ వ్యాధులతో బాధపడుతుందేదన్నారు. అనంతరం పులి కళేబరానికి వెటర్నరీ డాక్టర్లు పోస్టుమార్టం నిర్వహించారు.

అనంతపురం జిల్లాలో చిరుత కళేబరం

అనంతపురం జిల్లా శెట్టూరు మండలం ఐదుకల్లు గ్రామం దుబ్బరగుట్టలో చిరుత కళేబరాన్ని సోమవారం పశువుల కాపరులు గుర్తించారు. అటవీ శాఖ అధికారులకు తెలియజేశారు.

ఆర్యవైశ్య సంఘ నేత గోపాలకృష్ణపై దాడి

స్థల వివాదం నేపథ్యంలో వేటకొడవలితో దాడిచేసిన ప్రత్యర్థి



గాయపడిన గోపాలకృష్ణ

మడకశిర: స్థల వివాదం నేపథ్యంలో ఆర్యవైశ్య సంఘ మడకశిర పట్టణ అధ్యక్షుడు, వ్యాపారవేత్త ఏఎస్ గోపాలకృష్ణపై ప్రత్యర్థులు సోమవారం తెల్లవారుజామున దాడిచేశారు. తీవ్రంగా గాయపడిన ఆయన్ను కుటుంబ సభ్యులు బెంగళూరుకు తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు... శ్రీ సత్యసాయి జిల్లా మడకశిరలోని మారుతీనగర్ ప్రధాన రహదారికి ఆనుకుని గోపాలకృష్ణకు విలువైన స్థలం ఉంది. ఇందులో కొన్నేళ్లుగా ఆయన వేరుశనగ మిల్లును నిర్వహిస్తున్నారు. అయితే ఆ స్థలానికి సంబంధించి గోపాలకృష్ణకు, మడకశిరకే చెందిన అన్సర్‌కు మధ్య వివాదం నడుస్తోంది. అన్సర్ సోమవారం తెల్లవారుజామున ఈ స్థలం చుట్టూ కూలీలతో కంచె వేయిస్తున్నాడు. ఈ విషయాన్ని మిల్లులోని కార్మికుల ద్వారా తెలుసుకున్న గోపాలకృష్ణ తన బైక్‌పై అక్కడకు చేరుకుని, పనులు అడ్డుకున్నారు. దీంతో అన్సర్ వేటకొడవలితో గోపాలకృష్ణపై దాడిచేశాడు. తల, చెవిపై తీవ్ర గాయాలైన గోపాలకృష్ణను కార్మికులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆయనను కుటుంబ సభ్యులు బెంగళూరులోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. గోపాలకృష్ణ ఫిర్యాదు మేరకు అన్సర్, మునీర్ తదితరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ మనోహర్ తెలిపారు. కాగా, ఆస్పత్రిలో గోపాలకృష్ణను రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి వైసీ గోవర్ధనరెడ్డి పరామర్శించారు. గోపాలకృష్ణపై జరిగిన దాడిని ఆర్య వైశ్య సంఘ నాయకులు తీవ్రంగా ఖండించారు.

బాధితులకు భరోసా ఇవ్వడం మరిచిపోలేను



వాసిరెడ్డి పద్మను సత్కరిస్తున్న వెంకటలక్ష్మి

ఏపీ మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ

సాక్షి,అమరావతి: ఎన్నో కష్టాలు, సమస్యలతో మహిళా కమిషన్‌ను ఆశ్రయించే బాధితులకు భరోసా ఇవ్వడంలో సభ్యులు, సిబ్బంది అందించిన సహకారం మరిచిపోలేనని ఏపీ మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. ఆ పదవికి ఇటీవల రాజీనామా చేసిన ఆమెను గుంటూరు జిల్లా మంగళగిరిలోని కమిషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం సత్కరించారు. వాసిరెడ్డి పద్మ మాట్లాడుతూ బాధితులకు న్యాయం చేయడంలో మహిళా కమిషన్ సభ్యులు, కార్యాలయ సిబ్బంది అందించిన సహకారం సంతోషాన్నిచ్చిందని చెప్పారు. సీఎం జగన్ సహకారంతో మహిళా సాధికారత కోసం కృషి చేసినట్లు చెప్పారు. మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జెల వెంకటలక్ష్మి, కమిషన్ సభ్యులు ఎస్‌కే రుకియా బేగం, బూసి వినీత, గద్దం ఉమా, కమిషన్ సెక్రటరీ దాసరి శ్రీలక్ష్మి, కమిషన్ రీజనల్ డైరెక్టర్ శైలజ తదితరులు వాసిరెడ్డి పద్మను ఘనంగా సత్కరించారు.



"ఏదైనా నీకు కష్టంగా కనబడినంత మాత్రాన, ఇంకెవరికీ అది సాధ్యంకాదని అనుకోకు.
– మార్కస్ అరేలియస్

సాక్షి
మంగళవారం, 19 మార్చి 2024

ఎన్నికల బృహత్ పర్వం!

ప్రజాస్వామ్యానికి పండుగ లాంటి ఎన్నికల సమయం వచ్చింది. దేశవ్యాప్త సార్వత్రిక ఎన్నికలకూ, అదే విధంగా మరో 4 రాష్ట్రాల శాసనసభల ఎన్నికలకూ శనివారం కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) షెడ్యూల్ ప్రకటించడంతో ఒక బృహత్ యజ్ఞానికి అంకురార్పణ జరిగింది. ప్రపంచంలోని అతి పెద్ద ప్రజాస్వామ్యంలో మరో నెల రోజుల పైచిలుకులో తొలి దశతో సుదీర్ఘ ఎన్నికల పర్వం ఊపందుకోనుంది. ఇదే ఏడాది అమెరికా సహా పలు భారీ ప్రజాస్వామ్య దేశాలు ఎన్నికలకు సిద్ధమవుతుండగా, 96.9 కోట్ల మంది రిజిస్టర్డ్ ఓటర్లతో మన దేశం సంఖ్యాపరంగా అన్నిటి కన్నా ముందు వరుసలో ఉంది. అలాగే, మిగిలిన దేశాలతో పోలిస్తే సుదీర్ఘంగా ఈ ప్రక్రియ సాగనుంది. దేశంలో తొలి సార్వత్రిక ఎన్నికలు సైతం ఇలాగే సుదీర్ఘంగా సాగాయి. 489 స్థానాలకు గాను మొత్తం 68 దశల్లో అప్పట్లో ఎన్నికలు జరిగాయి. ఆ తరువాత మళ్ళీ అంత సుదీర్ఘంగా సాగుతున్నవి ఈ సార్వత్రిక ఎన్నికలే. ఈ ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 వరకు 44 రోజుల వ్యవధిలో ఈ హంగామా కొనసాగుతుంది. జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి. దాంతో రానున్న రెండున్నర నెలలు వేసవి వేడితో పాటు దేశమంతటా ఎన్నికల ఉష్ణోగ్రతలు పెరిగిపోనున్నాయి.

ఇవి యువతరం ఎన్నికలు కావడం విశేషం. ఓటర్లలో 29 శాతం మంది 18 నుంచి 29 ఏళ్ళ మధ్యవయసు యువతరమే. 2660 రిజిస్టర్డ్ రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు పాల్గొనే ఈ ఎన్నికలు ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనవి కూడా! అధికారికంగా అభ్యర్థులకు ఎన్నికల వ్యయ పరిమితులు విధించారన్న మాటే కానీ, పార్టీల ప్రచారం సహా ఈ ఎన్నికల తతంగం మొత్తం ఖర్చు దాదాపు రూ. 1.2 లక్ష కోట్లు దాటుతుందని లెక్క. ఏకంగా 15,256 అడుగుల ఎత్తైన ప్రాంతంలోనూ పోలింగ్ కేంద్రం నిర్వహిస్తున్న బృహత్తర ప్రక్రియ ఇది. వెబ్‌సైట్లు, సోషల్ మీడియా, ఫోన్-ఇన్ ప్రచార సాధనాలతో వర్చ్యువల్ ప్రచారం ప్రబలిన ఆధునిక కాలమిది. ఓటింగ్‌కు 48 గంటల కన్నా ముందే ప్రచారం ఆపాలి, అంశాల ప్రాతిపదికన – కులమతాలకూ, విద్వేషానికీ దూరంగా ప్రచారం సాగాలి లాంటి నిబంధనల్ని ఆచరణలో పెట్టించడం ఈసీకి కష్టమే. అలాగే 1999లో 29 రోజులతో మొదలై గత 2019లో 39, ఈసారి 44 రోజులకూ వ్యాపిస్తూ పోతున్న ఎన్నికల ప్రక్రియ ప్రభుత్వ యంత్రాంగం చేతిలో ఉండే పాలకపక్షాలకు వాటంగా మారుతుందని ఆరోపణలొస్తున్నాయి.

షెడ్యూల్ ప్రకటన ఫలితంగా తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి రావడంతో ఈసీ క్రియాశీలక పాత్ర మొదలైంది. తాజాగా సోమవారం గుజరాత్, యూపీ సహా అరడజను రాష్ట్రాల్లో హోమ్‌శాఖ కార్యదర్శులను తొలగిస్తూ ఈసీ కొరడా ఝళిపించింది. పశ్చిమ బెంగాల్‌లో ఆ రాష్ట్ర సీఎం మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితుడైన డీజీపీపై వేటు వేసింది. ఎన్నికలు నిష్పక్షపాతంగా సాగాలంటే, ఆ యా ప్రాంతాల్లో పాలకపక్ష అనుకూలురని పేరుబడ్డ అధికారులకు చెక్ చెప్పడం సమంజసమే, స్వాగతించాల్సిందే. అయితే, అనేక సందర్భాల్లో కేంద్రంలోని పాలక వర్గాల చేతిలోని సంస్థగా ఈసీ వ్యవహరిస్తోందని ఆరోపణలు వింటూనే ఉన్నాం. అవన్నీ నిరాధారమని మాటలతో కన్నా చేతల ద్వారా తేల్చడమే ఈసీ ముందున్న మార్గం. ఈసీ స్వతంత్ర ప్రతిపత్తికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన ఒకప్పటి కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ టీఎన్ శేషన్‌ను ఆదర్శంగా నిలుపుకోవాలి. పాలకుల కన్నా ప్రజలకు జవాబుదారీగా ఈసీ నిలబడాలి. డబ్బు, అధికారం లేనివారు సైతం ఎన్నికల బరిలో స్వేచ్ఛగా పోటీ చేసే ఆరోగ్యకర వాతావరణం కల్పించాలి.

దురదృష్టవశాత్తూ పరిస్థితులన్నీ ఆ ఆదర్శాలకు తగ్గట్టు ఉన్నాయన్న భరోసా ఇప్పటికీ పూర్తిగా కలగడం లేదు. ఈ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతున్న సమయంలోనే దేశంలో ఒకటికి రెండు కీలక పరిణామాలు సంభవించాయి. రహస్యమయమైపోయిన ఎన్నికల బాండ్లలో దాతలు, గ్రహీతల (పార్టీల) వివరాలు వెల్లడించాలని సర్వోన్నత న్యాయస్థానం భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ)ని ఆదేశించాల్సి వచ్చింది. మరోపక్క మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలోని కమిటీ 'ఒకే దేశం – ఒకే ఎన్నిక' అంశంపై వేలకొద్దీ పేజీల నివేదిక సమర్పిస్తూ, లోక్‌సభకూ, రాష్ట్రాల శాసనసభలకూ ఏకకాలంలో ఎన్నికలు జరగాలని సిఫార్సు చేసింది. ఇంకొకపక్క కేంద్ర ఎన్నికల కమిషనర్ల నియామక విధానంలో సుప్రీమ్ కోర్ట్ ప్రధాన న్యాయమూర్తికి భాగం లేకుండా ప్రభుత్వం ఆ మధ్య చేసిన మార్పులు సైతం మరోసారి తెర మీదకు వచ్చాయి. ఈ పరిణామాలన్నీ ఒక రకంగా భారత ప్రజాస్వామ్య ప్రస్థానం నునుపైన జారుడు శిఖరం మీద సాగుతున్న అంశాన్ని పట్టిచూపాయి. రానున్న కాలంలో ఈ ప్రయాణం ఇంకెంత సంక్లిష్టం కానున్నదో చెప్పకనే చెప్పాయి.

బాండ్ల సాక్షిగా పారిశ్రామిక వర్గాలకూ, రాజకీయాలకూ మధ్య రహస్యబంధం అంతకంతకూ బలపడుతున్న వేళ, దేశమంతా ఒకేసారి ఎన్నికలతో సమస్తం కేంద్ర పాలకుల కనుసన్నల్లోకి మార్చాలని చూస్తున్న వేళ... రానున్న ఎన్నికల్లో ప్రజలెన్నుకొనే ప్రభుత్వాలు కీలకం కానున్నాయి. ''చరిత్ర కూడలిలో నిల్చొని, ఏ మార్గంలో వెళ్ళాలో ఎంచుకోవాల్సిన పరిస్థితి ప్రతి జాతికీ ఒకానొక దశలో వస్తుంది'' అని భారతదేశానికి రెండో ప్రధాన మంత్రి అయిన లాల్‌బహదూర్ శాస్త్రి ఒక సందర్భంలో అన్నారు. ఆ మార్గాన్ని బట్టే భవితవ్యం ఉంటుంది. ప్రజాస్వామ్య భారతావని తన ప్రయాణంలో ఇప్పుడు సరిగ్గా అదే స్థితిలో ఉంది. ఈ ఎన్నికలలో ప్రజలు తమ ఓటు హక్కు ద్వారా ఎంచుకొనే మార్గం పౌరుల మొదలు న్యాయవ్యవస్థ, ప్రభుత్వ అధికార వ్యవస్థ, మీడియా దాకా సమస్తాన్నీ ప్రభావితం చేయనుంది. అందుకే, సరైన మార్గాన్ని ఎంచుకోవడం అత్యవసరం. సరైన ఎంపిక సాగాలంటే, అలక్ష్యం చేయకుండా విలువైన ఓటుహక్కును వినియోగించుకోవడమే సాధనం.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, **తిథి:** శు.దశమి రా.2.49 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** పునర్వసు రా.10.47 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** ఉ.10.18 నుండి 11.58 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.31 నుండి 9.19 వరకు, తదుపరి రా.10.57 నుండి 11.45 వరకు, **అమృతఘడియలు:** రా.8.19 నుండి 10.05 వరకు.

సూర్యోదయం : 6.10
సూర్యాస్తమయం: 6.05
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

ప్రమాదంలో లౌకికవాదం

పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) జాబితాలో చేర్చిన మతపరమైన మైనారిటీలు వారి స్వదేశాలలో గొప్ప అణచివేతను ఎదుర్కొంటున్నారు. కానీ జాబితాలో చేర్చని ఇతర మైనారిటీలు కూడా ఉన్నారు. యూదులు, నాస్తికులు, అజ్ఞేయవాదులతో పాటు హజారా, అహ్మదీయ, షియా వంటి ఇస్లామిక్ శాఖలకు చెందిన వ్యక్తులు అందుకు కొన్ని ఉదాహరణలు. కేవలం పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ – మూడు దేశాలకు చెందిన శరణార్థులకే సీఏఏ కింద రక్షణ ఉంటుంది. ఇతర పొరుగు దేశాల్లోని వారిని అది విస్మరిస్తోంది. సీఏఏ రాజ్యాంగబద్ధంగా చెల్లుబాటు కావాలంటే, చేసిన వర్గీకరణ సహేతుకమైనదనీ, సాధించాలనుకున్న అంశంతో హేతుబద్ధమైన సంబంధాన్ని కలిగి ఉందనీ నిరూపించాల్సి ఉంది. మతపరమైన వర్గీకరణ, అలాగే ఇతర పొరుగు దేశాలను ఈ చట్టం నుండి తొలగించడం దేశ లౌకిక మూలాలపైనే సందేహాలను కలిగిస్తుంది.

హేతుబద్ధత ఉండాలి!

విశ్లేషణ



వికాస్ సింగ్

అత్యంత కఠినతరమైన పోరాటం తర్వాత భారతదేశం స్వాతంత్ర్యం పొందినప్పుడు, మన వ్యవస్థాపక పితామహులు అన్ని మతాల ప్రజలకు స్వర్గధామంగా ఉండే లౌకిక దేశంగా భారతదేశం ఉంటుందని భావించారు. దేశ విభజన సమయంలో పాకిస్తాన్, తూర్పు బెంగాల్ (తరువాత తూర్పు పాకిస్తాన్, ఇప్పుడు బంగ్లాదేశ్) నుండి హిందువులు, సిక్కులు వలస వచ్చారు. కొత్త జీవితాన్ని వెతుక్కుంటూ భారతదేశానికి వచ్చిన వారికి మన ప్రజలు సాదరంగా స్వాగతం పలికారు. ఇదే తరహాలో, పౌరసత్వ (సవరణ) చట్టం, 2019, లేదా సీఏఏ, మతపరమైన హింస కారణంగా అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్ లేదా పాకిస్తాన్ నుండి పారిపోయి వచ్చిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు, క్రైస్తవులకు భారత పౌరసత్వాన్ని సజావుగా అందించడానికి ప్రయత్నిస్తుంది.

పౌరసత్వ చట్టం, 1955, దాని అసలు రూపంలో, 1950 జనవరి 26 తర్వాత దేశంలో జన్మించిన ఎవరినైనా భారతీయ పౌరుడిగా పరిగణించాలని సూచించింది. పౌరసత్వ (సవరణ) చట్టం, 2003 అమలులోకి వచ్చి, రెండు కొత్త కటాఫ్ తేదీలను ప్రవేశపెట్టిన తర్వాత ఈ స్థితి ఆగిపోయింది. దీనివల్ల, భారతదేశంలో 1950 జనవరి 26 తర్వాత 1987 జూలై 1కి ముందు జన్మించినవారే భారతీయ పౌరులు అవుతారు. అలాగే 1987 జూలై 1, 2004 డిసెంబర్ 3 మధ్య జన్మించినవారు భారత పౌరుడిగా పరిగణించబడటానికి భారతీయ పౌరసత్వం కలిగిన తల్లి లేదా తండ్రిని కలిగి ఉండాలి. 2004 డిసెంబరు 3 తర్వాత జన్మించిన వారికి, తల్లిదండ్రులిద్దరూ భారతీయ పౌరులుగా ఉండాలి; లేదా ఒకరు భారతీయ జాతీయులైతే, మరొకరు ఆ వ్యక్తి పుట్టిన సమయంలో 'అక్రమ వలసదారు' కాకూడదు. వాస్తవానికి, 2003 చట్టం ప్రకారం, చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్ లేదా ఇతర ప్రయాణ పత్రాలు లేకుండా భారతదేశంలోకి ప్రవేశించిన విదేశీయుడిని మొదటిసారిగా 'అక్రమ వలసదారు'గా నిర్వచించారు. ఇలాంటివారు రిజిస్ట్రేషన్ లేదా సహజీకరణ ద్వారా పౌరసత్వం కోసం దరఖాస్తు చేయడం నిషేధించబడింది.



అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్ లేదా పాకిస్తాన్ నుండి హిందూ, సిక్కు, బౌద్ధ, జైన్, పార్సీ లేదా క్రిస్టియన్ మతాలకు చెందిన ఏ వ్యక్తినైనా 2014 డిసెంబర్ 31న లేదా అంతకు ముందు భారతదేశంలోకి ప్రవేశించిన వారిని మినహాయించడానికి, 'అక్రమ వలసదారు' నిర్వచనాన్ని ఇప్పుడు సీఏఏ ద్వారా సవరించారు. అలాగే పాస్‌పోర్ట్ (భారతదేశంలోకి ప్రవేశం) చట్టం, 1920 లేదా ఫారినర్స్ యాక్ట్, 1946 ప్రకారం, 'అక్రమ వలసదారు' నిర్వచనం నుండి వీరు మినహాయింపు పొందారు. ఈ సమూహానికి చెందిన వ్యక్తులు భారతదేశంలోకి ప్రవేశించిన తేదీ నుండి ఇప్పుడు భారతదేశ పౌరులుగా పరిగణించబడతారు. అటువంటి వ్యక్తుల సహజీకరణకు అర్హతలు కూడా సడలించారు. గత 14 సంవత్సరాలలో వ్యక్తి ఐదు సంవత్సరాలకు తక్కువ కాకుండా భారతదేశంలో లేదా ప్రభుత్వ సేవలో ఉండాలి. ఈ గ్రూప్‌లోకి రాని వ్యక్తుల కోసం, భారతదేశంలో లేదా ప్రభుత్వ సేవలో ఉండే కాల వ్యవధి మునుపటి 14 సంవత్సరాలను 11 ఏళ్లకు కుదించారు.

మతపరమైన హింస నుండి పారిపోయిన శరణార్థులను స్వాగతించే, రక్షించే ఒక మైలురాయి చట్టంగా సీఏఏని పాలక యంత్రాంగం ప్రశంసించింది. అయినప్పటికీ, అనేక ఆందోళనలు పరిష్కారం కాలేదు. జాబితాలో చేర్చిన మతపరమైన మైనారిటీలు వారి స్వదేశాలలో గొప్ప అణచివేతను ఎదుర్కొంటున్నారు. అలాగే జాబితాలో చేర్చని ఇతర మైనారిటీలు కూడా ఉన్నారు. యూదులు, నాస్తికులు, అజ్ఞేయవాదులతో పాటు హజారా, అహ్మదీయా, షియా వంటి ఇస్లామిక్ శాఖలకు చెందిన వ్యక్తులు కొన్ని ఉదాహరణలు. కేవలం మూడు దేశాలకు చెందిన శరణార్థులకు సీఏఏ కింద రక్షణ ఉంటుంది. నేపాల్‌లోని క్రైస్తవులు, మయన్మార్‌లోని రోహింగ్యాలు, శ్రీలంకలోని తమిళ జాతికి చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న ప్రమాదాలకు సంబంధించి కళ్ళు మూసుకుంది. కాబట్టి సీఏఏ రాజ్యాంగబద్ధంగా చెల్లుబాటు కావాలంటే, చేసిన వర్గీకరణ సహేతుకమైనదనీ, సాధించాలనుకున్న అంశంతో హేతుబద్ధమైన సంబంధాన్ని కలిగి ఉందనీ నిరూపించాల్సి ఉంది.

పేర్కొన్న మానవతా లక్ష్యం ప్రశంసనీయమే అయినప్పటికీ, ఇది ప్రశ్నకు తావిస్తోంది. ఇతర మతాల ప్రజలను, ఇతర పొరుగు దేశాలలో మతపరమైన హింసను ఎదుర్కొంటున్న వారిని ఎందుకు వదిలిపెట్టారు? శరణార్థుల స్థితికి సంబంధించిన 1951 ఐక్యరాజ్యసమితి కన్వెన్షన్‌పై, శరణార్థుల స్థితికి సంబంధించిన 1967 ప్రోటోకాల్‌పై భారతదేశం సంతకం చేయలేదు. మన పెద్ద జనాభా, పరిమిత ఆర్థిక వనరులను బట్టి దీన్ని అర్థం చేసుకోవచ్చు. అయితే, సీఏఏకీ, 1951 కన్వెన్షన్‌కీ మధ్య పూర్తి వ్యత్యాసం ఉంది. కన్వెన్షన్ శరణార్థులు ఎదుర్కొనే వివిధ అణచివేత అంశాలను పేర్కొంటోంది. జాతి, మతం లేదా ఒరిజినల్ దేశం ఆధారంగా వారిపై వివక్ష చూపకుండా ఆయా దేశాలను నిషేధిస్తుంది. ఈ ఒక్క అంశానికి సంబంధించి మాత్రమే భారత ప్రభుత్వం తెచ్చిన పౌరసత్వ సవరణ చట్టాన్ని ఐక్యరాజ్యసమితి కన్వెన్షన్ తప్పుబట్టి ఉంటుంది.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 77 ఏళ్లు అవుతుందనీ, మనం ఆధునిక యుగంలోకి అడుగు పెట్టామనీ గుర్తుంచుకోవాలి. భారతదేశం బహుళ సాంస్కృతిక, లౌకిక ప్రజాస్వామ్య ప్రాతిపదికన ఏర్పడింది. మతపరమైన వర్గీకరణ, ఇతర పొరుగు దేశాలను సీఏఏ నుండి మినహాయించడం వల్ల దేశం లౌకిక మూలాలపై బహుశా అనుద్దేశపూర్వకంగా అయినా సరే, అనుమానాలు ఉన్నాయి. ఈ అంశం దురదృష్టవశాత్తూ ఈ చట్టంలోని సంక్షేమ ఆధారిత లక్ష్యాన్ని కప్పివేసింది.

వ్యాసకర్త సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది

అసంపూర్ణ చట్టం

విశ్లేషణ



సంజయ్ హజారికా

పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), 2019కి జవసత్వాలు అందించే 39 పేజీల నిబంధనలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర పాలనా యంత్రాంగం ఓటర్లను విభజించాలని చూస్తోందంటూ ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్న తరుణంలో లోక్‌సభ ఎన్నికలకు కొన్ని వారాల ముందుగా చోటు చేసుకున్న ఈ పరిణామం వివాదాన్ని రేకెత్తించింది. కాగా, మరో ఎన్నికల హామీని తాను నెరవేర్చినట్లు బీజేపీ చెప్పుకొంది. పౌరసత్వాన్ని హరించడానికే సీఏఏని ఉపయోగిస్తారనే భయాలు కేవలం నిరాధారమైనవని తిప్పికొట్టింది.

అఫ్గానిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో హింసాత్మక చర్యల కారణంగా పారిపోయి భారతదేశంలో అక్రమంగా లేదా అనధికారికంగా స్థిరపడిన ఆరు మతాలకు చెందిన మైనారిటీలకు పౌరసత్వం అందించడం ఈ చట్టం ప్రధాన లక్ష్యం. ఈ ఆరు మత బృందాలు ఆ దేశాలకు చెందిన హిందువులు, క్రైస్తవులు, బౌద్ధులు, సిక్కులు, పార్సీలు, జైనులు. ఆ దేశాలకు చెందిన ముస్లింలను సీఏఏ నుంచి మినహాయించారు. ఈ దేశాలకు చెందిన ముస్లింలను పై చట్టం నుంచి మినహాయించడానికి హేతువు ఏమిటంటే... ఆ మూడు దేశాలూ ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్న ఇస్లామిక్ దేశాలు. కాబట్టి వారు తమతమ దేశాలలో తగు న్యాయం పొందగలరని ఇది సూచిస్తుంది.

దరఖాస్తులను పర్యవేక్షించడానికి కేంద్ర అధికారులతో కూడిన కమిటీలను రూపొందించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఈ ప్రక్రియపై నియంత్రణను కలిగి ఉంది. పాత విధానంలో జిల్లా అధికారులే అభ్యర్థనలను స్వీకరించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశం ప్రకారం పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవడంలో నిరీక్షణ వ్యవధిని, సీఏఏ 11 నుండి ఐదు సంవత్సరాలకు తగ్గిస్తుంది. అయితే దరఖాస్తుదారులు వారి మాతృభూమి నుండి అధికారిక పత్రాలను సమర్పించాలి.

అస్సాం, పశ్చిమ బెంగాల్, కేరళతోపాటు దేశంలోని ఇతర ప్రాంతాలలో పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు జరుగుతున్నప్పటికీ, 2019-20లో భారతదేశం అంతటా ఈ సవరణ చట్టంపై వీచిన తుపానుతో పోలిస్తే ఇవి పెద్దగా సద్దులేనివిగానే కనిపిస్తాయి. అయితే, రాబోయే కొద్ది వారాల్లో అభ్యంతరాలు పెరిగే అవకాశం ఉంది. ఈ అంశంలో మరొక పెద్ద సమస్య దాగి ఉంది. ముఖ్యంగా రాజ్యాంగబద్ధతను వ్యతిరేకిస్తున్న సీఏఏకి సంబంధించిన అనేక చట్టపరమైన సవాళ్లను సుప్రీంకోర్టు ఇంకా వినలేదు, తీర్పు ఇవ్వలేదు. ఇక్కడ కీలకమైన వాదన ఏమిటంటే, మతాన్ని పౌరసత్వానికి గుర్తుగా ప్రతిష్ఠించడం ద్వారా, రాజ్యాంగానికి చెందిన ప్రాథమిక స్వరూపాన్నే పౌరసత్వ సవరణ చట్టం ఉల్లంఘిస్తుందన్నదే. అదే సమయంలో భారత రాజ్యాంగం మతపరమైన వివక్షను నిషేధిస్తుంది. చట్టం ముందు ప్రజలందరికీ సమానత్వం, చట్టం ద్వారా సమాన రక్షణకు హామీ ఇస్తుంది.

ఈ చట్టంపై తొలి సవాలు 2020లో వచ్చింది. సుప్రీంకోర్టు ఈ అభ్యంతరాలను ఇంకా వినలేదు. అయితే, ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం, గత ఏడాది డిసెంబర్‌లో పౌరసత్వ చట్టం, 1955లోని సెక్షన్ 6ఏ చెల్లుబాటుకు సంబంధించిన మరో కేసులో తీర్పును రిజర్వ్ చేసింది. ఈ నిర్దిష్ట సవరణ 1985లో కుదిరిన అస్సాం ఒప్పందం నాటిది. ఇది బంగ్లాదేశ్ నుండి అక్రమ వలసలకు సంబంధించిన శాశ్వత సవాలుపై రాష్ట్రంలో స్థిరత్వాన్ని తీసుకురావడానికి ప్రయత్నించింది. చట్టవిరుద్ధంగా వచ్చిన వారిని భారతీయ పౌరులుగా గుర్తించడానికి ఇది ఒక యంత్రాంగాన్ని అందించింది. అస్సాంలో బంగ్లాదేశ్ వలసదారులకు పౌరసత్వం మంజూరు చేయడానికి 1971 మార్చి 25ని కటాఫ్ తేదీగా నిర్ణయించడమైంది.

పౌరసత్వ సవరణ చట్టం భారతదేశం అంతటా ఒకే విధంగా వర్తించదు. ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, ప్రత్యేక రాజ్యాంగ రక్షణ ఉన్న అస్సాం (తక్కువ జనాభాతో), త్రిపురలోని మూడు గిరిజన ప్రాబల్య ప్రాంతాలలో ఈ చట్టం అమలు కాదు.

2019లో నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్నార్సీ)ని తీసుకురావడం ద్వారా అస్సాంలో పరిస్థితి క్లిష్టంగా మారింది. 19 లక్షల దరఖాస్తుదారులు దీనికి వెలుపలే ఉండిపోయారు. వీరిలో ఎక్కువమంది హిందువులు, స్థానిక సంఘాల సభ్యులే ఉన్నారు తప్పితే, ముస్లింలు కాదు. ఇది బీజేపీనీ, దాని మిత్రపక్షాలనూ ఆశ్చర్యానికి గురి చేసింది. అప్పటి నుంచి వారు ఈ చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేస్తున్నారు. అస్సాంలో అక్రమ వలసలకు వ్యతిరేకంగా పోరాడుతున్న కార్యకర్తలు కూడా సీఏఏని వ్యతిరేకించారు. మతం పౌరసత్వాన్ని నిర్ణయించకూడదని వాదించారు.


సహాయాన్ని పొందవలసిన సామాజిక బృందాల జాబితా కూడా అసంపూర్ణంగా కనిపిస్తోంది. ఇందులో శ్రీలంకలోని తమిళ హిందువులు, క్రైస్తవులు వంటి సమూహాలు లేవు. వీరిలో 90,000 మందికి పైగా భారత్‌లో శరణార్థులుగా ఉన్నారు. మయన్మార్ నుండి వచ్చిన చిన్ క్రైస్తవులు కూడా జాబితాలో లేరు. వీరిలో 45,000 మందికి పైగా ఒక్క మిజోరంలోనే ఉన్నారు.

ఒక మతానికి చెందినవారైనప్పటికీ, ఆ మతంలోని మైనారిటీ శాఖలపై వేధింపుల ప్రమాదం తగ్గదు. అయినా పాకిస్తాన్‌లోని అహ్మదీయులు, అఫ్గానిస్తాన్‌లోని హజారాలు వంటి బలహీనమైన ముస్లిం సమూహాలకు రక్షణ కల్పించాల్సిన అవసరం సీఏఏకి కనిపించలేదు.

వ్యాసకర్త రచయిత, కాలమిస్ట్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

నేర్వవలసిన చరిత్ర పాఠాలు



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

"ప్రపంచంలో సంభవించే ఘటనలను, లేదా పరిణామాలను హేతువాదం ద్వారా కార్య కారణ సంబంధాల పరిశోధనల ద్వారా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలే గాని – కనిపించని ఏ దేవుళ్ళకో మొత్తుకుంటేనో ప్రకృతి రహస్యాలు అర్థం కావు."
– సుప్రసిద్ధ ప్రపంచ తార్కికులు థేల్స్, అనాక్సిమాండర్, యూక్లిడ్, బుద్ధుడు!

ధనిక వర్గ వ్యవస్థల్లో, పెట్టుబడిదారీ వ్యవస్థల్లో అనివార్యమైన సామాజిక, ఆర్థిక అసమానతలు ఎలాంటి పరిస్థితుల్ని సామాన్య కష్ట జీవులకు సృష్టించిపెడతాయో ప్రపంచ ప్రసిద్ధ నవలా రచయిత అన్నా రాచెస్టర్ రాసిన ''కార్మికులు– రాక్షసి బొగ్గు'' అన్న నవలలో వివరించాడు.

యలమంచిలి శివాజీ 'ఎదురీత' పుస్తకం కూడా భారత వ్యవసాయ, పారిశ్రామిక వ్యవస్థలలో సామాజిక ఆర్థిక వ్యవస్థల్లోని అసమానతలనూ, వాటిని తొలగించే మార్గాలనూ చెబుతోంది. శివాజీ దశాబ్దం పాటు వెలువరించిన రాజ్యసభ ప్రసంగాలను 'ఎదురీత' మకుటంతో ప్రచురించారు 'రైతు నేస్తం' అధినేత వెంకటేశ్వర్రావు. డా॥ శివాజీ ఈ గ్రంథంలో దేశంలోని ప్రస్తుత నాయకుల వ్యవహార శైలినీ, చట్టసభలు నడుస్తున్న తీరుతెన్నుల్నీ పరిశీలించి విలువలు ఎంతగా పతనమైపోతున్నాయో అని వ్యథను వ్యక్తం చేశారు. అంతేగాదు, చివరికి నాటి ప్రధానీ, ఆర్థిక వేత్తా అయిన మన్మోహన్ సింగ్ తీసుకొనే ప్రతి చర్య దేశంలోని స్టాక్ ఎక్స్ఛేంజీలను జూద గృహాలుగా మార్చడానికే ఉపయోగపడిందని అన్నారు. మన్మోహన్ ప్రభుత్వ చర్యలు గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకూ, వ్యవసాయ రంగం నుంచి పారిశ్రామిక రంగానికీ సంపదను బదిలీ చేయడానికే ఉపయోగపడ్డాయని శివాజీ విమర్శించారు. అలా గాకుండా ఉపాధి కోసమో, ఉన్నత విద్య కోసమో తగినన్ని సౌకర్యాలను గ్రామీణ ప్రాంతాల్లోనే కల్పించాలని శివాజీ కోరారు. తన వైఖరికి ప్రధాన కారణాన్ని ఆయన బాహాటంగానే ప్రకటించారు:

''నేను మధ్యతరగతి రైతు కుటుంబం నుంచి వచ్చిన రాజకీయ నాయకుణ్ణి కావటం వల్ల రైతులు, వ్యవసాయ కార్మికులు (కూలీలు) పడే కష్టాలు ఎలా ఉంటాయో ఎవరూ చెప్పకుండానే తెలుసుకోగలిగాను. పస్తులు ఉంటున్నా గుట్టు చప్పుడు కాకుండా జీవించే మనస్తత్వం మన గ్రామీణులది. అలాంటి రైతులు ఈ రోజున తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని బజారునపడి రోదిస్తున్నారు. పత్తి రైతులు, పొగాకు రైతులు కక్కలేక, మింగలేక బతుకులు ఈడుస్తున్నారు'' అని చెప్పారు. చివరగా అన్ని పార్టీలకూ ఒక హెచ్చరిక కూడా శివాజీ చేశారు: ''గూండాలూ, నేర చరిత్ర ఉన్న వ్యక్తులనూ, పెద్ద మనుషులుగా చెలామణీ అవుతున్న కుహనా రాజకీయుల్నీ అన్ని పార్టీలూ బహిష్కరించవలసిన సమయం వచ్చింది. అలా జరక్కపోతే ఈ దేశంలో ఇక ప్రజాస్వామ్యం బతికి బట్టకట్టనట్టే లెక్క''.

రెండో మాట



నిజానికి, మనం ఇప్పుడు మాట్లాడుకొంటున్నది క్రీ.శ. 21వ శతాబ్దం గురించి. కాని క్రీస్తు పూర్వం 2100 ప్రాంతంలోనే సుమేరియా పాలకులు ప్రజా బాహుళ్య ప్రయోజనాలను ఈడేర్చవలసిన సమాజ సంపదను కొలది మంది ప్రయోజనాల కోసం దుర్వినియోగం కావడం గమనించారు. వ్యక్తిగత దోపిడీకి ఆస్కారమిచ్చే పరిస్థితుల్ని అరికట్టేందుకు తీసుకున్న కఠిన చర్యలను ఇక్కడ మనం గుర్తు చేసుకోవడం మంచిది.

వేల సంవత్సరాల క్రితమే సుమేరియాలో యావత్తు ఆర్థిక వ్యవస్థను నాటి పాలకులు స్వాధీన పరచుకుని దేశ ప్రజాబాహుళ్యం కోసం వినియోగించారు. సాగుభూమి సంతనూ పాలకులు ప్రభుత్వ స్వాధీనంలోకి తీసుకోవడంతో, ప్రభుత్వ గిడ్డంగులకు ధాన్యరాశులు చేరి సవ్యంగా ఏకకాలంలో ప్రజలకు అందాయి. దాదాపు అదే కాలపు నాటి బాబిలోనియా పాలకులు కూడా సామాన్య పశుల కాపరులకూ, చేతివృత్తులతో జీవిస్తున్న కళాకారులకూ వేతనాలను నిర్ణయించారు.

అలాగే ఈజిప్టులో పాలకులు (టోలమీలు) భూమిపై అధికారం ద్వారా వ్యవసాయాన్ని నిర్వహించి రైతులకు, కార్మికులకు ప్రయోజనం కల్గించారు. గనులనూ పాలక వర్గమే నిర్వహించింది. ఖనిజ సంపదను కోటికి పడగలెత్తిన సోమరుల నుంచి, స్వార్థపరుల నుంచి రక్షించి ప్రజల ప్రయోజనాల్ని రక్షించింది.

కనుకనే ఈ పరిణామాలన్నింటి సారాంశాన్ని వర్తమాన కాలానికి వర్తింపజేస్తూ సుప్రసిద్ధ చరిత్రకారుడూ, 'లెసన్స్ ఆఫ్ హిస్టరీ' (చరిత్ర పాఠాలు) గ్రంథ కర్తా అయిన విల్ డ్యూరాంట్ తన అనంతర పరిశీలనను సోషలిస్టు, కేపిటలిస్టు వ్యవస్థల అనుభవాలకు అన్వయింపజేస్తూ ఇలా పేర్కొన్నాడు: ''సోషలిజం... స్వేచ్ఛా వాయువుల్ని అనుమతించక తప్పనట్టే మరో వైపున వ్యక్తిగత పెట్టుబడి దోపిడీని స్వేచ్ఛగా అనుమతించడానికి అలవాటుపడిన కేపిటలిజం కూడా తన వ్యవస్థలో సమానత్వ ధోరణులను అనుమతించక తప్పని పరిస్థితి వచ్చింది.''

ఈ చరిత్ర పాఠాలకు శివాజీ కూడా అతీతుడు కాదు. ఆ పాఠాలలో భాగమే అతని 'ఎదురీత' అని పాఠక లోకమూ ఈ పుస్తకాన్ని చదివితే తీర్మానించుకొంటుంది!

abkprasad2006@yahoo.co.in

కృతఘ్నుడు

'కృతఘ్నఘ్నాయ దేవాయ, జ్యోతిషాం పతయే నమః' అని ఆదిత్య హృదయ స్తోత్రంలో కనిపిస్తుంది. కృతఘ్నులను శిక్షించే దైవమైన వెలుగుల రాజు సూర్యుడికి నమస్కారం, అని. అప్పుడప్పుడూ సాటి వాళ్ళ సహాయం అవసరమవకుండా ఎంతటి వారికయినా బతుకు నడవదు. కష్టంలో ఉండగా ఏ బంధువులో, మిత్రులో, ఆప్తులో, అపరిచితులో చేయూత ఇచ్చి చేసిన ఉపకారం వల్ల కాస్త నిలదొక్కుకొని, ఆ కష్టం అధిగమించి ముందుకు సాగడం అందరి జీవితాలలోనూ జరిగేదే.

జ్యోతిర్మయం

ఇతరుల ఉపకారానికి కృతజ్ఞులై, వాళ్ళకు ఎప్పుడెప్పుడు తగిన ప్రత్యుపకారం చేయగలమా, ఎప్పుడెప్పుడు వారి ఋణం తీర్చుకోగలమా అని ఉబలాటపడేవాళ్లు ఉదాత్త స్వభావులు. ఉత్తములు. ఆదికావ్యమైన రామాయణం తెరిచి చూస్తే, అందులో మొట్టమొదటి సర్గలో రెండో శ్లోకంలోనే ధర్మజ్ఞతనూ, కృతజ్ఞతనూ ఉత్తమ పురుషుల లక్షణాలుగా ప్రస్తావించడం కనిపిస్తుంది.

అందరూ ఉత్తములూ, ధీరోదాత్తులూ కాలేరు. తమకు ఒకరు చేసిన ఉపకారానికి ఎత్తుకెత్తుగా తగినంత ప్రత్యుపకారం చేయలేని ఎందరో 'సగటు' మనుషులు ఉంటారు. వాళ్ళలో కూడా చాలా మంది, కనీసం, ఉపకారి పట్ల కొంత విశ్వాసమూ, సద్భావమూ, సుహృద్భావమూ కలిగి ఉంటారు. వీళ్ళు మధ్యములు. ఇతరులు చేసిన సహాయాన్ని తమ కష్టం గడిచిపోయిన తక్షణమే మరిచిపోయే ప్రబుద్ధులు అధములు. వీళ్లలో అధమాధములు, ఇతరులు ఉదార బుద్ధితో చేసిన ఉపకారాన్ని తమ సమర్థతగా, ఆ ఉపకారుల తెలివితక్కువతనంగా భావించి, అవకాశం చిక్కితే ఆ ఉపకారికి అపకారం చేయడానికి కూడా వెనకాడరు. సమాజంలో అన్ని రకాల వాళ్ళూ తటస్థపడతారు.

ఈ లోకంలో జరిగే విషయాలన్నిటికీ ఒక సాక్షి సూర్యభగవానుడు. లోకులు చూపే కృతఘ్నతను కూడా ఆయన కనిపెట్టే ఉంటాడని ఈ స్తోత్రం చెప్తుంది. కేవలం గమనించడమే కాదు, సూర్యుడు 'కృతఘ్నఘ్నుడు'. అంటే, కృతఘ్నులను సరైన సమయంలో తగిన రీతిలో శిక్షిస్తాడు. ('ఘ్న' అంటే చంపడం, హాని చేయడం, లాగి వేయడం, తొలగించడం అన్న అర్థాలు వస్తాయి). మంచి కానీ, చెడు కానీ, మనిషి చేసే ప్రతి చర్యకూ ప్రకృతి లోనే ప్రత్యక్ష సాక్షులున్నారు అని పురాణ కథలు పదే పదే బోధిస్తాయి.

– ఎం. మారుతి శాస్త్రి

క్లుప్తంగా...

బాబు మాయమాటలను బీసీలు నమ్మరు

- ఎమ్మెల్సీ, బీసీ నేత కవురు శ్రీనివాస్



సాక్షి, భీమవరం: బీసీ డిక్లరేషన్ పేరిట చంద్రబాబు చేసే మోసపూరిత వాగ్దానాలు నమ్మేది లేదని, బాబు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తే.. సీఎం వైఎస్ జగన్ తన పాలనలో అగ్రాసనం వేశారని ఎమ్మెల్సీ, బీసీ నేత కవురు శ్రీనివాస్ స్పష్టం చేశారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 48 శాసన సభ, 11 లోక్‌సభ స్థానాలిస్తే.. ప్రతిపక్షం ఇప్పటివరకు ప్రకటించిన 128 స్థానాల్లో బీసీలకు ఇచ్చింది కేవలం 24 సీట్లు మాత్రమేనని చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు తన కేబినెట్‌లో కేవలం 8 మంది బీసీలకు మాత్రమే అవకాశం ఇస్తే.. సీఎం జగన్ 11 మందికి మంత్రి పదవులిచ్చారని గుర్తు చేశారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో ఒక్క బీసీ నేతను కూడా రాజ్యసభకు పంపలేదని, కానీ సీఎం జగన్ మాత్రం కేవలం ఐదేళ్లలోనే నలుగురు బీసీలను రాజ్యసభకు పంపి బీసీల పట్ల తన కున్న చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని వివరించారు. బీసీ సాధికారతకు పెద్దపీట వేస్తున్న వైఎస్సార్‌సీపీ వెంటే బీసీలున్నారని తెలిపారు.

చిలకలూరిపేట సభ అట్టర్ ఫ్లాప్

- స్వార్థ రాజకీయాలకు ఏపీ తాకట్టు
- బీజేపీ, టీడీపీ, జనసేనలపై ఎంపీ భరత్‌రామ్ ఆగ్రహం



రాజమహేంద్రవరం సిటీ: బీజేపీ, టీడీపీ, జనసేన సంయుక్తంగా చిలకలూరిపేటలో నిర్వహించిన ప్రజాగళం ఎన్నికల బహిరంగ సభ అట్టర్‌ఫ్లాప్ అయ్యిందని రాజమహేంద్రవరం ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ అన్నారు. నగరంలోని తన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ప్రజాగళం వేదికగా రాష్ట్ర అభివృద్ధిపై ప్రధాని మోదీ ప్రకటన చేస్తారని ఎదురు చూసిన ప్రజలకు ఆశాభంగమే ఎదురైందని విమర్శించారు. ప్రధాని మోదీ పట్ల టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చూపిన అతి వినయం, పొగడ్తలు చూసి జనం నవ్వుకున్నారని ఎద్దేవా చేశారు. రాజకీయ స్వార్థానికి ఆంధ్రుల ఆత్మాభిమానాన్ని తాకట్టు పెట్టాలని చంద్రబాబు, పవన్ చూస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో కేంద్రంలో ఎన్డీఏ, రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చినా ఏపీకి ఒరగబెట్టింది శూన్యమని చెప్పారు. రైల్వే జోన్, పోలవరం ప్రాజెక్టుకు పూర్తి నిధులు ఇస్తామనే కనీస హామీ కూడా మోదీ ఇవ్వలేదని చెప్పారు. ఓటుకు రూ.కోట్లు కేసు, వివిధ స్కీముల పేరుతో చేసిన స్కామ్‌ల నుంచి బయటపడటానికే పొత్తు పెట్టుకున్నారని మండిపడ్డారు.

టీడీపీ లేకపోతే జనసేన ఎక్కడిది?

- మద్దతు అంటూనే మండిపోయేలా వర్మ వ్యాఖ్యలు
- పిఠాపురంలో టీడీపీ – జనసేన మధ్య ముదిరిన వివాదం



పిఠాపురం: కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో చంద్రబాబు హామీతో సమసిపోయిందనుకున్న టీడీపీ–జనసేన వివాదం.. టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తాజా వ్యాఖ్యలతో మరింత ముదిరింది. చంద్రబాబును కలిసి వచ్చిన వర్మ పిఠాపురంలో ఆదివారం కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ జనసేన నేతలపై తీవ్ర పదజాలంతో విమర్శలు గుప్పించారు. ఈ వివరాలు సోమవారం వెలుగులోకి వచ్చాయి. పిఠాపురంలో ఉన్నది అసలు జనసేన పార్టీయే కాదని, ఇక్కడ ఎన్నికలను ఎదుర్కొనే శక్తి టీడీపీకే ఉందని వర్మ అన్నారు. ఇప్పుడున్న జనసేన నాయకులంతా కాకినాడ నుంచి మాస్కులు వేసుకుని వచ్చిన వారేనని పిఠాపురం జనసేన ఇన్‌చార్జి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను ఎద్దేవా చేశారు. మాదేపల్లి శ్రీనివాస్, జ్యోతుల సతీష్, బవిరిశెట్టి రాంబాబు తదితరులనుద్దేశించి మాట్లాడుతూ, వారందరూ టీడీపీ నుంచి జనసేన కొనుక్కున్న వారేనని విమర్శించారు. టీడీపీ నేతలపై, తనపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేశారని, ఇప్పుడు ఆ పార్టీకి తానే దిక్కయ్యానని అన్నారు. టీడీపీని తొక్కేసేందుకు, తనను హత్య కేసులో ఇరికించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారన్నారు. టీడీపీ కేడర్ పని చేస్తే తప్ప జనసేన ఒక్క ఓటు కూడా తెచ్చుకోలేదని, అదో చేతగాని పార్టీ అంటూ విరుచుకుపడ్డారు. పేరుకే జనసేన ఉండాలని, అంతా పసుపు రంగులోనే చూస్తామని, తాము నెగ్గించి భిక్ష వేసినట్లుగా జనసేనకు ఇస్తామని తీవ్ర స్థాయిలో విమర్శించారు. పవన్ గెలుపునకు పూర్తిగా సహకరిస్తానని చెబుతూనే, తనకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని, సైన్యాన్ని నడపడానికి సైన్యాధిపతిగా తాను తీసుకునే నిర్ణయాలకు మద్దతు పలకాలంటూ జనసేన నేతలను తన కింద పని చేసే వ్యక్తులుగా చెప్పుకొచ్చారు. వర్మ చేసిన వ్యాఖ్యలతో పిఠాపురంలో టీడీపీ–జనసేన మధ్య విభేదాలు మళ్లీ రచ్చకెక్కాయి. వర్మ వ్యాఖ్యలపై పిఠాపురం జనసేన నేతలు తీవ్రంగా మండిపడుతున్నారు. ఈ విషయాన్ని అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి తాడోపేడో తేల్చుకుంటామని చెబుతున్నారు. ఎవరో వేసే భిక్ష కోసం తామెందుకు పని చేయాలంటూ అగ్గి మీద గుగ్గిలమవుతున్నారు.

కూటమి ఆశలు పటాపంచలు

మూడు పార్టీల అనైతిక కలయికకు ప్రజా స్పందన కరవు



ఆదివారం జనం లేక వెలవెలబోయిన టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రజాగళం సభ

సాక్షి, అమరావతి: టీడీపీ – బీజేపీ – జనసేన కూటమి ఆశలు పగటి కలలే అని తేలిపోయింది. వారి పొత్తులకు ప్రజా స్పందన కరవైంది. ఈ పొత్తులు మూడు పార్టీల ముఖ్యమైన నేతల నుంచి క్షేత్రస్థాయి కార్యకర్తల వరకు ఇష్టపడటంలేదు. నియోజకవర్గాల్లో పార్టీల నేతలు, కార్యకర్తలు ఉప్పు, నిప్పులానే ఘర్షణ పడుతున్నారు. ప్రజా స్పందన అయితే శూన్యం. ఈ నేపథ్యంలోనే బీజేపీతో పొత్తుకు ముందు 20 రోజుల క్రితం కాపు సామాజికవర్గం బాగా బలంగా ఉండే తాడేపల్లిగూడెం ప్రాంతంలో టీడీపీ – జనసేన 'జెండా' సభ నిర్వహించాయి. అది అట్టర్ ఫ్లాప్ అయింది. బీజేపీతో పొత్తు తర్వాత ఆదివారం కమ్మ సామాజికవర్గం ఎక్కువగా ఉండే చిలకలూరిపేట ప్రాంతంలోని బొప్పూడిలో సభ పెట్టారు. ప్రధాని మోదీ కూడా పాల్గొన్న ఈ సభపై చంద్రబాబు, పవన్ సహా కూటమి నేతలంతా ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఈ సభకూ ప్రజల నుంచి స్పందన లేక అట్టర్ ఫ్లాప్ అయింది. దీంతో మూడు పార్టీల నాయకులు, శ్రేణులు నిరాశలో మునిగిపోయారు. ఏకంగా ప్రధాని నరేంద్ర మోదీ కూడా పాల్గొన్న ఈ సభకు ప్రజాస్పందన మొదలు సభ జరిగిన తీరు, నాయకుల ప్రసంగాలు అన్నింటిపై మూడు పార్టీల సీనియర్ నేతలు సైతం పెదవి విరుస్తున్నారు.

కార్లు అడ్డుపెట్టి.. ట్రాఫిక్ జామ్ చేసి

చిలకలూరిపేట సభకు భారీగా జనసమీకరణ చేయడం కోసం టీడీపీ నాయకులు మొదట దాదాపు 2500 బస్సులు కావాలని ఆర్టీసీ అధికారులను కోరారు. క్షేత్రస్థాయిలో ప్రజా స్పందన వ్యతిరేకంగా ఉందని తెలిసిపోవడంతో ఆఖరి నిమిషంలో 1540 బస్సులను క్యాన్సిల్ చేసి, 960 బస్సులను మాత్రమే తీసుకున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. మరికొన్ని ప్రైవేట్ స్కూళ్ల బస్సులనూ తీసుకున్నారు. వీటిలో ఏ బస్సుల్లోనూ సగం కూడా నిండలేదు. ఏ ఒక్క బస్సూ నిండుగా సభకు రాలేదని స్థానికులు చెప్పారు.

ఏలూరు లోక్‌సభ ప్రాంతం మొదలు ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రాంతం మధ్య దాదాపు సగం రాష్ట్రం నుంచి ఈ సభ కోసం మూడు పార్టీలూ ప్రతిష్టాత్మకంగా తీసుకొని 10 లక్షలకు తక్కువ కాకుండా జనసమీకరణ చేయాలని భావించాయి. ప్రధాని నరేంద్ర మోదీ వచ్చినప్పటికీ, పదో వంతు కూడా జనాలు సభలో కనిపించలేదు. చివరకు సభకు ఎక్కువ మంది జనాలు వచ్చారని చూపించుకోవడానికి టీడీపీ నాయకులే జాతీయ రహదారిపై కార్లు అడ్డంగా పెట్టి రెండు మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ చేసి వాటినే డ్రోన్లతో చిత్రీకరించి చూపించేందుకు ప్రయత్నించారు. వారు కార్లు అడ్డం పెట్టడం సహా పూర్తి వాస్తవ చిత్రం వారి చిత్రాల్లోనే కనిపించేస్తోంది.

సభలో వైఫల్యాలను పోలీసులపై రుద్దే యత్నం

బీజేపీతో అధికారికంగా పొత్తు ఖరారు కాకముందే మార్చి తొలివారంలోనే టీడీపీ జనసేన పార్టీలు చిలకలూరిపేట సభ నిర్వహించాలని నిర్ణయించుకున్నాయి. మూడు పార్టీల పొత్తు ఖరారైన తర్వాత ప్రధాని మోదీని కూడ ఈ సభకు ఆహ్వానించారు. అయితే, ఈ సభకు జనసమీకరణ పూర్తిగా టీడీపీ నాయకుల ఆధ్వర్యంలోనే కొనసాగింది. సభ నిర్వహణను ఆఖరి నిమిషంలో బీజేపీ నాయకులకు అప్పగించారు. సభలో ప్రధాని స్థాయిలో ఉన్న మోదీని అవమానించారు. ప్రధాని వేదిక పైకి వచ్చిన తర్వాత బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు సభ నిర్వహణ చేపట్టారు. వేదికపైకి వచ్చిన ప్రధాని మోదీకి శాలువా కప్పి సన్మానించాలని చంద్రబాబును, పుష్పగుచ్ఛం అందించాలని పవన్‌ను కోరారు. అయితే, చంద్రబాబు, పవన్ వద్ద కనీసం ఓ పూల బొకే కూడా లేకపోవడంతో ప్రధాని అలానే కొద్దిసేపు నిలబడ్డారు. చివరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తన వద్ద ఉన్న వినాయకుని ప్రతిమను ప్రధానికి బహూకరించి, సన్మాన కార్యక్రమం మ మ అనిపించారు. ఆ తర్వాత ప్రధాని ప్రసంగించే సమయంలో మైకులు మూడు సార్లు మూగబోయాయి. అంతకు ముందే సభలో జనం పలుచగా ఉండటంతో ఎక్కువ మంది వచ్చారన్నట్లుగా చూపించడానికి టీడీపీ నేతల ఆదేశాల మేరకు పలువురు కార్యకర్తలు సౌండ్ బాక్స్‌లు, ఫ్లడ్ లైట్ల టవర్ల పైకి ఎక్కారు. అది ప్రమాదమని తెలిసినా, చంద్రబాబు, ఆ సమయంలో ప్రసంగిస్తున్న పవన్ వారిని వారించలేదు. ఇది గమనించి ప్రధానే స్వయంగా పవన్‌ను ప్రసంగం ఆపమని చెప్పి, తాను మైకు ముందుకు వచ్చి వారందరినీ కిందికి దిగాలని కోరాల్సివచ్చింది. ఇలా అన్ని అంశాల్లో సభ నిర్వహణలో తెలుగుదేశం పార్టీ నాయకుల లోపాలు స్పష్టంగా కనపడుతున్నా, ఆ లోపాలను పోలీసులు, అధికారులపైనా నెట్టేందుకు టీడీపీ, జనసేన నాయకులు పూనుకున్నారు.

కూటమి రాజకీయ నినాదంపైనా అస్పష్టతే

టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు పొత్తు పెట్టుకున్నప్పటికీ, వారికి ఉమ్మడి రాజకీయ విధానం లేదన్న విషయం వారి ప్రసంగాలే తేల్చేశాయి. రాష్ట్రానికి వచ్చే ఐదేళ్లు వారు ఏం చేస్తామన్నది కూడా చెప్పకుండా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కొద్దిరోజులుగా కేవలం సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై వ్యక్తిగత, రాజకీయ విమర్శలకే పరిమితమవుతున్నారు. తాడేపల్లిగూడెం సభలో పూర్తిగా సీఎం వైఎస్ జగన్‌పై వ్యక్తిగత విమర్శలకే పరిమితమయ్యారు. చిలకలూరిపేట సభలో ఓ పక్క మోదీపై ప్రశంసలు కురిపిస్తూ, జగన్‌పై అవే విమర్శలను కొనసాగించారు. ప్రస్తుత పీసీసీ (రాష్ట్ర కాంగ్రెస్) అధ్యక్షురాలుగా కొనసాగుతున్న షర్మిల సొంత చెల్లెలు అయి ఉండి కూడా సీఎం జగన్‌ని నమ్మడం లేదని బాబు, పవన్ విమర్శిస్తే.. అదే సభలో ప్రధాని మోదీ మాత్రం కాంగ్రెస్ పార్టీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు రెండు ఒక్కటేనని, ఒకే కుటుంబానికి చెందిన షర్మిల, వైఎస్ జగన్ ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చడానికే ఇలా రెండు పార్టీల్లో ఉన్నారని విమర్శలు చేయడం గమనార్హం. కీలకమైన రాజకీయ విధానంలో మూడు పార్టీల మధ్య ఏకాభిప్రాయం లేదనడానికి ఇదే ఉదాహరణ అని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ఎందుకు విడిపోయారో, మళ్లీ ఎందుకు కలిశారో చెప్పకుండా..

2014 ఎన్నికలప్పుడు ఈ మూడు పార్టీలే ఉమ్మడిగా కలిసి పోటీ చేశాయి. ఆ ఎన్నికల్లో వందల హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఏ హామీ అమలుచేయలేదు. రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణ మాఫీ పేరిట రైతులు, మహిళలను వంచించారు. ఐదేళ్లు తిరగకుండానే మూడు పార్టీలు విడిపోయి, ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకొన్నాయి. 2019లో వేర్వేరుగా పోటీ చేశాయి. మళ్లీ ఇప్పుడు ఆ మూడు పార్టీలే కూటమి కట్టాయి. అప్పుడు ఎందుకు విడిపోయారు, తిరిగి మళ్లీ ఎందుకు కలిశారో వారే చెప్పలేకపోతున్నారు. దీంతో వారి కార్యకర్తలే వారిని నమ్మడం లేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

తెలుగుదేశం పేరే ఎత్తని ప్రధాని మోదీ

2019 ఎన్నికలకు ముందు చంద్రబాబు ప్రధాని స్థానంలో ఉన్న నరేంద్ర మోదీపై వ్యక్తిగతంగా, రాజకీయంగానూ తీవ్ర విమర్శలు చేశారు. ప్రధాని మోదీ ఎన్నికల ప్రచారం కోసం రాష్ట్రానికి వస్తే టీడీపీ నాయకులు గో బ్యాక్ నినాదాలతో హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. ప్రధాని పాల్గొనే సభలకు సమీపంలో నల్ల బెలూన్లు సైతం ఎగరవేశారు. ఆదివారం చిలకలూరిపేట సభలో చంద్రబాబు, మోదీ ఇరువురు పక్క పక్కనే కూర్చున్నా, ప్రధాని మోదీ గత ఐదేళ్లనాటి చేదు సంఘటనలు ఇంకా మరిచిపోలేదేమో అన్నట్టుగా ముభావంగా ఉన్నారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఐదేళ్ల కిత్రం మోదీపై తీవ్ర విమర్శలు చేసిన చంద్రబాబే ఈ సభలో హిందీలో, తెలుగు భాషలో పొగడ్తల వర్షం కురిపించారు. అయితే, ప్రధాని మోదీ తన ప్రసంగంలో తెలుగుదేశం పార్టీ పేరును ఒక్కసారి కూడా ఉచ్చరించలేదు. కేవలం ఎన్డీఏ పేరుతో ప్రజలను ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. చంద్రబాబు పేరును కేవలం ఒక్కసారి మాత్రమే పలికారు.

టీడీపీ బీసీల వ్యతిరేక పార్టీ

ప్రముఖ పారిశ్రామికవేత్త రావూరి ఈశ్వరరావు ఫైర్



ఈశ్వరరావును వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న చిత్తూరు అసెంబ్లీ అభ్యర్థి విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: టీడీపీ పేరుకు మాత్రమే బీసీల పార్టీ అని.. కానీ, నిజానికి అది బీసీల వ్యతిరేక పార్టీ అని ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ నేత రావూరి ఈశ్వరరావు తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. చంద్రబాబునాయుడుతో పాటు ఆ పార్టీని నమ్ముకుని తాను వీధిలో పడ్డానని కన్నీటిపర్యంతమయ్యారు. టీడీపీలోని ఓ నలుగురు నాయకులు తన కొంపముంచారని ఆరోపించారు. చిత్తూరు గురునగర్ కాలనీలోని తన నివాసంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీ వర్గానికి చెందిన వ్యక్తిని కావడంతో పార్టీలో తనను పూర్తిగా పక్కన పెట్టేశారన్నారు. అంతేకాక.. రూ.340 కోట్లు విలువ చేసే తన ఫ్యాక్టరీని మూయించారన్నారు. ఇన్నాళ్లు పార్టీలో ఉన్నందుకు తన పరువు పూర్తిగా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. నిజానికి.. ప్రజాసేవ చేస్తూ 24 ఏళ్లు టీడీపీకి బానిసలా సేవచేశానని.. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కూడా అనేక సంవత్సరాలు పనిచేశానని ఆయన చెప్పారు. పైగా.. 2004 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన మనోహర్ విజయంలో కీలకపాత్ర పోషించానన్నారు. టీడీపీలోని ఆ నలుగురు నేతలు తనను దారుణంగా అవమానించారని.. వీరు చిత్తూరు జిల్లాలో బీసీ సామాజికవర్గ నేతలను అస్సలు ఎదగనివ్వడంలేదని ఆయన చెప్పారు. ప్రస్తుత టీడీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న గురజాల జగన్‌మోహన్‌కు కూడా వారి నుంచి అవమానాలు ప్రారంభమయ్యాయన్నారు. ఇలాంటి నీచమైన పార్టీ నుంచి తాను వైదొలుగుతున్నానని.. టీడీపీకి రాజీనామా చేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా రావూరి ఈశ్వరరావును వైఎస్సార్‌సీపీ చిత్తూరు అసెంబ్లీ అభ్యర్థి విజయానందరెడ్డి కలిశారు. రావూరికి పార్టీ కండువా వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించి తన విజయానికి పాటుపడాలని అభ్యర్థించారు. సీఎం వైఎస్ జగన్ సింహంలాంటి వారని, ఆయన చేస్తున్న అభివృద్ధి నచ్చిందని రావూరి వ్యాఖ్యానించారు. మంత్రి పెద్దిరెడ్డి విజయానందరెడ్డి గెలుపునకు తాను శక్తివంచన లేకుండా కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

పశ్చిమ గోదావరి జిల్లాలో వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

పార్టీలో చేరిన టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం నేతలు, కార్యకర్తలు

పెనుగొండ/దెందులూరు/భీమవరం/ఏలూరు (టూటౌన్)/పాలకోడేరు: పశ్చిమ గోదావరి జిల్లాలో టీడీపీ, జనసేన, బీజేపీ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీల నుంచి నేతలు, కార్యకర్తలు భారీగా సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. పెనుగొండ మండలం తూర్పుపాలెంలో బీజేపీ, సీపీఎం నేతలకు మాజీ మంత్రి రంగనాథరాజు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 2019లో ఆచంట నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఏడిద కోదండ చక్రపాణి, సీపీఎం నేత గుర్రాల సత్యనారాయణతో పాటు పలువురు పార్టీలో చేరారు. గుర్రాల సత్యనారాయణ పెనుగొండ పట్టణ కార్యదర్శిగాను, రైతు సంఘ నాయకుడు గాను వ్యవహరించారు. కాంగ్రెస్ పార్టీ దెందులూరు మండల అధ్యక్షుడు కంచర్ల గంగాధరరావు, గౌడ సంఘం అధ్యక్షుడు బెజవాడ సత్తిబాబు, ఆ పార్టీ నేతలు దంపనబోయిన రామచంద్రరావు, కొల్లేటి శంకర్ తదితరులు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరవాసరం మండలం మత్స్యపురి, భీమవరం పట్టణంలోని 2,36 వార్డులకు చెందిన జనసేన, టీడీపీ నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఏలూరు 29వ డివిజన్ కుమ్మరి రేవుకు చెందిన 50 మందికి పైగా బీజేపీ కార్యకర్తలు ఎమ్మెల్యే ఆళ్ల నాని, కార్పొరేటర్ సన్నీ, వైఎస్సార్‌సీపీ నేత యలమర్తి సతీష్‌ల సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరంతా కుమ్మరి రేవు ప్రాంతానికి చెందిన బీజేపీ కార్యకర్తలు పెద్ది రమణమ్మ, ఉద్దడం రవళి ఆధ్వర్యంలో పార్టీలోకి వచ్చారు. పాలకోడేరు మండలం శృంగవృక్షంకి చెందిన 60 మందికి పైగా టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు ఉండి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నరసింహరాజు సమక్షంలో పార్టీలో చేరారు.



శ్రీరంగనాథరాజు సమక్షంలో పార్టీలో చేరిన బీజేపీ, సీపీఎం నాయకులు



ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సమక్షంలో పార్టీలో చేరిన కాంగ్రెస్ నేతలు



ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో పార్టీలో చేరుతున్న టీడీపీ, జనసేన నేతలు



ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో పార్టీలో చేరిన బీజేపీ కార్యకర్తలు



వైఎస్సార్‌సీపీ ఉండి ఎమ్మెల్యే అభ్యర్థి నరసింహరాజు ఆధ్వర్యంలో పార్టీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలు

సభ నిర్వహించుకోలేక పోలీసులపై నిందలా?

- పదేళ్ల క్రితం ఒకే వేదికను పంచుకున్నారుగా.. నాటి హామీలు ఏమయ్యాయి?
- కనీసం సంజాయిషీ చెప్పి ప్రజల ముందుకు రావాల్సింది
- పదేళ్ల తర్వాత మళ్లీ అదే నాటకం ఆడితే ప్రజలేమన్నా అజ్ఞానులా?
- నాడు బూతులు తిట్టుకుని మళ్లీ ఏ ముఖం పెట్టుకుని ఒకే వేదిక ఎక్కారు?
- వారేం చెప్పినా ప్రజలు నమ్మరనే సీఎం జగన్‌పై తిట్లతో బాబు, పవన్ ప్రసంగాలు
- మోదీ వద్ద హోదా, పోలవరం, విశాఖ ఉక్కు వంటి సమస్యలను ప్రస్తావించలేదేం?
- సభ అట్టర్ ఫెయిల్ అయ్యిందని ప్రధాని తిట్టి ఉంటారు
- అందుకే ఆ నెపం పోలీసులపైకి నెడుతున్నారు
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి: చిలకలూరిపేట సభను నిర్వహించుకోలేక అభాసుపాలై పోలీసులపై నిందలేస్తే ఎలా అని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలను వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి నిలదీశారు. కూటమి నేతల తీరు ఆడలేక మద్దెల ఓడు అన్నట్లుగా ఉందన్నారు. సభ అట్టర్ ఫెయిల్ కావడంతో ప్రధాని మోదీ తిట్టి ఉంటారని, దీంతో చంద్రబాబు, పవన్ పోలీసులపై నెపం వేస్తున్నారని అన్నారు. ఆయన సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. 'రాష్ట్ర విభజన నేపథ్యంలో పదేళ్ల క్రితం 2014లో జరిగిన ఎన్నికల్లో వీరు ముగ్గురూ తిరుపతిలో ఒకే వేదికపై కనిపించారు. కొత్త రాష్ట్రం, కొత్త సమస్యల పరిష్కారానికి జాతీయ స్థాయి నాయకత్వం కావాలని అప్పట్లో చంద్రబాబు అన్నారు. దీనికి సరైన పరిష్కారం చూపుతామంటూ పవన్‌ను తోడుగా తీసుకుని తిరుపతి సభలో మోదీ ప్రత్యక్షమయ్యారు. మళ్లీ పదేళ్ల తర్వాత అదే నాటకమాడుతున్నారు. ఆనాడు కొత్త పెళ్లి కాబట్టి కాస్తంత ఊపు మీద ఉన్నట్లు కన్పించారు. ఇప్పుడు మాత్రం ప్రజల్ని మోసగిస్తున్న ఛాయలు వారి ముఖాల్లో కనిపించాయి' అని అన్నారు. మీడియాతో మాట్లాడుతూ సజ్జల రామకృష్ణారెడ్డి ఇంకా ఏమన్నారంటే..

అప్పట్లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?

2014లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసినా కేవలం 1 శాతం ఓట్ల తేడాతో అధికారంలోకి వచ్చారు. నాడు వారు ఇచ్చిన ప్రత్యేక హోదాతో సహా మిగతా హామీలన్నీ ఏమయ్యాయి? మూడేళ్ల తర్వాత విడిపోయి బండ బూతులు తిట్టుకున్నారు. చంద్రబాబు ఏకంగా మోదీ కుటుంబాన్ని గురించి కూడా మాట్లాడారు. ఈరోజు అదే చంద్రబాబు అవే పార్టీలను కలుపుకొని వేదిక ఎక్కారు. మళ్లీ ఏ ముఖం పెట్టుకుని ఇప్పుడు ఒకే వేదికపైకి వచ్చారు? 2014లో రైతు రుణ మాఫీ, డ్వాక్రా రుణ మాఫీ, ఆడబిడ్డ పుట్టగానే 25 వేలు వేస్తామని, జాబు కావాలంటే బాబు రావాలి – లేదంటే నెలకు రూ.2000 నిరుద్యోగ భృతి.. ఇలా 600కు పైగా హామీలు ఇచ్చారు. అవన్నీ ఎమయ్యాయో చిలకలూరిపేటలో సంజాయిషీ ఇచ్చి ఉండాల్సింది. ఇప్పుడేం చెప్పినా ప్రజలు నమ్మరనే సీఎం జగన్‌పై దుమ్మెత్తిపోయడమే పనిగా చంద్రబాబు, పవన్ నోటికొచ్చినట్లు మాట్లాడారు.

చిన్న సభనూ సక్రమంగా నిర్వహించలేకపోయారు

సాక్షాత్తు ప్రధాని మోదీ పాల్గొన్న సభ గందరగోళంగా జరిగింది. వాళ్ల మైక్ సిస్టమ్స్ ఫెయిల్ అయితే పోలీసులు రాలేదని ఆరోపిస్తున్నారు. లక్షల మంది వచ్చే మా సిద్ధం సభలకు మా ఏర్పాట్లు మేం చేసుకున్నాం. అలానే ఎవరి ఏర్పాట్లు వారు చేసుకోవాలి. పొరపాటున కరెంటు పోయి ఉంటే మాపైనే ఎన్నో అనేవారు. ఒక చిన్న సభ.. అంతా కలిపి 50 – 60 వేలు వచ్చి ఉంటారు. అదీ సక్రమంగా నిర్వహించలేక, వారి చేతకాని తనాన్ని పోలీసు శాఖకు అంటగట్టడం దివాళాకోరుతనం. ప్రధాని మోదీకి సన్మానం అన్నారు.. అవమానించారు. ఇవన్నీ అర్థంటుగా అధికారంలోకి వచ్చేయాలన్న చంద్రబాబు ఆత్రాన్ని సూచిస్తాయి. జగన్ చెల్లెళ్లే ఓట్లేయద్దంటున్నారు అని చంద్రబాబు అంటే.. వైఎస్సార్‌సీపీ, కాంగ్రెస్ రెండు ఒకటేనని ప్రధాని మోదీ చెబుతున్నారు. మీరు ఏది చెబితే అది నమ్మడానికి ప్రజలంత అజ్ఞానులు అనుకుంటున్నారా?

సీఎం జగన్ ఢిల్లీకి వెళ్లి ప్రధానితో సమావేశమైన ప్రతిసారీ ప్రత్యేక హోదా, పోలవరానికి నిధులు, రైల్వే జోన్, విభజన హామీలతోపాటు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే నడపాలని కోరుతూ వస్తున్నారు. ప్రధాని మోదీ పాల్గొన్న వేదిక నుంచే ఈ హామీలు అమలు చేయాలని సీఎం జగన్ విజ్ఞప్తి చేశారు. చిలకలూరిపేట సభలో ప్రత్యేక హోదా, పోలవరం, స్టీల్‌ప్లాంట్‌పై ప్రధాని మోదీని చంద్రబాబు, పవన్ కనీసం అడగలేకపోయారు.

విశ్వసనీయతకు వారంటీ అవసరం లేని గ్యారంటీ జగన్

తాము పెట్టుకున్న నమ్మకానికి డబుల్‌గా జగన్ చేశారనే నమ్మకం ప్రజల్లో ఉంది. ప్రజల్లో ఆ స్పందన కనిపిస్తోంది. సిద్ధం సభల్లో కనిపించిన స్పందన అక్కడి నుంచి వచ్చిందే. విశ్వసనీయతకు వారంటీ అవసరం లేని గ్యారంటీ సీఎం వైఎస్ జగన్ అనేది ఈ ఐదేళ్లలో కనిపించింది. చంద్రబాబు, పవన్ ఎన్ని చెప్పినా రాష్ట్రంలో 87 శాతం కుటుంబాలు జగన్ పాలన వల్ల లబ్ధి పొందాయి. ఇది తాత్కాలికం కాదు. వారి జీవితాల్లో వెలుగులు వచ్చాయి. అందుకే ప్రజలు జగన్‌ను వారి మనిషిగా ఓన్ చేసుకుంటున్నారు. చంద్రబాబు 2014లో వేసిన నాటకం మళ్లీ వేసి ప్రజలను భ్రమల్లో పెట్టాలని ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, వాటిని తిప్పికొట్టాలి.

తొలిరోజు ప్రశాంతంగా
పదో తరగతి పరీక్షలు

- 96.35 శాతం మంది విద్యార్థులు హాజరు
- దృష్టి లోపం ఉన్నవారికి ప్రత్యేకంగా ఆడియో ప్రశ్నపత్రం
- పలు కేంద్రాల్లో పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారుల తనిఖీ



విజయవాడ పటమట కేబీసీ బాయ్స్ హైస్కూల్‌లో తనిఖీ చేస్తున్న కమిషనర్ సురేష్ కుమార్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం 26 జిల్లాల్లో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 3,473 సెంటర్లను ఏర్పాటు చేశారు. తొలిరోజు 6,54,553 మంది విద్యార్థులకు గాను 6,30,633 మంది (96.35 శాతం) పరీక్షలకు హాజరయ్యారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. సోమవారం పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్, పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డి విజయవాడ, గుంటూరులోని పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ప్రవీణ్ ప్రకాశ్ మాట్లాడుతూ.. 35,119 మంది ఇన్విజిలేటర్లు విధుల్లో ఉన్నారన్నారు. పరీక్షల సరళిని పరిశీలించేందుకు 156 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 682 సిట్టింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు ఆడియోతో కూడిన ప్రశ్నపత్రాలను అందించామన్నారు. దేశంలో ఈ తరహా పరీక్షా విధానం అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని తెలిపారు. ఈ ఏడాది 12 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఆడియో సౌకర్యాన్ని ఉపయోగించుకుని స్వయంగా పరీక్షలు రాస్తున్నారన్నారు. భవిష్యత్‌లో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులందరికీ ఈ విధానం అమలు చేస్తామని చెప్పారు. గతేడాది పదో తరగతి పరీక్షల్లో ఫెయిలయ్యి రెగ్యులర్ విద్యార్థులుగా తిరిగి నమోదైనవారి మార్కులు సబ్జెక్టుల వారీగా పరిగణిస్తామని తెలిపారు. గతేడాది, ఇప్పుడు మార్కులను పరిశీలించి, అధిక మార్కులను పరిగణనలోకి తీసుకుంటామన్నారు.

'ఇంటర్' మూల్యాంకనం ప్రారంభం

కాగా ఈనెల 1న ప్రారంభమైన ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ప్రధాన పేపర్లు ఇప్పటికే పూర్తయ్యాయి. రేపటి(బుధవారం)తో మైనర్ సబ్జెక్టుల పరీక్షలు కూడా అయిపోతాయి. ఈ క్రమంలో ఇప్పటికే పూర్తయిన పేపర్ల జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం ప్రారంభమైంది. సుమారు 23 వేల మంది అధ్యాపకులు ఈ ప్రక్రియలో పాల్గొన్నట్టు ప్రవీణ్ ప్రకాశ్ తెలిపారు. ఒక్కో అధ్యాపకుడు రోజుకు 30 జవాబు పత్రాలను మూల్యాంకనం చేస్తారన్నారు. ఇది ఏప్రిల్ 4 వరకు కొనసాగుతుందని, అనంతరం ఫలితాలను విడుదల చేస్తామని చెప్పారు.



జెల్లీఫిష్

కృష్ణాతీరంలో జెల్లీఫిష్‌ల సందడి

కృష్ణాజిల్లా, నాగాయలంక మండలంలోని సముద్రంలో ఆకర్షణీయమైన జెల్లీఫిష్‌ల సందడి ఆరంభమైంది. నాగాయలంక శ్రీరామ పాదక్షేత్రం ఘాట్ సమీపంలో కృష్ణానదికి అవతలి వైపు పశ్చిమ దిక్కున లంక దిబ్బల నడుమ నది పాయలో (నాగాయలంక రేవులో) ఈ జెల్లీ ఫిష్‌లు అధిక సంఖ్యలో సంచరిస్తున్నాయి. పర్యాటకులకు కనుల విందు చేస్తున్నాయి. దీంతో పలువురు బోట్‌లో వెళ్లి మరీ వీటి అందాన్ని చూసి ఆస్వాదిస్తున్నారు. వేసవిలో సముద్ర జలాల్లోని ఉప్పు శాతం పెరగడం, సముద్ర జలాలు బ్యాక్ వాటర్‌గా ఇక్కడి కృష్ణానదిలో నిత్యం ఉప్పునీరు మాత్రమే ప్రవహించడంతో జెల్లీ ఫిష్‌లు అధిక సంఖ్యలో నదిలోకి తరలి వచ్చాయని ఔత్సాహిక కృష్ణానదీ కేజ్ కల్చరిస్ట్ తలశిల రఘుశేఖర్ చెప్పారు.

–నాగాయలంక(అవనిగడ్డ)

జలమండలి కేసులోనూ ఈడీ విచారణకు కేజ్రీవాల్ డుమ్మా

న్యూఢిల్లీ: ఢిల్లీలో మద్యం కేసులో ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ గైర్హాజరుల పర్వం ఢిల్లీ జలమండలి కేసులోనూ పునరావృతమైంది. మద్యం అవకతవకల కేసులో కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పలుమార్లు సమన్లు జారీచేయడం ఆయన గైర్హాజరవడం తెల్సిందే. తాజాగా ఢిల్లీ జల్‌బోర్డ్‌లో అక్రమాలు జరిగాయంటూ నమోదైన కేసును దర్యాప్తు చేస్తున్న ఈడీ విచారణ కోసం సోమవారం తమ ఎదుట హాజరుకావాలని ఇప్పటికే సమన్లు జారీచేయగా కేజ్రీవాల్ ఈడీ ఆఫీస్‌కు రాలేదు. తనకు సమన్లు పంపడం చట్టవ్యతిరేకమని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. మనీ లాండరింగ్ సంబంధించిన సమన్లు అందుకున్న రెండో కేసు ఇది. మద్యం ఎక్సయిజ్ కేసులో ఇప్పటికే ఎనిమిది సార్లు సమన్లు అందుకోవడం, ప్రతిసారీ ఆఫీస్‌కు రాకుండా మిన్నకుండిపోవడం తెల్సిందే. మద్యం కేసులో విచారణ నిమిత్తం మార్చి 21వ తేదీన తమ ఆఫీస్‌కు రావాలని ఈడీ తాజాగా ఆయనకు తొమ్మిదోసారి సమన్లు జారీ చేయడం గమనార్హం.

నేడు బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలకు నగారా మోగిన నేపథ్యంలో బీజేపీ మూడో జాబితాపై కసరత్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా మంగళవారం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో కేంద్ర ఎన్నికల కమిటీ భేటీ కానుంది. పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) బీఎల్‌సంతోష్ తోపాటు, పార్లమెంటరీ బోర్డు సభ్యులు పాల్గొంటారు. సీఈసీ భేటీలో తెలుగు రాష్ట్రాలు సహా దేశంలోని 13 రాష్ట్రాల ఎంపీ అభ్యర్థుల ఎంపికపై చర్చించి ఆమోద ముద్రవేయనున్నారు. ఇప్పటికే ప్రకటించిన రెండు జాబితాల్లో తెలంగాణలోని 15 స్థానాలకు అభ్యర్థుల పేర్లను వెల్లడించింది. మూడో జాబితాలో తెలంగాణలోని రెండు స్థానాలు, ఆంధ్రప్రదేశ్‌లోని ఆరు సీట్లకు అభ్యర్థుల పేర్లు ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. మరోవైపు, సోమవారం పార్టీ ప్రధాన కార్యాలయంలో పది రాష్ట్రాలకు చెందిన కోర్ కమిటీ నేతలతో జేపీ నడ్డా, అమిత్ షా, బీఎల్ సంతోష్ భేటీ అయ్యారు. ఆయా రాష్ట్రాల ఎంపీ అభ్యర్థుల పేర్లపై చర్చించి జాబితాను సిద్ధం చేసినట్లు తెలిసింది.

బీజేపీ 17, జేడీ(యూ) 16

బిహార్‌లో కుదిరిన సీట్ల సర్దుబాటు

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి బిహార్‌లో ఎన్డీఏ కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు ఖరారైంది. దీని ప్రకారం 17 చోట్ల బీజేపీ పోటీ చేయనుంది. 16 చోట్ల నితీశ్ సారథ్యంలోని జేడీ(యూ), ఐదో చోట్ల చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్‌జన్‌శక్తి (రామ్‌విలాస్) పార్టీ బరిలో దిగనున్నాయి. హిందుస్తానీ అవామ్ మోర్చా, ఉపేంద్ర కుష్వాహా సారథ్యంలోని రాష్ట్రీయ లోక్‌మోర్చా చెరో స్థానం నుంచి పోటీ చేస్తాయి. 'ఇండియా' కూటమితో తెగతెంపులు చేసుకుని మళ్లీ తమతో జట్టుకట్టిన జేడీ(యూ) కంటే బీజేపీ బిహార్‌లో తొలిసారిగా ఎక్కువ స్థానాల్లో పోటీకి దిగడం విశేషం. ఈసారి రాష్ట్రంలో మొత్తం 40 స్థానాలూ ఎన్డీఏవేనని బిహార్ ఎన్నికల ఇన్‌చార్జ్, బీజేపీ నేత వినోద్ తావ్డే ధీమా వ్యక్తంచేశారు.

కాంగ్రెస్ రెబల్స్‌కు సుప్రీంలో చుక్కెదురు

న్యూఢిల్లీ: హిమాచల్ ప్రదేశ్‌లోని అధికార కాంగ్రెస్‌కు చెందిన ఆరుగురు రెబల్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ స్పీకర్ అనర్హులుగా ప్రకటించడంపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ ఆరుగురు శాసనసభ్యులు ఇటీవలి రాజ్యసభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన విషయం తెలిసిందే. అనర్హత నిర్ణయాన్ని సవాల్ చేస్తూ వీరు దాఖలు చేసిన పిటిషన్లపై సోమవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం విచారణ జరిపింది. నాలుగు వారాల్లోగా సమాధానం ఇవ్వాలంటూ స్పీకర్ కుల్దీప్ సింగ్ పఠానియా కార్యాలయానికి నోటీసు పంపింది. పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నందున అసెంబ్లీ కార్యకలాపాలతోపాటు ఓటింగ్‌లోనూ పాల్గొనరాదని ఆరుగురికి ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణను మే 6వ తేదీకి వాయిదా వేసింది. ఖాళీ అయిన ఆరు స్థానాల్లో నామినేషన్ల దాఖలుకు మే 7 ఆఖరు తేదీ.

సోషల్ మీడియా... నయా యుద్ధరంగం

ఎన్నికల ప్రచారంలో కొన్నేళ్లుగా కీలక పాత్ర

సోషల్ సైట్లలో ప్రచారమే ఇప్పటి ట్రెండు	అదే బాట పడుతున్న పార్టీలు, నేతలు	సోషల్ ఇన్‌ఫ్లుయెన్సర్లకు పెరుగుతున్న డిమాండ్



ఒకప్పుడు ఎన్నికల ప్రచారమంటే గోడలపై రాతలు, పోస్టర్లు, బ్యానర్లు. ఇప్పుడా రోజులు పోయాయి. అక్కడక్కడా ఫెక్సీలున్నా, అవన్నీ బడా నేతల దృష్టిలో పడేందుకు చోటా, మోటా లీడర్ల ప్రయత్నాల్లో భాగమే. ఇప్పుడు ఎన్నికల ప్రచారంలో సోషల్ మీడియాది కీలక పాత్ర. వాట్సాప్, ఇన్‌స్టా, ఫేస్‌బుక్, ఎక్స్, యూట్యూబ్... రీల్స్, షార్ట్స్, మీమ్స్.. మాధ్యమమేదైనా సరే.. ఓటరు మానసిక స్థితిని ప్రభావితం చేసే మార్గాలే! అందుకే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను వాడుకుంటూ ప్రచారంలో దూసుకుపోతున్నారు నేతలు. ఓటర్లను ఆకట్టుకోవడానికి, ప్రచారం కోసం వారిని ఆశ్రయిస్తున్నారు. పార్టీలు తమ విధానాలను బలంగా జనంలోకి తీసుకెళ్లేందుకు సోషల్ బాట పడుతున్నాయి...

- సాక్షి, నేషనల్ డెస్క్

కరోనా తర్వాతి ప్రపంచంలో సమాచార సాధనంగా సోషల్ మీడియా పట్ల దృక్పథమే పూర్తిగా మారిపోయింది. డేటా–సేకరణ, విజువలైజేషన్ ప్లాట్‌ఫాం స్టాటిస్టికా ప్రకారం ఫేస్‌బుక్‌కు భారత్‌లో 36.7 కోట్ల యూజర్లున్నారు. వాట్సాప్‌కు 50 కోట్ల మంది యాక్టివ్ యూజర్లున్నారు. వారి అభిప్రాయాలను ప్రభావితం చేయడంలో వీటితో పాటు ఎక్స్, ఇన్‌స్టా, వాట్సప్ చానళ్లదీ కీలక పాత్రే. అందుకే పార్టీలు ప్రచారానికి సోషల్ ప్లాట్‌ఫాంలను ఎంచుకుంటున్నాయి. ఫేస్‌బుక్‌లో ప్రతి పార్టీకీ జాతీయ స్థాయి నుంచి రాష్ట్ర, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి దాకా ఓ పేజీ ఉంది. ప్రతి రాజకీయ నాయకుడికీ ఓ సైన్యమే ఉంది. ఇక వాట్సాప్ గ్రూప్‌లకైతే కొదవే లేదు. ఇవి కూడా జాతీయ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు కులాలు, మతాలవారీగా ఎప్పుడో ఏర్పాటయ్యాయి. ఈ సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలనే ఆయుధంగా చేసుకుని బీజేపీ 2014లో అధికారంలోకి వచ్చింది. ఎక్స్‌లో ప్రధాని మోదీకి ఏకంగా 9.7 కోట్ల ఫాలోయర్లున్నారు. రాహుల్‌కు 2.5 కోట్ల మంది ఉన్నారు.

పర్సనల్ అప్రోచ్..

ఎన్నికలంటే ఇంటింటికీ వెళ్లి ఓట్లగడం పాత పద్ధతి. ఇప్పుడంతా పర్సనల్ అప్రోచ్. బీజేపీ ఇటీవల వాట్సాప్ ఉన్న వాళ్లందరికీ 'ప్రధాని నుంచి లేఖ' పంపింది. కేంద్రం ఇప్పటిదాకా ఏం చేసింది, ఇంకా ఏం చేస్తే బాగుంటుందో చెప్పాలని పౌరులను కోరింది. 'మై ఫస్ట్ ఓట్ ఫర్ మోదీ' అనే వెబ్‌సైట్‌నూ ప్రారంభించింది. మోదీకి ఎందుకు ఓటేయాలనుకుంటున్నదీ చెబుతూ వీడియో చేసి పెట్టడానికి వీలు కల్పించింది. సాధారణ పౌరుడిని ప్రధానే నేరుగా అభిప్రాయం కోరడం, ఓటేయడానికి కారణాన్ని అడిగి తెలుసుకోవడం కచ్చితంగా వారి అభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మారుస్తుందన్నది బీజేపీ అంచనా. రాహుల్ గాంధీ వాట్సాప్ చానల్‌ను కాంగ్రెసే నిర్వహిస్తోంది. అందులో రాహుల్ ప్రజలతో సంభాషిస్తారు. వారి ప్రశ్నలకు బదులిస్తారు. ఈ వాట్సాప్ సమాచారం సర్క్యులేషన్‌ను జిల్లా స్థాయిలో పర్యవేక్షిస్తారు. ఎక్కువ వాట్సాప్ గ్రూపుల ద్వారా మరింత ఎక్కువ మంది ఓటర్లతో వేగంగా, మెరుగ్గా అనుసంధానం కావచ్చన్నది కాంగ్రెస్ భావన.

> దేశవ్యాప్తంగా ఇంటర్నెట్ వ్యాప్తి సగటున 40 శాతం ఉందని అంచనా. ఆ లెక్కన 2 లక్షల ఓటర్లుండే అసెంబ్లీ స్థానంలో సోషల్ మీడియా ద్వారా కనీసం 70 నుంచి 80 వేల మందిని ప్రభావితం చేసే వీలుంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. చాలాసార్లు విజేతను తేల్చడంలో ఐదారు వేల ఓట్లు కూడా నిర్ణాయకంగా మారుతున్న నేపథ్యంలో ఇది చాలా పెద్ద సంఖ్యేనని పార్టీలు భావిస్తున్నాయి. అందుకే సోషల్ మీడియాను ఇప్పుడు ఏ పార్టీ కూడా తేలిగ్గా తీసుకోవడం లేదు.
>
> **- అంకిత్ లాల్, అడ్వైజర్, పొలిటికో**

ప్రభావశీలతపై సందేహాలూ..

సోషల్ మీడియా ప్రభావంపై అనుమానాల్లేకపోయినా ఓటర్లుగా ఫలానా పార్టీకి ఓటేసేలా ప్రభావితం చేయడంలో వాటి శక్తిపై మాత్రం సందేహాలున్నాయి. వాటి ప్రచారం తటస్థ ఓటర్ల వైఖరిలో మార్పు తేవచ్చేమో గానీ సంప్రదాయ ఓటర్లు, పార్టీ మద్దతుదారుల అభిప్రాయాలను ప్రభావితం చేయబోదని విశ్లేషకుల అంచనా. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ అభ్యర్థి కులం, స్థానిక అనుబంధం, పార్టీకి విధేయత వంటివే సంప్రదాయ ఓటర్లను ప్రభావితం చేస్తాయంటున్నారు. అభ్యర్థి చరిష్మా, విశ్వసనీయత, పార్టీకి ప్రజాదరణ కూడా ఓటర్లను కదిలిస్తాయని విశ్లేషిస్తున్నారు.

కీలకంగా ఇన్‌ఫ్లుయెన్సర్లు...

సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు. ఎక్కువమందిని ఆకర్షించగల, ప్రభావితం చేయగల వ్యక్తులు. రీల్స్, షార్ట్స్ ప్రాచుర్యంతో వీరి ప్రాబల్యం మరింతగా పెరిగింది. ఎన్నికల్లో కూడా కీలక ప్రచారకర్తలుగా మారారు. సామాజిక మాధ్యమాల్లో 10,000 మంది ఫాలోయర్స్ ఉన్నవారిని 'నానో' ఇన్‌ఫ్లుయెన్సర్లని, లక్ష దాకా ఉంటే మైక్రో ఇన్‌ఫ్లుయెన్సర్లు, 10 లక్షలుంటే మాక్రో ఇన్‌ఫ్లుయెన్సర్లు, అంతకు మించితే మెగా ఇన్‌ఫ్లుయెన్సర్లని అంటారు. గ్రామీణ ప్రాంతాల్లో మైక్రో ఇన్‌ఫ్లుయెన్సర్లు కీలకంగా మారారు.

ముందున్న బీజేపీ..

2024 సార్వత్రిక ఎన్నికల వేళ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు డిమాండ్ పెరిగింది. పార్టీలు వారికి ప్రధాన ఖాతాదారులుగా మారుతున్నాయి. ఈ విషయంలో బీజేపీ ముందుంది...

- ప్రభుత్వ పథకాలపై కంటెంట్ కోసం సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్‌తో కలిసి పని చేయడానికి నాలుగు ప్రైవేట్ ఏజెన్సీలను ఎంపిక చేసినట్టు కేంద్ర సమాచార, ప్రసార మంత్రి అనురాగ్ ఠాకూర్ పార్లమెంటుకు తెలిపారు. ఇదంతా బీజేపీకి లబ్ధి చేసేదే.
- వివిధ ప్రాంతాల్లో ఇన్‌ఫ్లుయెన్సర్లతో బీజేపీ 50కి పైగా సమావేశాలను ఏర్పాటు చేసింది. మోదీ నేతృత్వంలో మంత్రులు కూడా ప్రధాన చానళ్లకు బదులు పాడ్‌కాస్ట్ షోలు, యూట్యూబ్ చానళ్లలో కనిపిస్తున్నారు.
- ఎస్.జైశంకర్, స్మృతీ ఇరానీ, పీయూష్ గోయల్, రాజీవ్ చంద్రశేఖర్ వంటి కేంద్ర మంత్రులు యూట్యూబ్‌లో 70 లక్షలకు పైగా ఫాలోవర్లున్న పాడ్‌కాస్టర్ రణ్‌వీర్ అలహాబాదియాకు ఇంటర్వ్యూలిచ్చారు.

కాంగ్రెస్‌దీ అదే బాట...

ఇన్‌ఫ్లుయెన్సర్ల సేవలను వాడుకునే విషయంలో కాంగ్రెస్ కూడా ఏమీ వెనకబడి లేదు. భారత్ జోడో యాత్రలోనూ, తాజాగా ముగిసిన భారత్ జోడో న్యాయ్ యాత్రలోనూ వారిని బాగానే ఉపయోగించుకుంది...

- రెండు జోడో యాత్రల్లోనూ ప్రధాన మీడియా కంటే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకే రాహుల్ ప్రాధాన్యమిచ్చారు.
- 'అన్ ఫిల్టర్డ్ విత్ సమ్‌దీశ్' యూ ట్యూబర్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు.
- ట్రావెల్ అండ్ ఫుడ్ వీడియో పాడ్‌కాస్ట్ కర్లీ టేల్స్ వ్యవస్థాపకుడు కామియా జానీతో తన భోజనం తదితరాల గురించి పిచ్చాపాటీ మాట్లాడారు.
- రాజస్తాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ తన హయాంలో 'జన్ సమ్మాన్' వీడియో పోటీలు నిర్వహించారు. సంక్షేమ కార్యక్రమాలపై సోషల్ ప్లాట్‌ఫాంల్లో 30 నుంచి 120 సెకన్ల వీడియోలు షేర్ చేసిన వారిలో విజేతలకు నగదు బహుమతులిచ్చారు.

నేడు సీడబ్ల్యూసీ భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో గెలుపు వ్యూహాలను సిద్ధం చేసేందుకు కాంగ్రెస్ అత్యున్నత నిర్ణాయక మండలి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) మంగళవారం భేటీ కానుంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగే ఈ భేటీలో మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో పాటు కీలక నేతలు హాజరు కానున్నారు. ఈ భేటీలో లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోకు తుది రూపు ఇవ్వనున్నారు. రైతులు, మహిళలు, యువత, బలహీన వర్గాలే లక్ష్యంగా 'భాగిదారీ న్యాయ్'(భాగస్వామ్య న్యాయం), 'కిసాన్ న్యాయ్', 'నారీ న్యాయ్', 'శ్రామిక్ న్యాయ్','యువ న్యాయ్'పేరిట ఇప్పటికే తన హామీలను ప్రజల ముందుంచిన కాంగ్రెస్ వాటిపై నేతలకు మార్గనిర్దేశం చేయనుంది. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం, రైతులకు వడ్డీలేని రుణాలు, ప్రస్తుతం కేంద్రం అందిస్తున్న సాయం పెంపు, యువత కోసం 30 లక్షల ఉద్యోగాల భర్తీ, ప్రభుత్వ లేక ప్రైవేట్ రంగంలో 25 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న ప్రతి డిప్లొమా లేక డిగ్రీ హోల్డర్‌కు అప్రెంటిస్ షిప్ శిక్షణకు రూ.లక్ష సాయం, 30 ఏళ్లలోపు యువత స్టార్టప్‌లకు నిధులు సమకూర్చడానికి రూ.5,000 కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటు, పేపర్ లీకేజీల నివారణకు ప్రత్యేక చట్టం, మహిళల కోసం నిరుపేద కుటుంబంలోని ఒక మహిళకు ఏడాదికి రూ.లక్ష సాయం వంటి 25 హామీలపై చర్చించనుంది.

అభ్యర్థుల ఎంపికపై సీఈసీ..

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి ఇప్పటికే పలు మార్లు భేటీ అయిన కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) మంగళవారం మళ్లీ సమావేశం కానుంది. ఇప్పటికే రెండు విడతలుగా 82 మంది పేర్లను ప్రకటించిన విషయం తెలిసిందే. 19న జరిగే భేటీలో తెలంగాణలోని మిగతా స్థానాలకు అభ్యర్థులను ఫైనల్ చేసే అవకాశాలున్నాయి. భేటీలో పాల్గొనేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం ముంబై నుంచి నేరుగా ఢిల్లీ చేరుకోగా, సీఈసీ సభ్యుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యుడు దామోదర రాజనర్సింహ మంగళవారం ఉదయానికి ఢిల్లీ చేరుకునే అవకాశం ఉంది.

బెంగాల్ డీజీపీ తొలగింపు

ఆరు రాష్ట్రాల హోం శాఖ కార్యదర్శులపైనా ఈసీ వేటు

సాక్షి, న్యూఢిల్లీ: రానున్న లోక్‌సభ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించే లక్ష్యంతో కేంద్ర ఎన్నికల సంఘం భారీ కసరత్తుకు తెరతీసింది. ఉత్తరప్రదేశ్, గుజరాత్, బిహార్, జార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ హోం శాఖ కార్యదర్శులతోపాటుగా, పశ్చిమబెంగాల్ డీజీపీ రాజీవ్ కుమార్‌ను తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. మిజోరం, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల సాధారణ పరిపాలన విభాగాల కార్యదర్శులను కూడా తొలగించింది.

గతంలోనూ చర్యలు


2016 అసెంబ్లీ ఎన్నికలతోపాటు 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ పశ్చిమబెంగాల్ డీజీపీకి ఎన్నికల విధుల నుంచి ఈసీ తొలగించడం గమనార్హం. తాత్కాలికంగా డీజీపీ రాజీవ్ కుమార్‌కు ఎన్నికలతో సంబంధం లేని బాధ్యతలను అప్పగించాలని బెంగాల్ చీఫ్ సెక్రటరీకి ఈసీ సూచించింది. ఆయనకు జూనియర్‌గా ఉన్న మరో అధికారికి డీజీపీ బాధ్యతలివ్వాలని కోరింది. డీజీపీ పోస్టుకు అర్హులైన ముగ్గురు అధికారుల పేర్లను తమకు పంపించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది.

వీరికి రెండు విధులు

గుజరాత్, ఉత్తరప్రదేశ్, బిహార్, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల హోం శాఖ కార్యదర్శులు సంబంధిత రాష్ట్రాల సీఎం కార్యాలయాల బాధ్యతలను కూడా నిర్వహిస్తున్నారని, దీనివల్ల ఎన్నికల సంబంధ విధుల అమలులో ఎంతో కీలకమైన నిష్పాక్షికత, తటస్థత కొరవడే ప్రమాదముందని ఈసీ పేర్కొంది. ముఖ్యంగా శాంతిభద్రతలు, బలగాల మోహరింపుపై ఇది ప్రభావం చూపొచ్చని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలోనే వీరిని విధుల నుంచి తప్పించాలని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది.

బీఎం కమిషనర్ తొలగింపు

ఎన్నికల సమయంలో మూడేళ్లు ఒకే చోట బాధ్యతలు నిర్వహిస్తున్న వారిని, సొంత జిల్లాల్లో విధుల్లో ఉన్న వారిని ఎన్నికల సంబంధ విధుల నుంచి బదిలీ చేయడం ఆనవాయితీ. అయితే, మహారాష్ట్ర ప్రభుత్వం తమ సూచనలను పాటించకపోవడంపై ఈసీ అసంతృప్తిగా ఉంది. దీంతో, బృహన్ముంబై మున్సిపల్ కమిషనర్ ఇక్బాల్ సింగ్ చహల్‌తోపాటు అదనపు కమిషనర్లు, ఉప కమిషనర్లను విధుల నుంచి తప్పించాలని ఆదేశాలిచ్చింది. ఇతర కార్పొరేషన్ల మున్సిపల్ కమిషనర్లు, అదనపు, ఉప కమిషనర్లను కూడా బదిలీ చేయాలని కోరింది.



చీఫ్ జస్టిస్ చంద్రచూడ్

కామెంట్లకు మేమూ అతీతం కాదు!

ఎన్నికల బాండ్ల తీర్పును సోషల్ మీడియాలో దుర్వినియోగం చేస్తున్నారని, కేంద్రంపై అభ్యంతరకర కామెంట్లు పెడుతున్నారని సొలిసిటర్ జనరల్ తుషార్ వాదించారు. ప్రస్తుతం కోర్టులో ఉన్నవారే దీనిపై ఇంటర్వ్యూలిస్తూ కావాలనే సుప్రీంకోర్టుకు కూడా ఇబ్బందికర పరిస్థితి సృష్టిస్తున్నారన్నారు. ఈ వ్యాఖ్యలతో సీజేఐ ఏకీభవించలేదు. ''మా తీర్పులను ఎవరెలా వ్యాఖ్యానిస్తున్నారన్న దానితో మాకు సంబంధం లేదు. మా ఆదేశాలు అమలయ్యాయా లేదా అన్నదే మాకు ముఖ్యం. న్యాయమూర్తులుగా మేం రాజ్యాంగబద్ధంగా తీర్పులు వెల్లడిస్తాం. చట్టాలకు అనుగుణంగా నడుచుకుంటాం. మీడియా, సోషల్ మీడియా కామెంట్లకు మేం కూడా అతీతమేమీ కాదు. కానీ వాటిని తట్టుకునే శక్తి మాకు, న్యాయవ్యవస్థకు ఉంది'' అని ఆయన అభిప్రాయపడ్డారు.

బాండ్ల నంబర్లేవి?

ఎస్‌బీఐపై సుప్రీం మండిపాటు

- నంబర్లతో పాటు ఎన్నికల బాండ్ల వివరాలన్నీ వెల్లడించాల్సిందే
- ఎల్లుండి సాయంత్రానికల్లా ఈసీకి అందించాలని ఆదేశం

న్యూఢిల్లీ: ఎన్నికల బాండ్ల వివరాల వెల్లడిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీరుపై సుప్రీంకోర్టు మరోసారి మండిపడింది. బాండ్లను కొనుగోలు చేసిన వారు, నిధులందుకున్న పార్టీల వివరాలను బయట పెట్టే యునిక్ బాండ్ నంబర్లను ఎందుకు వెల్లడించలేదని బ్యాంకును నిలదీసింది. బాండ్ల వివరాలను ఒక్కటొక్కటిగా కాకుండా ఈ నెల 21 సాయంత్రానికల్లా పూర్తిస్థాయిలో ఈసీకి అందజేయాలని ఆదేశించింది. ''యునిక్ బాండ్ నంబర్లతో పాటు బ్యాంకు దగ్గరున్న మొత్తం సమాచారాన్ని వెల్లడి చేయాల్సిందే. ఈ విషయంలో ఎలాంటి సందేహాలకూ తావులేదు'' అని కుండబద్దలు కొట్టింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం సోమవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఎస్‌బీఐ అందజేసిన వివరాలన్నిటినీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ధర్మాసనంలో జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ఉన్నారు.

చైర్మన్, ఎండీ అఫిడవిట్ దాఖలు చేయాలి

ఎలక్టోరల్ బాండ్ల పథకం రాజ్యాంగవిరుద్ధమని, దాతలు, గ్రహీతల వివరాలను మార్చి 13వ తేదీకల్లా వెల్లడించాలని ఎస్‌బీఐని ఆదేశిస్తూ రాజ్యాంగ ధర్మాసనం ఇటీవల చారిత్రక తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. వివరాల వెల్లడికి గడువు కోరుతూ ఎస్‌బీఐ వేసిన పిటిషన్‌ను ఈ నెల 11న న్యాయస్థానం కొట్టివేసింది. అనంతరం ఎస్‌బీఐ ఎలక్టోరల్ బాండ్ల అరకొర వివరాలను ఎన్నికల సంఘానికి అందజేసింది. దీనిపై సుప్రీంకోర్టు ఎస్‌బీఐని సోమవారం సంజాయిషీ కోరింది. ''21వ తేదీ సాయంత్రానికల్లా పూర్తి వివరాలు ఈసీకివ్వండి. ఎన్నికల బాండ్లకు సంబంధించి అందుబాటులో ఉన్న సమాచారమంతటినీ ఈసీకి అందించామని, ఇంతకుమించి ఎలాంటి సమాచారమూ లేదని పేర్కొంటూ ఎస్‌బీఐ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అఫిడవిట్ దాఖలు చేయాలి'' అని స్పష్టం చేసింది. బాండ్ల వివరాలను వెల్లడించరాదన్న తమ పిటిషన్లపై సత్వరం విచారణ జరపాలన్న పరిశ్రమల సంఘాల విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది. ఎన్నికల బాండ్ల పథకం మొదలైన 2018 మార్చి నుంచి 2019 ఏప్రిల్ దాకా విక్రయించిన బాండ్ల వివరాలను బయట పెట్టాలన్న పిటిషన్‌నూ కొట్టేసింది. బాండ్ల వివరాలను వెల్లడించాలన్న తీర్పుపై సుమోటోగా సమీక్ష జరపాలంటూ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదిశ్ సి.అగర్వాలా రాసిన లేఖను కూడా బుట్టదాఖలు చేసింది. ఇవన్నీ ప్రచార స్టంట్లంటూ సీజేఐ మండిపడ్డారు.

'శక్తి' అంతమే విపక్షాల లక్ష్యం

రాహుల్ వ్యాఖ్యలపై మోదీ ఎదురుదాడి


శివమొగ్గ/కోయంబత్తూర్: 'శక్తి'ని అంతం చేయడమే తమ లక్ష్యమన్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలను ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచారాస్త్రంగా మలుచుకున్నారు. సోమవారం కర్ణాటకలోని శివమొగ్గ జిల్లా కేంద్రంలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని ప్రసంగించారు. ''శక్తిని అంతం చేస్తామని ముంబై శివాజీ గ్రౌండ్ సభలో విపక్ష ఇండియా కూటమి ప్రకటించింది. శక్తిని నాశనం చేయడమే వారి లక్ష్యమైతే శక్తి ఉపాసనే మా సంకల్పం. శివాజీ పార్కులో ప్రతి పిల్లాడూ జై భవానీ, జై శివానీ మంత్రం వింటూ, పఠిస్తూ పెరుగుతాడు. మరాఠా యోధుడు, ఛత్రపతి శివాజీ మహరాజ్ తుల్జా భవానీ మాత ఆశీస్సులతోనే దేశ స్వేచ్ఛ కోసం పోరాడారు. శక్తిని ఆరాధించారు. ఆయన పేరిట ఉన్న శివాజీ పార్కులోనే శక్తిని అంతమొందిస్తామని విపక్షాలు ప్రతినబూనాయి. ఈ మాట వింటే శివసేన వ్యవస్థాపకుడు దివంగత బాల్ ఠాక్రే ఆత్మ క్షోభిస్తుంది. ఎందుకంటే ఆయన కుమారుడు ఉద్ధవ్ అదే సభా వేదికపై ఉన్నారు. ప్రతి భారతీయ మహిళా శక్తికి ప్రతిరూపమే. నారీ శక్తికే మా ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చింది. చంద్రయాన్–3 దిగిన చోటుకు శివశక్తిగా నామకరణం చేశాం'' అని మోదీ గుర్తుచేశారు. ''నారీ శక్తే నాకు నిశ్శబ్ద ఓటరని కొందరు రాజకీయ విశ్లేషకులంటున్నారు. కానీ నా దృష్టిలో నారీ శక్తి అంటే అమ్మవారి శక్తి స్వరూపం'' అన్నారు. ''అమ్మవారి శక్తి స్వరూపమంటే భరతమాతకు మరో పేరు. కన్నడ కవి, జ్ఞానపీఠ్ అవార్డ్ గ్రహీత కువెంపు సైతం కర్ణాటక మాత అంటే శక్తి స్వరూపిణి అన్నారు. ఇండియా కూటమి నేతలు మాత్రం ఏకంగా శక్తినే నాశనం చేస్తామంటున్నారు. ఇది మన తల్లులు, సోదరీమణులు, కూతుళ్లపై, మహిళా సంక్షేమ పథకాలపై దాడి. ధర్మాగ్రహ శక్తే ఉగ్రవాదాన్ని, అరాచకాలను అంతమొందిస్తుంది. ఆ శక్తినే విపక్షాలు సవాలు చేస్తున్నాయి. శక్తి సత్తా ఏంటో, శక్తికి ఎదురెళ్తే ఏమైతుందో ప్రతి మహిళ, కుమార్తె, సోదరీ కాంగ్రెస్‌కు తెలిసేలా చేయాలి'' అన్నారు.



కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు

కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో చాలామంది సీఎంలున్నారంటూ మోదీ ఎద్దేవా చేశారు. ''వెయిటింగ్ సీఎం, కాబోయే సీఎం, సూపర్ సీఎం, షాడో సీఎం. అధిష్టానానికి నిధులు పంపించే కలెక్షన్ మంత్రి విడిగా ఉన్నారు. ప్రభుత్వాన్ని నడపడానికి కూడా పైసల్లేకుండా నిధులన్నీ నొక్కేశారు'' అంటూ దుయ్యబట్టారు. కోయంబత్తూర్‌లో మోదీ 2.5 కి.మీ. పొడవున రోడ్ షో చేశారు.

'శక్తి' వ్యాఖ్యలు మతపరమైనవి కావు: రాహుల్



న్యూఢిల్లీ: 'శక్తి'పై పోరాటం చేస్తామన్న తన వ్యాఖ్యలను ప్రధాని మోదీ వక్రీకరించారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సోమవారం ఆరోపించారు. ''నిష్ఠుర సత్యాలు మాట్లాడతాను కాబట్టే మోదీజీకి నా మాటలు అస్సలు ఇష్టం ఉండదు. వాటిని తరచూ వక్రీకరిస్తారు. శక్తి (అధికారం) అంటూ నేను ప్రస్తావించింది ముసుగుమాటున దాక్కున్న మోదీ గురించే. ఆ అధికారమే ఇప్పుడు దేశ గొంతుకను నొక్కేస్తోంది. సీబీఐ, ఐటీ, ఈడీ, ఈసీ, మీడియా, పారిశ్రామిక రంగం... అన్ని వ్యవస్థలనూ ఆ శక్తే గుప్పిట్లో పెట్టుకుంది. ఆస్తులన్నీ కొందరికే కట్టబెట్టింది. అగ్నివీర్ పథకం ముసుగులో యువత కలలను కల్లలు చేసింది. వీటిపై నేను గొంతెత్తితే మోదీ, ఆయన అనుచరగణం అసహనంతో ఊగిపోతారు'' అన్నారు. ఏదో ఒకటి చేసి ప్రజల దృష్టి మరల్చడంతో మోదీ నిపుణుడని కాంగ్రెస్ నేతలు ప్రియాంకా గాంధీ, పవన్ ఖేడా తదితరులు అన్నారు. మహిళా రెజ్లర్లు బీజేపీ నేత బ్రిజ్‌భూషణ్ సింగ్ చేతుల్లో లైంగిక వేధింపులకు గురైనపుడు మోదీ శక్తి ఉపాసన ఏమైందని ప్రశ్నించారు. ఈసారి పోరు అసురశక్తికి, దైవశక్తికి మధ్యేనని వారన్నారు.

రష్యాతో నాటో ఘర్షణకు దిగితే... మూడో ప్రపంచ యుద్ధమే

పశ్చిమదేశాలకు పుతిన్ హెచ్చరిక • ఐదోసారి రష్యా అధ్యక్షుడిగా విజయం



మాస్కో: రష్యా అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మరుక్షణమే వ్లాదిమిర్ పుతిన్ పశ్చిమ దేశాలకు యుద్ధ హెచ్చరికలు పంపారు. ''అమెరికా సారథ్యంలోని నాటో కూటమి, రష్యా సైన్యం మధ్య ప్రత్యక్ష ఘర్షణలు జరిగితే మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీస్తుంది. ఆధునిక ప్రపంచంలో ఏదైనా సాధ్యమే. కానీ అంతటి దారుణ విపత్తును ఎవరూ కోరుకోరు'' అన్నారు. ఉక్రెయిన్ సైన్యానికి తోడుగా కదనరంగంలోకి ఫ్రాన్స్ బలగాలను దింపే ఉద్దేశముందన్న ఆ దేశ అధ్యక్షుడు మేక్రాన్ వ్యాఖ్యలపై పుతిన్ ఇలా స్పందించారు. ''ఉక్రెయిన్ యుద్ధంలో వందలాది ఇంగ్లిష్, ఫ్రెంచ్ సైనికులు చనిపోయారు. ఇది సరికాదు'' అన్నారు.

చర్చలకు సదా సిద్ధం

ఉక్రెయిన్ సైన్యం దాడులు ఇలాగే కొనసాగితే దాని చుట్టూ ఒక బఫర్ జోన్‌ను సృష్టిస్తామని పుతిన్ అన్నారు. ''దాన్ని దాటి వైరి సైన్యం రష్యా భూభాగంలోకి అడుగుపెట్టడం అసాధ్యం. పూర్తిగా ఓటమి పాలయ్యేలోపు శాంతి బాట పట్టడం ఉత్తమం. చర్చలకు సిద్ధమని మేం మొదట్నుంచీ చెబుతున్నాం'' అన్నారు. రష్యా అధ్యక్ష ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగలేదన్న అమెరికా, పశ్చిమ దేశాల వాదనను పుతిన్ కొట్టిపారేశారు. అమెరికాలోనే ఎన్నికలు సజావుగా జరగడం లేదని విమర్శించారు. ట్రంప్‌కు వ్యతిరేకంగా అధ్యక్షుడు బైడెన్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు.

2030 దాకా అధ్యక్ష పీఠంపై

రష్యా రాజకీయ వ్యవస్థపై పుతిన్ పట్టు మరోసారి రుజువైంది. అధ్యక్ష ఎన్నికల్లో ఆయన ఘనవిజయం సాధించారు. పోలైన ఓట్లలో 87.29 శాతం (7.6 కోట్ల) ఓట్లు ఆయనకు పడ్డట్టు సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ సోమవారం ప్రకటించింది. పుతిన్‌కు ఇన్ని ఓట్లు రావడం ఇదే తొలిసారి. ఆరేళ్లపాటు, అంటే 2030 దాకా పుతిన్ అధ్యక్షునిగా కొనసాగుతారు. ఆయనకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఇరుదేశాల భాగస్వామ్యం మరింత సుదృఢంకావాలని అభిలషించారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ఉత్తరకొరియా పాలకుడు కిమ్, హోండురాస్, నికరాగ్వా, వెనిజులా, తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్ దేశాధినేతలూ పుతిన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పశ్చిమదేశాలు మాత్రం ఈ ఎన్నికలు పెద్ద మోసమని విమర్శించాయి.

నవాల్నీని వదిలేద్దామనుకున్నాం..

దివంగత విపక్ష నేత అలెక్సీ నవాల్నీ ప్రస్తావనను పుతిన్ తొలిసారిగా బహిరంగంగా తెచ్చారు. ''ఖైదీల మార్పిడిలో భాగంగా నవాల్నీని విదేశాలకు అప్పగించి పశ్చిమదేశాల జైళ్ల నుంచి రష్యన్లను వెనక్కు తెద్దామని మా అధికారుల సలహాకు వెంటనే ఒప్పుకున్నా. ఆ లోపే ఆయన జైల్లో చనిపోయారు. కొన్ని అలా జరుగుతాయంతే. ఇదే జీవితం'' అన్నారు.



ఏ పార్టీకా గొడుగు

ఎన్నికల సామగ్రి విక్రయాలు మొదలయ్యాయి. బెంగళూరులోని చామరాజపేటెలో సోమవారం ఓ దుకాణంలో పార్టీల జెండాలు, గొడుగులు వగైరా

హస్తం అబద్ధాల పక్షం

- ఇక్కడ దోచుకుని ఢిల్లీ నేతలకు ఇస్తారు
- శివమొగ్గ సభలో ప్రధాని మోదీ ధ్వజం
- 28 స్థానాల్లోనూ గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి

శివమొగ్గ: అబద్ధాలు చెప్పడం కాంగ్రెస్ పార్టీకి పుట్టుకతో వచ్చిన లక్షణమని, రోజుకొక అబద్ధం హస్తానికి అలవాటని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. రాష్ట్ర కాంగ్రెస్ నేతలు అవినీతిలో కూరుకుపోయారని, ఆ అవినీతి సొమ్మును కేంద్ర కాంగ్రెస్ నేతలకు బదిలీ చేసే ఏటీఎంలా మారిపోయారని దుయ్యబట్టారు. సోమవారం మధ్యాహ్నం శివమొగ్గ నగరంలో అల్లమప్రభు మైదానంలో బీజేపీ రెండో ఎన్నికల ప్రచార సభ జరిగింది. ఇందులో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. పేదరికం పోవాలన్నా, అవినీతి దూరం కావాలన్నా, వ్యవసాయ కార్మికులకు, యువతకు బలం చేకూరాలన్న కర్ణాటకలోని 28 స్థానాలతో పాటు కేంద్రంలో బీజేపీకి 400కు పైగా స్థానాల్లో అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. గడిచిన పదేళ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పలు అభివృద్ధి పనులను చేపట్టింది. బలమైన ఆర్థిక దేశంగా భారత్‌ను మార్చామని చెప్పారు.



వాహనంలో సభాస్థలికి వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ



సభికుల కేరింతలు

కన్నడలో ఆరంభం

కన్నడలో తన ప్రసంగాన్ని ప్రారంభించిన మోదీ శివమొగ్గ ప్రజలతో పాటు సిగంధూరు దేవీకి నమస్కారాలు చేశారు. కువెంపు పుట్టిన నేల ఇదని, బీజేపీకి మీ మద్దతునివ్వాలని ఓటర్లను అభ్యర్థించారు. కర్ణాటక అభివృద్ధి కోసం ఎన్‌డీఏ సర్కారు మళ్లీ రావాలని చెప్పారు. శివమొగ్గలో బీఎస్ యడియూరప్ప ఎంతో కష్టపడి బీజేపీ పార్టీని నిర్మించారని, ఇది తపోభూమిగా మారిందని కొనియాడారు. నారీశక్తి గురించి ఇండియా కూటమి అవహేళన చేస్తోందని, వారికి సమాధానం చెప్పాలన్నారు.

జన సందోహం

ప్రధాని సభకు జన సందోహం తరలివచ్చింది. శివమొగ్గ, ఉడుపి- చిక్కమగళూరు, దావణగెరె లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించి ఈ సభను జరిపారు. మోదీ విమానాశ్రయం నుంచి సభాస్థలికి వరకూ వాహనాలలో ర్యాలీగా, మళ్లీ టాప్‌లేని వాహనంలో వేదిక వరకూ వచ్చారు. శివమొగ్గతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి, జిల్లాల నుంచి వేలాది వాహనాల్లో తరలివచ్చారు. మోదీ వచ్చే మార్గంలో భారీ భద్రతను ఏర్పాటు చేశారు. వివిధ రహదారుల్లో రాకపోకలను నిషేధించారు. యడియూరప్ప, విజయేంద్ర, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



శివమొగ్గలో ప్రధాని వాహన శ్రేణికి స్వాగతం



లంబాడీ వనితల సందడి

న్యూస్‌రీల్

దంత ఆరోగ్యం ముఖ్యం



ఖైదీలకు దంత పరీక్షలు

మండ్య: అన్ని రోగాలకు నోరు కారణమని, నోరు, పళ్లను బాగా చూసుకుంటే అన్ని రోగాలను అరికట్టవచ్చని జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమాధికారి డాక్టర్ కె.మోహన్ తెలిపారు. జిల్లా పాలన విభాగం, భారత దంత వైద్య సంఘం భాగస్వామ్యంలో జిల్లా కారాగారంలో ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. నోటిని, దంతాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యం సక్రమంగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఖైదీలకు, జైలు సిబ్బందికి దంత పరీక్షలు చేశారు.

కావేరి నీటిపై నేతల అబద్ధాలు



కరపత్రాలను పంచుతున్న రైతు నేతలు

మండ్య: తమిళనాడుకు ప్రభుత్వం కావేరి నీరు విడుదల చేయలేదని ప్రజాప్రతినిధులు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని రైతు నాయకులు సునందా జయరాం ఆరోపించారు. నగరంలోని ఎంపీ విగ్రహం ఎదురుగా జరిగిన ఆందోళనలో ఆమె మాట్లాడుతూ ఇక్కడ ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే తమిళనాడుకు కావేరి నీటిని వదులుతున్నారని దుయ్యబట్టారు. ప్రజలు మెప్పు కోసం కావేరి నీటిని మళవళ్లిని దాటనివ్వలేదని నేతలు అబద్ధాలు చెబుతున్నారని, కానీ 6 వేల క్యూసెక్కుల నీరు తరలివెళ్లిపోయిందన్నారు. కబిని జలాశయం నుంచి నదికి 2 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారని ఆమె తెలిపారు. కావేరి పోరాటయోధుల గురించి ఇష్టమొచ్చినట్లు ఎమ్మెల్యేలు మాట్లాడుతున్నారని, భవిష్యత్తులో ప్రజలే వారికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు.

సదానంద కలకలం

- నేడు మీడియా ముందు ముఖ్య ప్రకటన

శివాజీనగర: బెంగళూరు ఉత్తర ఎంపీ, బీజేపీ మాజీ ముఖ్యమంత్రి సదానందగౌడ గతంలో పోటీ రాజకీయాల నుంచి విరమించుకుంటానని ప్రకటించడం తెలిసిందే. ఇంతలో ఆయన మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి ముఖ్యమైన విషయం చెప్పబోతున్నారు. సదానంద సోమవారం బెంగళూరులో మాట్లాడుతూ ఆ భేటీలో అన్నీ వెల్లడిస్తానని అన్నారు. తమ పార్టీలో చేరాలని కాంగ్రెస్ నాయకులు సంప్రదించిన విషయం వాస్తవమే అన్నారు. బీజేపీ హైకమాండ్ బెంగళూరు ఉత్తర టికెట్‌ను సదానందకు కాకుండా కేంద్ర మంత్రి శోభా కరంద్లాజెకు ఇచ్చింది. దీంతో సదానందగౌడ అసంతృప్తికి గురయ్యారు. రాష్ట్ర రాజకీయంలో తనకు జరిగిన అన్యాయాలపై మనస్సు విప్పి మాట్లాడాలని ఉందన్నారు. ఇప్పుడే చెబితే ఏమీ ఉండదని చమత్కరించారు. రాజకీయంలో తారుమార్లు, అవమానాలు సహజమేనని తెలిపారు. ఆయన రాజకీయాలకు గుడ్ బై చెబుతారా, లేక కాంగ్రెస్‌లో చేరతారా? అనేది ఉత్కంఠగా మారింది.

నక్సల్స్ కోసం కూంబింగ్



రోడ్డుపై మోహరించిన పోలీసులు

యశవంతపుర: దక్షిణ కన్నడ, కొడగు జిల్లా సరిహద్దుల్లో కడమకల్లు వద్దనున్న కోజిమలె రబ్బర్ ఎస్టేట్ వద్ద నక్సలైట్ల సంచారం బయటపడింది. సుమారు 8 మంది నక్సల్ బృందం ఆదివారం సాయంత్రం కొజిమలె, కల్మకారులోని ఒక అంగడిలో రూ.3,500 ల విలువైన నిత్యావసర వస్తువులను కొనుగోలు చేశారని పోలీసులకు తెలిసింది. దీంతో నక్సల్ వ్యతిరేక దళం పోలీసులు అక్కడ గాలింపు చేపట్టారు. ఆ బృందంలో ఆరు మంది పురుషులు, ఇద్దరు మహిళలు, యూనిఫాం ధరించి ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. అదే బృందమే రెండు జిల్లాల్లో పలుచోట్ల తిరుగుతున్నట్లు భావిస్తున్నారు. కోజిమలె సమీపంలోని మూడు బాకుగొండి ఉప్పకళ, కోజిమలె, కడమకల్లు ప్రాంతాలలో కూంబింగ్ ప్రారంభించారు. సుళ్య తాలూకా గుత్తిగారు, కొల్లమొగరు, కల్మకారు ప్రాంతం వరకు కోజిమలె రబ్బర్ ఎస్టేట్ వ్యాపించి ఉంది. 2012లో కాలూరు గ్రామంలో, 2018లో ఫిబ్రవరిలో సంపాజె గడ్డెలోను నక్సలైట్లు కనిపించారు. తాజా సంఘటనతో అక్కడ కలకలం ఏర్పడింది.

మహిళా టెక్కీ విషాదాంతం

- డివైడర్‌ను ఢీకొన్న కారు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు



మృతురాలు ఉమాదేవి (ఫైల్)

పెనుకొండ రూరల్: డివైడర్‌ను కారు ఢీకొనడంతో మహిళా టెక్కీ మృతి చెందిన సంఘటన పెనుకొండ 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన మేరకు ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు చెందిన, మురళి, భార్య ఉమాదేవి (34) బెంగళూరులో ఐటీ ఇంజినీర్లుగా పని చేస్తూ అక్కడే స్థిరపడ్డారు. పిల్లలు శ్రీనిధి, విక్రమ్‌తో కలసి మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లోని బంధువుల పెళ్లికి వెళ్లారు. ఆదివారం రాత్రి బెంగళూరుకు బయలుదేరారు, సోమవారం ఉదయం గుట్టూరు వై జంక్షన్ కోటక్ కంపెనీ ఎదురుగా రాగానే కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొనింది. కారు వెనుక భాగం ధ్వంసం కాగా ఉమాదేవి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. భర్త, పిల్లలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె మృతితో భర్త, పిల్లలు కన్నీరుమున్నీరయ్యారు.

యడ్డి, కేంద్రంపై సీఎం ఫైర్

శివాజీనగర: ఎరువుల కోరిన రైతులపై కాల్పులు జరిపి బలి తీసుకొన్న యడియూరప్ప కుమారునికి ఓటు వేయాలని కోరడం ఆత్మసాక్షిగా సబబేనా? రాష్ట్రానికి అన్ని విధాలా అన్యాయం జరుగుతోంది, ఇలా ఉంటే రాష్ట్ర రైతులు ఎందుకు బీజేపీకి మద్దతు ఇవ్వాలి? అని సీఎం సిద్దరామయ్య ధ్వజమెత్తారు. సోమవారం ఆయన ఒక ప్రకటనలో యడ్డిపై విమర్శలు గుప్పించారు. యడ్డి రైతు రుణ మాఫీ చేయమంటే నోట్ల ముద్రణ యంత్రం లేదన్నాడు, రైతులపై కాల్పులు జరిపించాడు అని సిద్దు విమర్శించారు. రాష్ట్రంలో కరువు ప్రకటించి 6 నెలలు గడిచింది. రూ.18,177 కోట్ల పరిహారం ఇవ్వాలని కేంద్రానికి పలుసార్లు లేఖ రాసి, నేరుగా కలిసి విన్నవించాను. అయినా పైసా కూడా పరిహార సొమ్ము విడుదల కాలేదని ఆరోపించారు. దేశంలో వ్యవసాయ రంగాన్ని అదాని, అంబానీ లాంటి వ్యాపారవేత్తల చేతిలోపెట్టే దుష్ట ఆలోచనలతో కేంద్రం రైతు చట్టాలను అమలు చేస్తోందన్నారు.

తల్లి సలహాతో రాజకీయాల్లోకి: యదువీర్



మైసూరులో యదువీర్ ప్రచారం

మైసూరు: ప్యాలెస్ ఆస్తులను కాపాడుకునేందుకు రాజకీయాల్లోకి రాలేదని, ప్రజల కోసం పనిచేసేందుకు వచ్చినట్లు మైసూరు- కొడగు బీజేపీ అభ్యర్థి యదువీర్ కృష్ణదత్త చామరాజ ఒడెయార్ అన్నారు. ఆస్తుల గురించి తన తల్లి కోర్టులో న్యాయ పోరాటం చేస్తున్నారన్నారు. సోమవారం నగరంలో ఓ హోటల్‌లో బీజేపీ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బెంగళూరులోని ప్యాలెస్ హక్కుల గురించి న్యాయ పోరాటం చేస్తున్నామని, అందులో తన పాత్ర ఏమీ లేదని, ఆస్తులన్నీ తన తల్లి పేరు మీద ఉన్నాయని చెప్పారు. తన తల్లి సలహా, ఆశీస్సులతోనే రాజకీయాల్లోకి వచ్చినట్లు, ఆమె ప్రచారానికి రావాల్సిన అవసరం లేదని అన్నారు.

డబ్బు లావాదేవీలపై కన్ను

- బెంగళూరు ప్రత్యేక కమిషనర్ సూచన





అధికారుల సమావేశం

బనశంకరి: లోక్‌సభ ఎన్నికలలో డబ్బు పంపిణీని అరికట్టడానికి అనుమానాస్పద నగదు లావాదేవీలపై నిఘా వేయాలని నగర ఎన్నికల విభాగం ప్రత్యేక కమిషనర్ సెల్వమణి నోడల్ అధికారులకు సూచించారు. సోమవారం నోడల్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఒకే అకౌంట్ నుంచి పలు అకౌంట్లకు నగదు జమ అయ్యే సమాచారం తమకు ఇవ్వాలని, సమాచారం ఇవ్వకపోతే కఠిన చర్యలు తప్పవని అధికారులకు హెచ్చరించారు. వ్యక్తుల ఖాతాల్లోకి ఒకే బ్యాంకు నుంచి ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ ద్వారా అధిక మొత్తంలో నగదు జమ కావడం, డిపాజిట్లు, లక్షకు పైగా నగదు డ్రా చేయడం, రూ.10 లక్షల కంటే ఎక్కువగా జరిగే లావాదేవీల గురించి తెలుసుకోవాలన్నారు. ఆదాయ పన్ను శాఖతో కలిసి అనుమానిత నగదు కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాలని తెలిపారు.

నగదుకు ఆధారాలుండాలి

కోడ్ వచ్చిన 72 గంటల్లో బహిరంగ స్థలాల్లో ప్రజాప్రతినిధుల పేర్లు, ఫోటోలను తొలగించాలని, లేదంటే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. బ్యాంకు సిబ్బంది, ఏటీఎంలకు నగదు తరలించే సిబ్బంది తగిన దాఖలాలను దగ్గర ఉంచుకోవాలన్నారు. రికార్డులు లేకుంటే నగదును సీజ్ చేయాలని సూచించారు. సమావేశంలో వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



బనశంకరి: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో బెంగళూరు పోలీసులు నగర వ్యాప్తంగా వాహన సోదాలను ముమ్మరం చేశారు. ప్రతి నియోజకవర్గ పరిధిలో మూడు చొప్పున మొత్తం 100 కు పైగా చెక్ పోస్టులను ఏర్పాటుచేశారు. ఉత్తర విభాగంలో 20, పశ్చిమలో 22, కేంద్ర లో 22 చెక్ పోస్టులను తెరవగా, ఇందులో అధికారులు, సిబ్బంది 24 గంటలూ విధుల్లో ఉంటున్నారు. ఇప్పటికే నగరానికి వచ్చి వెళ్లే మార్గాలు, సిటీ లోపల ముఖ్యమైన ప్రాంతాల్లో వాహన తనిఖీలను చేపట్టారు.

తవా, కుక్కర్ల లోడ్ పట్టివేత



కుక్కర్‌లు ఉన్న టెంపో

దొడ్డబళ్లాపురం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు పంపిణీ చేయడానికి తవా, కుక్కర్‌లను తీసుకువెళ్తున్న టెంపో వాహనాన్ని జేడీఎస్ కార్యకర్తలు పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన హారోహళ్లి తాలూకా మరళవాడి గ్రామం వద్ద చోటుచేసుకుంది. మరళవాడి గ్రామంలో పంపిణీకి వెళ్తోందని తెలిసి అడ్డుకున్నారు. తహసీల్దార్,పోలీసులు టెంపో వాహనాన్ని సరుకుతోపాటు స్వాధీనం చేసుకున్నారు. తవా, కుక్కర్ బాక్సులపై సీఎం సిద్ధరామయ్య, డీసీఎం డీకే శివకుమార్,ఎంపీ డీకే సురేశ్,ఎమ్మెల్యే ఇక్బాల్ హుసేన్‌ల ఫోటోలు ఉన్నాయి.

రూ.10 కోట్ల వజ్రాలు రూ.3 కోట్లకే

దొడ్డబళ్లాపురం: రూ.10 కోట్ల విలువైన వజ్రాలను రూ.3 కోట్లకే ఇస్తామని నమ్మించి వ్యాపారిని మోసం చేయడానికి యత్నించిన నలుగురిని బెంగళూరు కెంపేగౌడ విమానాశ్రయం పోలీసులు అరెస్టు చేసారు. రవి, నవీన్‌కుమార్, అహ్మద్, అబ్దుల్ దస్తగిరి పట్టుబడ్డ నిందితులు. లక్ష్మీనారాయణ అనే వజ్రాల వ్యాపారికి వాట్సాప్ కాల్ చేసి పై విధంగా ప్రలోభపెట్టారు. డీల్ కుదుర్చుకోవడానికి నిందితులు, వ్యాపారి ఎయిర్‌పోర్టు వద్ద తాజ్ హోటల్‌లో కలిశారు. వ్యాపారి ఆ వజ్రాలను పరిశీలించగా అవి నకిలీవని తెలిసింది. దీంతో ఎయిర్‌పోర్టు పోలీసులకు సమాచారం ఇవ్వగా నిందితులను అరెస్టు చేసి నకిలీ వజ్రాలను సీజ్ చేశారు.



సీజ్ చేసిన నకిలీ వజ్రాలు

మలె రాజేంద్ర రథోత్సవం



సోమవారం బాగల్‌కోట దగ్గర హొస మురనాళలో మలె రాజేంద్ర స్వామి తేరు వేడుక

మద్యం, సిగరెట్లు సమర్పయామి



ఖాప్రి స్వామికి మద్యం సమర్పిస్తున్న అర్చకుడు



ఆలయం ముందు భక్తజన సందోహం



ఖాప్రి దేవరు

- ఖాప్రి స్వామికి విశేష నైవేద్యాలు
- కార్వారలో ఘనంగా జాతర

యశవంతపుర: సామాన్యంగా దేవునికి నైవేద్యంగా కోడి, మేక, పొట్టేలును బలి ఇవ్వటం చూశాం. అయితే కార్వారలో మేక, పొట్టేళ్లతో పాటు మద్యం, సిగరెట్లతో హారతి ఇవ్వటం సంప్రదాయంగా వస్తోంది. ఖాప్రి దేవుని జాతర ఆదివారం కార్వారలోని కోడిభాగంలో కాళినదీ ఒడ్డున వైభవంగా జరిగింది. వేల మంది భక్తులు సాయంత్రం వరకు మద్యం, సిగరెట్ సమర్పణం, తులాభారం సేవల్లో పాల్గొన్నారు. రాష్ట్రం నలుమూల నుంచే కాకుండా గోవా, మహారాష్ట్ర నుంచి భక్తులు వచ్చారు.

ఆఫ్రికా నుంచి వచ్చిన దేవుడు

ఖాప్రి దేవుడు ఐదారు తరాల నుంచి నెలిసి ఇక్కడి ప్రాంతాన్ని ఎంతోగాను కాపాడుతున్నట్లు భక్తుల నమ్మకం. ఈ దేవుడు మూలతః ఆఫ్రికాకు చెందినవారిగా భావిస్తారు. ఆఫ్రికాకు చెందిన వ్యక్తి మూడు వందల ఏళ్ల క్రితం ఈ స్వామిని ప్రతిష్ఠించి పూజలను ప్రారంభించారు. ఆ పూజారి అదృశ్యమైన తరువాత పుర్సప్ప అనే వ్యక్తి పూజలను కొనసాగించారు. ప్రతి ఆదివారం, బుధవారం ప్రత్యేక పూజలను నిర్వహిస్తారు.

ఘాట్‌లో నిలిచిపోయిన లారీ

యశవంతపుర: సిమెంట్ లోడ్ లారీ చార్మాడి ఘాట్‌లో మరమ్మతులకు గురై నిలిచిపోవడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పది చక్రాలు ఉన్న వాహనాలకు ఘాట్ మార్గంలో అనుమతులు లేవు. చిక్కమగళూరు-మంగళూరుకు ఇది ఒకే మార్గం కావటం వల్ల గంటల కొద్ది వాహనాలు నిలిచిపోయాయి. కొట్టిగేహర చెక్ పోస్టులో పోలీసులు ఉన్నా కూడా భారీ వాహనాన్ని ఆపకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.



మలుపులో చిక్కుకుపోయిన లారీ

మా బలాన్ని బీజేపీ వాడుకోవాలి: కుమారస్వామి

బనశంకరి: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ- జేడీఎస్ పొత్తులో భాగంగా హాసన్, కోలారు, మండ్య సీట్లలో జేడీఎస్ పోటీ చేస్తుందని పార్టీ నేత హెచ్‌డీ.కుమారస్వామి తెలిపారు. సోమవారం పార్టీ ఆఫీసులో కోర్ కమిటీ భేటీ తరువాత విలేకరులతో మాట్లాడారు. స్వతంత్రంగా పోటీ చేసినా హాసన్, మండ్యలో సులభంగా గెలుస్తామని, కోలారు పోటీపై గందరగోళం లేదని చెప్పారు. 18 లోక్‌సభ స్థానాల్లో జేడీఎస్ ప్రాబల్యం ఉందని, దీనిని వినియోగించుకోవాలని బీజేపీ కి చెబుతానని అన్నారు. కాగా, బీజేపీ తమను పట్టించుకోవడం లేదని, సభలకు పిలవడం లేదని కొందరు నేతలు ఫిర్యాదు చేశారు. వెంటపడి పొత్తు పెట్టుకునే అవసరం లేదని అన్నారు.

దుర్గమ్మ సిడిబండి రథోత్సవం నేడే

- ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి
- విద్యుద్దీపాలంకరణలో మిరుమిట్లు

బళ్లారి అర్బన్: బళ్లారి ప్రజల ఆరాధ్యదైవం కనక దుర్గమ్మ సిడిబండి రథోత్సవం మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈఓ హనుమంతప్ప తెలిపారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా సిడిబండి రథోత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఆలయ నలు దిక్కుల్లోని నాలుగు గోపురాలకు రంగులు వేసి విద్యుత్ అలంకరణలతో ముస్తాబు చేశారు. భక్తులకు దర్శనం కోసం క్యూలైన్ పద్ధతిని ఏర్పాటు చేశారు. సిడిబండి రథోత్సవంలో జిల్లా ఇంచార్జి మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా, హిందూ ధార్మిక దత్తి శాఖ అధికారి హెచ్.గంగాధరప్ప, దేవస్థాన ధర్మకర్త పీఎం రాజశేఖర్‌తో పాటు ఆలయ కమిటీ సభ్యులు, కౌల్ బజార్ గాణిగ సమాజం ప్రముఖులు, పోలీస్ అధికారులు పాల్గొంటారన్నారు. ఒక రోజు ముందుగానే సోమవారం సాయంత్రం కౌల్‌బజార్‌లోని గాణిగర సమాజం వారు ఏర్పాటు చేసిన సిడిబండి కౌల్‌బజార్, బసవనకుంట, ఎస్పీ సర్కిల్, పార్వతి నగర్ రోడ్డు మీదుగా కనకదుర్గమ్మ ఆలయానికి చేరుకుంది.

కనకదుర్గమ్మ దేవి ఆలయ చరిత్ర

నగర ప్రజలకు శాంతి, ఆరోగ్యం కోసం ఏటా కనకదుర్గమ్మ సిడిబండి ఉత్సవాలను కౌల్‌బజార్ గాణిగర సమాజ బాంధవులు ఆచరిస్తున్నారు. పురాతన కాలంలో బళ్లారిలో కలరా వ్యాధి వ్యాపించడంతో అమ్మవారు ఒకరికి కలలో వచ్చి సిడిబండికి దిష్టిబొమ్మను కట్టి ఆలయం చుట్టు ప్రదక్షణలు చేయమని చెప్పిందని సమాచారం. అప్పట్లో సిడిబండికి ఎద్దులను కట్టి ఒక మనిషిని కాడుమానుకు వేలాడ కట్టి అమ్మవారి ఆలయం చుట్టు మూడు ప్రదక్షణలు చేస్తూ వచ్చారు. నగర ప్రజలు ఆరోగ్యంగా, శాంతియుతంగా ఉండేందుకు ఈ సిడిబండి ఉత్సవాలు ఏటా నిర్వహిస్తున్నట్లు గాణిగర సమాజ ప్రముఖులు రవికుమార్, రమేష్‌బాబు తెలిపారు. మొదట్లో మనిషిని సిడిబండికి కట్టి ఊరేగించేవారు. అయితే ఆ తర్వాత క్రమంగా మనిషి రూపంలో దిష్టిబొమ్మను తయారు చేసి సిడిబండి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1974లో ఆలయం ప్రభుత్వ దేవదాయ శాఖ పరిధిలోకి వచ్చింది. ఆలయ పూజారులుగా యాదవ సమాజ బాంధవులకు వంశ పారంపర్యంగా బాధ్యతలు అప్పగించి అమ్మవారికి పూజలు చేస్తున్నట్లు తెలిపారు. సిడిబండి రథోత్సవంలో బళ్లారి గాణిగర వంశపారంపర్యంగా దోణప్ప వీధిలోని రెండు ఎద్దులు, బళ్లారి గాణిగర సంఘం రెండు ఎద్దులు, సిరుగుప్ప గాణిగర సమాజం రెండు ఎద్దులను సిడిబండికి కట్టి అమ్మవారి ఆలయం చుట్టు మూడు ప్రదక్షిణలు చేస్తున్నట్లు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి నిరంతర కృషి

చాలా ఏళ్ల నుంచి కనకదుర్గమ్మ ఆలయ వంశపారంపర్య పూజారులు ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఆలయ ప్రధాన ధర్మకర్త పీ.గాదెప్ప తెలిపారు. భక్తుల సహకారంతో అమ్మవారి ఆలయం రూపురేఖలను మార్చుతున్నట్లు తెలిపారు. అప్పట్లో ఎర్రమట్టి, తెల్ల సున్నంతో ఉన్న ఆలయ గోడలను ప్రస్తుతం మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. మధుర మీనాక్షి దేవి ఆలయం మాదిరిగా దుర్గమ్మ ఆలయానికి గోపురాలు నిర్మించి పుష్కరణి, ప్యారపేట, ప్రాంగణంలో తాగు నీరు, విశ్రాంత మండపాలు, అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. మొదట్లో అమ్మవారి రూపానికి మాత్రం పూజలు జరిగాయి. భక్తుల సహాయంతో వెండి ఆభరణాల అలంకరణలతో ప్రస్తుతం బంగారు ఆభరణాలతో పూజలు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయం ముందు దుర్గాదేవి ఎత్తైన విగ్రహం, నరకాసురుని విగ్రహాలను కూడా ప్రతిష్టించి పూజలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సిడిబండి ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.


ఆలయం వద్ద రథోత్సవానికి చేసిన ఏర్పాట్ల దృశ్యం


ఆలయం వెలుపల అమ్మవారి విగ్రహం


దీపాలంకరణలో కనకదుర్గమ్మ వారి ఆలయం

క్లుప్తంగా

జొన్నల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించండి


వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: జిల్లాలో జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాలని కర్ణాటక రైతు సంఘం డిమాండ్ చేసింది. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో జిల్లాధ్యక్షుడు చామరస మాలిపాటిల్ మాట్లాడారు. జిల్లాలో రైతులకు కరువు పరిహారం అందించక పోవడాన్ని తప్పుబట్టారు. వానలు లేక చెరువులు, కుంటలు, బోరుబావులు ఎండిపోయాయన్నారు. తాగునీటి ఎద్దడి నెలకొనకుండా చూడాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

జానపద కళలను కాపాడుకోవాలి

రాయచూరు రూరల్: నేటి ఆధునిక సమాజంలో నశించిపోతున్న జానపద కళలకు ప్రాధాన్యత కల్పించాలని ఎస్‌కేఈ పారా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ బాబూరావ్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం రాత్రి రంగమందిరంలో శరణప్ప గోనాళ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జానపద సంభ్రమ కార్యక్రమంలో మాట్లాడారు. నేడు పాత కాలపు కళలకు ఆదరణ కరువవుతోందన్నారు. ఇలాంటి తరుణంలో కలబుర్గిలో జానపద విశ్వవిద్యాలయం ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు శరణప్ప, ప్రతిభ, గోపి, నాగేష్, శాంత, జగన్నాథ్, ప్రభ, వీరేంద్ర, రేఖ, వెంకటేష్‌లున్నారు.

నిరంతర అధ్యయనం అవసరం


జ్యోతి వెలిగిస్తున్న మారుతి బగాదే

రాయచూరు రూరల్: న్యాయవాదులు నిరంతరం అధ్యయనం చేయాలని జిల్లా ప్రధాన జడ్జి మారుతి బగాదే అన్నారు. సోమవారం జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. న్యాయ శాస్త్ర అంశాలను శ్రద్ధగా చదవాలన్నారు. శిబిరంలో అదనపు జిల్లా జడ్జి దయానంద బేలూరు, ధారవాడ న్యాయవాది సావలిగమఠ, ప్రభు, శశిధర గౌడ, బసప్ప తిప్పారెడ్డి, అంబాపతి, మల్లికార్జున, వీరభద్రప్ప, నాగరాజ, శివశంకర్, రేణుక, ఈరమ్మ, బసనగౌడ, శివరాజ్, విజయలక్ష్మి, మల్లారెడ్డిలున్నారు.

నియామకం

గంగావతి: కర్ణాటక విలేకరుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆదేశాల మేరకు తాలూకా అధ్యక్షులుగా శ్రీనివాస్ దేవికేరిని ఆ సంఘం జిల్లాధ్యక్షుడు నియమించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘం తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తానన్నారు. నిత్యం పలు రకాల సమస్యలను ఎదుర్కొనే విలేకరుల సమస్యల పరిష్కారానికి తాను శాయశక్తులా కృషి చేస్తానన్నారు. తన నియామకంపై సంఘం సభ్యులు, సంఘం రాష్ట్ర కార్యదర్శి హోసకెరె మల్లికార్జున హర్షం వ్యక్తం చేశారు.

కేపీఎస్‌సీ సభ్యునికి సన్మానం


సన్మానం అందుకున్న రామకృష్ణ ప్రసాద్

కోలారు: కర్ణాటక లోక్ సేవా కమిషన్(కేపీఎస్‌సీ) సభ్యుడిగా నియమితులైన కేఎస్‌ఆర్‌పీ డీఐజీ ఎంవీ రామకృష్ణ ప్రసాద్‌ను జిల్లా యాదవ సంఘం పదాధికారులు సన్మానించారు. జిల్లాలోని కేజీఎఫ్‌కు చెందిన రామకృష్ణ ప్రసాద్ కేపీఎస్‌సీ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈనేపథ్యంలో అఖిల భారత యాదవ మహాసభ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా యాదవ సముదాయానికి చెందిన వ్యక్తికి కేపీఎస్‌సీ సభ్యత్వం లభించడం గర్వకారణమన్నారు. సంఘం అకౌంటెంట్ హుళియప్ప, మాజీ ఉపాధ్యక్షుడు సదాసంద, వీటీయూ సిండికేట్ సభ్యుడు చిత్తప్ప తదితరులు ఉన్నారు.

ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరం


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

గంగావతి: కారటగి తాలూకాలోని బసవణ్ణ క్యాంప్‌లో సోమవారం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో ఎయిడ్స్, రక్త పరీక్షలు, బీపీ, షుగర్, క్షయ వ్యాధికి 92 మందికి పరీక్షలు జరిపారు. వీరిలో 16 మంది బీపీ, షుగర్ పరీక్షలు, నలుగురికి క్షయ పరీక్షలు చేశారు. పలువురిని మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రికి రావాలని వైద్యులు సూచించారు. శిబిరంలో డాక్టర్ అర్పిత, గాయత్రి, హనుమంత, శివలీల, రేఖ, దుర్గమ్మ, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నిక


శశీల్ నమోషి

రాయచూరు రూరల్: హైదరాబాద్ కర్ణాటక విద్యా సంఘం(హెచ్‌కేఈఎస్) అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ శశీల్ నమోషి ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపును అదే రోజురాత్రి కలబుర్గిలోని హైదరాబాద్ కర్ణాటక విద్యా సంఘం భవనంలో నిర్వహించారు. ఓట్ల లెక్కింపులో అధ్యక్ష పదవికి పోటీ చేసిన శశీల్ నమోషికి 617 ఓట్లు, సంతోష్ బిల్‌గుండికి 502 ఓట్లు, డాక్టర్ కామరెడ్డికి 249 ఓట్లు, రాజశేఖర్‌కు 3 ఓట్లు లభించాయి. దీంతో శశీల్ నమోషి ఎన్నికైనట్లు ప్రకటించారు.

శెట్టర్‌కు టికెట్ ఇవ్వకుంటే ఉధృత పోరాటం

హుబ్లీ: మాజీ సీఎం జగదీశ్ శెట్టర్‌కు బెళగావి లోక్‌సభ బీజేపీ టిక్కెట్‌ను తప్పించడానికి కుట్రలు జరుగుతున్నాయి. ఒక వేళ ఆయనకు టిక్కెట్ దక్కక పోతే ఉధృత పోరాటం చేస్తామని అఖిల భారత వీరశైవ లింగాయత మహా సభ హెచ్చరించింది. సోమవారం ఈ మేరకు ఆ మహాసభ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ వీసీ సవడి విలేకరులతో మాట్లాడారు. శెట్టర్ పార్టీని పెంచి పోషించారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఆయనకు టిక్కెట్ రాకుండా చేశారన్నారు. ధార్వాడ, హావేరి లోక్‌సభ స్థానాలకు టిక్కెట్ కూడా తప్పించారని మండిపడ్డారు. ప్రస్తుతం బెళగావి లోక్‌సభ స్థానానికి ఆయన పేరు ముందంజలో ఉన్నా కొందరు కుట్రలు చేసి ఆయనకు టిక్కెట్ రాకుండా ప్రణాళిక రూపొందిస్తున్నారన్నారు. వారి కుట్రలకు పార్టీ అధిష్టానం తలొగ్గకుండా శెట్టర్‌కు టిక్కెట్ కేటాయించాలన్నారు. ఒక వేళ టిక్కెట్ తప్పితే వీధుల్లోకి దిగి పోరాటం చేస్తామన్నారు. అంతేగాకుండా ఈ ఎన్నికల్లో బీజేపీకి తమ సత్తా ఏంటో చూపించి తగిన గుణపాఠం చెబుతామన్నారు.

ఆటలాడుతూ అనంత లోకాలకు..

- నీటి తొట్టిలో పడి బాలుడి దుర్మరణం

రాయచూరు రూరల్: ఇంటివారందరూ నమాజు చేస్తుండగా మూడేళ్ల బాలుడు ఆటలాడుతూ నీటి తొట్టిలో పడి దుర్మరణం పాలైన ఘటన దావణగెరె జిల్లా హొన్నాళిలోని తుంగభద్ర కాలనీలో చోటు చేసుకుంది. వివరాలు..అసద్ అహ్మద్(3) అనే బాలుడు కుటుంబ సభ్యులు నమాజు ముగించుకొని బయటికొచ్చి చూడగా కనిపించక పోవడంతో ఆందోళన చెందారు. సుమారు రెండు గంటల పాటు వెతికారు. చివరికి నీటి తొట్టిని పరిశీలించగా బాలుడి మృతదేహం కనిపించడంతో భోరుమన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి శవ పరీక్షకు పంపి హొన్నాళి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వాహనాల తనిఖీ


చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు

తుమకూరు: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఎన్నికల సిబ్బంది తనిఖీలు షురూ చేశారు. తుమకూరు కుణిగల్ రోడ్డు మరళూరు బైపాస్ రోడ్డు చెక్‌పోస్టు వద్ద వాహనాలను అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు.

ట్యాంకర్లతో నీరివ్వండి

- కొత్తగా బోర్లు వేయండి
- బెంగళూరులో నీటి కొరతపై సీఎం సూచనలు

బనశంకరి: బెంగళూరులో నీటి కొరత రాకుండా చూడాలని, సమస్య ఏర్పడిన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య అధికారులకు సూచించారు. సోమవారం బీబీఎంపీ, బెంగళూరు జలమండలి అధికారులతో నీటి ఎద్దడిపై సమావేశమయ్యారు. శివారుప్రాంతాలు, కొత్తగా పాలికెలోకి చేరిన 110 పల్లెల్లో నీటి సమస్య తలెత్తినట్లు సమాచారం ఉంది. తక్షణం పరిష్కార చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రైవేటు ట్యాంకర్ల దందా కు అడ్డుకట్ట వేసి, వాటిని స్వాధీనం చేసుకుని నీటి సరఫరా చేయాలన్నారు. కావేరి నీరు సరఫరా అవుతున్న ప్రాంతాల్లో తాగు నీటి సమస్య లేదని తెలిపారు. కొరత ఉన్న చోట్ల బోర్లు వేయాలన్నారు. డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఎఫెక్ట్

ఈ సమావేశంపై ఎన్నికల కోడ్ ప్రభావం పడింది. సీనియర్ అధికారులు నేరుగా సమావేశంలో పాల్గొనలేదు. ఈ సమావేశం కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని తెలిసి రాలేదు. వ్యక్తిగతంగా సమస్య పరిష్కారానికి కొన్ని సూచనలు చేశారు.

రాజుగా ఉండను: యదువీర్

మైసూరు: ప్యాలెస్‌కు మాత్రమే రాజుగా పరిమితం కాదలుచుకోలేదని, ప్రజల మధ్య నిలుచుని సామాన్యునిలా పని చేస్తానని మైసూరు రాజవంశీకుడు, మైసూరు బీజేపీ అభ్యర్థి యదువీర్ కృష్ణదత్తా ఒడెయార్ అన్నారు. ఎన్నికల్లో ఓటమి భయం లేదని, తనను ఎలా పిలవాలనే విషయం ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు. సోమవారం హోటల్‌లో ఆయన మీడి యాతో మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థ అమల్లోకి వచ్చిన తర్వాత రాచరికానికి ప్రత్యేక హక్కులు లేవన్నారు. రాజవంశస్తులు కూడా సామాన్య ప్రజల మాదిరే జీవిస్తారని తెలిపారు.

పాదయాత్ర

యదువీర్ మైసూరులోని క్యాతవారనహళ్లిలో పాద యాత్ర ద్వారా ప్రచారం చేశారు. ఆయనకు స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. మొదట మలేమహదేశ్వర స్వామి దేవస్థానంలో పూజలు చేసి బయల్దేరారు. కళాబృందాల ప్రదర్శనలు అలరించాయి.

పబ్లిక్ పరీక్షలపై తీర్పు రిజర్వు

బనశంకరి: 5, 8, 9 తరగతులు, పీయూసీ ఫస్టియర్‌కు పబ్లిక్ పరీక్షలను జరపాలని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను హైకోర్టు ఏకసభ్య పీఠం గతంలో కొట్టివేసింది. ప్రభుత్వం దీనిని ప్రశ్నిస్తూ హైకోర్టులో పిటిషన్ వేసింది ఈ అర్జీపై సోమవారం న్యాయమూర్తులు జస్టిస్ కే.సోమశేఖర్ ,రాజేశ్ కేరై ధర్మాసనం విచారణ జరిపింది. తీర్పును కొద్ది రోజుల్లో ప్రకటిస్తామని ప్రకటించింది. ఈ తరగతులకు పబ్లిక్ పరీక్షలు వద్దని తల్లిదండ్రులతో పాటు ప్రైవేటు పాఠశాలలు డిమాండ్ చేశాయి.

ఈసారి కమలధారి ఎవరో?

- గోప్యంగా బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక వ్యవహారం
- టికెట్లు దక్కకుంటే ప్రత్యర్థి పార్టీలో చేరే యోచనలో ఆశావహులు

రాయచూరు రూరల్: రాయచూరు, యాదగిరి జిల్లాల లోక్‌సభ బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికలో ఆయా పార్టీల అధినాయకత్వం గోప్యతను పాటిస్తోంది. రాయచూరు లోక్‌సభ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసే వారిలో మాజీ ఎంపీ బీ.వీ.నాయక్, మాజీ ఎమ్మెల్యే తిప్పరాజ్ హవల్దార్, సిట్టింగ్ ఎంపీ రాజా అమరేశ్వర నాయక్‌ల పేర్లు రేసులో ఉన్నాయి. పార్టీ కార్యకర్తల అభిప్రాయ సేకరణ, అభ్యర్థి ఎంపికపై సమీక్ష నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం తన అభ్యర్థి ఎంపిక కోసం బీజేపీ అభ్యర్థి ఎంపిక కోసం ఎదురు చూస్తోంది. ఎంపీ రాజా అమరేశ్వర నాయక్‌కు బీజేపీ టికెట్ నిరాకరిస్తే కాంగ్రెస్ పార్టీలో చేరే యోచనలో ఉన్నారు. బీ.వీ.నాయక్‌కు బీజేపీ టికెట్ ఇవ్వక పోతే ఆయన కూడా హస్తం పార్టీలో చేరే అవకాశాలున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎంపీ రాజా అమరేశ్వర నాయక్‌కు 2002 వరకు కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసిన అనుభవం ఉంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నుంచి ఆయన పోటీ చేసి గెలుపొందారు. మాజీ ఎంపీ బీ.వీ.నాయక్ కాంగ్రెస్ అభ్యర్థిగా 2014లో కాంగ్రెస్ నుంచి ఎంపీగా గెలిచారు. 2019 ఎన్నికల్లో ఓడిపోయారు. ఏదేమైనా ఇద్దరూ కాంగ్రెస్ పార్టీ నుంచి కమలం తీర్థం పుచ్చుకున్న వారే కావడం గమనార్హం.

ప్రేమించి.. నమ్మించి.. వంచించి..

- ప్రియురాలికి అబార్షన్ చేయించి ప్రియుడు పరారీ


ప్రేమికుల జంట(ఫైల్)

రాయచూరు రూరల్: ప్రేమించిన ప్రియురాలిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెను లోబర్చుకుని గర్భం దాల్చిన అనంతరం ఆమెకు అబార్షన్ చేయించి ప్రేమికుడు పరారైన ఘటన కొప్పళ జిల్లా కనకగిరి తాలూకా వరనఖేడలో వెలుగు చూసింది. గ్రామానికి చెందిన మంజునాథ్, అదే గ్రామానికి చెందిన యువతి రెండేళ్ల నుంచి ప్రేమించుకున్నారు. రెండు నెలల క్రితం ఇద్దరు గ్రామం నుంచి పరారయ్యారు. ఈ ఘటనపై కనకగిరి పోలీస్ స్టేషన్‌లో యువతి అదృశ్యంపై కేసు నమోదైంది. అయితే మూడు రోజుల క్రితం మంజునాథ్ యువతిని పిలుచుకొచ్చాడు. అతని సోదరుడు హనుమేష్ నాయక్ సహకారంతో హిరేవంకలకుంటలో వైద్యుడితో అబార్షన్ చేయించి అక్కడే వదిలి పెట్టి వెళ్లాడు. రక్తస్రావం అధికం కావడంతో ఆమెను మహిళా సాంత్వన కేంద్రంలో ఉంచారు. మెరుగైన చికిత్స కోసం గంగావతి ఆస్పత్రిలో చేర్పించినట్లు పోలీసులు తెలిపారు. సోదరుడు హనుమేష్ నాయక్, హిరే వంకలకుంట వైద్యుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లక్ష్మి తెలిపారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం


ఉత్తమ ఉపాధ్యాయిని లక్ష్మిని అభినందిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర శ్లాఘనీయమని, విద్యార్థులకు అన్ని విధాలుగా ఉత్తమ శిక్షణనందిస్తున్న ఉపాధ్యాయులు గౌరవనీయులని కర్ణాటక జ్ఞాన విజ్ఞాన సమితి జిల్లా అధ్యక్షుడు జి.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం తాలూకాలోని రోణూరు ఉన్నత పాఠశాలలో సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో ఆయన మాట్లాడారు. సైనికుడు, వైద్యుడు, న్యాయవాది ఇలా అన్ని హోదాల కంటే ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైందన్నారు. ఉపాధ్యాయ వృత్తి గౌరవాన్ని కాపాడడానికి ప్రతి ఉపాధ్యాయుడు ప్రయత్నించాలన్నారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు గ్రహీత, రోణూరు పాఠశాల ఉపాధ్యాయిని హెచ్‌కె లక్ష్మిని సన్మానించారు. సమితి జిల్లా కోశాధికారి జగన్నాథ్, జిల్లా కార్యదర్శి శరణప్ప జమాదార్, జిల్లా సమన్వయ కార్యదర్శి ముకుంద, జిల్లా సంచాలకుడు సురేష్, తాలూకా గౌరవ అధ్యక్షుడు రమణప్ప పాల్గొన్నారు.

నీరసాగర నీటిని పంటల సాగుకు వాడొద్దు

హుబ్లీ: నీరసాగర ఆనకట్ట నీటిని పంటల సాగుకు వాడరాదని జిల్లా యంత్రాంగం రైతులకు సూచించింది. ఎండాకాలం ప్రారంభం కావడంతో తాగు నీటి సమస్య తలెత్తింది. గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో వర్షాలు కురవక ప్రజలు నీటి కోసం హాహాకారాలు చేస్తున్నారు. అందువల్ల నీరసాగర జలాశయం నుంచి ఆ చుట్టు పక్కల రైతులు నీటిని వ్యవసాయానికి వాడరాదని అధికార యంత్రాంగం కట్టుదిట్టంగా రైతులకు సూచించింది. ఆ పరిధిలోకి వచ్చే గుడికట్టి, లింగనకొప్ప, బసవనకొప్ప, కళసదకొప్ప, నీరసాగర, కన్యకొప్ప తదితర గ్రామాల రైతులు తమ పొలాలకు ఈ జలాశయం నుంచి నీటిని మోటార్ పంపుసెట్ల ద్వారా మళ్లించుకోవడాన్ని వెంటనే నిలిపేయాలని సూచించారు. మోటార్ పంప్‌సెట్ ద్వారా నీటిని వాడితే సంబంధిత మోటార్లను స్వాధీనం చేసుకొని చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హుబ్లీ ధార్వాడ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ ఈశ్వర్ ఉళ్లాగడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పాత హుబ్లీలో 22 వార్డులకు తాగునీటిని సరఫరా చేసేది ఈ జలాశయం నుంచే అని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం జలాశయంలో నీటిమట్టం రోజురోజుకు తగ్గిపోతోందన్నారు. ప్రస్తుతం 0.3 టీఎంసీల నీటి లభ్యత ఉందన్నారు. ఈ నీటిని హుబ్లీ నగర ప్రజలకు తాగునీటి అవసరాలకు కేటాయించామన్నారు. సీఎం సిద్దరామయ్య వీడియో కాల్ ద్వారా జరిపిన ప్రగతి పరిశీలన సమావేశంలో విపత్తు నిర్వహణకు సంబంధించి తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించిన నేపథ్యంలో జిల్లాధికారి ఈ సూచన చేశారు. వర్షాలు ప్రారంభం అయ్యేదాకా సాగుకు ఈ నీటిని ఎట్టి పరిస్థితిలో వాడరాదని విజ్ఞప్తి చేశారు.

రోగులకు పాలు, పండ్లు పంపిణీ

గంగావతి: దివంగత డాక్టర్ పునీత్‌రాజ్‌కుమార్ జయంతి సందర్భంగా సోమవారం గాంధీనగర్ యువకుడు హనుమేష్ ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్‌ను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డాక్టర్ పునీత్‌రాజ్‌కుమార్ దివ్యాంగులు, అనాథలు, పేదలకు ప్రజా సేవ చేశారని, పలు రకాలుగా ఆర్థికసాయం చేసి ఆదుకొన్నారన్నారు. అలాంటి దానపరుడు మళ్లీ పుట్టాలని దేవుడిని ప్రార్థిస్తున్నామన్నారు. యువకులు మహంతేష్, వెంకటేష్, శివరాజ్, కిరణ్‌కుమార్, గాదిలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

టికెట్ ఇవ్వాలి

శ్రీనివాసపురం: ఈ లోక్‌సభ ఎన్నికలలో కోలారు నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయాలని ఉందని బీజేపీ నాయకుడు కేహెచ్ మధుసూధన్ తెలిపారు, మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందున్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడారు. తనకు టికెట్ ఇవ్వాలని పార్టీ అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నానని, నియోజకవర్గాల పర్యటనలో ప్రజల నుంచి బీజేపీకి సంపూర్ణ మద్దతు లభిస్తోందన్నారు.

10 గంటల విద్యుత్ అందించరూ


వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కోలారు: వ్యవసాయ పంప్‌సెట్లకు 10 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం పదాధికారులు సోమవారం బంగారుపేట బెస్కాం కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి బెస్కాం అసిస్టెంట్ ఇంజినీర్‌కు వినతిపత్రం సమర్పించారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ మాట్లాడుతూ తాలూకాలో బోరుబావుల కింద పంటలు పండించేందుకు విద్యుత్ సక్రమంగా సరఫరా కాక పండించిన పంటలు ఎండుతున్నాయని ఆరోపించారు. బెస్కాంలో పెచ్చుమీరిన అవినీతి, అక్రమాలపై తనిఖీ చేయించాలని డిమాండ్ చేశారు. రైతుల శ్రేయస్సు దృష్ట్యా విద్యుత్ సక్రమంగా సరఫరా చేయాలని ఒత్తిడి చేశారు. మరగల్ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్లి మంజునాథ్, కిరణ్, మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

అణ్ణమ్మ రాజేంద్రకు డాక్టరేట్


డాక్టరేట్ అందుకున్న అణ్ణమ్మ రాజేంద్ర

కోలారు: గోవా ఇంటర్ నేషనల్ హ్యూమన్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కోలారుకు చెందిన బీజేపీ వెనుకబడిన వర్గాల విభాగం కార్యదర్శి అణ్ణమ్మ రాజేంద్ర చేసిన సామాజిక సేవను గుర్తించి గౌరవ డాక్టరేట్ పట్టానిచ్చి గౌరవించారు. డాక్టరేట్ పొందిన అణ్ణమ్మ రాజేంద్రకు పలువురు అభినందనలు తెలిపారు.

నాణ్యమైన పాల ఉత్పత్తే ధ్యేయం


పాడి రైతులకు చెక్‌లను అందించిన ఎమ్మెల్యే, కోచిముల్ అధ్యక్షుడు నంజేగౌడ

మాలూరు: పాడి రైతులు కోముల్‌కు నాణ్యమైన పాలను ఉత్పత్తి చేసి అందించాలని, తద్వారా పాల సమాఖ్య అభివృద్ధికి సహకారం అందించాలని ఎమ్మెల్యే, కోచిముల్ అధ్యక్షుడు కేవై నంజేగౌడ తెలిపారు, పట్టణంలోని కోచిముల్ కార్యాలయంలో మరణించిన 48 పశువుల యజమానులకు రూ.32 లక్షల బీమా తాలూకా చెక్కులను అందించి మాట్లాడారు, గత ఐదేళ్లుగా కోచిముల్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేశామన్నారు. మంగళూరు డెయిరీ తరువాత పాడి రైతులకు అధిక ధర అందిస్తోందన్నారు. ప్రస్తుతం రూ.350 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలను కోముల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు, రూ.250 కోట్ల వ్యయంతో మెగా డెయిరీ , సుమారు రూ.70 కోట్ల వ్యయంతో సోలార్ ప్లాంట్, రూ.50 కోట్ల వ్యయంతో ఐస్క్రీం ప్లాంట్ తదితర పనులను జరుగుతున్నట్లు తెలిపారు, పశువుల బీమాను రూ.25 వేల నుంచి రూ.70 వేలకు పెంచామన్నారు. పశువుల బీమా సౌకర్యాన్ని రెండు వాయిదాల్లో కట్టే అవకాశం కల్పించామన్నారు. గతేడాది 90 వేల లీటర్ల పాల ఉత్పత్తి జరగగా, ఈ ఏడాది 1.10 లక్షల లీటర్లకు పెరిగిందన్నారు. తాను కోముల్ అధ్యక్షుడైన తర్వాత పాలక మండలి, అధికారుల సహకారంతో గణనీయంగా అభివృద్ధి చేశామన్నారు. జిల్లా మహిళా డైరెక్టర్ కాంతమ్మ సోమణ్ణ, కోచిముల్ డిప్యూటీ మేనేజర్ డాక్టర్ లోహిత్, కృషిక్ సమాజ అధ్యక్షుడు హనుమంతప్ప పాల్గొన్నారు.

పది పరీక్షలను సజావుగా నిర్వహించండి

- అధికారులకు డీడీపీఐ సూచన


మాట్లాడుతున్న డీడీపీఐ కృష్ణమూర్తి

కోలారు: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 25 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలను సజావుగా నిర్వహించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని డీడీపీఐ కృష్ణమూర్తి సూచించారు. సోమవారం నగరంలోని ఎస్‌డీసీ కళాశాలలో 65 పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి గందరగోళానికి తావు లేకుండా పరీక్షలను నిర్వహించాలన్నారు. పరీక్ష సిబ్బంది తప్పనిసరిగా గుర్తింపు కార్డును ధరించాలన్నారు. అనధికారిక వ్యక్తులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించవద్దన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రతి పరీక్ష గదిలోను వెలుగు, గాలి సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రశ్నపత్రాలను పరీక్షా కేంద్రాలకు గట్టి బందోబస్తు మధ్య తరలించాలన్నారు. అదేవిధంగా సమాధాన పత్రాలను ట్రెజరీకి తరలించే సమయంలో కూడా గట్టి బందోబస్తు ఉండాలన్నారు. సమావేశంలో శిక్షణాధికారి సహీదా అంజుం, ముళబాగిలు బీఈఓ గంగరామయ్య, శ్రీనివాసపురం బీఈఓ మునిలక్ష్మయ్య పాల్గొన్నారు.

పెచ్చులూడి పడిన బస్టాండు పైకప్పు

- విద్యార్థినులకు గాయాలు


పెచ్చులూడి కిందపడిన బస్టాండు పైకప్పు సీలింగ్

మాలూరు: బస్టాండు పైకప్పు పెచ్చులూడి కిందపడి విద్యార్థినులకు గాయాలైన ఘటన సోమవారం పట్టణంలోని బస్టాండులో జరిగింది. ఘటనలో బస్సు కోసం వేచి ఉన్న విద్యార్థినులు రేణుక, మధుశ్రీలకు గాయాలు కావడంతో వారిని వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. కంప్యూటర్ తరగతిని ముగించుకుని తమ గ్రామానికి తిరిగి వెళుతుండగా ఘటన చోటు చేసుకుంది. శిథిలావస్థలో ఉన్న బస్టాండు పైకప్పునకు వెంటనే మరమ్మతులు చేయాలని పట్టణ వాసులు డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

ఉత్తమ విద్యతో ప్రయోజకులు కావాలి



విద్యార్థులకు ప్రతిభా పురస్కారం అందజేస్తున్న నాగభూషణరావ్

గౌరిబిదనూరు: విద్యార్థులు ఉత్తమ విద్యను అభ్యసించి సమాజానికి ప్రయోజకులు కావాలని రాష్ట్ర కాఫీ బోర్డు విశ్రాంత అధికారి లేపాక్షి నాగభూషణరావ్ తెలిపారు. సోమవారం తాలూకా ఆనూడి గ్రామంలోని ఏవీఎస్ ఉన్నత పాఠశాలలో గత ఏడాది టెన్త్ పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు అనంత్, పునీత్‌లకు ప్రతిభా పురస్కారాలను అందజేసి మాట్లాడారు. విద్యావేత్త హెచ్ నరసింహయ్యను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సంఘ సంస్థలు అందించే సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బెంగుళూరు బ్రహ్మ విద్యాశ్రమం కబీర్‌నాథ స్వామీజీ విద్యార్థులకు భగవద్గీతను వితరణ చేసి సారాంశాన్ని తెలిపారు. కార్యక్రమంలో రాజణ్ణ, సూర్య ప్రకాశ్, వాసుదేవరావ్ చౌహాన్, సురేశ్, రంగనాథ్, కుమార్ శివలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

మోదీపై మంత్రి విసుర్లు

శివాజీనగర: ఎన్నికల బాండ్ల విషయంలో సుప్రీంకోర్టు తీసుకొన్న నిర్ణయంతో ప్రధాని నరేంద్ర మోదీకి నైతిక పరాజయం ఎదురైందని భారీ పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ అన్నారు. ఎన్నికల బాండ్ల వ్యవస్థ దుర్వినియోగం అధికమైందని, తినను, తిననివ్వను అని మోదీ ఉత్తుత్తి మాటలు చెప్పారు. ఇప్పుడు ఆ భ్రమలు పోయాయి. అవినీతికి సంబంధించి, దాడులకు గురైన కాంట్రాక్టర్లు బీజేపీ పేరుతో ఎన్నికల బాండ్లు తీసుకున్నారు అని ఆరోపించారు.

రథోత్సవానికి పూజలు



పూజలో పాల్గొన్న అర్చకులు

విజయపుర: పట్టణంలో శ్రీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఈ క్రమంలో సోమవారం రథోత్సవ కార్యక్రమానికి ఆలయ అర్చకులు మురళీధర భట్టాచార్య ప్రత్యేక పూజలు చేశారు.

గోడౌన్‌లో అగ్నిప్రమాదం

- కోట్ల విలువైన నిత్యావసర వస్తువులు అగ్నికి ఆహుతి



కాలిపోతున్న గోడౌన్

దొడ్డబళ్లాపురం: గోడౌన్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుని కోట్ల విలువైన నిత్యావసర వస్తువులు కాలిబూడిదైన సంఘటన కొత్తనూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని బైరతి గ్రామంలో చోటుచేసుకుంది. బైరతి గ్రామం వద్ద గాయత్రి అసోసియేట్‌కు చెందిన గోడౌన్‌లో సోమవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరిగింది. క్షణాల్లో మంటలు గోడౌన్ మొత్తం వ్యాపించి కోట్ల విలువైన నిత్యావసర వస్తువులు కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపకదళం సిబ్బంది 9 ఫైర్ ఇంజిన్‌లతో వచ్చి అతి కష్టం మీద మంటలు ఆర్పారు. అయితే అప్పటికే దాదాపుగా మొత్తం కాలిపోయింది. ఈ గోడౌన్ నుండి సూపర్ మార్కెట్‌లకు సరుకులు సరఫరా అయ్యేవి. షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. కొత్తనూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పునీత్ అజరామరుడు



రక్తదానం చేస్తున్న యువత

మైసూరు: ఇబ్బందుల్లో ఉన్న వారిని ఆదుకోవడమే కాకుండా ఎక్కడ కూడా తను చేసిన సమాజ సేవను చెప్పుకోని గొప్ప వ్యక్తి పునీత్ రాజ్‌కుమార్ అని ఎమ్మెల్యే కె.హరీశ్ గౌడ తెలిపారు. నగరంలోని కేజీ కొప్పల్ చంద్రమౌళేశ్వర దేవస్థానం ముందు అప్పు అభిమానుల బృందం సోమవారం పునీత్ రాజ్‌కుమార్ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో పునీత్ అభిమానులు రక్తదానం చేసి తమ గొప్పతనాన్ని చాటుకున్నారు. అలాగే ఉచిత ఆరోగ్య శిబిరంలో పలువురు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఎమ్మెల్యే హరీశ్ గౌడ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

డిజిటల్ అరెస్ట్.. సరికొత్త సైబర్ స్కామ్

- వ్యక్తిగత సమాచారం సేకరించి ఫోన్ బెదిరింపులు
- అమాయకులను దోచేస్తున్న సైబర్ కేటుగాళ్లు



బనశంకరి: సైబర్ కేటుగాళ్లు సరికొత్త మోసాతో హడలెత్తిస్తున్నారు. నేడు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం శరవేగంగా అభివృద్ధి చెందడంతో కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. యువతీ, యువకులను బురిడీ కొట్టించి లక్షలాది రూపాయల వంచనకు పాల్పడుతున్నారు. సిలికాన్‌సిటీలో విద్యావంతులు, ఉన్నతోద్యోగులు, ఐటీ బీటీ ఉద్యోగులు, అమాయకుల అకౌంట్లలో నగదు దోచేస్తున్నారు. సైబర్ వలయంలో డిజిటల్ అరెస్ట్ ప్రస్తుతం అధికంగా ఉంది. విద్యావంతులు, పెద్ద పోస్టుల్లో ఉన్న అధికారులే సైబర్ వంచకుల వలలో చిక్కుకుని కోట్లాది రూపాయలు పోగొట్టుకోవడంతో పోలీసులకు పెద్దసవాల్‌గా మారుతోంది.

డిజిటల్ అరెస్ట్ అంటూ బెదిరింపులు :

పోలీసుల పేరుతో ఫోన్లు చేసి బెదిరిస్తే భయపడిపోకుండా బాధితులు ధైర్యంగా పోలీసులకు తెలపాలని సీనియర్ పోలీస్ అధికారులు సూచిస్తున్నారు. బ్యాంకు అధికారుల ముసుగులో ఫోన్లు చేయడం, కేవైసీ అప్‌డేట్, ఉద్యోగాలు ఇప్పిస్తామని తెలపడం, తక్కువ సమయంలో భారీగా డబ్బు సంపాదన పేరుతో ఆశ చూపించడం, క్యూఆర్ కోడ్ పంపించి మోసం చేసే పలు వంచనలకు పాల్పడే సైబర్ వంచకులు ప్రస్తుతం డిజిటల్ అరెస్ట్ వైపు మళ్లారు. ఉత్తరప్రదేశ్, బిహార్, జార్ఖండ్ రాష్ట్రాల్లో కూర్చుని సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. సమాచారం సేకరించి దర్యాప్తు చేపడితే ఐపీ అడ్రస్ దుబై, కాంబోడియా చూపిస్తుంది. ప్రజలనుంచి కాజేసిన డబ్బు క్రిప్టో కరెన్సీగా మార్చుకుంటున్నారు. అంతేగాక సైబర్ నేరాల్లో ఒక అకౌంట్‌లో లక్ష రూపాయలు సీజ్ చేస్తే ఆ డబ్బుకు ఐదారు రాష్ట్రాల నుంచి నోటీస్ వస్తుందని విచారణ అధికారులు తెలిపారు.



కులదీప్‌కుమార్‌జైన్ సిట్ డీసీపీ

చెన్నైలో తన పాఠశాల సహ ఉద్యోగికి శనివారం ఫోన్ చేసిన సైబర్ వంచకులు డిజిటల్ అరెస్ట్ తరహాలో మోసం చేయడానికి ప్రయత్నించారు. ఆ సమయంలో అతను తన స్నేహితుడు పోలీస్ అధికారి అని సమాధానం ఇవ్వడంతో వంచకులు ఫోన్ కట్ చేశారు. దీంతో ప్రజలు సైతం ఇదే విధంగా ఆత్మవిశ్వాసంతో మాట్లాడితే వంచనబారిన పడరని డీసీపీ కులదీప్‌కుమార్‌జైన్ సలహాఇచ్చారు. విచారణ అధికారుల పేరుతో తమకు ఇష్టమెచ్చిన మొబైల్ నెంబర్లకు ఫోన్ చేసి నేర ఆరోపణలు చేస్తారు. అనంతరం విచారణ పేరుతో అకౌంట్‌కు నగదు జమ చేయించుకుని ఉడాయిస్తారు.

గోల్డెన్ మినిట్‌లో ఫోన్ చేయాలి

బాధితులు గోల్డెన్ మినిట్‌లో నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ) 1930 సహాయవాణికి ఫోన్ చేసి తెలిపితే నగదు ఫ్రీజ్ చేస్తారు. కానీ సైబర్ కేటుగాళ్లు గోల్డెన్ మినిట్‌లో నగదు వేరే చోటకు జమ చేయడంతో ఫిర్యాదు చేసినప్పటికీ నగదు సీజ్ చేయడం కుదరదు.

వారానికి రెండుమూడు కేసులు ఫిక్స్

బెంగళూరులో ప్రతివారం రెండు నుంచి మూడు డిజిటల్ అరెస్ట్ కేసులు నమోదు అవుతున్నాయి. ఫెడెక్స్‌తో పాటు కొరియర్ పేరులో వంచనకు పాల్పడుతున్న డిజిటల్ అరెస్ట్ కేసులు దర్యాప్తు కోసం ఎస్ఐటీ ప్రత్యేక బృందం ఏర్పాటు చేసింది. బెంగళూరు తూర్పు విభాగ ట్రాఫిక్ డీసీపీ కుల్‌దీప్ కుమార్ ఆర్.జైన్‌ను చీఫ్‌గా నియమించారు. ఢిల్లీలో నెలకు 200 కేసులు నమోదు అవుతున్నట్లు సమాచారం.

ఎలా వంచనకు పాల్పడతారంటే..

- వ్యక్తిగత సమాచారం సేకరించి ర్యాండమ్ మొబైల్ నెంబర్లకు ఫోన్ చేస్తారు
- విచారణ అధికారులు పేరు చెప్పుకుని ఫోన్ చేసి పరిచయం చేసుకుంటారు
- ఆధార్ రికార్డులు వినియోగించి కొరియర్ బుక్ అయింది డ్రగ్స్ సరఫరా జరుగుతుందని బెదిరిస్తారు.
- మిమ్మల్ని విచారణ చేపట్టాలని తెలిపి స్కైప్ అప్లికేషన్ డౌన్‌లోడ్ చేయిస్తారు
- అనంతరం డెస్క్‌టాప్ రిమోట్ యాక్సెస్ తీసుకుని దశలవారీగా విచారణ చేస్తారు.
- ముందుగా కానిస్టేబుల్, ఎస్ఐ, అనంతరం డీసీపీ అని నమ్మిస్తారు
- నగదు తిరిగి చెల్లిస్తామని తెలిపి తమ అకౌంట్లకు నగదు జమ చేసుకుని అదృశ్యమౌతారు.

పోలీసుల సలహాలు..

- డిజిటల్ అరెస్ట్ పట్ల భయపడిస్తే భయపడకండి ధైర్యంగా మాట్లాడండి
- దేశంలో ఎక్కడ ఉన్నా నేరుగా 112 సహాయవాణికి ఫోన్‌చేసి స్పష్టత తీసుకోండి
- తక్షణం గూగల్ సర్చ్ చేస్తే కొరియర్ స్కామ్ సమాచారం లభిస్తుంది.
- పోలీసులమని చెబితే మేము సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు వెళుతున్నామని తెలపండి
- డిజిటల్ అరెస్ట్ బెదిరింపు పట్ల తక్షణం మీ కుటుంబ సభ్యులకు తెలపండి
- డిజిటల్ అరెస్ట్ అనే ప్రక్రియ లేదు ప్రజలను భయపెట్టడానికి సైబర్ నేరగాళ్లు పుట్టుకొచ్చారు. ప్రతివారం రెండు మూడు కేసులు నమోదు అవుతున్నాయని పోలీసుల పేరుతో ఫోన్ చేసి బెదిరిస్తే 112 సహాయవాణికి ఫోన్ చేయాలని మీ కుటుంబసభ్యులకు సమాచారం అందించాలని సిట్ డీసీపీ కుల్‌దీప్ కుమార్‌జైన్ తెలిపారు.

ఆస్తి గొడవలతో హత్య

మైసూరు: ఆస్తి వివాదంలో సొంత చిన్నాన్న, అతని కుమారుడు కలసి తన అన్న కుమారున్ని హత్య చేసిన ఘటన మైసూరు తాలూకా గెజ్జగళ్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన మల్లేశ్ (45) హతుడు. మల్లేశ్ చిన్నాన వీరభద్రప్ప, అతని కొడుకు ప్రకాశ్ (35)లతో కొన్నేళ్లుగా ఆస్తి గొడవలు జరుగుతున్నాయి. కక్ష పెంచుకుని వీరభద్రప్ప, కొడుకు కలిసి మల్లేశ్‌ను కట్టెలతో బాది హత్య చేశారు. మైసూరు గ్రామీణ పోలీసులు నిందితులను అరెస్టు చేశారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి

జిల్లాలోని సాలిగ్రామ పట్టణం టెంపో స్టాండ్ వద్ద ఒక వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. పట్టణ సమీపంలోని కెడగ గ్రామానికి చెందిన వెంకటరామయ్య అనే వ్యక్తి కుమారుడు ప్రకాశ్ (55)గా నిర్ధారించారు. మూడు రోజుల క్రితమే ఇతడు ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. ఇతనికి పెళ్లయి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సాలిగ్రామ పోలీసులు కేసు నమోదు చేశారు.

లారీ డ్రైవర్ ఆత్మహత్య

మైసూరు: లారీ డ్రైవర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పిరియా పట్టణంలోని ముత్తురాయ స్వామి దేవస్థానం వద్ద జరిగింది. మృతుడిని తమిళనాడుకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఇతడు రోడ్డు పక్కన లారీని నిలిపి ఉరి వేసుకున్నాడు. పిరియా పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్.. రైతు మృతి

నియంత్రణ కోల్పోయిన ట్రాక్టర్ కాలువలోకి దూసుకెళ్లడంతో రైతు మృతి చెందాడు. ఈ ఘటన హుణసూరు తాలూకా సీబీటీ కాలనీలో జరిగింది. హుణసూరు తాలూకా హుండిమాళ గ్రామానికి చెందిన రైతు సీబీటీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. పొలం పనుల కోసం ట్రాక్టర్‌లో వెళ్తుండగా నియంత్రణ కోల్పోయి పక్కనే ఉన్న కాలువలో పడిపోయాడు. ఈ సమయంలో ట్రాక్టర్ కింద పడి గణేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు.

మైనర్ వివాహిత ఆత్మహత్య కేసులో భర్త అరెస్ట్

బనశంకరి: వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టిన మైనర్ బాలిక ఆత్మహత్యకు పాల్పడిన కేసులో మైనర్ యువకుడిని సోమవారం హెబ్బగోడి పోలీసులు అరెస్ట్ చేశారు. హెబ్బగోడిలో ఈనెల 13న మైనర్ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివాహం అనంతరం మానసిక వేధింపులు తాళలేక బాలిక ఆత్మహత్యకు పాల్పడిందనే కారణంతో యువకుడు విశాల్‌కుమార్‌ను సోమవారం హెబ్బగోడి పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిద్దరు బిహార్‌కు చెందిన వారు. విశాల్‌కుమార్ ఏడాది క్రితం ఉపాధి నిమిత్తం నగరానికి వచ్చి పెయింటింగ్ పనులు చేసేవాడు. ఈ సమయంలో బిహార్‌కు చెందిన బాలికను గత ఏడాది ఫిబ్రవరిలో వివాహం చేసుకున్నాడు. 20 రోజులు క్రితం విశాల్‌కుమార్ భార్యను హెబ్బగోడి సమీపంలోని తిరుపాళ్యలో అద్దె ఇంటికి తీసుకువచ్చాడు. అయితే ఈనెల 13న బాలిక ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. లైంగికంగా, మానసికంగా హింసించడంతో బాలిక ఆత్మహత్యకు పాల్పడిందని అనుమానం వ్యక్తమైంది. జిల్లా మక్కళ రక్షణా అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని హెబ్బగోడి పోలీసులకు సమాచారం అందించారు. జిల్లా శిశు సంక్షేమ సమితి శ్రీదేవి హెబ్బగోడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు సోమవారం విశాల్‌కుమార్‌ను అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు.

బాలికపై లైంగిక వేధింపులు

- నిందితుడు అరెస్టు

దొడ్డబళ్లాపురం: మైనర్ బాలికను హాస్టల్ నుండి తీసికెళ్లి లైంగిక వేధింపులకు గురిచేసిన వ్యక్తిని రామనగర పోలీసులు అరెస్టు చేసారు. హాస్టల్‌లో ఉంటున్న బాలిక (15)ను 36 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి తాను ఆమెకు అన్నయని చెప్పుకుని, టీ తాపించి తీసుకువస్తానని బయటకు తీసుకెళ్లాడు. బైక్‌పై దూరంగా తీసికెళ్లి నిర్జన ప్రదేశంలో లైంగిక వేధింపులకు గురిచేసాడు. ఎంత సేపయినా బాలికను తీసుకురాకపోవడంతో అనుమానం వచ్చిన హాస్టల్ సిబ్బంది బాలిక తల్లిదండ్రులకు ఫోన్ చేసారు. అదేవిధంగా రామనగర మహిళా పోలీస్ స్టేషన్‌కు కూడా కాల్ చేసారు. తక్షణం పోలీసులు అప్రమత్తమై హాస్టల్ సమీపంలోని మామిడి తోటలో బాలికతో ఉన్న నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఏడాది కాలంగా బాలికపై లైంగిక దౌర్జన్యం చేస్తున్నట్టు పోలీసులకు తెలిసింది. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసారు.

మొబైల్ టవర్ దగ్ధం

బనశంకరి: ఇటీవల బెంగళూరు నగరంలో తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా సోమవారం ఆనేకల్ తాలూకా జిగిణిలో ఇండస్ కంపెనీ మొబైల్ నెట్‌వర్క్ టవర్‌లో అగ్నిప్రమాదం సంభవించి కాలిపోయింది. జనరేటర్ రూమ్‌లో అగ్నిప్రమాదం సంభవించగా చూస్తుండగా టవర్ మొత్తం మంటల్లో దగ్ధమైంది. జనరేటర్‌లోని డీజిల్‌కు మంటలు ఏర్పడి టవర్ కాలిపోయిందా, షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు ఏర్పడ్డాయా అనే అనుమానం వ్యక్తమౌతుంది. ఎలక్ట్రానిక్‌సిటీ అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పివేశారు.

టింబర్ షాపు ఆహుతి

మైసూరు: టింబర్ షాపులో మంటలు చెలరేగి లక్షలాది రూపాయల విలువైన చెక్క సామగ్రి కాలిపోయింది. ఈ ఘటన మైసూరులోని ఆందోళన సర్కిల్ వద్ద జరిగింది. ఓ టింబర్ దుకాణంలో ఆకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసింది. అయితే అప్పటికే పలు విలువైన సామగ్రి అగ్నికి ఆహుతైంది.

ఆస్తి వివాదం.. అల్లుడిపై మామ కాల్పులు

యశవంతపుర: ఆస్తి వివాదానికి సంబంధించి మామ అల్లుడిపై తుపాకీతో కాల్పులు జరిపిన ఘటన బెళగావి జిల్లా రాయభాగ తాలూకా మోరబ గ్రామంలో జరిగింది. 30 గుంటల భూమికి సంబంధించి అల్లుడు శాంతినాథ్‌పై మామ ధనపాల్ తుపాకీతో కాల్పులు జరిపాడు. బలమైన గాయాలతో శాంతినాథ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రాయభాగ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

కారు దగ్ధం

నిలిపిన ఉంచిన కారులో మంటలు ఏర్పడి క్షణాల్లో కారు దగ్ధమైన ఘటన దావణగెరె జిల్లా కెటిజె నగరంలో జరిగింది. హదడి రోడ్డులోని విశాల్ మార్ట్ వద్ద నిలిపిన కారులో ఆకస్మికంగా మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపు కారు పూర్తిగా కాలి పోయింది.

భవిష్యత్తు భారత్ కోసం రూట్‌మ్యాప్

మైసూరు: భవిష్యత్తు భారత్ కోసం రూట్‌మ్యాప్ సిద్ధం చేస్తున్నట్లు, దేశం ఏ విధంగా అభివృద్ధి దిశగా ముందుకు వెళ్లాలనే విషయంపై సంకల్ప లేఖను తయారు చేస్తున్నట్లు ఇందుకోసం కోటి మంది ప్రజల సలహాలు, అభిప్రాయాలు తీసుకుంటున్నట్లు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాళవిక అవినాశ్ తెలిపారు. సోమవారం నగరంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో బీజేపీ ఏర్పాటు చేసిన సంకల్ప పత్రం -మీ సలహా అనే కార్యక్రమంపై మీడియాతో ముచ్చటించారు. గడిచిన పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో 95 శాతం పూర్తి చేసిందని, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను మార్చేందుకు ప్రధాని మోదీ ఆకాంక్ష అని తెలిపారు. ఇదే కార్యక్రమంలో ఎంపీ ప్రతాప్ సింహా మాట్లాడుతూ... బెంగళూరు ఎంజీ రోడ్డు కార్యాలయంలో కూర్చొని రాసుకునే తనకు పదేళ్ల పాటు ఎంపీగా ఉండేలా బీజేపీ చేసిందని, అలాంటి పార్టీ తనకు ద్రోహం చేయదని తెలిపారు. 2014లో తనకు ఎందుకు టికెట్ ఇచ్చిందని బీజేపీ హైకమాండ్‌ను అడగలేదని, ఇప్పుడు ఎందుకు టికెట్ ఇవ్వలేదని అడగబోనని చెప్పారు., తనకు ఎంపీగాను, రాజకీయంగాను జీవితం ఇచ్చింది బీజేపీనేనని గుర్తు చేశారు., పార్టీ అభ్యర్థి యదువీర్‌కు ఒక కార్యకర్తలా పని చేస్తానని హామీ ఇచ్చారు.

తొలకరికి ముందే చర్యలు తీసుకోండి



బనశంకరి: తొలకరి వానలకు ముందుగానే బీబీఎంపీ పరిధిలో అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ అధికారులకు సూచించారు. తాగునీటి వ్యవస్థ, ఎన్నికల ఏర్పాట్లపై సోమవారం సీనియర్ అధికారులతో తుషార్ సమావేశం నిర్వహించారు. బీబీఎంపీ పరిధిలోని ఆయా వలయాల్లో వరద పీడిత ప్రాంతాలను గుర్తించి సదరు ప్రాంతాల్లో వరదలు తలెత్తకుండా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలి. రాజకాలువల్లో పూడిక తీసి వర్షపు నీరు సజావుగా వెళ్లేలా చూడాలి. రోడ్లు, డ్రైనేజీలు శుభ్రంగా ఉండేలా చూసుకుని రోడ్లపై నీరు ప్రవహించకుండా చూడాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా తాగునీటి సమస్య గురించి ఆయా వలయాల పరిధిలోని జలమండలి అధికారులతో సమన్వయం చేసుకుని నీటి సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. నీటి సమస్య ఉన్న ప్రాంతాలకు నీటి సరఫరా చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. లోకసభ ఎన్నికలు నేపథ్యంలో ప్రజాప్రతినిధుల ప్రకటనలతో కూడిన ఫ్లెక్సీలు, బ్యానర్లు లేకుండా చూడాలని తెలిపారు. సమావేశంలో పాలికె ప్రత్యేక కమిషనర్లు డాక్టర్ కే.హరీశ్‌కుమార్, సురోళ్కర్ వికాస్ కిషోర్, ఇంజనీర్లు, అధికారులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యం.. రెండు ప్రాణాలు బలి

బనశంకరి: డాక్టర్ల నిర్లక్ష్యంతో తీవ్ర రక్తస్రావమైన బాలింత, శ్వాస సమస్యతో పసికందు మృతి చెందారని మృతురాలి బంధువులు ఆరోపిస్తూ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ముందు ధర్నాకు దిగారు. బెళగావి సంతిబస్తవాడ గ్రామ లక్ష్మిలగమప్ప (28) మృతి చెందిన బాలింత. సోమవారం ఉదయం కిణయ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాలింత మృతి చెందింది. పసికందు (మగబిడ్డ) కూడా శ్వాస సమస్యతో మృతి చెందాడు. ఈ ఘటనపై బెళగావి గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో డాక్టర్లపై మృతురాలు కుటుంబ సభ్యులు కేసు పెట్టారు. కిణయ ఆసుపత్రి డాక్టర్లు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తన భార్య మృతి చెందిందని భర్త లగమప్ప ఆరోపించారు. సరైన సమయానికి అంబులెన్స్ వచ్చి ఉంటే తన భార్య బతికేదని అంతేగాక రాత్రి ఆసుపత్రిలో డాక్టర్లు కూడా లేరని నర్సు కాన్పు చేసిందని నిర్లక్ష్యంగా వ్యవహరించిన డాక్టర్లు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బావిలో దూకి గర్భిణి ఆత్మహత్య

యశవంతపుర: తీవ్రమైన తలనొప్పిని తట్టుకోలేక గర్భిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన బీదర్ జిల్లాలో జరిగింది. మృతురాలిని కీర్తిరాము (22)గా గుర్తించారు. బీదర్ జిల్లా హుమ్నాబాద్ తాలూకా మాణిక్ నగరలో నివాసం ఉంటున్న ఈమె ఏడు నెలల గర్భిణి. కొద్ది నెలలుగా తీవ్ర తలనొప్పితో బాధపడుతోంది. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. హుమ్నాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మరమ్మతులకు నోచుకోని తాగునీటి కేంద్రం

తుమకూరు: తుమకూరు జిల్లా చిక్కనాయకనహళ్లి తాలూకా హుళియారు హోబళి కెంకెరె గ్రామ పంచాయతీ పరిధిలోని కేసీ పాళ్య తాగునీటి కేంద్రం పాడై ఏడాది గడిచినా మరమ్మతులకు నోచుకోలేదు. పట్టణ ప్రాంత ప్రజలతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కేసీ పాళ్యలో ఐదేళ్ల క్రితం తాగునీటి కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. కేసీ పాళ్య గ్రామంలోని 200 ఇళ్లతో పాటు నాగప్పనకట్టె, బళ్లురయ్యనగుడ్లు ఇతర గ్రామాల ప్రజలకు తాగునీటి అవసరాలను ఈ కేంద్రం తీరుస్తోంది. ప్రస్తుతం తాగునీటి కేంద్రం చెడిపోయి మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీటికోసం మూడు, నాలుగు కిలోమీటర్ల దూరంలోని హుళియారు, కెంకెరె గ్రామాలకువెళ్లి తీసుకొని రావాల్సిన దుస్థితి ఏర్పడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కేంద్రంలో ఫిల్టర్లు పదే పదే పాడవుతుండడంతో వాటిని మరమ్మతులు చేసేందుకు రెండు, మూడు నెలలు పడుతుందని చెప్పారు. పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులకు ఈసమస్యను విన్నవించినా ప్రయోజనం శూన్యమని తెలిపారు. వెంటనే మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



ఏడాదిగా వృథాగా పడి ఉన్న తాగునీటి కేంద్రం

హోసూరు వార్తలు..

ముగ్గురు మహిళల అరెస్టు

హోసూరు: హోసూరు పారిశ్రామిక ప్రాంతంలో నగల దుకాణంలో నగలను ఎత్తుకెళ్తున్న ముగ్గురు మహిళలను సిఫ్‌కాట్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల మేరకు ఆదివారం సాయంత్రం నగల షాపులోకి ముగ్గురు మహిళలు వెళ్లారు. నగలు కొనాలని సిబ్బందితో మాట్లాడుతూ జత కమ్మలను తస్కరించి వెళ్లిపోయారు. సిబ్బంది గమనించి మహిళలను సిఫ్‌కాట్ పోలీసులకు అప్పగించారు. విచారణ జరుపగా చిత్తూరు జిల్లాకు ఓజీ కుప్పానికి చెందిన అలమేలు (45), లత (38), సేలం జిల్లాకు చెందిన గౌరి (45) అని తెలిసింది. అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

బాలిక పరువు హత్య.. తల్లిదండ్రులే నిందితులు



పోలీసులు అరెస్ట్ చేసిన తల్లిదండ్రులు

హోసూరు: జిల్లాలో మరో పరువు హత్య వెలుగు చూసింది. హోసూరు సమీపంలో గత రెండు రోజుల క్రితం దారుణ హత్యకు గురైన బాలిక హత్య కేసులో తల్లిదండ్రులే నిందితులుగా పోలీసులు తేల్చారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు హోసూరు తాలూకా బాగలూరు సమీపంలోని బటవారపల్లి చెరువులో గత రెండు రోజుల క్రితం ఓ బాలిక హత్యకు గురైంది. పోలీసులు శవాన్ని స్వాధీనపరుచుకొని విచారణ చేపట్టారు. బాగలూరు సమీపంలోని బటవారపల్లి గ్రామానికి చెందిన ప్రకాష్ (35), భార్య కామాక్షి (33) దంపతుల కూతురు స్ఫూర్తి (16) అని తెలిసింది. బాలిక బాగలూరు ప్రభుత్వ పాఠశాలలో ప్లస్‌వన్ చదివేది. ముత్తాళి గ్రామానికి చెందిన శివ (25) అనే యువకుడు బాలికతో తరచూ మాట్లాడేవాడు. దీనిపై స్ఫూర్తిని తల్లిదండ్రులు మందలించారు. చివరికి ఆవేశానికి గురైన దంపతులు కన్నకూతురిని గొంతు పిసికి చంపి గోనెసంచిలో కట్టి చెరువులో పడేశారు. తల్లిదండ్రులతో పాటు వారి బంధువు మీనాక్షి (36)ని పోలీసులు అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

కెలమంగలం: వ్యాన్ ఢీకొని పాదచారి మృతి చెందిన ఘటన వేపనపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు.. క్రిష్ణగిరి జిల్లా వేపనపల్లి సమీపంలోని కే.కొత్తూరు గ్రామానికి చెందిన రామప్ప (65) ఆదివారం సాయంత్రం నాచికుప్పం నుంచి వేపనపల్లి వైపు నడుచుకుంటూ వెళ్తుండగా అదే మార్గంలో వచ్చిన వ్యాన్ ఢీకొంది. తీవ్ర గాయాలతో రామప్ప ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. వేపనపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

క్రిష్ణగిరి: క్రికెట్ ఆడుతూ మిద్దెపై పడిన బంతిని తీసేందుకెళ్లిన ఇద్దరు విద్యార్థులు విద్యుదాఘాతానికి గురికాగా ఒకరు మృతి చెందారు. గాయపడిన బాలుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన కావేరిపట్టణం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు...క్రిష్ణగిరి జిల్లా పోచ్చంపల్లి సమీపంలోని వాడమంగలం గ్రామానికి చెందిన గోవిందస్వామి కొడుకు సంతోష్‌కుమార్ (16) అదే ప్రాంతంలోని ప్రైవేట్ పాఠశాలలో ప్లస్‌వన్ చదువుతున్నాడు. ఇతడి బాబాయి కొడుకు సాలామాన్ (14)తో కలిసి ఆదివారం రాత్రి క్రికెట్ ఆడుతుండగా బంతి సమీపంలోని మిద్దెపైన పడింది. బంతిని తెచ్చేందుకు సంతోష్‌కుమార్ మిద్దెపైకి వెళ్లాడు. ఆ సమయంలో విద్యుత్ తీగ తగలడంతో షాక్‌కు గురయ్యాడు. అతను కేకలు వేయడంతో సాలామాన్ కూడా పైకెళ్లి అతన్ని రక్షించే ప్రయత్నంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని ఇరువురిని పోచ్చంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంతోష్‌కుమార్ మృతి చెందాడు. సాలామాన్‌కు చికిత్స అందజేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

ఓటు హక్కు వినియోగంపై చైతన్య ర్యాలీ

హోసూరు: రాబోవు లోక్‌సభ ఎన్నికల్లో వంద శాతం ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచిస్తూ జిల్లా కేంద్రం క్రిష్ణగిరిలో ఏర్పాటు చేసిన చైతన్య కార్యక్రమాన్ని కలెక్టర్ శరయు జెండా ఊపి ప్రారంభించారు. అంగవికల సంక్షేమ శాఖ ద్వారా చేపట్టిన ఈ కార్యక్రమంలో సుమారు 50 మందికి పైగా దివ్యాంగులు త్రిచక్ర వాహన ర్యాలీ చేపట్టారు. క్రిష్ణగిరి కొత్త బస్టాండు వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ పట్టణ పురవీధులగుండా వెళ్లుతూ ఓటు హక్కు ప్రాముఖ్యతపై ప్రజలకు వివరిస్తూ, క్రిష్ణగిరి జిల్లాలో ఓటర్లు వందశాతం ఓటు హక్కును వినియోగించుకోవాలని చైతన్యం కల్పించారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ శరయు

కార్యక్రమంలో అధికారులు బాబు, మురుగేషన్, సుబ్రమణి, వెంకటేష్, రమాదేవి, కుమరేషన్, తవమణి, మహేశ్వరి, భువన తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం మొర



వినతిపత్రాలతో గ్రామస్థులు

హోసూరు: అగ్గొండపల్లి గ్రామంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ వంద మందికి పైగా గ్రామస్థులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కెలమంగలం సమితి బైరమంగలం గ్రామపంచాయతీ అగ్గొండపల్లి గ్రామంలో తరతరాలుగా నివాసముంటున్నామని తెలిపారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు.

తమిళ్ వాళ్వురిమై ఖచ్చి పార్టీలో చేరిక



బహిరంగ సభలో పాల్గొన్న పార్టీ అధ్యక్షులు వేల్‌మురుగన్

హోసూరు: వివిధ పార్టీలకు చెందిన పలువురు తమిళ్‌వాళ్వురిమై ఖచ్చి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హోసూరు రామ్‌నగర్ వద్ద పార్టీ నాయకుడు కార్తిక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశానికి ఆ పార్టీ వ్యవస్థాపకుడు, పన్‌రుట్టి ఎమ్మెల్యే వేల్‌మురుగన్ ముఖ్య అతిథిగా పాల్గొని కొత్తగా చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోవు లోక్‌సభ ఎన్నికల్లో కూటమి పార్టీ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థిని ఎక్కువ మెజార్టీతో గెలిపించుకొనేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆవును కారుతో ఢీకొట్టి..

బనశంకరి: బెంగళూరు నగరం మహాలక్ష్మీ లేఔట్‌లో రోడ్డుపై పడుకున్న ఆవుపై ఓ దుర్మార్గుడు కారుతో ఢీకొట్టాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎరుపు రంగు కారులో వచ్చిన వ్యక్తి పడుకున్న ఆవుపై దూసుకెళ్లడంతో చక్రాల కింద ఆవు చిక్కుకుంది. కొద్ది దూరం లాక్కెళ్లింది. ఈ దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. ఈ ప్రమాదంలో ఆవు తీవ్రంగా గాయపడింది.

వ్యక్తి దుర్మరణం

మండ్య: మళవళ్లి- మైసూరు ప్రధాన రహదారిపై నేణగూరు గేట్ వద్ద సోమవారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఒక పాదచారి మరణించాడు. నేణనూరు గ్రామానికి చెందిన మహదేవ స్వామి (60) అనే వృద్ధుడు నడుచుకుంటూ వెళుతుండగా వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఒకటి అతన్ని ఢీ కొట్టింది. కిరుగావలు పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఈలేస్తే.. క్లోజ్!



కోడ్ ఉల్లంఘనలపై ఓటర్ల కోసం సీ-విజిల్ యాప్

ఆడియోలూ అప్‌లోడ్ చేసే అవకాశం

గంట వ్యవధిలోనే ఘటనాస్థలికి ఫ్లయింగ్ స్క్వాడ్

గంటన్నరలో ఉన్నతాధికారులకు ఫిర్యాదుపై సమగ్ర నివేదిక

గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మెయిన్ రోడ్డులో రాజకీయ పార్టీల హోర్డింగులు సోమవారం ఉదయం వరకూ ఉన్నాయి. వీటిని సీ-విజిల్ ద్వారా ఫొటోలు తీసి ఎవరో అప్‌లోడ్ చేశారు. అంతే.. నిమిషాల వ్యవధిలో అక్కడకు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ చేరుకుంది. స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుని, యుద్ధ ప్రాతిపదికన హోర్డింగులను తొలగించింది. ఈ యాప్ ఎంత వేగంగా పని చేస్తుందనేందుకు ఈ చర్యలే సాక్ష్యం. సార్వత్రిక ఎన్నికలకు ఎన్నికల కమిషన్ సర్వ సన్నద్ధమయింది. ఇప్పటికే ఓటర్ల జాబితాలు.. పోలింగ్ కేంద్రాలు, ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లపై కసరత్తు చేస్తున్న ఎన్నికల సంఘం.. ఎన్నికల్లో పార్టీల ప్రలోభాలు, కోడ్ ఉల్లంఘనలపైనా దృష్టి సారించింది. ఉల్లంఘనులపై చర్యలకు 'సీ విజిల్' యాప్‌ను సిద్ధం చేసింది. - ప్రత్తిపాడు



ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ చేస్తే చాలు..

సాధారణ ఎన్నికల్లో ఎవరైనా ప్రవర్తనా నియమావళిని (ఎన్నికలకోడ్) ఉల్లంఘించినా, ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినా, మద్యం, డబ్బు, వస్తు సామగ్రి పంపిణీ వంటి వాటికి పాల్పడినా, అలాంటి వారిపై చర్యలు తీసుకునేలా ఈ యాప్‌ను రూపొందించారు. ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా, ఓటర్లకు కానుకలు అందజేసే సమయంలో ఫొటోలు, వీడియోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే నేరుగా ఎన్నికల సంఘానికి చేరిపోతాయి. కులమత విద్వేషాలను రెచ్చగొట్టేలా చేసే ప్రసంగాలనూ ఆడియో ద్వారా రికార్డు చేసి అప్‌లోడ్ చేయవచ్చు.

అత్యంత వేగంగా స్పందన


సీ విజిల్ యాప్ ద్వారా చేసిన ఫిర్యాదులపై అత్యంత వేగంగా స్పందన ఉంటుంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినా, ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నా సంబంధిత ప్రదేశం నుంచే ఫొటోలు, వీడియోలు, ఆడియోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయవచ్చు. అప్‌లోడ్ చేసిన గంటలోపు అక్కడకు ముగ్గురు సభ్యులతో కూడిన ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ చేరుకుంటుంది. ఘటనపై 90 నిమిషాల్లో ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తారు. ఎన్నికల కమిషన్ అందుబాటులోనికి తీసుకువచ్చిన ఈ యాప్‌ను ఓటర్లు వినియోగించుకోవాలి.



- ఎం.పద్మజ, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, ప్రత్తిపాడు

గంట వ్యవధిలోనే..

- ఎవరైనా, ఎక్కడి నుంచైనా యాప్‌లో అప్‌లోడ్ చేసిన ఐదు నిమిషాల్లో జిల్లా ఎన్నికల అధికారికి వెళుతుంది. ఆయన దీని పరిశీలనకు ఫీల్డ్‌లో ఉన్న టీముకు పంపిస్తారు.
- 15 నిమిషాల్లో ఫీల్డ్‌లో ఉన్న ఫ్లయింగ్ స్క్వాడ్ ఘటనా స్థలానికి చేరుతుంది.
- 30 నిమిషాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ చర్యలు మొదలుపెట్టి నివేదికను ఉన్నతాధికారులకు పంపుతుంది.
- యాభై నిమిషాల్లో రిటర్నింగ్ అధికారులు ఫిర్యాదును క్లోజ్ చేస్తారు.
- ప్రతి ఫిర్యాదుకు 100 నిమిషాల్లో ప్రతి స్పందన ఉంటుంది.



సీవిజిల్ యాప్ ముఖచిత్రాలు

గూగుల్ ప్లే స్టోర్ నుంచి..

- యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్ చేసుకోవాల్సి ఉంటుంది.
- ఇన్‌స్టాల్ చేసుకునే సమయంలో రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గాన్ని ఎంచుకోవాల్సి ఉంటుంది.
- ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ చేయాలనుకున్న సమయంలో మొబైల్‌లోని జీపీఎస్ ఆన్‌లో ఉంచాలి. దాని ఆధారంగానే అధికారులు సంబంధిత ప్రాంతానికి నేరుగా చేరుకోగలుగుతారు.
- యాప్ ఇన్‌స్టాల్ చేసుకునే సమయంలో వచ్చిన ఓటీపీ ద్వారా యాప్ యాక్టివేట్ అవుతుంది.
- ఆ తర్వాత వీడియోలు, ఫొటోలు అప్‌లోడ్ చేసి నేరుగా యాప్ ద్వారా ఉన్నతాధికారులకు పంపవచ్చు.

చంద్రబాబుకు ఎన్నికల కమిషన్ నోటీసులు

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై టీడీపీ సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు
- 24 గంటల్లో వాటిని తొలగించాలని సీఈవో ఆదేశాలు



రాష్ట్ర ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తున్న ప్రభుత్వ విప్ అప్పిరెడ్డి తదితరులు

సాక్షి, అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడికి ఎన్నికల కమిషన్ సోమవారం నోటీసులు జారీ చేసింది. సీఎం వైఎస్ జగన్‌పై వ్యక్తిగత దూషణలకు పాల్పడుతూ టీడీపీ సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టడంపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎక్స్, ఫేస్‌బుక్, యూట్యూబ్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా టీడీపీ అసభ్యకర ప్రచారానికి పాల్పడుతోందని, సీఎం వైఎస్ జగన్ వ్యక్తిత్వంపై దాడిచేస్తోందని అప్పిరెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. వీటిని పరిశీలించిన ప్రధాన ఎన్నికల కమిషనర్.. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై చంద్రబాబుకు సోమవారం నోటీసులు జారీ చేశారు. సీఎం వైఎస్ జగన్‌ను కించపరిచేలా టీడీపీ సోషల్ మీడియాలో పెట్టిన అభ్యంతరకర పోస్టులు 24 గంటల్లో తొలగించాలని ఎన్నికల కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. సోషల్ మీడియా పోస్టులు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని సీఈవో స్పష్టం చేశారు. సీఈవోకు ఫిర్యాదు చేసిన వారిలో లేళ్ల అప్పిరెడ్డితో పాటు ఎమ్మెల్యే మద్దాళి గిరి, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి ఎ.నారాయణమూర్తి, పార్టీ న్యాయవిభాగం అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి ఉన్నారు.

జనసేన దుకాణం క్లోజ్!

- పార్టీ కార్యాలయం మూసివేత
- టు లెట్ బోర్డు పెట్టిన భవనం యజమాని
- కార్యాలయం అద్దె చెల్లించకపోవడమే కారణం?
- పొత్తుల వల్ల సీట్లు దక్కకపోవడంతో స్థానిక నేతల ఆగ్రహం
- కార్యాలయం ఖర్చు, అద్దె కూడా వృథా అని భావన



తాజాగా జనసేన కార్యాలయం వద్ద టు లెట్ బోర్డు



జనసేన కార్యాలయం (ఫైల్)

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: జనసేన పార్టీ ఉత్తరాంధ్ర కార్యాలయం మూతపడింది. ఉత్తరాంధ్రలో పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు విశాఖలోని మాధవధార ప్రాంతంలో ఏర్పాటు చేసిన జనసేన కార్యాలయాన్ని కొద్ది రోజులుగా తెరవడంలేదు. ఇప్పుడు కార్యాలయం భవనాన్ని అద్దెకిస్తామంటూ భవనం యజమాని టు లెట్ బోర్డు పెట్టారు. పార్టీ కార్యాలయం ఖర్చును భరించేందుకు స్థానిక నేతలెవరూ ముందుకు రాకపోవడం, కనీసం అద్దె కూడా చెల్లించకపోవడంతో భవనం యజమాని పార్టీ కార్యాలయాన్ని ఖాళీ చేయించినట్టు సమాచారం. ఓ పక్క పొత్తుల్లో అధిక శాతం సీట్లు కోల్పోవడం, ఉన్న సీట్లను కూడా కొత్తగా వచ్చిన వారికి ఇస్తుండటంతో స్థానిక నేతలందరూ పార్టీ అధినాయకత్వంపై ఆగ్రహంతో ఉన్నారు. ఇన్నాళ్లూ డబ్బు ఖర్చుపెట్టు కొన్న తమను పొత్తులు, కొత్తవారికి సీట్లతో దెబ్బ తీశారని కుతకుతలాడుతున్నారు. పొత్తులో భాగంగా విశాఖ దక్షిణం, పెందుర్తి, యలమంచిలి, అనకాపల్లి సీట్లు జనసేనకు వచ్చాయి. పార్టీలో మొన్ననే చేరిన వంశీకృష్ణకు విశాఖ దక్షిణ స్థానాన్ని, అంతకుముందు చేరిన పంచకర్లకు పెందుర్తి, నిన్న చేరిన కొణతాలకు అనకాపల్లి సీటు కేటాయించినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పార్టీలో మొదటి నుంచీ ఉండి పనిచేసిన తమను కాదని కొత్తగా వచ్చిన వారికి పెద్దపీట వేయడాన్ని జనసేన నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో ఇప్పటికే అనకాపల్లి నేత పరుచూరి భాస్కర్‌రావు, పెందుర్తి నేత కంచిపాటి కాశీవిశ్వనాథనాయుడు పార్టీకి రాజీనామా చేశారు. మరి కొందరు పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉన్నారు. నేతలెవ్వరూ పార్టీ కార్యాలయం వైపు కన్నెత్తి చూడటంలేదు. ఆ భవనం అద్దె కూడా వృథా అని భావించి, అద్దె కట్టడం మానేసినట్లు సమాచారం.

ఇది రెండోసారి

జనసేన కార్యాలయం మూతపడటం ఇది రెండోసారి. గతంలో నరసింహనగర్ రైతుబజార్ సమీపంలోని అపార్టుమెంట్‌లో పార్టీ కార్యాలయం ఉండేది. 2019 ఎన్నికల్లో ఓటమి తర్వాత ఈ కార్యాలయాన్ని మూసివేశారు. కొద్ది రోజులు పార్టీ కార్యాలయం లేకుండానే కాలం వెళ్లదీశారు. రెండేళ్ల క్రితం మాధవధారలో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఆ కార్యాలయం ఇప్పుడు మూతపడటంతో ఉత్తరాంధ్రలో ముందుగానే దుకాణం సర్దేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అది మీ బాబు రూటు

చంద్రబాబు తప్పలను జగన్‌పై రుద్దడానికి రామోజీ విష కథనం

- 2019లో సేవామిత్ర యాప్ ద్వారా వైఎస్సార్‌సీపీ ఓట్ల తొలగింపునకు టీడీపీ కుట్ర
- ఈసీకి ఫిర్యాదుతో తిరిగి చేర్చిన 31,97,473 ఓట్లు



సాక్షి, అమరావతి: పచ్చకామెర్ల రోగికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుందన్న చందంగా... కళ్లకు పచ్చ పసరు రాసుకున్న రామోజీకి అంతా తన 'బాబు' లాగే కనిపిస్తున్నారు. తన బాబు దొంగ ఓట్లతో గెలిచాడు కాబట్టి మిగతా వారూ అలానే ఉంటారని భావిస్తూ ''ఓటు హక్కుపై వేటు.. అదే జగన్ రూటు'' అంటూ జగన్‌పై ఉన్న అక్కసును బయట పెట్టుకున్నారు. అసలు దొంగఓట్లకు ఆద్యుడు చంద్రబాబేనని, తమిళనాడుకు చెందిన వలస కూలీలను చేర్పించడం ద్వారా ఇన్నాళ్లూ కుప్పంలో గెలుస్తూ వచ్చాడని, ఇప్పుడు ఆ భాగోతం బయటపడటంతో సొంత నియోజకవర్గంలో తన బాబు' ఓడిపోతాడనే భయంతోనే ఇటువంటి వార్తలు రాస్తున్నారంటూ రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

సేవామిత్ర యాప్ పేరుతో వైఎస్సార్‌సీపీ మద్దతుదార్ల ఓట్ల తొలగింపు

రాష్ట్రంలో 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక ప్రజలకు సంబంధించిన వ్యక్తిగత డేటాను చౌర్యం చేసి ప్రైవేటు సంస్థలకు చంద్రబాబు అప్పగించారు. వాటిని సేవా మిత్ర యాప్‌తో అనుసంధానం చేసి, వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల ఓట్లను తొలగించారు. 2015లో 22,76,714, 2016లో 13,00,613, 2017లో 14,46,238 వెరసి 50,23,565 ఓట్లను చంద్రబాబు తొలగింపజేశారు. తద్వారా తనకు అలవాటైన రీతిలో దొడ్డిదారిన అధికారంలోకి వచ్చేందుకు కుట్ర చేశారు. ఈ కుట్రను ప్రజాసంఘాలు బహిర్గతం చేశాయి. దీనిపై వైఎస్సార్‌సీపీ చేసిన ఫిర్యాదుపై కేంద్ర ఎన్నికల సంఘం విచారణకు ఆదేశించింది. అర్హుల ఓట్లను కూడా తొలగించినట్లు తేల్చిన ఎన్నికల అధికారులు.. 2019 ఎన్నికల నాటికి 31,97,473 ఓట్లను జాబితాలో అదనంగా చేర్చారు. దాంతో ఆ ఎన్నికల్లో 50 శాతంపైగా ఓట్లు సాధించి.. 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధించింది.

ఈసీ స్పష్టం చేసినా వినపడలేదా!

అత్యంత పారదర్శకంగా ఓటర్ల జాబితాను రూపొందిస్తున్నట్లు కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్ కుమార్ ఇటీవల ఓ సమీక్షలో స్పష్టం చేశారు. రాష్ట్రంలో దొంగ ఓట్ల నమోదు, గంపగుత్తగా ఓట్ల తొలగింపు, జీరో ఇంటి నెంబర్‌పై ఓటర్ల నమోదు అంటూ తెలుగుదేశం పార్టీ, పచ్చ మీడియా చేసిన బోగస్ ప్రచారంలో వీసమెత్తు నిజం లేదన్న విషయాన్ని ఆయన విస్పష్టంగాచెప్పారు. 2023 జనవరి 6 నుంచి ఆగస్టు 30 మధ్య కాలంలో తొలగించిన 21 లక్షల ఓట్లను సమీక్షిస్తే అందులో కేవలం 13,061 ఓట్లలోనే తప్పులు దొర్లాయని ఆయన తేల్చారు. అంటే తొలగించిన మొత్తం ఓట్లల్లో ఇది కేవలం 0.61 శాతం మాత్రమే. వాటిని తిరిగి సవరించారు. మృతి చెందిన, ఇంటి మార్పు, డూప్లికేట్ ఓటర్ల నమోదుపై 14.48 లక్షల దరఖాస్తులు వస్తే అందులో 5.65 లక్షల ఓటర్లు చనిపోవడం లేదా శాశ్వతంగా వేరే చోటికి వెళ్లిపోవడం, ఒకటి కంటే ఎక్కువ ఓట్లు ఉండటాన్ని గుర్తించి వాటిని తొలగించారు. ఒకే ఇంటి నంబర్‌పై పది మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న కేసులను పరిశీలించడానికి 1.57 లక్షల ఇళ్లకు ఎన్నికల సిబ్బంది వెళ్లారు. ఇంటింటి సర్వే నిర్వహించి 20 లక్షల ఓట్లను పరిశీలించారు. జీరో ఇంటి నెంబర్‌తో 2.52 లక్షల ఓట్లు ఉండగా వాటిలో 97 శాతం అసలైన చిరునామా నమోదు చేసి సరిదిద్దారు. ఎన్నికల సంఘం ఇంత కచ్చితంగా వ్యవహరించినా రామోజీ కళ్లకు ఇవేవీ కనిపించ లేదు. నామినేషన్ల దాఖలు చివరి రోజు వరకు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అనుమతిస్తామని కేంద్ర ఎన్నికల సంఘం ఒకపక్క చెపుతున్నా.. పదేపదే అదే అబద్ధాన్ని రామోజీ ప్రచారం చేస్తున్నారు.

దొంగ ఓట్లతో గెలిచిన బాబు

2014లో దొంగఓట్లతో గెలిచిన చంద్రబాబు నాయుడు 2019లో కూడా అదే దారిలో వెళ్లి భంగపడ్డారు. సేవామిత్ర యాప్ ద్వారా వైఎస్సార్‌సీపీ మద్దతుదార్ల ఓట్ల తొలగింపునకు కుట్ర పన్నారు. ఇప్పుడు 2024లో కూడా ఇదే విధంగా దొంగ ఓట్లను చేర్పించడానికి తెలుగుదేశం పార్టీ నుంచి భారీ సంఖ్యలో గంపగుత్తగా ఫారం-6లను దాఖలు చేస్తూ పచ్చ మీడియా ద్వారా అధికారపార్టీపై బురద జల్లే ప్రయత్నం చేస్తోంది. రాష్ట్రంలో 99% స్వచ్ఛతతో ఓటర్ల జాబితా తయారు చేయడమే కాకుండా పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటిస్తున్నా రామోజీ పత్రిక మాత్రం ఓటర్ల జాబితాపై పదే పదే తప్పుడు ఆరోపణలతో విషకథనాలను ప్రచురిస్తోంది. 2014 ఎన్నికల నాటికి ఓటర్ల జాబితాలో సుమారు 35 లక్షలకు పైగా దొంగ ఓట్లు ఉన్నట్లు అప్పట్లో ప్రజా సంఘాలు గుర్తించాయి. ఆ ఎన్నికల్లో కేవలం ఐదు లక్షల ఓట్ల తేడాతో టీడీపీ అధికారంలోకి రావడానికి కూడా అదే కారణమని తేల్చాయి.

వికేంద్రీకరణకు మోదీ అనుకూలం



రిలే దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ: కూటమి సభకు వచ్చిన ప్రధాని మోదీ అమరావతిపై పెదవి విప్పక పోవడం.. పాలనా వికేంద్రీకరణకు పచ్చజెండా ఊపడమేనని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1,268వ రోజుకు చేరుకున్నాయి. పలువురు మాట్లాడుతూ.. కులవాదులు అమరావతి అని చెబుతున్న భ్రమరావతిలో జరిగిన అవినీతిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నివేదికలు ప్రధాని దృష్టిలో ఉన్నాయి కనుకనే ప్రధాని మారు మాట్లాడకుండా వెళ్లారన్నారు. మూడు రాజధానుల అజెండాతో ఎన్నికలకు వెళుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు మద్దతుగా ఉన్నారని, సిద్ధం సభల సాక్షిగా తేటతెల్లమైందని, కూటమి సభల పేరుతో ప్రజలను మోసం చేయాలని చూసిన బాబుకు ప్రజా స్పందన కరువైందని చెప్పారు. మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, పెద్దింటి విజయ్, నూతక్కి జోషి, బోడ ప్రేమ్, నలుగుర్తి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మరి కొంతకాలం
ఈవీలకు ఊరట

▶ మొదటి పేజీ తరువాయి

టూ వీలర్లకు కిలోవాట్‌కు రూ. 10 వేలు చొప్పున గరిష్ఠంగా రూ. 25 వేలు, త్రీ వీలర్లకు రూ. 50 వేల వరకూ ప్రయోజనం చేకూరనుంది. విద్యుత్ వాహనాల కోసం కేంద్రం ఫాస్టర్ అడాప్షన్ అండ్ మాన్యుఫాక్చరింగ్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికల్స్ (ఎఫ్ఏఎంఈ) పథకాన్ని 2019లో తీసుకువచ్చింది. నిజానికి ఈవీలపై ప్రోత్సాహకాలను కేంద్రం తగ్గిస్తూ వస్తోంది. గతేడాది మే వరకూ 15 శాతం నుంచి 40 శాతం వరకూ సబ్సిడీ ఇచ్చేది. జూన్ తర్వాత వాహన ధరలో కేవలం 15 శాతం గానీ లేదా కిలోవాట్ హవర్ (కెడబ్ల్యూహెచ్)కు రూ. 10 వేలుగానీ ఏది తక్కువైతే అది మాత్రమే సబ్సిడీ ఇవ్వడం ప్రారంభించారు. రానున్న మూడేళ్లలో 1 మిలియన్ ఈవీ అమ్మకాల లక్ష్యాన్ని చేరుకోనున్నామని, ఆ తర్వాత సబ్సిడీని కొనసాగించలేమని కూడా కేంద్రం తేల్చేసింది.

ఆదర్శంగా ఏపీ 'ఈవీ' ప్రోత్సాహం

మన రాష్ట్రం ఎలక్ట్రిక్ వెహికల్స్‌ను ప్రోత్సహించడానికి ప్రత్యేక విధివిధానాలను రూపొందించింది. అవి దేశ వ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యుత్ వాహనాలకు ఏపీ అందిస్తున్న తోడ్పాటు భేష్ అని ఇండియా ఎలక్ట్రిక్ వెహికల్ మార్కెట్ రౌండప్ 2023 నివేదిక కొనియాడింది. 2030 నాటికి 30 శాతం ఈవీ కార్లు, 80 శాతం ఈవీ టూ వీలర్లు, 70 శాతం ఈవీ కమర్షియల్ వెహికల్స్ ప్రవేశపెట్టాలని కేంద్రం లక్ష్యంగా నిర్దేశించింది. ఇందుకు తోడ్పాటునందిస్తున్న నాలుగు రాష్ట్రాల్లో ఏపీ ముందు వరుసలో ఉందని నివేదిక తెలిపింది. 2030 నాటికి మొత్తం పెట్రోల్, డీజిల్, గ్యాస్ వాహనాల్లో సగం విద్యుత్ వాహనాలే ఉండాలనే లక్ష్యాన్ని ఏర్పరచుకున్న ఏపీ చొరవను ఆదర్శంగా తీసుకోవాలని ఇతర రాష్ట్రాలకు ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) వంటి కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు సూచించాయి. ఈవీ ప్రమోషన్‌కు వివిధ విధానాల ద్వారా సహకరిస్తూ, ప్రోత్సాహకాలను అందించడంలో ఆంధ్రప్రదేశ్ ముందుందని ఎనర్జీ సొల్యూషన్స్ సంస్థ వెల్లడించింది. కాగా ఏపీలో ప్రస్తుతం దాదాపు 65 వేల విద్యుత్ వాహనాలున్నాయి. భవిష్యత్తులో విద్యుత్ వాహనాల వినియోగం రాష్ట్రంలో భారీగా పెరగనుందని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) అభిప్రాయపడింది. 2034 నాటికి దాదాపు 10.56 లక్షల వాహనాలు రాష్ట్ర రోడ్లపై తిరిగే అవకాశం ఉందని, వీటన్నిటి కోసం 677 మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరం అవుతుందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ప్రణాళిక (ఏపీ స్టేట్ ఎలక్ట్రిసిటీ ప్లాన్)లో వెల్లడించింది. దీనికి తగ్గట్టు రాష్ట్ర ప్రభుత్వం వివిధ ప్రాంతాల్లో సుమారు 400 ఈవీ ఛార్జింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేస్తోంది. రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు వంటి ప్రయోజనాలను కల్పిస్తోంది. లక్ష మంది ఉద్యోగులకు ఈవీలను వాయిదా పద్ధతిలో ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళిక రచించింది.



రాష్ట్రంలో 2024 నుంచి 2034 వరకూ విద్యుత్ వాహనాల పెరుగుదల (అంచనా) ఇలా..

ఏడాది	2 చక్రాలు	3 చక్రాలు	4 చక్రాలు	గూడ్స్	బస్సు	మొత్తం
2024	52,334	6,951	9,318	239	133	68,975
2025	80,386	9,664	11,845	379	178	1,02,469
2026	1,23,474	13,435	15,056	661	238	1,52,864
2027	1,89,658	18,677	19,138	1,101	319	2,28,893
2028	2,91,317	25,965	24,327	1,834	427	3,43,871
2029	4,47,468	36,097	30,923	2,054	572	5,18,114
2030	6,87,318	50,184	39,307	5,086	766	7,82,660
2031	7,38,550	53,924	44,269	5,833	882	8,43,459
2032	7,93,602	57,944	49,858	6,691	1,016	9,09,111
2033	8,52,757	62,263	56,153	7,674	1,170	9,80,017
2034	9,16,322	66,904	63,242	8,802	1,348	10,56,617

పోలింగ్ శాతం పెంచండి

▶ మొదటి పేజీ తరువాయి

తక్కువ శాతం పోలింగ్ నమోదైన పోలింగ్ కేంద్రాలు, అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలను గుర్తించాలని సూచించింది. తక్కువ శాతం పోలింగ్ నమోదవడానికి కారణాలను విశ్లేషించి పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల భాగస్వామ్యం పెంచేలా చర్యలను చేపట్టాలని సూచించింది. అలాగే, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్లు, నిరాశ్రయులైన వివిధ అట్టడుగు వర్గాలు, సంచార సమూహాలు, సెక్స్ వర్కర్లు, క్లిష్ట పరిస్థితుల్లోని మహిళలు మొదలైన వారిని గుర్తించి వారందరినీ పోలింగ్‌లో భాగస్వామ్యం చేయడానికి అట్టడుగుస్థాయి నుంచి చర్యలు చేపట్టాలని తెలిపింది. ఇందుకోసం క్షేత్రస్థాయి నుంచి ప్రణాళికలను అమలుచేయాల్సిందిగా సీఈఓలు, డీఈఓలను కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఏ ఒక్క ఓటరును వదిలేయకూడదనే లక్ష్యంగా చర్యలు ఉండాలని స్పష్టంచేసింది. ఇందుకోసం ఎన్నికలను ప్రజాస్వామ్యంలో అతిపెద్ద పండుగగా ప్రచారం చేయడంతో పాటు ఒక వ్యక్తి ఓటు వేయడం ద్వారా దేశం గర్విస్తుందనే భావనతో ప్రచారం నిర్వహించాలని కోరింది. ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లో ప్రతీ ఓటరు ఓటు వేసేలా చర్యలు తీసుకోవాల్సిందిగా కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టంచేసింది.

ఈ నినాదాలతో ప్రచారం చేయండి..

ఇక ఓటర్ల భాగస్వామ్యం పెంచడానికి ''చునావ్ కా పర్వ్ దేశ్ కా గర్వ్''.. అలాగే, మొదటిసారి ఓటర్లను పోలింగ్‌లో పాల్గొనేలా ప్రోత్సహించడానికి ''మేరా పెహలే ఓట్ దేశ్‌కే లియే'' నినాదాలతో ప్రచారాలు నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం సూచించింది. ప్రభావితం చేసే వ్యక్తులు, సెలబ్రిటీల ద్వారా ఓటర్లలో అవగాహన కల్పించేందుకు స్మార్ట్ ఫిల్మ్‌ల ద్వారా 'నా ఓటు నా డ్యూటీ' అంటూ కూడా ప్రచారం కల్పించాలని తెలిపింది. ఎన్నికల ప్రక్రియ మరింత సమ్మిళితంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరింది.

రాష్ట్రంలో 83 శాతం పోలింగ్ లక్ష్యం

2019 ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 79 శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి 83 శాతం లక్ష్యంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం చర్యలు చేపడుతోంది. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో 17 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 70 శాతంలోపే పోలింగ్ నమోదైంది. ఇప్పుడు ఆ నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం పెంచేందుకు కసరత్తు చేస్తున్నారు.



2019లో అసెంబ్లీ ఎన్నికల్లో 70 శాతంలోపు పోలింగ్ నమోదైన నియోజకవర్గాలు

నియోజకవర్గం	పోలింగ్ శాతం	నియోజకవర్గం	పోలింగ్ శాతం
విశాఖ వెస్ట్	56.3	రాజమండ్రి సిటీ	65.7
పాడేరు	58.5	విజయవాడ వెస్ట్	65.7
విశాఖ సౌత్	59.5	విజయవాడ సెంట్రల్	65.6
విశాఖ నార్త్	62.4	విజయవాడ ఈస్ట్	67.4
విశాఖ ఈస్ట్	63.2	గుంటూరు వెస్ట్	65.6
గాజువాక	63.7	నెల్లూరు సిటీ	65.8
ఇచ్ఛాపురం	68.0	నెల్లూరు రూరల్	64.5
కాకినాడ సిటీ	66.5	ఆదోని	64.9
		తిరుపతి	66.1

హోం ఓటింగ్‌కు నోటిఫికేషన్

- 85 ఏళ్లు పైబడినవారికి, దివ్యాంగులకు పోస్టల్ బ్యాలెట్

ఇక రాష్ట్రంలో మే 13న జరగనున్న ఎన్నికల్లో 85 పైబడిన వారు, శారీరక వైకల్యం ఉన్న ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ జారీకి కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం నోటిఫికేషన్ జారీచేసింది. అలాగే, కోవిడ్ సోకిన వారికి కూడా పోస్టల్ బ్యాలెట్ జారీకి కూడా మరో నోటిఫికేషన్ జారీచేసింది. రాష్ట్రంలో 85 ఏళ్లు దాటిన ఓటర్లు 2,12,237 మంది ఉన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా హోం ఓటింగ్ అనేది వీరికి ఐచ్ఛికం. పోలింగ్ కేంద్రానికి వచ్చి కూడా ఓటు వేయవచ్చు. ఒకసారి పోస్టల్ బ్యాలెట్ కోసం ఫాం-12 పూరించి రిటర్నింగ్ అధికారికి ఇచ్చాక, ఆయన పోస్టల్ బ్యాలెట్‌కు అనుమతించిన తరువాత అలాంటి వారు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయడానికి అవకాశం ఉండదు. అలాగే, శారీరక వైకల్యం ఉన్న ఓటర్లు కూడా పోస్టల్ బ్యాలెట్ ద్వారా హోం ఓటింగ్‌కు చేసేందుకు అవకాశం ఉంటుంది. శారీరక వైకల్యం నిర్ధారించిన మేరకు ఉంటేనే రిటర్నింగ్ అధికారి పోస్టల్ బ్యాలెట్ జారీకి అనుమతిస్తారు. ఇక పోస్టల్ బ్యాలెట్‌కు అనుమతి పొందిన వారు పోలింగ్ తేదీకి పది రోజుల ముందే వారి ఇంటి వద్దే ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తారు. వీడియోగ్రాఫర్‌తో సహా ఐదుగురు పోలింగ్ సిబ్బంది వారి ఇంటికి వెళ్లి ఓటు వేయిస్తారు. ఆ బ్యాలెట్‌ను రెండు కవర్లలో ఉంచి పోలింగ్ బాక్సులో వేస్తారు.

గ్రామీణ మహిళలను నిత్యం కలుస్తూ వారి సంక్షేమానికి కృషి చేస్తూ పరిష్కారాలను సూచిస్తూ మహిళా రైతుల అభివృద్ధికి చేయూతనిస్తున్నారు **డాక్టర్ రుక్మిణీ రావు.** ఏళ్ల తరబడి సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు ఆమె. దెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్‌గానూ, వందకు పైగా మహిళా రైతు సంఘాలతో కూడిన జాతీయవేదిక మకాం సహ వ్యవస్థాపకులుగానూ ఉన్నారు. నారీ శక్తి పురస్కార గ్రహీత, హైదరాబాద్ వాసి, సామాజిక కార్యకర్త రుక్మిణీరావుతో మాట్లాడినప్పుడు స్త్రీ సంక్షేమానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను ఆమె ఇలా మనముందుంచారు.



అమ్మాయిలను కాపాడుకుందాం...

''ఒక మార్గాన్ని ఎంచుకున్నప్పుడు ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా, ఆపకూడదు, ఆగకూడదు. ఈ రోజుల్లో మన అమ్మాయిలను కాపాడుకోవాల్సిన అవసరం చాలా ఉంది. మేం తెలంగాణలోని నల్లగొండ జిల్లాలో 50 గ్రామాల్లోని 8 నుంచి 17 ఏళ్ల వయసు లోపు అమ్మాయిల సంక్షేమానికి గ్రామ్య రిసోర్స్ సెంటర్‌లో భాగంగా వర్క్ చేస్తున్నాం. మహిళల సంక్షేమానికి కృషి చేద్దామని చేసిన ప్రయత్నంలో ఎన్నో సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఇటీవల 15-16 ఏళ్ల లోపు అమ్మాయిలు తెలిసిన, తెలియని అబ్బాయిల మాటలు నమ్మి ఇల్లు వదిలి వెళ్లిన ఘటనలను ఎక్కువ చూస్తున్నాం. దీంతో స్కూల్ నుంచి డ్రాపౌట్ అయిన వాళ్లకు, ఇల్లు వదిలి బయటకు వెళ్లిన వాళ్లను తిరిగి వచ్చేలా, కౌన్సెలింగ్స్ చేస్తున్నాం. ఇద్దరు చిన్నపిల్లలను వారి తల్లిదండ్రులు అమ్మడం గురించి తెలిసి మా స్నేహితురాలు జమునతో కలిసి నేనూ అక్కడకు వెళ్లాను. ఆ అమ్మకం కార్యక్రమాన్ని అడ్డుకుని, వారికి సహాయం చేయాలనుకున్నప్పుడు 'గ్రామ్య రిసోర్స్ సెంటర్ ఫర్ ఉమెన్'ని ప్రారంభించాం. ఈ సంస్థకు 30 ఏళ్లు పూర్తయ్యాయి. ఆరు మండలాల్లో దాదాపు 800 మంది మహిళలు తమ జీవనోపాధిని మెరుగుపరచుకోవడానికి, ఆడపిల్లల పట్ల వారి వైఖరిని పునరాలోచించడానికి వర్క్ చేస్తున్నాం. ఏళ్లుగా ఆడ శిశు హత్యలతో పాటు అంతర్జాతీయ దత్తత ద్వారా కూడా ఆడపిల్లల అక్రమ రవాణాకు విస్తృతమైన నెట్‌వర్క్ ఉందని కనుక్కొన్నాం. ప్రచార పద్ధతిలో పని చేస్తూ, అనేక అక్రమ దత్తత కేంద్రాలను మూసివేయించాం.

వివక్ష లేని చోట పెంపకం

నా చిన్నతనంలో మా అమ్మమ్మ, అమ్మ, అత్తల మధ్య పెరిగాను. ఆ విధంగా ఇంటిని నడిపే సమర్థ మహిళల గురించి నాకు తెలుసు. మా ఇంట్లో అబ్బాయిలు, అమ్మాయిలు అనే వివక్ష ఉండేది కాదు. నేను బాగా చదువుకోవాలన్నది అమ్మ ఆలోచన. ఉస్మానియా యూనివర్శిటీ ఆర్ట్స్ కాలేజీ నుండి సైకాలజీలో మాస్టర్స్ పూర్తి చేశాను. చదువు చెప్పాలనే ఆలోచనతో హైదరాబాద్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్ ఫర్ ఉమెన్‌లో టీచింగ్ చేశాను. ఆ తర్వాత ఢిల్లీలో సైకాలజీలో పీహెచ్‌డీ చేశాను. 1970 - 1980ల మధ్య వరకు ఢిల్లీలోని నేషనల్ లేబర్ ఇన్‌స్టిట్యూట్, పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ సెంటర్ ఫర్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్‌లో కెరియర్ స్టార్ట్ చేశాను. అప్పుడే జీవితం ఒక మలుపు తీసుకుందనిపిస్తుంది. వరకట్న మరణాలు తీవ్ర సమస్యగా ఉన్న రోజులవి. ఇది సమాజానికే అనారోగ్యం అనిపించేది. మా స్నేహితులతో కలిసి ఎడతెగని చర్చలు జరిపేవాళ్లం. వరకట్న వ్యతిరేక ప్రదర్శనలలో విస్తృతంగా పాల్గొన్నాం. అప్పుడు 1981లో మహిళల కోసం 'సహేలీ రిసోర్స్' సెంటర్‌ను ఏర్పాటు చేశాం. అక్కణ్ణుంచి ఈ మార్గంలో ఏళ్లుగా ప్రయాణిస్తున్నాను. నాతో పాటు ఎన్నో అడుగులు తోడయ్యాయి. సేవా కార్యక్రమాలు చేసేవారితో నేనూ కలుస్తున్నాను.

సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా...

పదేళ్లక్రితం ఒక విషయం మమ్మల్ని కదిలించింది. కౌమార దశలో గ్రామాల్లో ఉన్న అమ్మాయిలకు సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్ ఇచ్చారు. దానివల్ల వచ్చిన సైడ్ ఎఫెక్ట్స్ మీద ఎవరూ దృష్టి పెట్టలేదు. అక్కడ ఆ అమ్మాయిలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నారో మేం స్వయంగా చూశాం. దీంతో ఇది సరైన పద్ధతి కాదని మా ఇద్దరు ఫ్రెండ్స్‌తో కలిసి సుప్రీం కోర్టులో కేసు వేశాం. విదేశాలలో ఒక వ్యాక్సిన్ గురించి నిర్ణయం తీసుకుంటే వాళ్లు సెంటర్‌ను ఏర్పాటు చేస్తారు. అలాంటిది మన దగ్గర లేదు. ఇప్పుడు వ్యాక్సిన్ ఖరీదు తగ్గిందన్నారు. వ్యాక్సిన్ వేయాలంటున్నారు. డాక్టర్లు చెప్పిన ఆలోచన కూడా బాగుంది. అయితే, ఆ తర్వాత వచ్చే సమస్యల పైన కూడా దృష్టి పెట్టమని, మెడికల్ సిస్టమ్‌ను కరెక్ట్ చేయమని ప్రభుత్వాలను కోరుతున్నాం. అప్పుడే, ఈ డ్రైవ్‌ను ముందుకు తీసుకెళితే బాగుంటుంది'' అని తన అభిప్రాయలను వెలిబుచ్చారు రుక్మిణీరావు.

– నిర్మలా రెడ్డి

ఫొటో: అనిల్ కుమార్ మోర్ల

గ్రామీణ మహిళలతో కలిసి...

1989లో ఢిల్లీ నుంచి తిరిగి హైదరాబాద్‌కు వచ్చేశాను. పుట్టిపెరిగిన ప్రాంతం, పరిచయమున్న సాంస్కృతిక నేపథ్యంలో సమర్థంగా పని చేయగలనని భావించాను. న్యాయం కోసం కోర్టులకు వచ్చే మధ్యతరగతి మహిళలకు సహాయం చేయడం ప్రారంభించాం. వారి స్థితి చూశాక ఇంకా ఎంతో చేయాల్సింది ఉందనిపించింది. అక్కణ్ణుంచి గ్రామీణ మహిళల సంక్షేమానికి శ్రద్ధ వహించాల్సిన అవసరం గుర్తించి అటువైపుగా అడుగులు వేశాం. 30 ఏళ్లుగా మహిళా రైతుల హక్కులను ప్రోత్సహించడానికి డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీతో కలిసి పనిచేస్తున్నాను. సంస్థలో మహిళా నాయకత్వాన్ని అభివృద్ధి చేయడం, వర్క్‌షాప్‌ల నిర్వహణ ముఖ్యంగా తీసుకున్నాను. సొసైటీలో డైరెక్టర్, బోర్డ్ మెంబర్‌గా ఉన్నాను. ఇవి కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న మహిళా రైతులతో 'మకాం' అనే వేదిక ద్వారా విస్తృత కార్యక్రమాలు చేస్తున్నాం. రైతు అనగానే ట్రాక్టర్ పైన మగవాళ్లు ఉండటమే కనిపిస్తుంది. కానీ, ఇప్పుడు ఆడవాళ్లు కూడా ట్రాక్టర్లు నడపడం, వ్యవసాయం, ఆహార ఉత్పత్తుల తయారీలో అగ్రభాగాన ఉండేలా కృషి చేస్తున్నాం. ఒంటరి మహిళల కోసం సమాఖ్యను ఏర్పాటు చేశాం. ఇందులో సంఘాలున్నాయి. తెలంగాణలోని 10 జిల్లాల నుంచి కో ఆర్డినేషన్ చేస్తున్నాం. లెప్రసీ వ్యాధి అనేది దాదాపుగా కనుమరుగైందని అంతా అనుకుంటున్నారు. కానీ, లెప్రసీతో బాధపడుతున్న వారిని మేం గుర్తించాం. ఈ వ్యాధి ముదరకుండా ముందస్తు నివారణకు సాయం అందిస్తున్నాం.

న్యూస్‌మేకర్

ఆరు భాషలు నిలబెట్టాయి

భాష విజయానికి సాధనం. రాజకీయాల్లో భాషతో ఆకర్షించేవారు వేగంగా పైమెట్టు మీదకు చేరుతారు. అయితే ఆ రంగంలో బహుభాషలతో ఆకట్టుకునే మహిళలు తక్కువ. కాని సామాన్య టీచరైన ఎం.ఎల్.అశ్విని తనకు వచ్చిన ఆరు భాషల వల్ల జన సామాన్యంలో చొచ్చుకుపోతూ బిజెపి అధినాయకత్వాన్ని మెప్పించింది. కేరళలో మహామహులు పోటీపడిన కాసర్‌గోడ్ పార్లమెంట్ స్థానానికి పార్టీ ఆమెను నిలబెట్టింది. అశ్విని పరిచయం.



రాబోయే పార్లమెంట్ ఎన్నికల కోసం బిజెపి విడుదల చేసిన కేరళ అభ్యర్థుల్లో కాసరగోడ్ అభ్యర్థి పేరు చూసి అందరూ ఆశ్చర్యపోయారు. ఎందుకంటే ఆ అభ్యర్థి పూర్వాశ్రమంలో ఒక మామూలు స్కూల్ టీచర్. ఆ తర్వాత ఆమె ఉంటున్న ఊరు మంజేశ్వరకు కేవలం బ్లాక్ పంచాయతీ మెంబర్. పార్టీలో కేవలం మహిళా మోర్చా జాతీయస్థాయి సభ్యురాలు. అయినా సరే ఆమెకే పార్టీ అధిష్ఠానం సీటు ఇచ్చింది. దానికి కారణం ఆమెకు తెలిసిన ఆరు భాషలు. మలయాళం, కన్నడం, తమిళం, తుళు, హిందీ, ఇంగ్లిష్. ఆమె పేరు ఎం.ఎల్.అశ్విని.

భాషతో గెలిచింది

కాసరగోడ మంగుళూరుకు దగ్గరగా ఉంటుంది. కన్నడిగులు కూడా ఇక్కడ ఉంటారు. బెంగళూరులో పుట్టి పెరిగిన ఎం.ఎల్.అశ్విని కాసరగోడకు కోడలుగా వచ్చింది. 'బెంగళూరు మెట్రోపాలిటిన్ సిటీ. అన్నిభాషల వారూ ఉంటారు. నాకు భాషలు నేర్చుకోవడం ఇష్టం. చిన్నప్పుడే ఇంగ్లిష్ మీద పట్టు వచ్చింది. కన్నడ నా మాతృభాష. నా చుట్టుపక్కల తుళు కుటుంబాలు ఉండేవి. వారి నుంచి తుళు నేర్చుకున్నాను. తమిళం కూడా బెంగళూరులోనే నేర్చుకున్నాను. కాసరగోడ వచ్చాక మలయాళం చాలా సులువుగా నేర్చుకున్నాను. హిందీ బాగా తెలుసు. ఇలా ఆరు భాషల్లో నేను అనర్గళంగా మాట్లాడగలను' అంటుందామె. ఇంట్లో కూడా ఆమె తన భాషలను సాధన చేస్తానని చెప్పింది. 'నేను నా భర్తతో తుళులో మాట్లాడతాను. నా భర్త, కొడుకు మలయాళంలో మాట్లాడుకుంటారు. మా అమ్మాయి నేను కన్నడంలో మాట్లాడుకుంటాం. ఇలా అన్ని భాషలు మా ఇంట్లో వినిపిస్తూనే ఉంటాయి' అంటుందామె. ఇన్ని భాషలు రావడం ఆమెకు మేలు చేసింది.

ఢిల్లీ వెళ్లాక

జాతీయ పార్టీలో ఢిల్లీలో కేంద్ర స్థానంలో ఉంటాయి. స్కూలు టీచర్ ఉద్యోగం మానేసి బి.జె.పిలో చేరాక ఆమెకు మహిళా మోర్చాలో నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పార్టీ స్థానం ఇచ్చింది. అంతే కాదు ఢిల్లీ కేంద్రంగా దాదాపు 10 రాష్ట్రాలలో మహిళా మోర్చా సభ్యులతో కార్యకలాపాలు బలపరచడానికి ఆమెకు బాధ్యత అప్పగించింది. 'ఢిల్లీలో జాతీయ స్థాయి నాయకులు హిందీలోకాని, ఇంగ్లిష్‌లో కాని మాట్లాడటం సౌకర్యంగా భావిస్తారు. కేరళ నుంచి వచ్చిన నాయకులు మలయాళం లేదా తమిళం వంటి భాషలు అనర్గళంగా మాట్లాడతారుకాని ఇంగ్లిష్, హిందీ పూర్తిగా రావు. నాకు రావడం లాభించింది' అంటుంది అశ్విని. మహిళా మోర్చా తరఫున జమ్ము కశ్మీర్‌తో మొదలు ఉత్తరప్రదేశ్, అస్సాం వరకు ఆమె పని చేసినప్పుడు దిగువ శ్రేణి కార్యకర్తలతో వాళ్లకు తెలిసిన భాషల్లో మాట్లాడుతూ సులువుగా కలిసిపోవడం పార్టీ గమనించింది. కాసరగోడ్‌లో ఉన్న కన్నడ, మలయాళ, తమిళ భాషీయులతో ఆమె భాషలతో చొచ్చుకుపోవడం పార్టీ దృష్టికి వచ్చింది. అందుకే జిల్లా అధ్యక్షుడు రావిష్ తంత్రి, జాతీయ ప్రతినిధీ సీనియర్ నేత అయిన పి.కె.కృష్ణదాస్‌ను కాదని పార్టీ అశ్వినికి సీటు ఇచ్చింది.

భాష గొప్ప సాధనం:

'విజయానికి భాష గొప్ప సాధనం' అంటుంది అశ్విని. 'రాజకీయాలలో ప్రజలకు తెలిసిన భాషలో మంచి ఉపన్యాసం ఇవ్వగలిగిన వారికి ఎక్కువ ఆకర్షణ ఉంటుంది. నేను ఏ భాషలో అయినా మంచి ఉపన్యాసం ఇవ్వగలను. అందుకే నాకు ఈ అవకాశం దక్కింది. భాషలు ఎన్ని తెలిస్తే అంత మంచిది' అందామె.

2019 పార్లమెంట్ ఎన్నికల్లో కాసరగోడ్‌లో బి.జె.పి మూడో స్థానంలో నిలిచింది. ఈసారి ఏమవుతుందో చూద్దాం.

సాగుబడి
ఉత్తరాభాద్ర కార్తె: మార్చి 30 వరకు

కరువును తట్టుకున్న పంటలు!



పొలంలో ఆదిలక్ష్మి

ఏపీ రైతు సాధికార సంస్థ (ఆర్‌వైఎస్‌ఎస్) మద్దతుతో ఆంధ్ర ప్రదేశ్ ప్రకృతి వ్యవసాయంలో ఒక సరికొత్త ప్రయోగం ప్రారంభమైంది. కరువును తట్టుకునే ప్రత్యేక పద్ధతి (డ్రాట్ ప్రూఫింగ్ మోడల్)లో పంటలు సాగు జరుగుతోంది. వర్షాలు తక్కువగా ఉన్నప్పటికీ, బీడు భూముల్లో కూడా ప్రత్యేక పద్ధతులను అనుసరిస్తూ ప్రకృతి వ్యవసాయం చేయవచ్చని పలువురు చిన్న, సన్నకారు రైతులు నిరూపిస్తున్నారు. పొలం మొత్తాన్నీ దుక్కి చేయకుండా.. ప్రతి 3 అడుగుల దూరంలో ఒక అడుగు భూమిని తవ్వి 5 రకాల పంట విత్తనాలను విత్తుతున్నారు. 2023 ఆగస్టులో ప్రారంభమైన ఈ సరికొత్త పద్ధతిలో అనేక జిల్లాలకు చెందిన 56 మంది రైతులు 20 సెంట్ల నుంచి ఎకరా విస్తీర్ణంలో డ్రాట్ ప్రూఫ్ సాగు చేస్తున్నారు. ఇద్దరు రైతుల అనుభవాలతో కూడిన కథనం..

- ప్రకృతి వ్యవసాయంలో సరికొత్త ప్రయోగం
- బీడు భూములనూ సాగులోకి తెచ్చే వినూత్న పద్ధతి
- పొలం అంతా దున్నకుండా ప్రతి 3 అడుగులకు ఒక అడుగు విస్తీర్ణంలో తవ్వి 5 రకాల పంటల సాగు
- ఏపీ రైతు సాధికార సమితి ఆధ్వర్యంలో సాగు చేస్తున్న 56 మంది చిన్న, సన్నకారు రైతులు

కాలువ రాకపోయినా పంట వచ్చింది

రైతు ఆదిలక్ష్మి ఇలా చెప్పారు.. ''మాకు అరెకరం పొలం ఉంది. ఇక్కడ అందరూ మిరపే వేస్తారు. మేమూ మిరపే వేసేవాళ్లం. రెండేళ్ల నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాం. మిరపలో అంతరపంటలు కూడా సాగు చేశాం. సాగర్ కాలువ నుంచి ఇంజన్‌తో తోడుకొని తడి పెట్టేవాళ్లం. గత ఏడాది 7 క్వింటాళ్ల ఎండు మిరప పండింది. రూ. 50 వేల నికారాదాయం వచ్చింది. వర్షాలు లేక ఈ సంవత్సరం కాలువ ఒక్కసారే వచ్చింది. అందుకని మిరప వేయలేదు. ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారుల సూచన మేరకు.. కరువును తట్టుకొని పండే డ్రాట్ ప్రూఫ్ మోడల్‌లో పంటలు పెట్టాం. ఈ పంటలకు ముందు మేలో నవధాన్య (ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్) పంటలు చల్లాం. వర్షం లేక సరిగ్గా మొలవలేదు. మళ్లీ జూలైలో వేశాం. వర్షానికి మొలిచింది. పెరిగినాక కోసి, గొడ్లకు మేతగా వాడుకున్నాం. వరుసగా మూడేళ్లుగా నవధాన్య పంటలు వేయటం వల్ల ఉపయోగం ఏమిటంటే.. భూమి బాగా గుల్లబారింది. నవధాన్య పంటలు వేయని పక్క పొలంలోకి వెళ్లి మట్టి చేత్తో తీయాలంటే చాలా కష్టపడాలి. మా పొలంలో సులువుగానే మట్టి తీయొచ్చు.


పొలం దున్నకుండానే, 3 అడుగులకు ఒక చోట అడుగు నేలను గుల్లగా తవ్వి, గత ఏడాది అక్టోబర్ 27న 5 రకాల విత్తనాలు నాటుకున్నాం. ప్రధాన పంటగా మధ్యలో ఆముదం లేదా కందిని నాటాం. దానికి నాలుగు వైపులా చిక్కుడు, అలసంద, అనుములు, సజ్జలు విత్తుకున్నాం. బీజామృతంతో విత్తన శుద్ధి చేసి, విత్తన గుళికలు తయారు చేసుకొని నాటుకున్నాం. సీడ్ పెల్లటైజేషన్ చేయటం వల్ల భూమిలో విత్తుకున్న తర్వాత మొలక శాతం బాగుంటుంది. ఒకవేళ వర్షం రాకపోయినా లేదా మనం నీళ్లు పెట్టటం లేటైనా ఆ విత్తనం చెడిపోకుండా ఉంటుందని పెల్లటైజేషన్ చేశాం. విత్తనం పెట్టిన కొద్ది రోజులకు తుపాను వానకు విత్తనాలు మొలిచాయి. విత్తనం పెట్టేటప్పుడు అరెకరంలో 200 కిలోల ఘనజీవామృతం వేశాం. రెండుసార్లు ద్రవ జీవామృతం పిచికారీ చేశాం. తర్వాత మరో రెండు సార్లు వాన వచ్చింది. అదే వాన సరిపోయింది.

మిరపకు ఈ పంటలకు చాలా తేడా ఉంది. మిరపకు రెండు రోజులు నీరు లేకపోతే వడపడి పోయి ఎండిపోతుంది. డ్రాట్ ప్రూఫ్ మోడల్‌లో పంటలు అలా కాదు. నీరు లేకపోయినా చాలా వరకు జీవ కళ ఉంటుంది. అదీకాక, మేం చేసిన విత్తన గుళికలుగా చేసి వేసినందు వల్ల, భూమిలో వేసిన ఘనజీవామృతం వల్ల, ద్రవ జీవామృతం పిచికారీ వల్ల పంటలు ఎదిగాయి. ప్రధాన పంటతో పాటు పెట్టిన అనుములు, చిక్కుళ్ల వల్ల ఉపయోగం ఏమిటంటే.. ఈ తీగలు పాకి నేలపై ఎండపడకుండా కప్పి ఉంచి కాపాడటం, భూమిలో తేమ ఆరిపోకుండా కాపాడింది. సజ్జ ద్వారా రూ. 8,000లు వచ్చాయి. సజ్జ ఇంకా తీయాల్సి ఉంది. చిక్కుళ్లు,సొర కాయలు, దోసకాయల ద్వారా మరో ఆరేడు వేలు ఆదాయం వచ్చింది. సజ్జ బాగా పెరగటంతో నీరు లేక కంది సరిగ్గా ఎదగలేదు.

ఇప్పటికి అన్నీ కలిపి రూ. 15 వేల వరకు ఆదాయం వచ్చింది. ఇంకా ఆముదాలు ఒక బస్తా వరకు వస్తాయి. పనులు మేమే చేసుకుంటాం. ఖాళీ ఉన్న రోజుల్లో కూలికి వెళ్తాం. బెట్టను తట్టుకొని పంట పండించుకోవచ్చని, ఎంతో కొంత దిగుబడి వస్తుందని నాకైతే నమ్మకం కుదిరింది..''

- ఎం. ఆదిలక్ష్మి (83091 18867),
ఈపూరు, పల్నాడు జిల్లా

ప్రతి 3 అడుగులకు ఒక అడుగులో పంటలు



బీడులోనూ పంటలు..

కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కపట్రాళ్ళ గ్రామానికి చెందిన రంగస్వామి బిఎస్సీ బీఈడీ చదువుకొని తమ రెండెకరాల్లో ఐదేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ఒక ఎకరంలో సపోట, మామిడి చెట్లు ఉన్నాయి. మరో ఎకరంలో టొమాటో, మిర్చి, వంగ, గోరుచిక్కుడు పంటలను బోరు నీటితో సాగు చేశారు. రెండో పంటగా వేరుశనగ, కంది, ముల్లంగి తదితర పంటలు వేశారు. రెండెకరాల్లో సగటున ఏడాదికి రూ. లక్షా 70 వేల వరకు నికరాదాయం పొందుతున్నట్లు తెలిపారు. సపోట, మామిడి తోటలో మూడు ఏళ్లుగా దుక్కి చేయని 30 సెంట్ల విస్తీర్ణంలో డ్రాట్ ప్రూఫింగ్ మోడల్‌లో 2023 డిసెంబర్‌లో ప్రయోగాత్మకంగా సజ్జ, గోరు చిక్కుడు, అనుములు , అలసంద, కంది, ఆముదం పంటలను సాగు చేశారు. 3 అడుగుల దూరంలో ఒక అడుగు విస్తీర్ణంలో తవ్వి, ఘనజీవామృతం వేసి విత్తనాలు విత్తారు. మామిడి ఆకులతో ఆచ్ఛాదన చేశారు. వారానికోసారి బక్కెట్లతో పాదికి 2,3 లీటర్ల నీరు పోశారు. మూడు నెలల వ్యవధిలో అలసంద, అనుములు అమ్మితే రూ. 2 వేల దాకా ఆదాయం వచ్చింది. పశుగ్రాసం రూపంలో మరో రూ. 3 వేల ఆదాయం వచ్చింది. రూ. 2 వేల గోరుచిక్కుళ్లు పండాయి. తమ ఇంటి కోసం, బంధువులకు వినియోగించారు. సజ్జ పక్షులు తిన్నాయి. కంది, ఆముదం పంటలు కోయాల్సి ఉంది. పంటలకు నీరు పోస్తున్నందున మొక్కల మధ్యన 3 అడుగుల ఖాళీలో గడ్డి పెరుగుతోంది. ఆ గడ్డిని కోసి ఆవులు, గేదెలకు వేస్తున్నారు. డ్రాట్ ప్రూఫింగ్ మోడల్ పంటలతో వదిలేసిన భూమిని దుక్కి చేయకుండానే.. పంటలు పెట్టుకునే చోట తవ్వి విత్తనాలు పెట్టుకొని తిరిగి సాగులోకి తెచ్చుకోవచ్చని, ఎంతో కొంత పంట దిగుబడి తీసుకోవచ్చని రంగస్వామి అంటున్నారు.

ప్రకృతి వ్యవసాయం వల్ల రంగస్వామి పొలంలో వానపాముల సంఖ్య పెరిగింది. నేల గుల్లబారి మృదువుగా తయారవడంతో వర్షాలు తగ్గినా పంట పెరుగుదల బాగా కనిపిస్తోంది. రంగస్వామి ప్రకృతి వ్యవసాయం చూసి రంగస్వామి (88869 60609) తండ్రి కూడా ప్రకృతి వ్యవసాయం చేపట్టడం విశేషం.



రంగస్వామి

పాలేకర్ ఫుడ్ ఫారెస్ట్‌లో ఎకరానికి రూ. 6 లక్షల ఆదాయం!



పాలేకర్ ఫుడ్ ఫారెస్ట్ ఐదు అంచెల పంటల సాగు నమూనాతో ఎకరానికి ఏటా రూ. 6 లక్షల ఆదాయం సమకూరుతుందని పద్మశ్రీ పురస్కార గ్రహీత డా. సుభాష్ పాలేకర్ 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. గుజరాత్‌లో ఫైవ్ లేయర్ ఫుడ్ ఫారెస్ట్‌లు తన టెక్నాలజీకి నిదర్శనంగా నిలిచాయని, తొలి ఏడాదే రూ. 2 లక్షలు, ఆరో ఏడాది నుంచి రూ. 6 లక్షల ఆదాయం సమకూరుతోందన్నారు. ఆసక్తిగల రైతులు గుజరాత్ వస్తే తానే స్వయంగా చూపిస్తానన్నారు. ఈ నెల 29,30,31 తేదీల్లో అహ్మదాబాద్‌కు 151 కి.మీ. దరంలోని పాలియాడ్ (బోటాడ్ జిల్లా)లోని శ్రీ విషమన్ బాపు ప్యాలెస్ మందిర్‌లో (ఆంగ్లం/ హిందీ) రైతు శిక్షణా శిబిరంలో పాల్గొనే వారికి ఈ ఫుడ్ ఫారెస్ట్‌లను స్వయంగా చూపిస్తానన్నారు. 3 రోజులకు ఫీజు రూ.700. ఇతర వివరాలకు.. ఘనశ్యాం భాయ్ వాల- 63550 77257, కశ్యప్ భాయ్‌చౌహాన్- 85303 13211.

పుట్టగొడుగుల సాగుపై 26 రోజుల ఉచిత శిక్షణ

ఇంటర్/డిప్లొమా దశలో చదువు మధ్యలో ఆపేసిన గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం, 'ఆస్కి' సంయుక్త ఆధ్వర్యంలో మార్చి 21వ తేదీ నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు పుట్టగొడుగుల పెంపకంపై పూర్తిస్థాయి శిక్షణా శిబిరం జరగనుంది. హైదరాబాద్ (రాజేంద్రనగర్‌లోని పిజెటిఎస్ఏయు ఆవరణ) లోని విస్తరణ విద్యా సంస్థలో జరిగే ఈ శిబిరంలో పాల్గొనే వారికి బోధనతో పాటు భోజన, వసతి కూడా పూర్తిగా ఉచితం. చిన్న స్థాయి పుట్టగొడుగుల రైతుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని అంశాలపై నైపుణ్య శిక్షణ ఇస్తారు. 16 ఏళ్లు పైబడిన గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులు అర్హులు. ఇంటర్ ఫస్టియర్ పాస్ లేదా టెన్త్ తర్వాత వ్యవసాయ/ అనుబంధ విభాగాల్లో 3 ఏళ్ల డిప్లొమా మొదటి ఏడాది పూర్తి చేసిన లేదా పదో తరగతి పాసైన తర్వాత కనీసం ఒక ఏడాది పుట్టగొడుగుల పెంపకంలో అనుభవం పొందిన వారు లేదా 8వ తరగతి పాసైన తర్వాత కనీసం 3 ఏళ్లుగా పుట్టగొడుగులు పెంపకం పని చేస్తున్న వారు.. ఈ ఉచిత శిక్షణకు అర్హులు. విద్యార్హత, కుల ధృవీకరణ, ఆధార్, ఫోటో తదితర వివరాలను పొందుపరుస్తూ ఆన్‌లైన్‌లో గూగుల్ ఫామ్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అందుకోసం ఈ క్యూ.ఆర్. కోడ్‌ను స్కాన్ చేయండి. ఇతర వివరాలకు.. 040- 2405368, 98666 18107. eeihyd1962@gmail.com

22 నుంచి దేశీ వరి సాగు, నీటి సంరక్షణపై 'సేవ్' శిక్షణ

విశాఖపట్నం కృష్ణాపురంలోని సింహాచలం దేవస్థానం గోశాల (న్యూ)లో ఈ నెల 22 నుంచి 26 వరకు దేశీ వరి సాగుదారులు, దేశీ వరి బియ్యాన్ని సేకరించి ఆలయాల్లో నైవేద్యాల కోసం అందించే దాతలతో రైతుల ముఖాముఖి పరిచయ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రకృతి వ్యవసాయ సాధకులు, 'సేవ్' సంస్థ నిర్వాహకులు విజయరామ్ తెలిపారు. పాలేకర్ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో దేశీ వరి రకాల సాగు, ఉద్యాన పంటల 5 లేయర్ సాగు, వాననీటి సంరక్షణకు ఇంకుడు గుంతల తవ్వకంపై రైతులకు శిక్షణ ఇస్తామన్నారు. పెళ్లిళ్లలో ఔషధ గుణాలు గల సంప్రదాయ వంటకాలు వడ్డించే ఆసక్తి గల వారికి ఆ వంటకాలను కూడా ఈ శిబిరంలో పరిచయం చేస్తామన్నారు. 'శబలా భోజన పండుగ' పేరిట నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలన్నీ ఐదు రోజులూ జరుగుతాయని, ఆసక్తిగల వారు ఏదో ఒక రోజు హాజరైతే చాలని విజయరామ్ తెలిపారు. వివరాలకు.. సేవ్ కార్యాలయం 63091 11427, సురేంద్ర 99491 90769.

29 నుంచి సేవాగ్రామ్‌లో జాతీయ విత్తనోత్సవం

వాతావరణ మార్పుల్ని తట్టుకునే శక్తి దేశీ వంగడాలకే ఉందనే నినాదంతో ఈ నెల 29 నుంచి 31 వరకు మహారాష్ట్ర వార్ధా జిల్లా సేవాగ్రామ్‌లోని నాయ్ తాలిమ్ సమితి పరిసర్‌లో వార్షిక జాతీయ విత్తనోత్సవం జరగనుంది. దేశం నలుమూలల నుంచి అనేక పంటల దేశీ వంగడాల ప్రదర్శన, అమ్మకంతో పాటు సేంద్రియ రైతుల సదస్సులు, క్షేత్ర సందర్శనలు, నిపుణులతో ముఖాముఖి వంటి కార్యక్రమాలను నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు. ముందస్తు రిజిస్ట్రేషన్ తప్పనిసరి. రుసుము రూ. వెయ్యి. వివరాలకు.. యుగంధర భోజె – 91302 17662, ప్రతాప్ మరోడె – 75888 46544.



ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్ టోర్నీ చాంపియన్స్ అల్‌కరాజ్, స్వియాటెక్

ప్రతిష్టాత్మక ఇండియన్ వెల్స్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్–1000 టోర్నీలో పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్) టైటిల్ నిలబెట్టుకోగా... మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) రెండోసారి విజేతగా నిలిచింది. కాలిఫోర్నియాలో జరిగిన ఫైనల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ అల్‌కరాజ్ 7–6 (7/5), 6–1తో ప్రపంచ నాలుగో ర్యాంకర్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా)ను ఓడించగా... స్వియాటెక్ 6–4, 6–0తో మరియా సాకరి (గ్రీస్)పై గెలిచింది. 2016లో జొకోవిచ్ తర్వాత ఇండియన్ వెల్స్ టోర్నీని వరుసగా రెండేళ్లు సాధించిన ప్లేయర్‌గా అల్‌కరాజ్ నిలిచాడు. అల్‌కరాజ్ కెరీర్‌లో ఇది ఐదో మాస్టర్స్ సిరీస్ టైటిల్. విజేతలుగా నిలిచిన అల్‌కరాజ్‌కు 11 లక్షల డాలర్ల (రూ. 9 కోట్ల 11 లక్షలు) ప్రైజ్‌మనీ, 1000 ర్యాంకింగ్ పాయింట్లు... స్వియాటెక్‌కు 11 లక్షల డాలర్ల (రూ. 9 కోట్ల 11 లక్షలు) ప్రైజ్‌మనీ, 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



'సూరీడు' నిప్పులు చెరిగేదెప్పుడు?

- నిలకడలేమితో సన్‌రైజర్స్ హైదరాబాద్
- ఈసారి కొత్త కెప్టెన్, కొత్త హెడ్ కోచ్ ఆధ్వర్యంలో బరిలోకి

మరో 3 రోజుల్లో ఐపీఎల్

ఎనిమిది, ఎనిమిది, పది... గత మూడు ఐపీఎల్ సీజన్‌ల పాయింట్ల పట్టికలో వరుసగా సన్‌రైజర్స్ హైదరాబాద్ స్థానాలు ఇవి! 2023లోనైతే మరీ ఘోరంగా టీమ్ నాలుగే విజయాలు సాధించింది. 2020లో డేవిడ్ వార్నర్ సారథ్యంలో మూడో స్థానంలో నిలిచిన తర్వాత జట్టు మళ్లీ కోలుకోలేదు. తర్వాతి ఏడాది విభేదాలతో వార్నర్‌ను ఎనిమిది మ్యాచ్‌లకే పరిమితం చేసిన టీమ్ మేనేజ్‌మెంట్ ఆ తర్వాత ఎన్ని ప్రయోగాలు చేసినా ఏవీ కలిసి రాలేదు. విదేశీ ఆటగాళ్లు అక్కడక్కడా మెరవడం మినహా భారత క్రికెటర్లు ఎవరూ జట్టును గెలిపించలేకపోతున్నారు. అభిమానుల కోణంలో అయితే వారంతా అపరిచితుల్లా కనిపిస్తున్నారు. లీగ్‌లో ప్రతీ టీమ్ ఏదో ఒక దశలో విధ్వంసక ఆటతీరుతో అందరి దృష్టినీ ఆకర్షిస్తుండగా సన్‌రైజర్స్ మాత్రం పాతకాలపు ఆటతోనే నడిపిస్తోంది. విదేశీ ఆటగాళ్లు కూడా తమపై ఉన్న అంచనాలు, ఒత్తిడిని అధిగమించి ఏ మేరకు రాణిస్తారనేది చెప్పలేం. ఈ నేపథ్యంలో మరో సీజన్‌కు జట్టు సిద్ధమైంది. వన్డే వరల్డ్ కప్ విన్నింగ్ కెప్టెన్ కమిన్స్ సారథ్యంలో, కొత్త హెడ్ కోచ్ డానియల్ వెటోరి పర్యవేక్షణలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్న సన్‌రైజర్స్ టోర్నీలో ఎంత దూరం వెళుతుందనేది ఆసక్తికరం.

సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యానికే చెందిన సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ సౌతాఫ్రికా టి20 టోర్నీలో వరుసగా రెండేళ్లు టైటిల్స్ సాధించింది. ఈ రెండు సార్లూ కెప్టెన్ ఎయిడెన్ మార్క్‌రమ్ జట్టును విజేతగా నిలిపాడు. అయినా సరే అతడిని కాదంటూ ఆస్ట్రేలియా స్టార్ ప్యాట్ కమిన్స్‌ను రైజర్స్ ఈసారి కొత్త కెప్టెన్‌గా నియమించింది. వేలంలో కమిన్స్‌ను రైజర్స్ రూ. 20 కోట్ల 50 లక్షల భారీ ధరకు కొనుక్కుంది. గత ఏడాది కాలంలో నాయకుడిగా ఆసీస్‌కు అసాధారణ విజయాలు అందించిన కమిన్స్ అగ్రశ్రేణి టి20 లీగ్‌లో ఒక జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడం ఇదే తొలిసారి. అంతర్జాతీయ షెడ్యూల్ కారణంగా కమిన్స్ 2023లో ఐపీఎల్ ఆడలేదు. 2022లో కోల్‌కతా నైట్‌రైడర్స్ తరఫున 5 మ్యాచ్‌లే ఆడిన అతను ఏకంగా 10.68 ఎకానమీతో 7 వికెట్లే తీశాడు. అంతకుముందు సీజన్‌లోనూ 7 మ్యాచ్‌లలో 9 వికెట్లే తీసి భారీగా పరుగులిచ్చాడు. ఓవరాల్‌గా కమిన్స్‌కు టి20ల్లో అంత ఘనమైన రికార్డు ఏమీ లేదు. జట్టులో సమర్థులైన విదేశీ ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నా కూడా కెప్టెన్ హోదాలో కమిన్స్ అన్ని మ్యాచ్‌లు ఆడతాడు. ఇటీవల అతని బౌలింగ్ మెరుగైనా... తీవ్ర ఒత్తిడిలో జట్టుకు మంచి ఫలితాలు అందించడం కీలకం. సన్‌రైజర్స్ తమ తొలి మ్యాచ్‌ను ఈనెల 23న ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో తలపడుతుంది.

విదేశీ బృందం ఇలా...

కమిన్స్‌ను మినహాయిస్తే మరో ముగ్గురు విదేశీయులకే తుది జట్టులో చాన్స్ ఉంది. ఇలాంటి స్థితిలో రైజర్స్ అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లలో ఎవరిని ఎంచుకుంటుందో చూడాలి. బ్యాటర్లలో వరల్డ్‌కప్ 'ఫైనల్ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ట్రవిస్ హెడ్, గత ఏడాది టీమ్ టాప్ స్కోరర్ హెన్రిచ్ క్లాసెన్, దక్షిణాఫ్రికా టి20 కెప్టెన్ మార్క్‌రమ్, దూకుడుగా ఆడగల గ్లెన్ ఫిలిప్స్ అందుబాటులో ఉన్నారు. తాజా ఫామ్, గుర్తింపును బట్టి చూస్తే హెడ్, క్లాసెన్‌లు ఖాయంగా కనిపిస్తున్నారు. అప్పుడు బౌలింగ్‌లో అగ్రశ్రేణి లెగ్ స్పిన్నర్, ఐపీఎల్‌లో మంచి రికార్డు ఉన్న హసరంగకు తుది జట్టులో చోటు ఖాయం. ఆల్‌రౌండర్‌గా మార్కో జాన్సెన్ కూడా సిద్ధంగా ఉన్నా అతడిని ఆడించడం కష్టంగా మారనుంది. బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్ కారణంగా హసరంగ లీగ్ ఆరంభ మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. అప్పుడు జాన్సెన్‌కు అవకాశం లభించవచ్చు.

–సాక్షి క్రీడా విభాగం



కమిన్స్



వెటోరి



ట్రవిస్ హెడ్

జట్టు వివరాలు

కమిన్స్ (కెప్టెన్), మార్క్‌రమ్, ఫిలిప్స్, క్లాసెన్, హెడ్, జాన్సెన్, హసరంగ, ఫజల్ హఖ్ (విదేశీ ఆటగాళ్లు). అబ్దుల్ సమద్, రాహుల్ త్రిపాఠి, మయాంక్ అగర్వాల్, అన్‌మోల్‌ప్రీత్, ఉపేంద్ర యాదవ్, నితీశ్ కుమార్ రెడ్డి, అభిషేక్, వాషింగ్టన్ సుందర్, సన్వీర్ సింగ్, జాతవేద్ సుబ్రహ్మణ్యం, ఆకాశ్ సింగ్, షహబాజ్ అహ్మద్, భువనేశ్వర్, ఉనాద్కట్, నటరాజన్, ఉమ్రాన్, మయాంక్ మర్కండే (భారత ఆటగాళ్లు).



భువనేశ్వర్

మనోళ్లు సత్తా చాటుతారా...

బ్యాటింగ్ కోణంలో భారత ఆటగాళ్లంతా అంతంతమాత్రం ప్రదర్శనే కనబరుస్తున్నారు. ఏదో ఒక మ్యాచ్‌లో మెరుపు ఇన్నింగ్స్ మినహా నిలకడే లేదు. మయాంక్ అగర్వాల్, అభిషేక్ శర్మ, రాహుల్ త్రిపాఠిలలో ఒక్కరు కూడా గత సీజన్‌లో కనీసం 300 పరుగులైనా చేయలేకపోయారు. సమద్, అన్‌మోల్‌ప్రీత్ ప్రభావం చూపలేకపోగా... ఉపేంద్ర, నితీశ్ కుమార్ రెడ్డి, సన్వీర్ ఏమాత్రం ఆడతారో చూడాలి. రెండేళ్ల క్రితమే భారత జట్టుకు దూరమైన భువనేశ్వర్‌పైనే ఇంకా పేస్ బౌలింగ్ భారం ఉంది. ఉమ్రాన్ మాలిక్ తన వేగం మాత్రమే కాక ఇతరత్రా బౌలింగ్ మెరుగుపర్చుకొని ఉంటే ప్రభావం చూపించగలడు. నటరాజన్‌లో నాటి పదును తగ్గిపోగా, సీనియర్ జైదేవ్ ఉనాద్కట్ జట్టులో ఉండటం ఉపయోగపడవచ్చు. జట్టు స్పిన్ బలహీనంగా కనిపిస్తోంది. వాషింగ్టన్ సుందర్, షహబాజ్ అహ్మద్ ఫర్వాలేదనిపించే ఆటగాళ్లే. ఇన్నేళ్లుగా ఆడుతున్నా ఒక్క సీజన్‌లోనూ వీరిద్దరు ఎనిమిదికి మించి వికెట్లు తీయలేదు. మయాంక్ మార్కండే లెగ్‌స్పిన్ కొంత వరకు ప్రభావం చూపించవచ్చు.

రోహిత్ నన్ను భుజం తట్టి నడిపిస్తాడు: పాండ్యా



ముంబై: ఈ సీజన్ ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్‌ను నడిపించేది తనే అయినా కీలక పాత్ర మాత్రం మాజీ కెప్టెన్ రోహిత్ శర్మదేనని కొత్త కెప్టెన్ హార్దిక్ పాండ్యా అన్నాడు. 'కెప్టెన్సీ మార్పు భిన్నమైందని నేననుకోను. రోహిత్ ఎప్పుడూ మా జట్టులో భాగమే. మేమిద్దరం కలిసి పదేళ్లుగా ఆడుతున్నాం. నా మొత్తం కెరీర్ అతని సారథ్యంలోనే సాగిపోయింది. ఇకమీదటా అతని అండదండలతోనే సాగుతుంది. ఈసారి ఐపీఎల్‌లో రోహిత్ నన్ను భుజం తట్టి నడిపిస్తాడు. ఇందులో ఎలాంటి సందేహం లేదు' అని 2015 నుంచి 2021 వరకు ముంబై ఇండియన్స్‌కు ఆడిన పాండ్యా వివరించాడు. కొత్త ఫ్రాంచైజీ గుజరాత్ టైటాన్స్‌కు 2022, 2023లలో సారథ్యం వహించిన పాండ్యా ఈ రెండుసార్లూ జట్టును ఫైనల్‌కు చేర్చి ఓ సారి విజేతగా నిలిపాడు. దీంతో ముంబై ఫ్రాంచైజీ తమ భవిష్యత్ ప్రయోజనాల కోసమంటూ ఐదు సార్లు ముంబైని చాంపియన్‌గా నిలిపిన రోహిత్‌ను తప్పించిమరీ పాండ్యాకు పగ్గాలు అప్పగించింది.

దివ్యాంశ్, రమిత కొత్త ప్రపంచ రికార్డులు





దార్ట్‌మండ్ (జర్మనీ): ఇంటర్నేషనల్ సైసస్ స్పోర్ట్ ఫర్ షూటర్స్ (ఐఎస్ఎస్) షూటింగ్ టోర్నీలో భారత రైఫిల్ షూటర్లు దివ్యాంశ్ సింగ్ పన్వర్, రమితా జిందాల్ కొత్త ప్రపంచ రికార్డులు సృష్టించారు. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్ ఫైనల్లో దివ్యాంశ్ 254.4 పాయింట్లు స్కోరు చేసి పసిడి పతకం గెలిచాడు. ఈ క్రమంలో 253.7 పాయింట్లతో తన పేరిటే ఉన్న ప్రపంచ రికార్డును దివ్యాంశ్ బద్దలు కొట్టాడు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్ ఫైనల్లో రమిత 254.1 పాయింట్లు స్కోరు చేసి బంగారు పతకం సొంతం చేసుకుంది. అంతేకాకుండా 254 పాయింట్లతో హాన్ జియాయు (చైనా) పేరిట ఉన్న ప్రపంచ రికార్డును రమిత సవరించింది.



కాంస్యం నెగ్గిన జ్యోతిక శ్రీ

త్రివేండ్రం: ఇండియన్ ఓపెన్ 400 మీటర్ల అథ్లెటిక్స్ మీట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దండి జ్యోతిక శ్రీ కాంస్య పతకం సాధించింది. సోమవారం జరిగిన ఈ మీట్‌లో జ్యోతిక 400 మీటర్లను 52.73 సెకన్లలో పూర్తి చేసి మూడో స్థానంలో నిలిచింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) కోచ్ నాగపురి రమేశ్ వద్ద శిక్షణ తీసుకుంటున్న జ్యోతికకిదే అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శన కావడం విశేషం. విత్యా (తమిళనాడు; 52.25 సెకన్లు) స్వర్ణం, పూవమ్మ రాజు (కర్ణాటక; 52.69 సెకన్లు) రజతం సాధించారు.

మైదానంలోకి కోహ్లి



బెంగళూరు: భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి సుదీర్ఘ విరామం తర్వాత మైదానంలోకి దిగాడు. ఈ సీజన్ ఐపీఎల్ కోసం రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టుతో సోమవారం కలిసిన అతను వెంటనే కసరత్తు మొదలు పెట్టాడు. చిన్నస్వామి స్టేడియంలో ఆర్‌సీబీ శిబిరం జరుగుతోంది. జట్టు కెప్టెన్ డుప్లెసిస్‌తో కలిసి కోహ్లి ప్రాక్టీస్ సెషన్‌లో గడిపాడు. ఇటీవల కోహ్లి తన భార్య అనుష్క శర్మ ప్రసవం కోసం ఇంగ్లండ్‌తో సొంతగడ్డపై జరిగిన ఐదు టెస్టుల సిరీస్ నుంచి పూర్తిగా విశ్రాంతి తీసుకున్నాడు. ఈ నెల 22న చెన్నైలో జరిగే ఐపీఎల్ తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్‌కింగ్స్‌తో బెంగళూరు తలపడుతుంది.

హర్మన్‌ప్రీత్ సారథ్యంలో....

ఆస్ట్రేలియా పర్యటనకు భారత హాకీ జట్టు



న్యూఢిల్లీ: వచ్చే నెలలో ఆస్ట్రేలియాలో పర్యటించే భారత పురుషుల హాకీ జట్టును ప్రకటించారు. చీఫ్ కోచ్ క్రెయిగ్ ఫుల్టన్ ఆధ్వర్యంలో భువనేశ్వర్‌లో 28 మంది ఆటగాళ్లతో శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ జాబితా నుంచి రబిచంద్ర సింగ్‌ను తప్పించి మిగతా 27 మందితో టీమిండియా ఆస్ట్రేలియాకు వెళ్లనుంది. డ్రాగ్ ఫ్లికర్ హర్మన్‌ప్రీత్ సింగ్ కెప్టెన్‌గా, హార్దిక్ సింగ్ వైస్ కెప్టెన్‌గా కొనసాగుతారు. పారిస్ ఒలింపిక్స్ సన్నాహాల్లో భాగంగా భారత జట్టు పెర్త్ వేదికగా ఏప్రిల్ 1, 6, 7, 10, 12, 13వ తేదీల్లో ఆస్ట్రేలియా జట్టుతో ఐదు మ్యాచ్‌లు ఆడుతుంది.

భారత హాకీ జట్టు: పీఆర్ శ్రీజేశ్, కృషన్ బహదూర్ పాఠక్, సూరజ్ కర్కేరా (గోల్‌కీపర్లు); హర్మన్‌ప్రీత్ సింగ్, జర్మన్‌ప్రీత్ సింగ్, జుగ్‌రాజ్ సింగ్, అమిత్ రోహిదాస్, సంజయ్, సుమిత్, అమీర్ అలీ (డిఫెండర్లు); మన్‌ప్రీత్ సింగ్, హార్దిక్ సింగ్, షంషేర్ సింగ్, విష్ణుకాంత్ సింగ్, వివేక్ సాగర్ ప్రసాద్, నీలకంఠ శర్మ, రాజ్‌కుమార్ పాల్ (మిడ్ ఫీల్డర్లు); ఆకాశ్‌దీప్ సింగ్, మన్‌దీప్ సింగ్, దిల్‌ప్రీత్ సింగ్, సుఖ్‌జీత్ సింగ్, గుర్జంత్ సింగ్, అరిజీత్ సింగ్ హుండల్, లలిత్ కుమార్ ఉపాధ్యాయ్, అభిషేక్, మొహమ్మద్ రాహీల్ మౌసీన్, బాబీ సింగ్ ధామి (ఫార్వర్డ్స్).

సినిమా



● అనుపమ్ ఖేర్, కీరవాణి

అప్పట్నుంచి కీరవాణి ఫ్యాన్‌ని!

- అనుపమ్ ఖేర్

''మా తరానికి చెందిన అద్భుతమైన సంగీతదర్శకుల్లో ఒకరైన కీరవాణితో సినిమా చేసే అవకాశం రావడం నాకు గర్వకారణం. నా కల నిజమైంది'' అని బాలీవుడ్ ప్రముఖ నటుడు–దర్శకుడు అనుపమ్ ఖేర్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ఇరవై రెండేళ్ల తర్వాత ఆయన మళ్లీ మెగా ఫోన్ పట్టారు. గతంలో 'ఓం జై జగదీష్' (2002) చిత్రానికి దర్శకత్వం వహించారు అనుపమ్ ఖేర్. తాజాగా 'తన్వీ ది గ్రేట్' చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ఈ చిత్రానికి ఎంఎం కీరవాణి సంగీతదర్శకత్వం వహిస్తున్నట్లు ప్రకటించి, ఆయన ట్రాక్ కంపోజ్ చేస్తున్న ఫొటోను షేర్ చేశారు. ''ఆస్కార్ అవార్డు, గోల్డెన్ గ్లోబ్ అవార్డు విజేత కీరవాణి మా సినిమాకి మ్యూజిక్ ఇవ్వడం ఓ ఆశీర్వాదం. ఏడాదిగా ఈ సినిమాకి కలిసి పని చేస్తున్నాం. కీరవాణి స్వరపరచిన 'తుమ్ మిలే దిల్ ఖిలే..' (నాగార్జున, మనీషా కొయిరాలా, రమ్యకృష్ణ నటించిన 'క్రిమినల్' సినిమాలోని పాట) విన్నప్పట్నుంచి ఆయనకు అభిమాని అయిపోయాను. ఇప్పుడు నా సినిమా ఒప్పుకున్నందుకు ఆయనకు థ్యాంక్స్'' అని పేర్కొన్నారు అనుపమ్ ఖేర్.



● రామ్‌చరణ్, కాజల్ అగర్వాల్

మగధీర మళ్లీ వస్తున్నాడు

మెగా అభిమానులకు శుభవార్త. రామ్‌చరణ్ హీరోగా నటించిన 'మగధీర' సినిమా మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నెల 27న చరణ్ బర్త్‌డే సందర్భంగా 'మగధీర' చిత్రాన్ని 26న రీ రిలీజ్ చేస్తున్నారు మేకర్స్. రాజమౌళి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటించారు. గీతా ఆర్ట్స్ పతాకంపై అల్లు అరవింద్ నిర్మించిన 'మగధీర' 2009 జూలై 30న విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. 14 ఏళ్ల తర్వాత ఈ చిత్రాన్ని శ్రీ విజయలక్ష్మి ట్రేడర్స్ అధినేత యర్రంశెట్టి రామారావు, అరిగెల కిశోర్‌బాబు రీ రిలీజ్ చేస్తున్నారు. ''మగధీర' చిత్రాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక థియేటర్లలో రీ రిలీజ్ చేస్తున్నాం. తెలుగు ప్రేక్షకులు, మెగా అభిమానులు ఈ చిత్రాన్ని ఆదరించి మరోసారి ఘన విజయాన్ని అందించాలి'' అన్నారు యర్రంశెట్టి రామారావు, అరిగెల కిశోర్ బాబు.

ఈ రోజుల్లోనూ... ఈ నెల రీ రిలీజ్ అవుతున్న చిత్రాల్లో శ్రీ, రేష్మ జంటగా మారుతి దర్శకత్వం వహించిన 'ఈ రోజుల్లో' కూడా ఉంది. గుడ్ సినిమా గ్రూప్ బ్యానర్‌పై యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ సినిమా 2012 మార్చి 23న విడుదలై ఘన విజయం సాధించింది. ఈ చిత్రాన్ని 12 ఏళ్ల తర్వాత మళ్లీ విడుదల చేస్తున్నారు మేకర్స్. ఈ నెల 23న 'ఈ రోజుల్లో' విడుదల కానుంది.



● సమంత

ఇక ఊహూ..!

'ఊ అంటావా మావ..' అంటూ 'పుష్ప'లోని ప్రత్యేక పాటలో వీలైనంత గ్లామరస్‌గా కనిపించడంతో పాటు హాట్ స్టెప్స్‌తో, హాట్ హాట్ హావభావాలతో ఐటమ్ సాంగ్ లవర్స్‌ని ఆకట్టుకున్నారు సమంత. అయితే ఈ బ్యూటీ ఈ రేంజ్‌లో చేయడం చాలా మందిని షాక్‌కి గురి చేసింది. 'అవసరమా?' అని చర్చించుకున్నవాళ్లూ ఉన్నారు. సమంత కూడా ఈ పాట చేసినప్పుడు చాలా అసౌకర్యంగా ఫీలయ్యారట. ఆ విషయం గురించి ఇటీవల ఓ సందర్భంలో మాట్లాడుతూ – ''ఊ అంటావా..' పాట ఫస్ట్ షాట్ తీసేటప్పుడు భయంగా అనిపించింది. నా కాళ్లు వణికాయి. నేను అంత అందంగా ఉండనని, కొందరు అమ్మాయిల్లా బాగుండననీ అనుకుంటుంటాను. దాంతో నాకు 'ఊ అంటావా..' పాట సవాల్‌లా అనిపించింది. అయితే సెక్సీగా కనిపించడం అనేది నా ఆలోచన కాదు కాబట్టి ఆ పాట చిత్రీకరణ అప్పుడు వణికిపోయాను. కానీ ఓ వ్యక్తిగా, నటిగా నాకు అసౌకర్యంగా అనిపించినవి, క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కోవడం నుంచే నేను ఎదిగాను. 'ఊ అంటావా..' పాట నాకు సౌకర్యం కాదనిపించినా కొత్తగా ఏదైనా చేయాలని చేశాను. నిజానికి ఆ పాట లిరిక్స్ నాకు సవాల్‌గా అనిపించాయి. అమ్మాయిలంటే అందం మాత్రమే కాదనేలా ఆ పాట ఉంటుంది. అది నచ్చి చేశాను'' అన్నారు. ఇకపై ఇలాంటి పాటలు చేస్తారా? అనే ప్రశ్నకు ''లేదు.. ఎందుకంటే ఇలాంటి సవాళ్లను స్వీకరించాలనుకోవడంలేదు'' అన్నారు సమంత. ఇక ప్రత్యేక పాటలకు సమంత 'ఊహూ' అంటారని స్పష్టమైపోయింది.



● ప్రభుదేవా, నగ్మా

మరోసారి ప్రేమికుడు

ప్రేమికుడు మరోసారి ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ప్రభుదేవా, నగ్మా జంటగా శంకర్ దర్శకత్వం వహించిన చిత్రం 'ప్రేమికుడు'. కేటీ కుంజుమోన్ నిర్మించిన ఈ చిత్రం 1994 సెప్టెంబర్ 17న విడుదలై, సూపర్ హిట్టయింది. ఈ సినిమాను రీ రిలీజ్ చేస్తున్నారు రమణ, మురళీధర్. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌కి ముఖ్య అతిథులుగా తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్నకుమార్, ట్రెజరర్ రామ సత్యనారాయణ, దర్శకులు ముప్పలనేని శివ, శివనాగు నర్రా, నిర్మాత శోభారాణి హాజరై, మాట్లాడుతూ– ''రీ రిలీజ్‌లోనూ 'ప్రేమికుడు' సినిమా మంచి సక్సెస్ కావాలి'' అన్నారు. ''30 ఏళ్ల క్రితం సంచలన విజయం సాధించిన 'ప్రేమికుడు'ని మళ్లీ రిలీజ్ చేయడం చాలా హ్యాపీగా ఉంది'' అన్నారు నిర్మాతలు రమణ, మురళీధర్.



● కరీనా కపూర్

సౌత్‌కి సై

ఉత్తరాది హీరోయిన్లు శిల్పా శెట్టి, ప్రీతీ జింతా, రవీనా టాండన్, కత్రినా కైఫ్ వంటివారు గతంలో సౌత్‌లో సినిమాలు చేశారు. ఆ తర్వాత కంగనా రనౌత్, ఈ రెండు మూడేళ్లల్లో శ్రద్ధా కపూర్, అలియా భట్ వంటివారు దక్షిణాదిలో.. మరీ ముఖ్యంగా తెలుగు చిత్రాల్లో నటించారు. తాజాగా ప్రభాస్ 'కల్కి 2898 ఏడీ'తో దీపికా పదుకోన్, ఎన్టీఆర్ 'దేవర'తో జాన్వీ కపూర్ తెలుగులో ఎంట్రీ ఇస్తున్నారు. ఇక మరో బాలీవుడ్ ప్రముఖ తార కరీనా కపూర్ సౌత్ సినిమాకి సై అన్నారని తెలుస్తోంది. 'కేజీఎఫ్' ఫేమ్ యశ్ హీరోగా రూపొందుతున్న కన్నడ చిత్రం 'టాక్సిక్'లో కరీనా ఓ కీలక పాత్ర చేయనున్నారట. ఇటీవల ఓ టీవీ షోలో పాల్గొన్న కరీనా.. యశ్‌తో నటించాలనుంది అన్నారు. అలాగే సోషల్ మీడియా ద్వారా ఫ్యాన్స్‌తో ''దక్షిణాదిలోని ఓ స్టార్ హీరో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రంలో నటించనున్నాను. సౌత్‌లో నాకిది ఫస్ట్ మూవీ. షూటింగ్‌లో పాల్గొనే టైమ్ కోసం ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా'' అని కరీనా చెప్పారు. దాంతో 'టాక్సిక్' చిత్రాన్ని ఉద్దేశించే ఆమె ఈ విధంగా పేర్కొన్నారనే ఊహాగానాలు ఉన్నాయి.

రాజకీయాల నేపథ్యంలో...



● కోమల్ కుమార్, శ్రీశాంత్

భారత మాజీ క్రికెటర్ శ్రీశాంత్ విలన్‌గా, కోమల్ కుమార్, రిషికా శర్మ జంటగా నటించిన చిత్రం 'యమధీర'. శంకర్ ఆర్ దర్శకత్వంలో వేదాల శ్రీనివాస్ రావు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న రిలీజ్ కానుంది. ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ వేడుకకి తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి సెక్రటరీ ప్రసన్నకుమార్, ట్రెజరర్ రామ సత్యనారాయణ, నిర్మాతలు డీఎస్ రావు, పి. శ్రీనివాసరావు అతిథులుగా విచ్చేసి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ''రాజకీయాల నేపథ్యంలో రూపొందిన చిత్రం 'యమధీర'. ఈవీఎం ట్యాంపరింగ్‌పై ఈ చిత్రకథ సాగుతుంది'' అన్నారు వేదాల శ్రీనివాస్ రావు.

కాంబినేషన్ కాదు.. కథే ముఖ్యం



● రాజేశ్ దండా

''మా హాస్య మూవీస్‌లో 'ఇట్లు మారేడుమిల్లి, ఊరిపేరు భైరవకోన, సామజవరగమన' చిత్రాలతో హ్యాట్రిక్ సక్సెస్ అందుకున్నాను. 'అల్లరి' నరేశ్, సందీప్ కిషన్, శ్రీవిష్ణు, కిరణ్ అబ్బవరం వంటి హీరోలతో సినిమాలు చేస్తున్నాను. నాకు కాంబినేషన్ కాదు.. కథే ముఖ్యం. వైవిధ్యమైన కథలతో సినిమాలు తీస్తుండటంతో ప్రేక్షకులు కూడా ఆదరిస్తున్నారు'' అన్నారు నిర్మాత రాజేశ్ దండా. సోమవారం రాజేశ్ దండా విలేకరులతో మాట్లాడుతూ– ''స్వామి రారా' చిత్రంతో పంపిణీదారునిగా నా ప్రయాణం మొదలుపెట్టి దాదాపు 82 సినిమాలు రిలీజ్ చేశాను. అనిల్ సుంకర గారితో కలిసి 'సామజవరగమన, ఊరిపేరు భైరవకోన' వంటి చిత్రాలు నిర్మించా. ప్రస్తుతం 'అల్లరి' నరేశ్‌తో తీస్తున్న 'బచ్చలమల్లి' 50 శాతం పూర్తయింది. అలాగే సందీప్ కిషన్ హీరోగా త్రినాథరావు దర్శకత్వంలో సినిమా చేస్తున్నా. కిరణ్ అబ్బవరం హీరోగా ఓ సినిమా ఉంది. చిరంజీవిగారి కోసం ప్రసన్నకుమార్ బెజవాడ రెడీ చేసిన కథతోనే సందీప్ కిషన్ మూవీ తీస్తున్నాం అనడంలో వాస్తవం లేదు. ఇక ఓ స్టార్ హీరోతో ఓ పాన్ ఇండియా మూవీ చేయబోతున్నా. అది ఎవరనేది ప్రస్తుతానికి సస్పెన్స్'' అన్నారు.

చప్పట్లతో ప్రశంసలు



● శోభిత

పట్టుమని పదే సినిమాల్లో నటించిన ఒక ఆర్టిస్ట్‌కి హాలీవుడ్ చాన్స్ వస్తే... పట్టరానంత ఆనందం కలుగుతుంది. హాలీవుడ్ చిత్రం 'మంకీ మేన్'కి అవకాశం వచ్చినప్పుడు తెలుగు అమ్మాయి శోభితా ధూళిపాళకు అలాంటి ఆనందమే దక్కింది. పైగా ఈ చిత్రానికి 'స్లమ్ డాగ్ మిలియనీర్' ఫేమ్ నటుడు దేవ్ పటేల్ డైరెక్టర్ కావడం, హనుమంతుని పురాణం స్ఫూర్తిగా రూపొందడంతో మంచి అవకాశంగా భావిస్తున్నారు శోభిత. ఇటీవల యూఎస్‌లోని ఆస్టిన్‌లో జరిగే ప్రతిష్ఠాత్మక 'ఎస్ఎక్స్‌డబ్ల్యు' (సౌత్ బై సౌత్‌వెస్ట్)లో ఈ చిత్రం ప్రదర్శితమైంది. ఈ ప్రీమియర్‌కి హాజరైన శోభితా ధూళిపాళ మాట్లాడుతూ – ''ఈ వరల్డ్ ప్రీమియర్‌లో మా సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకులు అరుపులు, చప్పట్లతో నినాదాలు చేశారు. స్టాండింగ్ ఒవేషన్‌తోనూ ప్రశంసించారు. దేవ్ పటేల్‌కి డైరెక్టర్‌గా ఇది ఫస్ట్ మూవీ. హాలీవుడ్‌లో నాకు ఇది ఫస్ట్ మూవీ. ఈ చిత్రంలో నాది పెద్ద భాగం కానప్పటికీ, వేరే భాషలో నటించడం, అది కూడా దేవ్ పటేల్ విజన్‌లో నేను భాగం కావడం చాలా హ్యాపీగా ఉంది'' అన్నారు. ఇక పలువురు హాలీవుడ్ తారలతో పాటు విపిన్ శర్మ, అశ్వినీ కల్సేకర్, మకరంద్ దేశ్‌పాండే వంటి భారతీయ తారలు నటించిన 'మంకీ మేన్' ఏప్రిల్ 5న రిలీజ్ కానుంది.

సాక్షి బిజినెస్

మంగళవారం
19-3-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
105	32
72,748	22,056

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	16,150	▲	176
డోజోన్స్	38,870	▲	156
ఎఫ్‌టీఎస్‌ఈ 100	77,23	▼	5
డాక్స్	17,933	▼	4
షాంఘై	3,085	▲	30
నికాయ్	39,740	▲	1,033

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	65,612
బంగారం (99.5 స్వచ్ఛత)	65,350
వెండి (కేజీ)	74,156

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		81.19	84.48
£	బ్రిటన్ పౌండ్		103.88	108.12
€	యూరో		88.12	91.990
¥	జపాన్ ఎన్ (100)		47.00	64.00
AU$	ఆస్ట్రేలియా డాలర్		52.07	56.58
S$	సింగపూర్ డాలర్		60.13	64.88
SAR	సౌదీ రియాల్		21.21	22.74
UAE D	యూఏఈ దిర్హామ్		21.65	23.43
¥	చైనా యువాన్		10.28	12.29

భారత్ స్టార్టప్‌ల దూకుడు

ఈ ఏడాది 12 బిలియన్ డాలర్ల సమీకరణ • పీక్ ఫిఫ్టీన్ ఎండీ రాజన్ ఆనందన్

న్యూఢిల్లీ: దేశీ అంకుర సంస్థలు జోరు మీదున్నాయి. స్టార్టప్‌లు ఈ ఏడాది దాదాపు 8–12 బిలియన్ డాలర్ల వరకు నిధులు సమీకరించే అవకాశం ఉందని వెంచర్ క్యాపిటల్ సంస్థ పీక్ ఫిఫ్టీన్ ఎండీ రాజన్ ఆనందన్ తెలిపారు. దాదాపు 20 బిలియన్ డాలర్ల మేర ఇన్వెస్ట్ చేయతగిన ప్రైవేట్ నిధులు అందుబాటులో ఉన్నాయని, ప్రైవేట్ సంస్థలు.. స్టార్టప్‌లలో పెట్టుబడులు పెట్టేందుకు మదుపుదారులు ఆసక్తిగా ఉన్నారని స్టార్టప్ మహాకుంభ్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన పేర్కొన్నారు. 2021, 2022లో భారతీయ స్టార్టప్‌లలో ఏటా 8–10 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయని ఆనందన్ చెప్పారు.

దీంతో ఆ రెండు సంవత్సరాల్లో అంకుర సంస్థల్లోకి వచ్చిన పెట్టుబడులు 60 బిలియన్ డాలర్లకు చేరాయన్నారు. 'గతేడాది 7 బిలియన్ డాలర్లు వచ్చాయి. ఈ మొత్తం తక్కువని చాలా మంది అంటున్నారు. కానీ, నిజం చెప్పాలంటే ఆరేళ్లకు సరిపడా పెట్టుబడులు రెండేళ్లలోనే వచ్చేసిన నేపథ్యంలో గతేడాది అసలు పెట్టుబడుల పరిమాణం శూన్యంగా ఉండేది. ఈ ఏడాది మనం 8–10 లేదా 12 బిలియన్ డాలర్ల వరకు సమీకరించే దిశగా ముందుకు వెడుతున్నాం. రాబోయే రోజుల్లో 10–12 బిలియన్ డాలర్ల పెట్టుబడులను రాబట్టే స్థాయికి స్టార్టప్ వ్యవస్థ చేరుకోగలదు' అని ఆనందన్ తెలిపారు. దేశీ స్టార్టప్ వ్యవస్థను పటిష్టంగా నిర్మించుకోవడానికి ఏటా 10 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 80,000 కోట్లు) సరిపోతాయని చెప్పారు. ప్రస్తుతం భారత్‌లో 20 స్టార్టప్‌లు లిస్ట్ అయ్యాయని, వచ్చే 7–8 ఏళ్లలో 100 అంకుర సంస్థలు లిస్టింగ్‌కి వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



డీప్‌టెక్ స్టార్టప్స్ కోసం పాలసీ..

డీప్‌టెక్ స్టార్టప్స్ కోసం ప్రత్యేక పాలసీని త్వరలోనే ప్రకటించనున్నట్లు పారిశ్రామిక, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ తెలిపారు. అంకుర సంస్థలకు నిధులే కాకుండా ప్రభుత్వం నుంచి కూడా ఆర్డర్లు దక్కాల్సిన అవసరం ఉందని, గవర్నమెంట్ ఈ-మార్కెట్ ప్లేస్‌తో ఈ అవకాశం లభిస్తోందని సింగ్ వివరించారు. స్టార్టప్స్ నుంచి జీఈఎం ద్వారా ఇప్పటివరకు దాదాపు రూ. 22,000 కోట్ల విలువ చేసే కొనుగోళ్లు జరిగినట్లు ఆయన పేర్కొన్నారు.

4 నెలల మనవడికి రూ.240 కోట్ల బహుమతి

ఇన్ఫీ నారాయణ మూర్తి కానుక



న్యూఢిల్లీ: ఐటీ సేవల దిగ్గజం ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణ మూర్తి తన నాలుగు నెలల మనవడు ఏకగ్రాహ్ రోహన్ మూర్తికి ఖరీదైన బహుమతిని ప్రదానం చేశారు. ఇన్ఫోసిస్‌కు చెందిన 15 లక్షల షేర్లను ఇచ్చారు. ప్రస్తుత మార్కెట్ ధర (రూ. 1,602) ప్రకారం వీటి విలువ రూ. 240 కోట్లుగా ఇన్ఫోసిస్ ఒక ప్రకటనలో వెల్లడించింది. కంపెనీలో తనకు గల ఈక్విటీలో 0.04 శాతం వాటాను కుమారుడు రోహన్ పుత్రుడు ఏకగ్రాహ్‌కు నారాయణ మూర్తి రిజిస్టర్ చేశారు. దీంతో ఏకగ్రాహ్ రోహన్ ఇన్ఫోసిస్‌లో బుల్లి బిలియనీర్ వాటాదారుడయ్యారు. నారాయణ మూర్తి కుమార్తె అక్షత, అల్లుడు రిషీ (బ్రిటన్ ప్రధాని)కి ఇద్దరు కుమార్తెలుకాగా.. ఏకగ్రాహ్ మనవడు.

వృద్ధిజోరుకు సహకరించండి

ఏడీబీకి ఆర్థికమంత్రి విజ్ఞప్తి



న్యూఢిల్లీ: ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెట్ సొల్యూషన్స్) భార్గవ్ దాస్‌గుప్తా సమావేశమయ్యారు. భారత్ తదుపరి పురోగతిలో ఏడీబీ భాగస్వామ్యం కావడానికి సంబంధించిన అంశాలపై వీరు చర్చించినట్లు ఎక్స్‌లో చేసిన ఒక పోస్ట్‌లో ఆర్థికమంత్రిత్వశాఖ తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

19-3-2024	
విశాఖ	430-00
చిత్తూరు	478-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	423-00
విజయవాడ	423-00
18-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	410-00
వరంగల్	412-00

బీమాలో ఎఫ్‌డీఐల జోరు

న్యూఢిల్లీ: బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐలు) జోరు కొనసాగుతున్నట్లు ఫైనాన్షియల్ సర్వీసెస్ సెక్రటరీ వివేక్ జోషి పేర్కొన్నారు. గత 9 ఏళ్లలో దాదాపు రూ. 54,000 కోట్ల ఎఫ్‌డీఐలు తరలి వచ్చినట్లు వెల్లడించారు. నిబంధనలను ప్రభుత్వం మరింత సరళీకరించడం సానుకూల ప్రభావం చూపుతున్నట్లు తెలిపారు. 2014లో బీమా రంగంలో తొలుత 26% ఎఫ్‌డీఐలకు కేంద్రం అనుమతినిచ్చింది. 2019 నాటికి దీనిని క్రమంగా 100 శాతానికి పెంచడం ఈ రంగానికి కలిసి వచ్చిన అంశమని మంత్రి వివరించారు.

ఫెడ్ నిర్ణయాలకు ఎదురుచూపు

స్వల్ప లాభాలతో ముగింపు

ముంబై: అమెరికా ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ సమావేశం ప్రారంభం నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించడంతో దేశీయ స్టాక్ సూచీలు సోమవారం తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. అయితే రిలయన్స్ (1.45%)తో పాటు మెటల్, ఇంధన, ఆటో షేర్లూ రాణించడంతో స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ట్రేడింగ్‌లో 672 పాయింట్ల పరిధిలో



కదలాడిన సెన్సెక్స్ చివరికి 105 పాయింట్ల లాభంతో 72,748 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 207 పాయింట్ల రేంజ్‌లో 22,124 వద్ద గరిష్టాన్ని, 21,917 వద్ద కనిష్టాన్ని నమోదు చేసింది. ఆఖరికి 32 పాయింట్లు పెరిగి 22,056 వద్ద నిలిచింది. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు ప్రారంభంలోనే నష్టాల్లోకి జారుకున్నాయి. మిడ్ సెషన్ తర్వాత ఇటీవల దిగివచ్చిన నాణ్యమైన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో మళ్లీ లాభాల్లోకి మళ్లాయి. ఐటీ, ఎఫ్ఎంసీజీ,, ప్రైవేటు బ్యాంకులు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఇక బీఎస్ఈ స్మాల్ క్యాప్ సూచీ స్వల్పంగా 0.4% లాభపడగా, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.7% నష్టపోయింది.

టీసీఎస్‌లో టాటా సన్స్ వాటాల విక్రయం..

న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)లో ప్రమోటరు సంస్థ టాటా సన్స్ స్వల్ప వాటాలను విక్రయించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. షేరు ఒక్కింటికి రూ. 4,0001 చొప్పున మంగళవారం సుమారు 2.3 కోట్ల షేర్లను (దాదాపు 0.64 శాతం వాటా) బ్లాక్ డీల్స్ ద్వారా టాటా సన్స్ విక్రయించనున్నట్లు వార్తలు వచ్చాయి. దీని ప్రకారం మొత్తం డీల్ విలువ సుమారు రూ. 9,202 కోట్లుగా ఉండనుంది. మార్కెట్ కన్నా తక్కువ రేటుకి షేర్లను విక్రయించనున్న వార్తలతో సోమవారం (మార్చి 18న) టీసీఎస్ షేరు 2 శాతం క్షీణించి రూ. 4,145 వద్ద క్లోజయ్యింది. దీనితో పోలిస్తే ఆఫర్ ధర 3.45 శాతం తక్కువగా ఉండనుంది.

మహిళా ఫుట్‌వేర్ విభాగంలోకి 'లీ కూపర్'

ముంబై: ప్రముఖ డెనిమ్ బ్రాండెడ్ సంస్థ 'లీ కూపర్' మహిళా ఫుట్‌వేర్ విభాగంలోకి అడుగుపెట్టింది. ప్రత్యేకంగా మహిళల కోసం 'షూస్ డోంట్ జడ్జ్ ట్యాగ్‌లైన్'తో స్ప్రింగ్ సమ్మర్'24 పాదరక్షలు విడుదల చేసింది. రిలయన్స్ రిటైల్ ఆధ్వర్యంలో జరిగిన 'నో షూ పార్టీ' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో బాలీవుడ్ నటి సన్య మల్హోత్రా కొత్త కలెక్షన్లను ఆవిష్కరించారు. 'నాణ్యమైన మెటీరియల్‌తో తయారు చేసిన ఎస్ఎస్'24 కలెక్షన్లు అద్భుతమైన స్టైల్, అత్యంత సౌకర్యంగా ఉన్నాయి' అని సన్య తెలిపింది.

ఐడీబీఐపై ఫెయిర్‌ఫాక్స్ కన్ను

- నగదు రూపేణా కొనుగోలుకి రెడీ
- తదుపరి బ్యాంక్ పేరుతోనే సేవలు
- ఆర్థిక శాఖతో సంప్రదింపులు షురూ





ముంబై: పీఎస్‌యూ.. ఐడీబీఐ బ్యాంక్ కొనుగోలుకి కెనడియన్ పీఈ దిగ్గజం ఫెయిర్‌ఫ్యాక్స్ ఇండియా హోల్డింగ్ పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. మొత్తం నగదు రూపేణా చెల్లించేందుకు డీల్ కుదుర్చుకోవడం ద్వారా బ్యాంకును సొంతం చేసుకునేందుకు ఫెయిర్‌ఫాక్స్ అధినేత బిలియనీర్ ప్రేమ్ వత్సా ఆసక్తి చూపుతున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ వివరాల ప్రకారం కొనుగోలు తదుపరి సైతం బ్యాంక్ గుర్తింపును కొనసాగించేందుకు అంగీకారాన్ని తెలపనుంది. రెండు వారాల క్రితమే ఆర్థిక శాఖకు ఫెయిర్‌ఫాక్స్ తాజా ప్రతిపాదనలు చేరాయి. నిజానికి షేర్ల మార్పిడి ద్వారా బ్యాంకు కొనుగోలు ఒప్పందానికి పలు సంస్థలు ఆసక్తి చూపుతున్నప్పటికీ ప్రభుత్వం ఇందుకు సన్నద్ధంగా లేదు. దీంతో నగదు చెల్లింపును ఫెయిర్‌ఫాక్స్ తెరపైకి తీసుకువచ్చింది. కెనడా, భారత్‌ల మధ్య రాజకీయ విభేదాలు తలెత్తిన నేపథ్యంలో ఈ డీల్‌కు ప్రాధాన్యత ఏర్పడినట్లు బ్యాంకింగ్ వర్గాలు పేర్కొంటున్నాయి.

సీఎస్‌బీ విలీనం

దేశీయంగా సీఎస్‌బీ బ్యాంక్‌కు ఫెయిర్‌ఫాక్స్ ప్రమోటర్‌గా వ్యవహరిస్తోంది. ఫలితంగా ఐడీబీఐను సొంతం చేసుకుంటే సీఎస్‌బీ ప్రమోటర్‌గా కొనసాగేందుకు వీలుండదు. బ్యాంకింగ్ నిబంధనల ప్రకారం ఒక ఇన్వెస్టర్ రెండు బ్యాంకులకు ప్రమోటర్‌గా వ్యవహరించేందుకు అనుమతి లభించదు. వెరసి ఐడీబీఐలో సీఎస్‌బీ బ్యాంకును విలీనం చేయవలసి ఉంటుంది. ఐడీబీఐ బ్యాంక్ మార్కెట్ విలువ రూ. 90,440 కోట్లుకాగా.. సీఎస్‌బీ విలువ రూ. 6,000 కోట్లు మాత్రమే. కొంతకాలం ఐడీబీఐను విడిగా కొనసాగించాక తదుపరి దశలో సీఎస్‌బీ బ్యాంకులో విలీనం చేసేందుకు గతంలో ఫెయిర్‌ఫాక్స్ ప్రతిపాదించింది. అయితే విస్తారిత కార్యకలాపాలు కలిగిన ఐడీబీఐ బ్యాంక్ గుర్తింపు రద్దుకు ప్రభుత్వం సుముఖంగా లేకపోవడంతో ప్రతిపాదనలను తాజాగా సవరించింది. ఐడీబీఐ బ్యాంకులో సీఎస్‌బీ విలీనానికి ప్రతిపాదించడం ద్వారా ప్రభుత్వం, ఆర్‌బీఐ నుంచి సమ్మతిని పొందే ప్రయత్నాల్లో ఉంది. వాటా విక్రయానికి ప్రభుత్వం తెరతీశాక ఐడీబీఐ బ్యాంక్ షేరు రూ. 60 నుంచి రూ. 84 వరకూ బలపడింది. ఈ నేపథ్యంలో ఐడీబీఐపై కన్నేసిన కొటక్ మహీంద్రా బ్యాంక్.. సవరించిన ఆఫర్ ద్వారా ఫెయిర్‌ఫాక్స్‌కు చెక్ పెడుతుందా లేదా అనేది వేచిచూడవలసి ఉన్నట్లు బ్యాంకింగ్ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

భవిత

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం — ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

యూపీఎస్సీ-ఈపీఎఫ్‌వోలో 323 పర్సనల్ అసిస్టెంట్ పోస్టులు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్‌లో పర్సనల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 323
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు స్టెనోగ్రఫీ(ఇంగ్లిష్ లేదా హిందీ) నైపుణ్యం కలిగి ఉండాలి.
» **వయసు:** కనిష్టంగా 18 ఏళ్లు ఉండాలి. గరిష్టంగా యూఆర్/ఈడబ్ల్యూఎస్‌లకు 30 ఏళ్లు, ఓబీసీలకు 33 ఏళ్లు, ఎస్సీ/ఎస్టీలకు 35 ఏళ్లు, పీడబ్ల్యూబీడీలకు 40 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** రిక్రూట్‌మెంట్ టెస్ట్, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 27.03.2024.
» **వెబ్‌సైట్:** https://upsc.gov.in

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ 327 పోస్టులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్).. ఎగ్జిక్యూటివ్/నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 327

పోస్టుల వివరాలు

» **ఎగ్జిక్యూటివ్ కేడర్:** మేనేజ్‌మెంట్ ట్రెయినీ(ఈ-ఎం), ఈ2 గ్రేడ్-42, మేనేజ్‌మెంట్ ట్రెయినీ(సిస్టమ్స్), ఈ2 గ్రేడ్-07.
» **నాన్ ఎగ్జిక్యూటివ్ కేడర్:** జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రెయినీ(జేఎంఈటీ), టీ-ఎస్ గ్రేడ్ సీ-100, అసిస్టెంట్ ఫోర్‌మ్యాన్ ట్రెయినీ(మెకానికల్)టీ-ఎస్ గ్రేడ్ సీ-09, అసిస్టెంట్ ఫోర్‌మ్యాన్ ట్రెయినీ(ఎలక్ట్రికల్)టీ-ఎస్ గ్రేడ్ సీ-24, ఫిట్టర్ ట్రెయినీ, క్యాట్ 1-47, ఎలక్ట్రీషియన్ ట్రెయినీ, క్యాట్ 1-98.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** గరిష్ఠ వయో పరిమితి 30 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 15.04.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.05.2024
» **వెబ్‌సైట్:** www.scclmines.com

టీఎస్ పీజీఈసెట్-2024

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి (టీఎస్‌సీహెచ్‌ఈ తెలంగాణ స్టేట్ పోస్టు-గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టీఎస్ పీజీఈసెట్) నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పరీక్షను జేఎన్‌టీయూ-హైదరాబాద్ నిర్వహించనుంది.

» **కోర్సులు:** ఫుల్ టైమ్ ఎంఈ/ఎంటెక్/ఎంఫార్మసీ/ఎం.ఆర్క్/గ్రాడ్యుయేట్ లెవల్ ఫార్మా డి (పీబీ).
» **అర్హత:** కోర్సును అనుసరించి బీఈ, బీటెక్, బీఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ).
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆలస్య రుసుము లేకుండా దరఖాస్తుకు చివరి తేది:** 10.05.2024.
» **పరీక్ష తేదీలు:** 06.06.2024 నుంచి 09.06.2024.
» **వెబ్‌సైట్:** https://pgecet.tsche.ac.in/PGECET_HomePage.aspx

ఎన్ఎల్‌సీలో 239 ఇండస్ట్రియల్ ట్రైనీ పోస్టులు

నైవేలి(తమిళనాడు)లోని నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్ఎల్‌సీ).. ఇండస్ట్రియల్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 239
» **పోస్టుల వివరాలు:** ఇండస్ట్రియల్ ట్రైనీ/ఎస్ఎంఈ-టెక్నికల్(ఓ-ఎం)-100, ఇండస్ట్రియల్ ట్రైనీ (మైన్స్ అండ్ సపోర్ట్ సర్వీసెస్)-139.
» **అర్హత:** పదో తరగతి, ఐటీఐ, సంబంధిత ట్రేడ్‌లో డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** గరిష్ఠ వయో పరిమితి యూఆర్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 37ఏళ్లు, ఓబీసీ అభ్యర్థులు 40 ఏళ్లు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు 42 ఏళ్లకు మించకూడదు.
» **స్టైపెండ్:** నెలకు ఇండస్ట్రియల్ ట్రైనీ/ఎస్ఎంఈ అండ్ టెక్నికల్(ఓ-ఎం) అభ్యర్థులకు రూ.18,000 నుంచి రూ.22,000, ఇండస్ట్రియల్ ట్రైనీ(మైన్స్ అండ్ సపోర్ట్ సర్వీసెస్) అభ్యర్థులకు రూ.14,000 నుంచి రూ.18,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 20.03.2024
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరితేది:** 19.04.2024.
» **వెబ్‌సైట్:** www.nlcindia.in/new_website/index.htm

ఫ్యాషన్, డిజైనింగ్ @ ఎఫ్‌డీడీఐ

ఫ్యాషన్, డిజైనింగ్ రంగాల్లో అవకాశాలకు కేరాఫ్‌గా నిలుస్తోంది.. ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ)! డిజైనింగ్, ఫ్యాషన్‌లకు సంబంధించి పలు కోర్సులను అందిస్తున్న ఎఫ్‌డీడీఐ.. వీటిలో ప్రవేశాలకు ఆల్ ఇండియా సెలక్షన్ టెస్ట్‌ను నిర్వహిస్తోంది. తాజాగా 2024కు సంబంధించి ఎఫ్‌డీడీఐ ఏఐఎస్‌టీ నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. ఏఐఎస్‌టీ వివరాలు, ప్రవేశాలు కల్పించే కోర్సులు, క్యాంపస్‌లు, భవిష్యత్తు అవకాశాలు తదితర అంశాలపై విశ్లేషణ..



» ఎఫ్‌డీడీఐ ఏఐఎస్‌టీ-2024 నోటిఫికేషన్ విడుదల
» ఎఫ్‌డీడీఐలో డిజైన్, ఫ్యాషన్ విభాగాల్లో కోర్సులు
» బ్యాచిలర్, పీజీ స్థాయిలో ప్రోగ్రామ్‌లు

ఫ్యాషన్ డిజైనింగ్,ప్రొడక్షన్‌లో ప్రత్యేక నైపుణ్యాలు పొందేలా యువతను తీర్చిదిద్దే ఉద్దేశంతో.. కేంద్ర పర్యాటక శాఖ నేతృత్వంలో ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ)ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 12 ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌లు ఉన్నాయి. అవి..నోయిడా, ఫర్సత్‌గంజ్, చెన్నై, కోల్‌కత, రోహ్‌తక్, జోథ్‌పూర్, ఛింద్వారా, గుణ, అంక్లేశ్వర్, పాట్నా, హైదరాబాద్, చండీగఢ్.

బ్యాచిలర్, పీజీ ప్రోగ్రామ్‌లు

- జాతీయ స్థాయిలో ఉన్న 12 క్యాంపస్‌ల ద్వారా ప్రస్తుతం నాలుగు బ్యాచిలర్ ప్రోగ్రామ్‌లు, 2 పీజీ ప్రోగ్రామ్‌లను ఎఫ్‌డీడీఐ అందిస్తోంది. అవి..
- **బ్యాచిలర్ ప్రోగ్రామ్‌లు:** బ్యాచిలర్ ఆఫ్ డిజైన్-ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్; బ్యాచిలర్ ఆఫ్ డిజైన్-ఫ్యాషన్ డిజైన్; బ్యాచిలర్ ఆఫ్ డిజైన్-లెదర్ గూడ్స్ అండ్ యాక్సెసరీస్ ; బీబీఏ-రిటైల్ అండ్ ఫ్యాషన్ మర్కండైజ్.
- **పీజీ ప్రోగ్రామ్‌లు:** ఎం.డిజైన్-ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్; ఎంబీఏ-రిటైల్ అండ్ ఫ్యాషన్ మర్కండైజ్.
- బ్యాచిలర్ ప్రోగ్రామ్స్‌లో మొత్తం 1880, పీజీ ప్రోగ్రామ్స్‌లో 480 సీట్లు చొప్పున మొత్తం 2,360 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

కోర్సులు-అర్హతలు

- **బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సులు:** ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సు ఉత్తీర్ణత ఉండాలి.
- **మాస్టర్ ఆఫ్ డిజైన్ (ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్):** ఫుట్‌వేర్/లెదర్ గూడ్స్ అండ్ యాక్సెసరీస్ డిజైన్/ఫ్యాషన్/ఇంజనీరింగ్/ఫైన్ ఆర్ట్స్/ఆర్కిటెక్చర్ విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీ ఉతీర్ణులు అర్హులు.
- **మాస్టర్ ఆఫ్ డిజైన్ (ఫ్యాషన్ డిజైన్):** బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎంబీఏ(రిటైల్ అండ్ ఫ్యాషన్ మర్చెండైజ్):** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత సాదించాలి.
- ఆయా కోర్సుల చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఏఐఎస్‌టీ ర్యాంక్‌తో ప్రవేశాలు

ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌ల్లో యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి.. ఆల్ ఇండియా సెలక్షన్ టెస్ట్(ఏఐఎస్‌టీ) నిర్వహిస్తారు. ఇందులో సాధించిన స్కోర్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తారు. పరీక్ష విధానం యూజీ, పీజీ కోర్సులకు వేర్వేరుగా ఉంటుంది.

ఏఐఎస్‌టీ (బ్యాచిలర్ ఆఫ్ డిజైన్/బీబీఏ) ఇలా

బ్యాచిలర్ ప్రోగ్రామ్‌లకు నిర్వహించే పరీక్ష నాలుగు విభాగాల్లో 200 మార్కులకు ఉంటుంది. సెక్షన్-ఎలో అనలిటికల్ ఎబిలిటీ 25 ప్రశ్నలు-25 మార్కులకు; సెక్షన్-బిలో బిజినెస్ ఆప్టిట్యూడ్ 25 ప్రశ్నలు-50 మార్కులకు, డిజైన్ ఆప్టిట్యూడ్ 25 ప్రశ్నలు-50 మార్కులకు; సెక్షన్-సి జనరల్ అవేర్‌నెస్ 35 ప్రశ్నలు-35 మార్కులకు; సెక్షన్-డిలో కాంప్రహెన్షన్ 25 ప్రశ్నలు-25 మార్కులకు, గ్రామర్, యూసేజ్ 15 ప్రశ్నలు-15 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.

పీజీ ప్రోగ్రామ్‌లకు

పీజీ స్థాయిలో మాస్టర్ ఆఫ్ డిజైన్, ఎంబీఏ ప్రోగ్రామ్‌లకు నిర్వహించే పరీక్ష నాలుగు విభాగాల్లో 200 మార్కులకు ఉంటుంది. సెక్షన్ ఏలో అనలిటికల్ ఎబిలిటీ 25 ప్రశ్నలు-50 మార్కులకు; సెక్షన్-బిలో ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ అండ్ గ్రామర్ 50 ప్రశ్నలు-50 మార్కులకు;సెక్షన్-సిలో జీకే అండ్ కరెంట్ అఫైర్ 50 ప్రశ్నలు-50 మార్కులకు; సెక్షన్-డిలో మేనేజ్‌మెంట్ అప్టిట్యూడ్ టెస్ట్, డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్ 50 ప్రశ్నలు-50 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి. రెండు స్థాయిలకు పరీక్ష పెన్ పేపర్ విధానంలో జరుగుతుంది.

రాత పరీక్షలో రాణించేలా

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగంలో మంచి మార్కులకు అర్థమెటిక్-రేషియో, మిక్చర్స్, టైమ్ అండ్ వర్క్, యావరేజ్, పర్సంటేజ్, టైమ్ అండ్ స్పీడ్, ప్రాఫిట్ అండ్ లాస్, ఇంటరెస్ట్, బేసిక్ స్టాటిస్టిక్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా నెంబర్ ప్రాపర్టీస్, ప్రాబబిలిటీ, కౌంటింగ్ ప్రిన్సిపల్స్, జామెట్రీ, డెరివేటివ్స్(మ్యాగ్జిమా-మినిమా) వంటి ప్యూర్ మ్యాథ్స్ అంశాలను ప్రాక్టీస్ చేయాలి.

వెర్బల్ ఎబిలిటీ

ఇంగ్లిష్ గ్రామర్‌తోపాటు, లాజికల్ రీజనింగ్ అంశాలు, సీటింగ్ అరేంజ్‌మెంట్, సీక్వెన్సెస్, బ్లడ్ రిలేషన్స్, కోడింగ్, డీ-కోడింగ్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.

జనరల్ అవేర్‌నెస్

కరెంట్ అఫైర్స్‌తోపాటు, హిస్టరీ, పాలిటీ, ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి ముఖ్య ఘటనలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్

డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌కు సంబంధించి ఏదైనా ఒక ఆకృతిని రూపొందించే విధంగా ప్రాక్టీస్ చేయాలి. బిజినెస్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించి ఫ్యాషన్ రంగంలో తాజా పరిణామాలు, ఇండస్ట్రీ పరిణామం, వృద్ధి అంచనాలు తదితర అంశాలపై దృష్టి సారించాలి.

ఆకర్షణీయ వేతనాలు

ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌ల నుంచి బ్యాచిలర్, పీజీ పూర్తి చేసుకున్న వారికి క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్ ద్వారా రూ.లక్షల వేతనంతో కొలువులు ఖరారవుతున్నాయి. గత మూడేళ్ల క్యాంపస్ ప్లేస్‌మెంట్ గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటే.. ఎనభై శాతం పైగా విద్యార్థులకు ఆఫర్లు దక్కాయి. సగటు వేతనం రూ.8లక్షలుగా నమోదైంది. అడిడాస్ ఇండియా, ప్యూమా, ఆలైన్ అపారెల్స్, ఆదిత్య బిర్లా తదితర ప్రముఖ సంస్థలు ప్రముఖ రిక్రూటర్స్‌గా నిలుస్తున్నాయి.

లభించే ఉద్యోగాలు

ఎఫ్‌డీడీఐ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ఫుట్‌వేర్ డిజైనర్, ప్రొడక్ట్ డెవలపర్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్, క్వాలిటీ కంట్రోలర్, ఫుట్‌వేర్ టెక్నాలజిస్ట్, మెర్కండైజర్, మార్కెటింగ్, ప్లానింగ్ ఎగ్జిక్యూటివ్, ట్రెండ్ అనలిస్ట్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, డిజైన్ మ్యానుఫాక్చరింగ్ ఆపరేషన్స్, స్టోర్ మేనేజర్, ఫ్లోర్ మేనేజర్, ఏరియా మేనేజర్ వంటి ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. బీబీఏ, ఎంబీఏ కోర్సులు చేసిన వారికి ప్రముఖ ఈ-కామర్స్, టెక్స్‌టైల్ రంగాల్లోని సంస్థల్లో నిర్వహణ విభాగాల్లో కొలువులు లభిస్తున్నాయి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, ఏప్రిల్ 20
- అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్: 2024, మే 6 నుంచి
- ఏఐఎస్‌టీ పరీక్ష తేదీ: 2024 మే 12
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.fddiindia.com/admissionprocess

క్లుప్తంగా...

సమాజ అవసరాలను తీర్చేలా విద్యా విధానం

వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్



యూనిసెఫ్ ప్రతినిధులను అభినందిస్తున్న వీసీ తదితరులు

వైవీయూ: విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని.. సమాజ అవసరాలను తీర్చేలా విద్యా విధానం రూపొందిందని కడపలోని యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. సోమవారం వైవీయూలో యూనిసెఫ్, వైవీయూ, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి, బోర్డు ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్'పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. సమాజంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం చూపేలా కరిక్యులం రూపొందిందని చెప్పారు. విద్యార్థులు సమాజంలో భాగమని.. ప్రాజెక్టుల్లో భాగంగా గ్రామాలకు వెళ్లినప్పుడు అక్కడి సమస్యలపై సమగ్ర అధ్యయనం చేయాలని సూచించారు. వీలైతే పరిష్కారాలను కూడా చూపించాలని కోరారు. ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేలా అధ్యయన నివేదిక ఉండాలన్నారు. స్కిల్ ఓరియెంటెడ్ కోర్సుల వల్ల నైపుణ్యాలను మరింతగా పెంపొందించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, సీడీసీ డీన్ ఆచార్య కె.రఘుబాబు, వైవీయూ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కో–ఆర్డినేటర్ వీసీ సంపత్ కుమార్, యునిసెఫ్ కన్సల్టెంట్ పి.స్వాతి, యూనిసెఫ్ తెలంగాణ కన్సల్టెంట్ శ్రావ్య, శిక్షణ ఫౌండేషన్ ఆపరేషన్ మేనేజర్ అప్పారావు, సమగ్ర శిక్ష అభియాన్ ఏఎంఓ ధనలక్ష్మి తదితరులు విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

ఏపీఎస్‌పీఎఫ్ బృందాలకు క్రికెట్ కిట్లు



క్రికెట్ కిట్లు అందజేస్తున్న త్రివిక్రమవర్మ

సాక్షి, అమరావతి: పోలీసుల్లో శారీర దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి క్రీడలను ప్రోత్సహిస్తున్నట్లు ఏపీఎస్‌పీఎఫ్ అధిపతి డాక్టర్ సీఎం త్రివిక్రమ్ వర్మ అన్నారు. సోమవారం రాజమండ్రి, విజయవాడ, తిరుపతి జోన్‌ల పరిధిలోని యూనిట్లకు క్రికెట్ కిట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విజయవాడలో జోనల్ కమాండెంట్స్ సమావేశంలో మాట్లాడుతూ.. ఏపీఎస్‌పీఎఫ్ జోన్‌ల కార్యాలయంతో పాటు ట్రైనింగ్ సెంటర్ నిమిత్తం ఈ నెల 16వ తేదీన ప్రభుత్వం గన్నవరం మండలం వెదురుపావులూరులో ఐదెకరాల స్థలం కేటాయించిందన్నారు. ఆయా జిల్లాల్లోని జోనల్ హెడ్ క్వార్టర్స్, యూనిట్ హెడ్ క్వార్టర్స్‌కు కూడా స్థలాలు కేటాయించేలా సంబంధిత రెవెన్యూ అధికారులతో సంప్రదింపులు జరపాలని కమాండెంట్లకు సూచించారు. సెక్రటేరియట్, హైకోర్టు, ఎయిర్‌పోర్టు, ఏపీ జెన్‌కో స్టేషన్లలో భద్రతను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఏపీఎస్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ బీవీ రామిరెడ్డి, జోనల్ కమాండెంట్స్ కె.ఎస్.రావు, ఎం.శంకరరావు, డీకేఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.





బాపట్ల జిల్లా మేదరమెట్ల సమీపంలో 16వ నంబర్ జాతీయ రహదారిపై ఎయిర్ క్రాఫ్ట్స్ ల్యాండింగ్ ట్రయల్ రన్‌లో భాగంగా రన్‌వేపై తక్కువ ఎత్తులో ఎగురుతున్న హాకర్ ఫైటర్ విమానం, రన్‌వేపై ల్యాండ్ అయిన డోర్నియర్ విమానం, రహదారిపై ల్యాండ్ అయిన ఏఎన్32 కార్గో విమానాన్ని ఆసక్తిగా చూస్తున్న స్థానిక ప్రజలు

రహదారే.. రన్‌వే

బాపట్ల జిల్లా మేదరమెట్ల వద్ద జాతీయ రహదారిపై యుద్ధ విమానాల ల్యాండింగ్ సక్సెస్

సాక్షి ప్రతినిధి, బాపట్ల/అద్దంకి/మేదరమెట్ల: నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే 16వ నంబర్ జాతీయ రహదారి.. సోమవారం ఉదయం బాపట్ల జిల్లా మేదరమెట్ల సమీపంలో కొంతసేపు నిర్మానుష్యంగా మారింది. ఆ వెంటనే సరిగ్గా 11.03 గంటలకు నాలుగు యుద్ధ విమానాలు వరుసగా ఒకదాని వెంట ఒకటిగా దూసుకువచ్చాయి. స్థానికులు సంభ్రమాశ్చర్యాలతో చూస్తుండగా.. రెండు యుద్ధ విమానాలు రహదారిని తాకగా.. మరో రెండు అతి సమీపంలో చక్కర్లు కొట్టి వెళ్లిపోయాయి. అంతే అక్కడ ఉన్న వైమానిక దళ అధికారులు, సిబ్బంది, పోలీసులు చప్పట్లతో తమ సంతోషం వ్యక్తం చేశారు.

అత్యవసర ల్యాండింగ్ కోసం..

యుద్ధ విమానాల అత్యవసర ల్యాండింగ్ కోసం చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారి–16పై రేణింగివరం నుంచి మేదరమెట్లకు వెళ్లే దారిలో 4.1 కిలోమీటర్ల పొడవున, 33 మీటర్ల వెడల్పుతో ల్యాండింగ్ స్ట్రిప్ నిర్మించారు. గతంలో ఒకసారి దీనిపై ట్రయల్ రన్ నిర్వహించారు. తాజాగా సోమవారం మరోసారి ఈ స్ట్రిప్‌పై బాపట్ల జిల్లా సూర్యలంక వైమానిక దళం ఆధ్వర్యంలో ట్రయల్ రన్ నిర్వహించారు. ఉదయం 11.03 గంటలకు నాలుగు యుద్ధ విమానాలు రన్‌వే స్ట్రిప్‌పై ఎగురుతూ వెళ్లాయి. 11.05 గంటల నుంచి 11.06, 11.07 గంటల సమయంలో రెండు విమానాలు ఐదు అడుగుల ఎత్తులో రన్‌వేపై వెళ్లాయి. ఆ తర్వాత 11.19 గంటలకు ఒకటి, 11.24 గంటలకు మరొకటి ఎయిర్ స్ట్రిప్‌ను తాకుతూ(డెడ్‌లైన్)లో వెళ్లాయి. 11.28 గంటలకు సుఖోయ్–30, హాక్ విమానాలు రెండు అతి తక్కువ ఎత్తులో దూసుకెళ్లాయి. ఆ తర్వాత కొద్దిసేపటికి ఏఎన్–32 ట్రాన్స్‌పోర్టు విమానం ల్యాండ్ అయ్యింది. అనంతరం ఇదే విమానం ఎయిర్ స్ట్రిప్‌పై కొంతదూరం నెమ్మదిగా వెళ్లి.. 12.08కి టేకాఫ్ తీసుకుంది. అలాగే డార్నియర్ ట్రాన్స్‌పోర్టు విమానం 12.30 గంటలకు ల్యాండ్ అయ్యి.. 12.39 నిమిషాలకు విజయవంతంగా టేకాఫ్ అయ్యింది. దీంతో వైమానిక దళ అధికారులు సంతోషం వ్యక్తం చేశారు.

ప్రత్యేక ఏర్పాట్లు..

యుద్ధ విమానాల ల్యాండింగ్ నేపథ్యంలో జాతీయ రహదారికి ఇరువైపులా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్‌ను మళ్లించారు. పోలీస్ బలగాలు, సాయుధ మిలటరీ బలగాలు, వైమానిక దళానికి చెందిన ప్రత్యేక ఫైర్ ఇంజిన్‌లు ఏర్పాటు చేశారు. అలాగే తాత్కాలికంగా ఏర్పాటు చేసిన స్టేషన్ నుంచి వైమానిక దళ అధికారులు విమానాలకు మార్గనిర్దేశం చేశారు. కాగా, ఈ కార్యక్రమానికి సహకరించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌కు వైమానిక దళ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ.. 'వరదలు, భూకంపాలు, ఉగ్రవాద కార్యకలాపాలు, తీర ప్రాంతాల్లో చొరబాటుదారులు, ప్రకృతి వైపరీత్యాలతోపాటు అత్యవసర పరిస్థితుల్లో విమానాలు ల్యాండ్ చేయడానికి అనువుగా జాతీయ రహదారి–16పై ఎమర్జెన్సీ ల్యాండింగ్ సదుపాయం ఏర్పాటు చేశారు. గతేడాది డిసెంబర్‌లో ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించారు. ఇప్పుడు కూడా ట్రయల్‌రన్ విజయవంతమైంది' అని చెప్పారు. కార్యక్రమంలో వైమానిక దళ అధికారులు ఏవీఎం కుకరేజ్, జేపీ యాదవ్, విజయ్, ఎస్పీ వకుల్ జిందాల్, అడిషనల్ ఎస్పీ పాండురంగ విఠలేశ్వర్, జేసీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

భారత్-యూఎస్ టైగర్ ట్రయంఫ్ ప్రారంభం

31 వరకు రెండు ఫేజ్‌లలో యుద్ధ విన్యాసాలు



విశాఖ సముద్ర జలాల్లో అమెరికాకు చెందిన యూఎస్ఎస్ సోమర్‌సెట్ యుద్ధ నౌక

సాక్షి, విశాఖపట్నం: భారత్, యూఎస్ మధ్య రక్షణ బంధం మరింత బలోపేతం కోసం రెండు దేశాల మధ్య నిర్వహించే టైగర్ ట్రయంఫ్ యుద్ధ విన్యాసాలకు ఈ ఏడాది విశాఖపట్నం వేదికగా నిలిచింది. తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రం విశాఖపట్నంలో టైగర్ ట్రయంఫ్–2024 సోమవారం ప్రారంభమైంది. ఈ నెల 31వ తేదీ వరకు రెండు ఫేజ్‌లలో జరగనున్న ట్రయంఫ్ యుద్ధ విన్యాసాల్లో ఇరు దేశాలకు చెందిన త్రివిధ దళాలు పాల్గొననున్నాయి. ఈ మేరకు యూఎస్‌కు చెందిన యూఎస్ఎస్ సోమర్‌సెట్ యుద్ధ నౌకతో పాటు ల్యాండింగ్ ఎయిర్ క్రాఫ్ట్‌లు, హెలికాప్టర్లు, యూఎస్ మెరైన్ కార్ప్స్, ఎమ్మార్కెడ్ దళాలు విశాఖకు చేరుకున్నాయి. ర్యాపిడ్ యాక్షన్ మెడికల్ టీమ్(ఆర్ఏఎంటీ) కూడా ఈ విన్యాసాల్లో పాల్గొననుంది. ఈ నెల 25వ తేదీ వరకు హార్బర్ ఫేజ్ విన్యాసాలు జరగనున్నాయి. ఇందులో రెండు దేశాల త్రివిధ దళాల శిక్షణ సందర్శనలు, క్రీడాపోటీలు, వివిధ అంశాలపై చర్చలు ఉంటాయి. ఆ తర్వాత 26 నుంచి 31వ తేదీ వరకు సీ ఫేజ్ విన్యాసాలు ఉంటాయి. ఇందులో హ్యుమానిటేరియన్ అసిస్టెన్స్ అండ్ డిజాస్టర్ రిలీఫ్(హార్డ్), యుద్ధ విన్యాసాలను విశాఖ సముద్ర తీరానికి 40 మైళ్ల దూరంలో నిర్వహించనున్నారు.

గ్రూప్-1 మెయిన్స్‌పై సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేయండి

- హైకోర్టు ధర్మాసనం ముందు ఏపీపీఎస్సీ అప్పీల్
- నేడు విచారించనున్న ధర్మాసనం

సాక్షి, అమరావతి: గ్రూప్–1 మెయిన్స్ పరీక్షను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) హైకోర్టు ధర్మాసనాన్ని ఆశ్రయించింది. మెయిన్స్ పరీక్షను తిరిగి నిర్వహించాలన్న తీర్పును రద్దు చేయాలని కోరుతూ ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేసింది. ఈ అప్పీల్‌పై అత్యవసరంగా విచారణ జరపాలని ఏపీపీఎస్సీ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.సత్యనారాయణ ప్రసాద్ ధర్మాసనాన్ని అభ్యర్థించారు. ఈ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తులు జస్టిస్ గుహనాథన్ నరేందర్, జస్టిస్ న్యాపతి విజయ్‌లతో కూడిన ధర్మాసనం ఈ అప్పీల్‌పై మంగళవారం విచారణ జరుపుతామని స్పష్టం చేసింది. గ్రూప్–1 మెయిన్స్ మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయని, అందువల్ల మెయిన్స్ పరీక్షను రద్దు చేయాలని కోరుతూ పలువురు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఇటీవల తీర్పునిస్తూ, మెయిన్స్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ తీర్పుపై ఏపీపీఎస్సీ తాజాగా ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేసింది. ఇప్పటికే మెయిన్స్‌లో ఉత్తీర్ణులై ఉద్యోగాలు చేస్తున్న వారిపై సింగిల్ జడ్జి తీర్పు తీవ్ర ప్రభావం చూపుతుందని ఏపీపీఎస్సీ కార్యదర్శి తన అప్పీల్‌లో పేర్కొన్నారు. మెయిన్స్ పరీక్ష నిర్వహణను సవాలు చేయకపోయినప్పటికీ సింగిల్ జడ్జి మాత్రం ఆ పరీక్షను రద్దు చేశారన్నారు. సింగిల్ జడ్జి తీర్పు చట్ట విరుద్ధమే కాక, ఏకపక్షమని తెలిపారు. మూల్యాంకనం మూడు దశల్లో నిర్వహించడం జరుగుతుందని, దీనిని సింగిల్ జడ్జి తప్పుగా అర్థం చేసుకుని మూడుసార్లు మూల్యాంకనం చేసినట్లు తేల్చారన్నారు.

ఏపీపీఎస్సీలో ప్రతిభకే పట్టం

- వాస్తవాలు కప్పిపుచ్చి వక్రీకరణలు
- 2018 గ్రూప్–1 ఇంటర్వ్యూలకు 325 మంది ఎంపిక
- అత్యధికులు ఐఐటీ, ఐఐఎం, మెడిసిన్ చదువుకున్న వారే
- రాజకీయ విమర్శలకు స్పందించాల్సిన అవసరం లేదన్న చైర్మన్
- త్వరలో వాస్తవాలు వెల్లడిస్తామని ప్రకటన



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఏపీపీఎస్సీలో ప్రతిభకే పట్టం కట్టింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నివేదికలో దేశంలోని 15 రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లు వివాదాల్లో చిక్కుకుంటే, వివాద రహితంగా ఉద్యోగాలు భర్తీ చేసిన బోర్డుగా ఏపీపీఎస్సీ ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ విషయాన్ని విస్మరించిన 'పచ్చ' పత్రికలు చంద్రబాబుకు మేలు చేయడం కోసం వక్రీకరణలకు దిగడం దుర్మార్గం. నాడు చంద్రబాబు బృందం చేసిన తప్పులను ప్రస్తుత సర్వీస్ కమిషన్ సరిదిద్ది, సంస్కరణలు తీసుకొచ్చి, సమర్థంగా మెయిన్స్, ఇంటర్వ్యూలు పూర్తి చేసినా, బురద జల్లడమే ఈ ముఠా పనిగా పెట్టుకుంది. 2019 నుంచి అంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 78 నోటిఫికేషన్లు ఇచ్చి, 6,296 ఉద్యోగాలను వివాదరహితంగా భర్తీ చేసింది. గత ప్రభుత్వంలో నోటిఫికేషన్లు ఇచ్చి వివాదాల్లో ఉన్నవాటిని సైతం పరిష్కరించి, పోస్టుల భర్తీ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసింది. ఇందులో విద్యావంతులైన నిరుద్యోగ యువతకు మేలు చేసేలా గ్రూప్–1, గ్రూప్–2 వంటి గెజిటెడ్ పోస్టులతోపాటు, వివిధ శాఖల్లో అసిస్టెంట్ ఇంజినీర్లు, అగ్రికల్చరల్ ఆఫీసర్లు, మరెన్నో నాన్ గెజిటెడ్ పోస్టులకు నియామకాలు జరిగాయి.

నాడే పడిన వివాదాల బీజం

2018 గ్రూప్–1 మెయిన్స్ నిర్వహణ, అభ్యర్థుల ఎంపికపై ఎల్లో మీడియా, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపణలు చేస్తున్నారు. వాస్తవానికి వివాదాలకు బీజం పడింది మాత్రం ప్రిలిమ్స్‌పైనే. 2018 మే నెలలో నిర్వహించిన ప్రిలిమ్స్ పేపర్ దాదాపు 62 తప్పులు దొర్లాయి. వీటికి నాటి చంద్రబాబు ప్రభుత్వంగాని, నాటి సర్వీస్ కమిషన్ చైర్మన్ ఉదయ్ భాస్కర్‌గాని సమాధానం చెప్పిందీ లేదు. 2018 గ్రూప్–1కు ఎంపికైన అభ్యర్థులు అత్యధికులు ఉన్నత విద్యావంతులు. అంతకుమించి, వారు గతంలో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షలు ఉత్తీర్ణులైనవారు ఉన్నారు. ముఖ్యంగా మెయిన్స్‌లో అర్హత సాధించి ఇంటర్వ్యూకి ఎంపికైన వారిలో 14 మంది ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ఆ నోటిఫికేషన్‌కు సంబంధించి ఇంటర్వ్యూకి హాజరైన 320 మందిలో 19 మంది ఐఐటీ, ఐఐఎం నుంచి ఏడుగురు, ఎన్ఐటీ నుంచి 17, బిట్స్ పిలానీ నుంచి ఇద్దరు, ట్రిపుల్ ఐటీల నుంచి 13 మంది ఉన్నారు. ఇంజినీరింగ్, మెడిసిన్ చేసినవారు 177 మంది, సాధారణ పీజీ 51, గ్రాడ్యుయేట్లు 39 మంది ఉన్నారు. మొత్తం ఇంటర్వ్యూకు ఎంపికైన వారిలో 40 మంది సివిల్స్ రాస్తే, వీరిలో 14 మంది అదే ఏడాది ఐఏఎస్ సాధించగా, ఇద్దరు కేంద్ర సర్వీసుకు ఎంపికయ్యారు. మరో 24 మంది యూపీఎస్సీ ఇంటర్వ్యూ చేసినవారు. వీరుగాక, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో ఉన్నవారు 163 మంది ఉన్నారు. వీరంతా 2018 గ్రూప్–1 కంటే ముందే పలు పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూలు ఎదుర్కొన్నవారు. వీరంతా మెయిన్స్‌లో ప్రతిభ చూపిన తర్వాతే ఇంటర్వ్యూని ఎదుర్కొన్నారు. సివిల్స్‌లో ఐఏఎస్, ఐపీఎస్ ఉద్యోగాలు లక్ష్యంగా పెట్టుకుని చదివినవారికి గ్రూప్–1లో గెలవడం లెక్కకాదు.

ఆ విమర్శలకు మేం స్పందించం



రాజకీయ విమర్శలకు కమిషన్ స్పందించాల్సిన అవసరం లేదు. కానీ నిరుద్యోగులకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉంది. సరైన సమయంలో వాస్తవాలను వెల్లడిస్తాం. 2019 నుంచి ఇప్పటి దాకా కమిషన్ ఒక్క తప్పు లేకుండా పూర్తి పారదర్శకతతో వేలాది పోస్టులు భర్తీ చేసింది. 2018 గ్రూప్–1 పోస్టుల భర్తీలోనూ అంతే పారదర్శకంగా మెయిన్స్, ఇంటర్వ్యూలు నిర్వహించాం. ఎంపికైన అభ్యర్థుల్లో 14 మంది ఐఏఎస్‌కు ఎంపికవ్వడం అందుకు నిదర్శనం.

– గౌతమ్ సవాంగ్, ఏపీపీఎస్సీ చైర్మన్

ఇలాంటి అభ్యర్థులపై ఇప్పుడు ఎల్లో మీడియా, మాజీ ముఖ్యమంత్రి ఆరోపణలు చేస్తున్నారు.

డిజిటల్ మూల్యాంకనం ప్రతిపాదన నాటి చైర్మన్‌దే

గ్రూప్–1 మెయిన్స్ పేపర్లను సంప్రదాయ పద్ధతిలో సబ్జెక్టు నిపుణులు మూల్యాంకనం చేయడం ఎప్పటి నుంచో ఉన్నదే. అయితే, ఈ విధానంలో అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని చెప్పి నాటి సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా ఉన్న ఉదయ్ భాస్కర్ డిజిటల్ మూల్యాంకనం ప్రతిపాదన చేయగా, నాటి కమిషన్‌లోని సభ్యులు కూడా ఆమోదం తెలిపి కొత్త ప్రభుత్వం ముందుంచారు. అనంతరం దీనిపై జాతీయ స్థాయి సదస్సును విజయవాడలో నిర్వహించేందుకు సన్నాహాలు చేయగా అందుకు ప్రభుత్వం నిధులు కూడా కేటాయించింది. మెయిన్స్ పేపర్లను ఈ విధానంలోనే మూల్యాంకనం చేయాలని చూడగా, నోటిఫికేషన్‌లో చెప్పని కారణంగా కోర్టు ద్వారా ఈ ప్రక్రియను నిలిపివేశారు. దాంతో సంప్రదాయ విధానంలోనే పేపర్లను మూల్యాంకనం చేశారు. అయినప్పటికీ చంద్రబాబు, ఎల్లో మీడియా సర్వీస్ కమిషన్, ప్రభుత్వంపైనా రాజకీయ విమర్శలు చేస్తున్నాయి.

నీట్ దరఖాస్తుల్లో సవరణలకు అవకాశం

- రేపు అర్ధరాత్రి వరకు గడువు
- వైద్య కోర్సుల్లో ప్రవేశానికి మే 5న నీట్ నిర్వహణ
- ఈ ఏడాది పరీక్షకు 25 లక్షల మంది విద్యార్థులు



సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్, తదితర వైద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) –యూజీ 2024 ఆన్‌లైన్ దరఖాస్తుల్లో సవరణ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమైంది. సవరణలకు బుధవారం అర్ధరాత్రి 11:59 గంటల వరకూ గడువు ఉన్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఇప్పటికే వెల్లడించింది. ఈ క్రమంలో విద్యార్థులు తమ ఆన్‌లైన్ దరఖాస్తులను మరోసారి పరిశీలించి మార్పులుచేర్పులు చేసుకోవడానికి అవకాశం లభించింది. మే 5న దేశవ్యాప్తంగా 554 కేంద్రాలు, వివిధ దేశాల్లో 14 చోట్ల నీట్ నిర్వహించనున్నారు. ఇంగ్లిష్, హిందీ, తెలుగుతోపాటు 13 భాషల్లో పెన్ను, పేపర్ విధానంలో ఈ పరీక్ష ఉంటుంది. ఈ ఏడాది నీట్‌కు దేశవ్యాప్తంగా 25 లక్షల మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు తెలుస్తోంది. గతేడాది 20.87 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా 20.36 లక్షల మంది పరీక్షకు హాజరయ్యారు. ఇక ఆంధ్రప్రదేశ్ నుంచి గతేడాది 68,578 మంది పరీక్ష రాయగా 42,836 మంది అర్హత సాధించారు.

706 కళాశాలల్లో లక్షకు పైగా ఎంబీబీఎస్ సీట్లు

దేశవ్యాప్తంగా 706 వైద్య కళాశాలల్లో లక్షకుపైగా ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో 5,360 సీట్లు ఉన్నాయి. కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటులో భాగంగా వచ్చే విద్యా సంవత్సరం ఆదోని, మార్కాపురం, మదనపల్లె, పులివెందుల, పాడేరుల్లో వైద్య కళాశాలలు ప్రారంభించడానికి ఇప్పటికే వైద్య శాఖ నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ)కి దరఖాస్తు చేసింది. ఈ కళాశాలల్లో ఎన్ఎంసీ తనిఖీలు జరగాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తయి వీటికి కూడా అనుమతులు వస్తే వచ్చే విద్యా సంవత్సరంలో మరికొన్ని ఎంబీబీఎస్ సీట్లు మన విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయి.

పండ్లకు కవర్ల కవచం

- ఏటా 2వేల టన్నుల పండ్లకు కవర్లతో రక్షణ
- చీడపీడలకు చెక్.. 30శాతం పెట్టుబడి ఆదా
- పెరిగిన నాణ్యతతో 30శాతం అదనపు ధర
- ఇప్పటి వరకు చైనా, తైవాన్ నుంచి కవర్ల దిగుమతి
- దేశంలోనే తొలి కవర్ల తయారీ యూనిట్ మన రాష్ట్రంలో ప్రారంభం



ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం వద్ద కవర్లు కట్టిన మామిడి తోటలు




కవర్లు కట్టడంతో ఏపుగా ఎదిగిన డ్రాగన్ ఫ్రూట్, మామిడి

సాక్షి, అమరావతి: మామిడి, జామ, దానిమ్మ, యాపిల్, సీతాఫలంతోపాటు ప్యాషన్, డ్రాగన్ ఫ్రూట్స్ వంటివాటికి కవర్లు రక్షణ కవచాలుగా నిలుస్తున్నాయి. పండ్ల నాణ్యతను పెంచి రైతులకు అధిక ధరను అందిస్తున్నాయి. ప్రస్తుతం కవర్లు తొడగని బంగినపల్లి మామిడి పండ్లు టన్నుకు రూ.20వేల నుంచి రూ.25వేల వరకు పలుకుతుండగా... కవర్లు కట్టిన పండ్లకు రూ.80 వేల నుంచి రూ.1.10లక్షలు వరకు ధర పలుకుతోంది. కవర్లు తొడిగిన ఇతర పండ్లకు సైతం 30శాతం అదనపు ధర లభిస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వం ఉద్యాన పంటల నాణ్యతను పెంచడం ద్వారా ఎగుమతులను రెట్టింపు చేయాలన్న సంకల్పంతో పండ్లకు కవర్లు కట్టేందుకు రైతులకు హెక్టారుకు రూ.28వేలు చొప్పున సబ్సిడీ ఇస్తూ ప్రోత్సహిస్తోంది. ఈ విధంగా ప్రభుత్వం గడిచిన ఐదేళ్లలో రూ.1.80 కోట్లు సబ్సిడీ సొమ్మును రైతులకు ఇచ్చింది. దీంతో యాపిల్, దానిమ్మ, ద్రాక్షతోపాటు అన్ని రకాల పండ్లకు కవర్లు కట్టేందుకు రైతులు ముందుకొస్తున్నారు. దేశవ్యాప్తంగా సగటున 10కోట్ల కవర్లు దిగుమతి చేసుకుంటుండగా.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఉద్యానపంటలు సాగు చేసే రైతులే 3కోట్లకుపైగా కవర్లు వినియోగిస్తున్నారు.

తెగుళ్లు.. చీడపీడలకు చెక్

సాధారణంగా పిందె, కాయ మీద వర్షం లేదా మంచు పడితే వాటిని శిలీంధ్రాలు, బ్యాక్టీరియా ఆశించి మచ్చలు ఏర్పడతాయి. వాతావరణ పరిస్థితులను బట్టి మంగు, మసి, పండు ఈగ, తామర (త్రిప్స్), పెంకు పురుగులు దాడి చేస్తుంటాయి. వీటి నివారణ కోసం 10 నుంచి 15సార్లు మందుల పిచికారీ కోసం పంటను బట్టి ఎకరాకు రూ.10వేల నుంచి రూ.20వేలు ఖర్చు చేస్తున్నారు. అయినా ఆశించిన స్థాయిలో నాణ్యమైన దిగుబడి, గిట్టుబాటు ధర రాక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. పండ్లకు కవర్లను అమర్చటం వల్ల తెగుళ్లు, చీడపీడలకు చెక్ పెట్టగలుగుతున్నారు. ఒక్కో కవర్ రూ.2 కాగా.. అమర్చేందుకు మరో రూపాయి ఖర్చవుతోంది. 10 నుంచి 15 ఏళ్ల వయసుగల తోటలకు 60 నుంచి 70శాతం, ముదురు తోటల్లో 30 నుంచి 40శాతం కాయలకు కవర్లు కట్టగలుగుతున్నారు. విదేశాల్లో డిమాండ్ ఉన్న బంగినపల్లితోపాటు రసాలు, సువర్ణరేఖ తదితర మామిడి రకాలకు కవర్లను అమరుస్తున్నారు. రాయలసీమలో దానిమ్మ, జామ, డ్రాగన్ ఫ్రూట్, గోదావరి జిల్లాల్లో సీతాఫలం పండ్లకు కవర్లు కడుతున్నారు. నిమ్మకాయ సైజులోకి వచ్చిన తర్వాత కవర్లు కట్టి కనీసం 40 రోజులపాటు ఉంచితే కాయపై మచ్చలు ఏర్పడవు. వర్షం నీరు కాయకు తాకకుండా కిందికి జారిపోతుంది. ఈదురు గాలులవేళ కాయ రాలడం కూడా ఉండదు. 90 శాతం చీడపీడల నుంచి రక్షణ లభిస్తుంది. కాయల సైజు కూడా కనీసం 20–25 శాతం పెరుగుతుంది. నాణ్యంగా, ఆకర్షణీయంగా మంచి రంగుకొస్తాయి.

తొలి కవర్ల తయారీ యూనిట్ ఏపీలోనే..

కవర్లు కట్టే విధానం ఏపీలో శ్రీకారం చుట్టగా.. ఇప్పుడు 12 రాష్ట్రాలకు విస్తరించింది. రాష్ట్రంలో 2వేల టన్నుల పండ్లకు కవర్లు కడుతున్నారు. రానున్న ఐదారేళ్లలో కనీసం లక్ష టన్నులకు కవర్లు కట్టించాలన్న సంకల్పంతో ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోంది. నాలుగేళ్లుగా తైవాన్, చైనా నుంచి కవర్లను దిగుమతి చేసుకుంటుండగా.. దేశంలోనే తొలి ఫ్రూట్ కవర్ల తయారీ కంపెనీ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ వేదికైంది. ఫ్రూట్ టెక్ సొల్యూషన్స్ సంస్థ రూ.10కోట్ల పెట్టుబడితో ఏలూరు జిల్లా ఆగిరిపల్లి వద్ద ఫ్రూట్ కవర్ కంపెనీని ఏర్పాటు చేసింది.

ధరల్లో వ్యత్యాసం ఇలా...

పండ్ల రకం	కవర్లు కట్టనివి	కవర్లు కట్టినవి
మామిడి (కిలో)	రూ.20-25	రూ.80-రూ.100
దానిమ్మ (కిలో)	రూ.100-రూ.120	రూ.150-రూ.160
జామ (కిలో)	రూ.20	రూ.50-రూ.60
సీతాఫలం (కిలో)	రూ.150-రూ.160	రూ.250
యాపిల్స్ (బాక్స్)	రూ.1,000	రూ.2,500



విదేశాల్లో మంచి డిమాండ్



కవర్లు కట్టిన కాయలకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. మా కంపెనీ ఏటా 50 టన్నుల వరకు యూరప్, యూకే, యూఎస్ఏ దేశాలకు ఎగుమతి చేస్తోంది. డిమాండ్‌కు తగినట్లుగా కవర్లు కట్టిన కాయలు దొరకడం లేదు.

– ఉండవల్లి రాజు, యజమాని, మధురమ్స్ లిమిటెడ్

ఉద్యాన పంటలకు ఎంతో ఉపయోగం



ఉద్యాన పంటలకు మంచి ధర లభించేందుకు ఫ్రూట్ కవర్స్ ఎంతగానో ఉపయోగపడతాయి. దేశంలోనే తొలి ఫ్రూట్ కవర్ల తయారీ యూనిట్ ఆగిరిపల్లిలో ఏర్పాటుచేశాం. గతేడాది ఏప్రిల్‌లో ఉత్పత్తి ప్రారంభించాం. రోజుకు 2.50లక్షల కవర్ల ఉత్పత్తి సామర్థ్యంతో ముందుకెళ్తున్నాం. వచ్చే ఐదేళ్లలో కనీసం లక్ష టన్నుల పండ్లకు కవర్లు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం.

– శరణాల అప్పారావు, ఎండీ, ఫ్రూట్ టెక్ సొల్యూషన్స్

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

మంగళవారం : 19 : మార్చి : 2024



ఏ పార్టీకి గొడుగు

ఎన్నికల సామగ్రి విక్రయాలు మొదలయ్యాయి. బెంగళూరులోని చామరాజపేటలో సోమవారం ఓ దుకాణంలో పార్టీల జెండాలు, గొడుగులు వగైరా

న్యూస్‌రీల్

దంత ఆరోగ్యం ముఖ్యం



ఖైదీలకు దంత పరీక్షలు

మండ్య: అన్ని రోగాలకు నోరు కారణమని, నోరు, పళ్లను బాగా చూసుకుంటే అన్ని రోగాలను అరికట్టవచ్చని జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమాధికారి డాక్టర్ కె.మోహన్ తెలిపారు. జిల్లా పాలన విభాగం, భారత దంత వైద్య సంఘం భాగస్వామ్యంలో జిల్లా కారాగారంలో ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. నోటిని, దంతాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యం సక్రమంగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఖైదీలకు, జైలు సిబ్బందికి దంత పరీక్షలు చేశారు.

కావేరి నీటిపై నేతల అబద్ధాలు



కరపత్రాలను పంచుతున్న రైతు నేతలు

మండ్య: తమిళనాడుకు ప్రభుత్వం కావేరి నీరు విడుదల చేయలేదని ప్రజాప్రతినిధులు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని రైతు నాయకులు సునందా జయరాం ఆరోపించారు. నగరంలోని ఎంవీ విగ్రహం ఎదురుగా జరిగిన ఆందోళనలో ఆమె మాట్లాడుతూ ఇక్కడ ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే తమిళనాడుకు కావేరి నీటిని వదులుతున్నారని దుయ్యబట్టారు. ప్రజలు మెప్పు కోసం కావేరి నీటిని మళవళ్లిని దాటనివ్వలేదని నేతలు అబద్ధాలు చెబుతున్నారని, కానీ 6 వేల క్యూసెక్కుల నీరు తరలివెళ్లిపోయిందన్నారు. కబిని జలాశయం నుంచి నదికి 2 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారని ఆమె తెలిపారు. కావేరి పోరాటయోధుల గురించి ఇష్టమొచ్చినట్లు ఎమ్మెల్యేలు మాట్లాడుతున్నారని, భవిష్యత్తులో ప్రజలే వారికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు.

సదానంద కలకలం

- నేడు మీడియా ముందు ముఖ్య ప్రకటన

శివాజీనగర: బెంగళూరు ఉత్తర ఎంపీ, బీజేపీ మాజీ ముఖ్యమంత్రి సదానందగౌడ గతంలో పోటీ రాజకీయాల నుంచి విరమించుకుంటానని ప్రకటించడం తెలిసిందే. ఇంతలో ఆయన మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి ముఖ్యమైన విషయం చెప్పబోతున్నారు. సదానంద సోమవారం బెంగళూరులో మాట్లాడుతూ ఆ భేటీలో అన్నీ వెల్లడిస్తానని అన్నారు. తమ పార్టీలో చేరాలని కాంగ్రెస్ నాయకులు సంప్రదించిన విషయం వాస్తవమే అన్నారు. బీజేపీ హైకమాండ్ బెంగళూరు ఉత్తర టికెట్‌ను సదానందకు కాకుండా కేంద్ర మంత్రి శోభా కరంద్లాజెకు ఇచ్చింది. దీంతో సదానందగౌడ అసంతృప్తికి గురయ్యారు. రాష్ట్ర రాజకీయంలో తనకు జరిగిన అన్యాయాలపై మనస్సు విప్పి మాట్లాడాలని ఉందన్నారు. ఇప్పుడే చెబితే ఏమీ ఉండదని చమత్కరించారు. రాజకీయంలో తారుమార్లు, అవమానాలు సహజమేనని తెలిపారు. ఆయన రాజకీయాలకు గుడ్ బై చెబుతారా, లేక కాంగ్రెస్‌లో చేరతారా? అనేది ఉత్కంఠగా మారింది.

నక్సల్స్ కోసం కూంబింగ్



రోడ్డుపై మోహరించిన పోలీసులు

యశవంతపుర: దక్షిణ కన్నడ, కొడగు జిల్లా సరిహద్దుల్లో కడమకల్లు వద్దనున్న కోజిమలె రబ్బర్ ఎస్టేట్ వద్ద నక్సలైట్ల సంచారం బయటపడింది. సుమారు 8 మంది నక్సల్ బృందం ఆదివారం సాయంత్రం కొజిమలె, కల్మకారులోని ఒక అంగడిలో రూ.3,500 ల విలువైన నిత్యావసర వస్తువులను కొనుగోలు చేశారని పోలీసులకు తెలిసింది. దీంతో నక్సల్ వ్యతిరేక దళం పోలీసులు అక్కడ గాలింపు చేపట్టారు. ఆ బృందంలో ఆరు మంది పురుషులు, ఇద్దరు మహిళలు, యూనిఫాం ధరించి ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. అదే బృందమే రెండు జిల్లాల్లో పలుచోట్ల తిరుగుతున్నట్లు భావిస్తున్నారు. కోజిమలె సమీపంలోని మూడు బాళుగొండి ఉప్పకళ, కోజిమలె, కడమకల్లు ప్రాంతాలలో కూబింగ్ ప్రారంభించారు. సుళ్య తాలూకా గుత్తిగారు, కోల్లమొగరు, కల్మకారు ప్రాంతం వరకు కోజిమలె రబ్బర్ ఎస్టేట్ వ్యాపించి ఉంది. 2012లో కాలూరు గ్రామంలో, 2018లో ఫిబ్రవరిలో సంపాజె గడ్డెలోను నక్సలైట్లు కనిపించారు. తాజా సంఘటనతో అక్కడ కలకలం ఏర్పడింది.

హస్తం అబద్ధాల పక్షం

- ఇక్కడ దోచుకుని ఢిల్లీ నేతలకు ఇస్తారు
- శివమొగ్గ సభలో ప్రధాని మోదీ ధ్వజం
- 28 స్థానాల్లోనూ గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి



వాహనంలో సభాస్థలికి వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ



సభికుల కేరింతలు

శివమొగ్గ: అబద్ధాలు చెప్పడం కాంగ్రెస్ పార్టీకి పుట్టుకతో వచ్చిన లక్షణమని, రోజుకొక అబద్ధం హస్తానికి అలవాటని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. రాష్ట్ర కాంగ్రెస్ నేతలు అవినీతిలో కూరుకుపోయారని, ఆ అవినీతి సొమ్మును కేంద్ర కాంగ్రెస్ నేతలకు బదిలీ చేసే ఏటీఎంలా మారిపోయారని దుయ్యబట్టారు. సోమవారం మధ్యాహ్నం శివమొగ్గ నగరంలో అల్లమప్రభు మైదానంలో బీజేపీ రెండో ఎన్నికల ప్రచార సభ జరిగింది. ఇందులో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. పేదరికం పోవాలన్నా, అవినీతి దూరం కావాలన్నా, వ్యవసాయ కార్మికులకు, యువతకు బలం చేకూరాలన్నా కర్ణాటకలోని 28 స్థానాలతో పాటు కేంద్రంలో బీజేపీకి 400కు పైగా స్థానాల్లో అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. గడిచిన పదేళ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పలు అభివృద్ధి పనులను చేపట్టింది. బలమైన ఆర్థిక దేశంగా భారత్‌ను మార్చామని చెప్పారు.

కన్నడలో ఆరంభం

కన్నడలో తన ప్రసంగాన్ని ప్రారంభించిన మోదీ శివమొగ్గ ప్రజలతో పాటు సిగంధూరు దేవీకి నమస్కారాలు చేశారు. కువెంపు పుట్టిన నేల ఇదని, బీజేపీకి మీ మద్దతునివ్వాలని ఓటర్లను అభ్యర్థించారు. కర్ణాటక అభివృద్ధి కోసం ఎన్‌డీఏ సర్కారు మళ్లీ రావాలని చెప్పారు. శివమొగ్గలో బీఎస్ యడియూరప్ప ఎంతో కష్టపడి బీజేపీ పార్టీని నిర్మించారని, ఇది తపోభూమిగా మారిందని కొనియాడారు. నారీశక్తి గురించి ఇండియా కూటమి అవహేళన చేస్తోందని, వారికి సమాధానం చెప్పాలన్నారు.



శివమొగ్గలో ప్రధాని వాహన శ్రేణికి స్వాగతం



లంబాడీ వనితల సందడి

జన సందోహం

ప్రధాని సభకు జన సందోహం తరలివచ్చింది. శివమొగ్గ, ఉడుపి- చిక్కమగళూరు, దావణగెరె లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించి ఈ సభను జరిపారు. మోదీ విమానాశ్రయం నుంచి సభాస్థలికి వరకూ వాహనాలలో ర్యాలీగా, మళ్లీ టాప్‌లేని వాహనంలో వేదిక వరకూ వచ్చారు. శివమొగ్గతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి, జిల్లాల నుంచి వేలాది వాహనాల్లో తరలివచ్చారు. మోదీ వచ్చే మార్గంలో భారీ భద్రతను ఏర్పాటు చేశారు. వివిధ రహదారుల్లో రాకపోకలను నిషేధించారు. యడియూరప్ప, విజయేంద్ర, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

డబ్బు లావాదేవీలపై కన్ను

- బెంగళూరు ప్రత్యేక కమిషనర్ సూచన





అధికారుల సమావేశం

బనశంకరి: లోక్‌సభ ఎన్నికలలో డబ్బు పంపిణీని అరికట్టడానికి అనుమానాస్పద నగదు లావాదేవీలపై నిఘా వేయాలని నగర ఎన్నికల విభాగం ప్రత్యేక కమిషనర్ సెల్వమణి నోడల్ అధికారులకు సూచించారు. సోమవారం నోడల్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఒకే అకౌంట్ నుంచి పలు అకౌంట్లకు నగదు జమ అయ్యే సమాచారం తమకు ఇవ్వాలని, సమాచారం ఇవ్వకపోతే కఠిన చర్యలు తప్పవని అధికారులకు హెచ్చరించారు. వ్యక్తుల ఖాతాల్లోకి ఒకే బ్యాంకు నుంచి ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ ద్వారా అధిక మొత్తంలో నగదు జమ కావడం, డిపాజిట్లు, లక్షకు పైగా నగదు డ్రా చేయడం, రూ.10 లక్షల కంటే ఎక్కువగా జరిగే లావాదేవీల గురించి తెలుసుకోవాలన్నారు. ఆదాయ పన్ను శాఖతో కలిసి అనుమానిత నగదు కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాలని తెలిపారు.

నగదుకు ఆధారాలుండాలి

కోడ్ వచ్చిన 72 గంటల్లో బహిరంగ స్థలాల్లో ప్రజాప్రతినిధుల పేర్లు, ఫోటోలను తొలగించాలని, లేదంటే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. బ్యాంకు సిబ్బంది, ఏటీఎంలకు నగదు తరలించే సిబ్బంది తగిన దాఖలాలను దగ్గర ఉంచుకోవాలన్నారు. రికార్డులు లేకుంటే నగదును సీజ్ చేయాలని సూచించారు. సమావేశంలో వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



బనశంకరి: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో బెంగళూరు పోలీసులు నగర వ్యాప్తంగా వాహన సోదాలను ముమ్మరం చేశారు. ప్రతి నియోజకవర్గ పరిధిలో మూడు చొప్పున మొత్తం 100 కు పైగా చెక్ పోస్టులను ఏర్పాటుచేశారు. ఉత్తర విభాగంలో 20, పశ్చిమలో 22, కేంద్ర లో 22 చెక్ పోస్టులను తెరవగా, ఇందులో అధికారులు, సిబ్బంది 24 గంటలూ విధుల్లో ఉంటున్నారు. ఇప్పటికే నగరానికి వచ్చి వెళ్లే మార్గాలు, సిటీ లోపల ముఖ్యమైన ప్రాంతాల్లో వాహన తనిఖీలను చేపట్టారు.

తవా, కుక్కర్ల లోడ్ పట్టివేత



కుక్కర్‌లు ఉన్న టెంపో

దొడ్డబళ్లాపురం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు పంపిణీ చేయడానికి తవా, కుక్కర్‌లను తీసుకువెళ్తున్న టెంపో వాహనాన్ని జేడీఎస్ కార్యకర్తలు పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన హారోహళ్లి తాలూకా మరళవాడి గ్రామం వద్ద చోటుచేసుకుంది. మరళవాడి గ్రామంలో పంపిణీకి వెళ్తోందని తెలిసి అడ్డుకున్నారు. తహసీల్దార్,పోలీసులు టెంపో వాహనాన్ని సరుకుతోపాటు స్వాధీనం చేసుకున్నారు. తవా, కుక్కర్ బాక్సులపై సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్,ఎంపీ డీకే సురేశ్,ఎమ్మెల్యే ఇక్బాల్ హుసేన్‌ల ఫోటోలు ఉన్నాయి.

రూ.10 కోట్ల వజ్రాలు రూ.3 కోట్లకే

దొడ్డబళ్లాపురం: రూ.10 కోట్ల విలువైన వజ్రాలను రూ.3 కోట్లకే ఇస్తామని నమ్మించి వ్యాపారిని మోసం చేయడానికి యత్నించిన నలుగురిని బెంగళూరు కెంపేగౌడ విమానాశ్రయం పోలీసులు అరెస్టు చేసారు. రవి, నవీన్‌కుమార్, అహ్మద్, అబ్దుల్ దస్తగిరి పట్టుబడ్డ నిందితులు. లక్ష్మీనారాయణ అనే వజ్రాల వ్యాపారికి వాట్సాప్ కాల్ చేసి పై విధంగా ప్రలోభపెట్టారు. డీల్ కుదుర్చుకోవడానికి నిందితులు, వ్యాపారి ఎయిర్‌పోర్టు వద్ద తాజ్ హోటల్‌లో కలిశారు. వ్యాపారి ఆ వజ్రాలను పరిశీలించగా అవి నకిలీవని తెలిసింది. దీంతో ఎయిర్‌పోర్టు పోలీసులకు సమాచారం ఇవ్వగా నిందితులను అరెస్టు చేసి నకిలీ వజ్రాలను సీజ్ చేశారు.



సీజ్ చేసిన నకిలీ వజ్రాలు

మలె రాజేంద్ర రథోత్సవం



సోమవారం బాగల్‌కోట దగ్గర హొస మురనాళలో మలె రాజేంద్ర స్వామి తేరు వేడుక

మద్యం, సిగరెట్లు సమర్పయామి



ఖాప్రి స్వామికి మద్యం సమర్పిస్తున్న అర్చకుడు



ఆలయం ముందు భక్తజన సందోహం



ఖాప్రి దేవరు

- ఖాప్రి స్వామికి విశేష నైవేద్యాలు
- కార్వారలో ఘనంగా జాతర

యశవంతపుర: సామాన్యంగా దేవునికి నైవేద్యంగా కోడి, మేక, పోట్టేలును బలి ఇవ్వటం చూశాం. అయితే కార్వారలో మేక, పొట్టేళ్లతో పాటు మద్యం, సిగరెట్లతో హారతి ఇవ్వటం సంప్రదాయంగా వస్తోంది. ఖాప్రి దేవుని జాతర ఆదివారం కార్వారలోని కోడిభాగంలో కాళినదీ ఒడ్డున వైభవంగా జరిగింది. వేల మంది భక్తులు సాయంత్రం వరకు మద్యం, సిగరెట్ సమర్పణం, తులాభారం సేవల్లో పాల్గొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా గోవా, మహారాష్ట్ర నుంచి భక్తులు వచ్చారు.

ఆఫ్రికా నుంచి వచ్చిన దేవుడు

ఖాప్రి దేవుడు ఐదారు తరాల నుంచి నెలిసి ఇక్కడి ప్రాంతాన్ని ఎంతోగాను కాపాడుతున్నట్లు భక్తుల నమ్మకం. ఈ దేవుడు మూలతః ఆఫ్రికాకు చెందినవారిగా భావిస్తారు. ఆఫ్రికాకు చెందిన వ్యక్తి మూడు వందల ఏళ్ల క్రితం ఈ స్వామిని ప్రతిష్టించి పూజలను ప్రారంభించారు. ఆ పూజారి అదృశ్యమైన తరువాత పుర్సప్ప అనే వ్యక్తి పూజలను కొనసాగించారు. ప్రతి ఆదివారం, బుధవారం ప్రత్యేక పూజలను నిర్వహిస్తారు.

ఘాట్‌లో నిలిచిపోయిన లారీ

యశవంతపుర: సిమెంట్ లోడ్ లారీ చార్మాడి ఘాట్‌లో మరమ్మతులకు గురై నిలిచిపోవడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పది చక్రాలు ఉన్న వాహనాలకు ఘాట్ మార్గంలో అనుమతులు లేవు. చిక్కమగళూరు-మంగళూరుకు ఇది ఒకే మార్గం కావటం వల్ల గంటల కొద్ది వాహనాలు నిలిచిపోయాయి. కొట్టిగేహర చెక్ పోస్టులో పోలీసులు ఉన్నా కూడా భారీ వాహనాన్ని ఆపకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

మహిళా టెక్కీ విషాదాంతం

- డివైడర్‌ను ఢీకొన్న కారు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు



మృతురాలు ఉమాదేవి (ఫైల్)

పెనుకొండ రూరల్: డివైడర్‌ను కారు ఢీకొనడంతో మహిళా టెక్కీ మృతి చెందిన సంఘటన పెనుకొండ 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన మేరకు ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు చెందిన, మురళి, భార్య ఉమాదేవి (34) బెంగళూరులో ఐటీ ఇంజినీర్లుగా పని చేస్తూ అక్కడే స్థిరపడ్డారు. పిల్లలు శ్రీనిధి, విక్రమ్‌తో కలసి మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లోని బంధువుల పెళ్లికి వెళ్లారు. ఆదివారం రాత్రి బెంగళూరుకు బయలుదేరారు, సోమవారం ఉదయం గుట్టూరు వై జంక్షన్ కోటక్ కంపెనీ ఎదురుగా రాగానే కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొనింది. కారు వెనుక భాగం ధ్వంసం కాగా ఉమాదేవి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. భర్త, పిల్లలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె మృతితో భర్త, పిల్లలు కన్నీరుమున్నీరయ్యారు.

యడ్డి, కేంద్రంపై సీఎం ఫైర్

శివాజీనగర: ఎరువుల కోరిన రైతులపై కాల్పులు జరిపి బలి తీసుకొన్న యడియూరప్ప కుమారునికి ఓటు వేయాలని కోరడం ఆత్మసాక్షిగా సబబేనా? రాష్ట్రానికి అన్ని విధాలా అన్యాయం జరుగుతోంది, ఇలా ఉంటే రాష్ట్ర రైతులు ఎందుకు బీజేపీకి మద్దతు ఇవ్వాలి? అని సీఎం సిద్దరామయ్య ధ్వజమెత్తారు. సోమవారం ఆయన ఒక ప్రకటనలో యడ్డిపై విమర్శలు గుప్పించారు. యడ్డి రైతు రుణ మాఫీ చేయమంటే నోట్ల ముద్రణ యంత్రం లేదన్నాడు, రైతులపై కాల్పులు జరిపించాడు అని సిద్దు విమర్శించారు. రాష్ట్రంలో కరువు ప్రకటించి 6 నెలలు గడిచింది. రూ.18,177 కోట్ల పరిహారం ఇవ్వాలని కేంద్రానికి పలుసార్లు లేఖ రాసి, నేరుగా కలిసి విన్నవించాను. అయినా పైసా కూడా పరిహార సొమ్ము విడుదల కాలేదని ఆరోపించారు. దేశంలో వ్యవసాయ రంగాన్ని అదాని, అంబానీ లాంటి వ్యాపారవేత్తల చేతిలోపెట్టే దుష్ట ఆలోచనలతో కేంద్రం రైతు చట్టాలను అమలు చేస్తోందన్నారు.

తల్లి సలహాతో రాజకీయాల్లోకి: యదువీర్



మైసూరులో యదువీర్ ప్రచారం

మైసూరు: ప్యాలెస్ ఆస్తులను కాపాడుకునేందుకు రాజకీయాల్లోకి రాలేదని, ప్రజల కోసం పనిచేసేందుకు వచ్చినట్లు మైసూరు- కొడగు బీజేపీ అభ్యర్థి యదువీర్ కృష్ణదత్త చామరాజ ఒడెయార్ అన్నారు. ఆస్తుల గురించి తన తల్లి కోర్టులో న్యాయ పోరాటం చేస్తున్నారన్నారు. సోమవారం నగరంలో ఓ హోటల్‌లో బీజేపీ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బెంగళూరులోని ప్యాలెస్ హక్కుల గురించి న్యాయ పోరాటం చేస్తున్నామని, అందులో తన పాత్ర ఏమీ లేదని, ఆస్తులన్నీ తన తల్లి పేరు మీద ఉన్నాయని చెప్పారు. తన తల్లి సలహా, ఆశీస్సులతోనే రాజకీయాల్లోకి వచ్చినట్లు, ఆమె ప్రచారానికి రావాల్సిన అవసరం లేదని అన్నారు.

క్లుప్తంగా

జొన్నల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించండి


వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: జిల్లాలో జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాలని కర్ణాటక రైతు సంఘం డిమాండ్ చేసింది. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో జిల్లాధ్యక్షుడు చామరస మాలిపాటిల్ మాట్లాడారు. జిల్లాలో రైతులకు కరువు పరిహారం అందించక పోవడాన్ని తప్పుబట్టారు. వానలు లేక చెరువులు, కుంటలు, బోరుబావులు ఎండిపోయాయన్నారు. తాగునీటి ఎద్దడి నెలకొనకుండా చూడాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

జానపద కళలను కాపాడుకోవాలి

రాయచూరు రూరల్: నేటి ఆధునిక సమాజంలో నశించిపోతున్న జానపద కళలకు ప్రాధాన్యత కల్పించాలని ఎస్‌కేఈ పారా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ బాబూరావ్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం రాత్రి రంగమందిరంలో శరణప్ప గోనాళ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జానపద సంభ్రమ కార్యక్రమంలో మాట్లాడారు. నేడు పాత కాలపు కళలకు ఆదరణ కరువవుతోందన్నారు. ఇలాంటి తరుణంలో కలబురిగ్గిలో జానపద విశ్వవిద్యాలయం ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు శరణప్ప, ప్రతిభ, గోపి, నాగేష్, శాంత, జగన్నాథ్, ప్రభ, వీరేంద్ర, రేఖ, వెంకటేష్‌లున్నారు.

నిరంతర అధ్యయనం అవసరం


జ్యోతి వెలిగిస్తున్న మారుతి బగాదే

రాయచూరు రూరల్: న్యాయవాదులు నిరంతరం అధ్యయనం చేయాలని జిల్లా ప్రధాన జడ్జి మారుతి బగాదే అన్నారు. సోమవారం జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. న్యాయశాస్త్ర అంశాలను శ్రద్ధగా చదవాలన్నారు. శిబిరంలో అదనపు జిల్లా జడ్జి దయానంద బేలూరు, ధారవాడ న్యాయవాది సావలి గమఠ, ప్రభు, శశిధర గౌడ, బసప్ప తిప్పారెడ్డి, అంబాపతి, మల్లికార్జున, వీరభద్రప్ప, నాగరాజ, శివశంకర్, రేణుక, ఈరమ్మ, బసనగౌడ, శివరాజ్, విజయలక్ష్మి, మల్లారెడ్డిలున్నారు.

నియామకం

గంగావతి: కర్ణాటక విలేకరుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆదేశాల మేరకు తాలూకా అధ్యక్షులుగా శ్రీనివాస్ దేవికేరిని ఆ సంఘం జిల్లాధ్యక్షుడు నియమించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘం తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తానన్నారు. నిత్యం పలు రకాల సమస్యలను ఎదుర్కొనే విలేకరుల సమస్యల పరిష్కారానికి తాను శాయశక్తులా కృషి చేస్తానన్నారు. తన నియామకంపై సంఘం సభ్యులు, సంఘం రాష్ట్ర కార్యదర్శి హొసకెరె మల్లికార్జున హర్షం వ్యక్తం చేశారు.

కేపీఎస్‌సీ సభ్యునికి సన్మానం


సన్మానం అందుకున్న రామకృష్ణ ప్రసాద్

కోలారు: కర్ణాటక లోక్ సేవా కమిషన్(కేపీఎస్‌సీ) సభ్యుడిగా నియమితులైన కేఎస్‌ఆర్‌పీ డీఐజీ ఎంవీ రామకృష్ణ ప్రసాద్‌ను జిల్లా యాదవ సంఘం పదాధికారులు సన్మానించారు. జిల్లాలోని కేజీఎఫ్‌కు చెందిన రామకృష్ణ ప్రసాద్ కేపీఎస్‌సీ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈనేపథ్యంలో అఖిల భారత యాదవ మహాసభ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా యాదవ సముదాయానికి చెందిన వ్యక్తికి కేపీఎస్‌సీ సభ్యత్వం లభించడం గర్వకారణమన్నారు. సంఘం అకౌంటెంట్ హుళియప్ప, మాజీ ఉపాధ్యక్షుడు సదాసంద, వీటీయూ సిండికేట్ సభ్యుడు చిత్తప్ప తదితరులు ఉన్నారు.

ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరం


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

గంగావతి: కారటగి తాలూకాలోని బసవణ్ణ క్యాంప్‌లో సోమవారం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో ఎయిడ్స్, రక్త పరీక్షలు, బీపీ, షుగర్, క్షయ వ్యాధికి 92 మందికి పరీక్షలు జరిపారు. వీరిలో 16 మంది బీపీ, షుగర్ పరీక్షలు, నలుగురికి క్షయ పరీక్షలు చేశారు. పలువురిని మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రికి రావాలని వైద్యులు సూచించారు. శిబిరంలో డాక్టర్ అర్పిత, గాయత్రి, హనుమంత, శివలీల, రేఖ, దుర్గమ్మ, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దుర్గమ్మ సిడిబండి రథోత్సవం నేడే

- ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి
- విద్యుద్దీపాలంకరణలో మిరుమిట్లు

బళ్లారి అర్బన్: బళ్లారి ప్రజల ఆరాధ్యదైవం కనక దుర్గమ్మ సిడిబండి రథోత్సవం మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈఓ హనుమంతప్ప తెలిపారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా సిడిబండి రథోత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఆలయ నలు దిక్కుల్లోని నాలుగు గోపురాలకు రంగులు వేసి విద్యుత్ అలంకరణలతో ముస్తాబు చేశారు. భక్తులకు దర్శనం కోసం క్యూలైన్ పద్ధతిని ఏర్పాటు చేశారు. సిడిబండి రథోత్సవంలో జిల్లా ఇంచార్జి మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా, హిందూ ధార్మిక దత్తి శాఖ అధికారి హెచ్.గంగాధరప్ప, దేవస్థాన ధర్మకర్త పీఎం రాజశేఖర్‌తో పాటు ఆలయ కమిటీ సభ్యులు, కౌల్ బజార్ గాణిగ సమాజం ప్రముఖులు, పోలీస్ అధికారులు పాల్గొంటారన్నారు. ఒక రోజు ముందుగానే సోమవారం సాయంత్రం కౌల్‌బజార్‌లోని గాణిగర సమాజం వారు ఏర్పాటు చేసిన సిడిబండి కౌల్‌బజార్, బసవనకుంట, ఎస్పీ సర్కిల్, పార్వతి నగర్ రోడ్డు మీదుగా కనకదుర్గమ్మ ఆలయానికి చేరుకుంది.

కనకదుర్గమ్మ దేవి ఆలయ చరిత్ర

నగర ప్రజలకు శాంతి, ఆరోగ్యం కోసం ఏటా కనకదుర్గమ్మ సిడిబండి ఉత్సవాలను కౌల్‌బజార్ గాణిగర సమాజ బాంధవులు ఆచరిస్తున్నారు. పురాతన కాలంలో బళ్లారిలో కలరా వ్యాధి వ్యాపించడంతో అమ్మవారు ఒకరికి కలలో వచ్చి సిడిబండికి దిష్టిబొమ్మను కట్టి ఆలయం చుట్టు ప్రదక్షణలు చేయమని చెప్పిందని సమాచారం. అప్పట్లో సిడిబండికి ఎద్దులను కట్టి ఒక మనిషిని కాడుమానుకు వేలాడ కట్టి అమ్మవారి ఆలయం చుట్టు మూడు ప్రదక్షణలు చేస్తూ వచ్చారు. నగర ప్రజలు ఆరోగ్యంగా, శాంతియుతంగా ఉండేందుకు ఈ సిడిబండి ఉత్సవాలు ఏటా నిర్వహిస్తున్నట్లు గాణిగర సమాజ ప్రముఖులు రవికుమార్, రమేష్‌బాబు తెలిపారు. మొదట్లో మనిషిని సిడిబండికి కట్టి ఊరేగించేవారు. అయితే ఆ తర్వాత క్రమంగా మనిషి రూపంలో దిష్టిబొమ్మను తయారు చేసి సిడిబండి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1974లో ఆలయం ప్రభుత్వ దేవదాయ శాఖ పరిధిలోకి వచ్చింది. ఆలయ పూజారులుగా యాదవ సమాజ బాంధవులకు వంశపారంపర్యంగా బాధ్యతలు అప్పగించి అమ్మవారికి పూజలు చేస్తున్నట్లు తెలిపారు. సిడిబండి రథోత్సవంలో బళ్లారి గాణిగర వంశపారంపర్యంగా దోణప్ప వీధిలోని రెండు ఎద్దులు, బళ్లారి గాణిగర సంఘం రెండు ఎద్దులు, సిరుగుప్ప గాణిగర సమాజం రెండు ఎద్దులను సిడిబండికి కట్టి అమ్మవారి ఆలయం చుట్టు మూడు ప్రదక్షిణలు చేస్తున్నట్లు తెలిపారు.


ఆలయం వద్ద రథోత్సవానికి చేసిన ఏర్పాట్ల దృశ్యం

ఆలయ అభివృద్ధికి నిరంతర కృషి

చాలా ఏళ్ల నుంచి కనకదుర్గమ్మ ఆలయ వంశపారంపర్య పూజారులు ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఆలయ ప్రధాన ధర్మకర్త పీ.గాదెప్ప తెలిపారు. భక్తుల సహకారంతో అమ్మవారి ఆలయం రూపురేఖలను మార్చుతున్నట్లు తెలిపారు. అప్పట్లో ఎర్రమట్టి, తెల్ల సున్నంతో ఉన్న ఆలయ గోడలను ప్రస్తుతం మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. మధుర మీనాక్షి దేవి ఆలయం మాదిరిగా దుర్గమ్మ ఆలయానికి గోపురాలు నిర్మించి పుష్కరణి, ప్యారపేట, ప్రాంగణంలో తాగునీరు, విశ్రాంత మండపాలు, అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. మొదట్లో అమ్మవారి రూపానికి మాత్రం పూజలు జరిగాయి. భక్తుల సహాయంతో వెండి ఆభరణాల అలంకరణలతో ప్రస్తుతం బంగారు ఆభరణాలతో పూజలు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయం ముందు దుర్గాదేవి ఎత్తైన విగ్రహం, నరకాసురుని విగ్రహాలను కూడా ప్రతిష్టించి పూజలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సిడిబండి ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.


ఆలయం వెలుపల అమ్మవారి విగ్రహం


దీపాలంకరణలో కనకదుర్గమ్మ వారి ఆలయం

ఎన్నిక


శశీల్ నమోషి

రాయచూరు రూరల్: హైదరాబాద్ కర్ణాటక విద్యా సంఘం(హెచ్‌కేఈఎస్) అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ శశీల్ నమోషి ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపును అదే రోజురాత్రి కలబురిగ్గిలోని హైదరాబాద్ కర్ణాటక విద్యా సంఘం భవనంలో నిర్వహించారు. ఓట్ల లెక్కింపులో అధ్యక్ష పదవికి పోటీ చేసిన శశీల్ నమోషికి 617 ఓట్లు, సంతోష్ బిల్‌గుండికి 502 ఓట్లు, డాక్టర్ కామరెడ్డికి 249 ఓట్లు, రాజశేఖర్‌కు 3 ఓట్లు లభించాయి. దీంతో శశీల్ నమోషి ఎన్నికైనట్లు ప్రకటించారు.

శెట్టర్‌కు టికెట్ ఇవ్వకుంటే ఉధృత పోరాటం

హుబ్లీ: మాజీ సీఎం జగదీశ్ శెట్టర్‌కు బెళగావి లోక్‌సభ బీజేపీ టిక్కెట్‌ను తప్పించడానికి కుట్రలు జరుగుతున్నాయి. ఒక వేళ ఆయనకు టిక్కెట్ దక్కక పోతే ఉధృత పోరాటం చేస్తామని అఖిల భారత వీరశైవ లింగాయత మహా సభ హెచ్చరించింది. సోమవారం ఈ మేరకు ఆ మహాసభ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ వీసీ సవడి విలేకరులతో మాట్లాడారు. శెట్టర్ పార్టీని పెంచి పోషించారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఆయనకు టిక్కెట్ రాకుండా చేశారన్నారు. ధార్వాడ, హావేరి లోక్‌సభ స్థానాలకు టిక్కెట్ కూడా తప్పించారని మండిపడ్డారు. ప్రస్తుతం బెళగావి లోక్‌సభ స్థానానికి ఆయన పేరు ముందంజలో ఉన్నా కొందరు కుట్రలు చేసి ఆయనకు టిక్కెట్ రాకుండా ప్రణాళిక రూపొందిస్తున్నారన్నారు. వారి కుట్రలకు పార్టీ అధిష్టానం తలొగ్గకుండా శెట్టర్‌కు టిక్కెట్ కేటాయించాలన్నారు. ఒక వేళ టిక్కెట్ తప్పితే వీధుల్లోకి దిగి పోరాటం చేస్తామన్నారు. అంతేగాకుండా ఈ ఎన్నికల్లో బీజేపీకి తమ సత్తా ఏంటో చూపించి తగిన గుణపాఠం చెబుతామన్నారు.

ఆటలాడుతూ అనంత లోకాలకు..

- నీటి తొట్టిలో పడి బాలుడి దుర్మరణం

రాయచూరు రూరల్: ఇంటివారందరూ నమాజు చేస్తుండగా మూడేళ్ల బాలుడు ఆటలాడుతూ నీటి తొట్టిలో పడి దుర్మరణం పాలైన ఘటన దావణగెరె జిల్లా హొన్నాళిలోని తుంగభద్ర కాలనీలో చోటు చేసుకుంది. వివరాలు..అసద్ అహ్మద్(3) అనే బాలుడు కుటుంబ సభ్యులు నమాజు ముగించుకొని బయటికొచ్చి చూడగా కనిపించక పోవడంతో ఆందోళన చెందారు. సుమారు రెండు గంటల పాటు వెతికారు. చివరికి నీటి తొట్టిని పరిశీలించగా బాలుడి మృతదేహం కనిపించడంతో భోరుమన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి శవ పరీక్షకు పంపి హొన్నాళి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఈసారి కమలధారి ఎవరో?

- గోప్యంగా బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక వ్యవహారం
- టికెట్లు దక్కకుంటే ప్రత్యర్థి పార్టీలో చేరే యోచనలో ఆశావహులు


ఎంపీ రాజా అమరేశ్వర నాయక్


మాజీ ఎంపీ బీ.వీ.నాయక్


మాజీ ఎమ్మెల్యే తిప్పరాజ్

రాయచూరు రూరల్: రాయచూరు, యాదగిరి జిల్లాల లోక్‌సభ బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికలో ఆయా పార్టీల అధినాయకత్వం గోప్యతను పాటిస్తున్నారు. రాయచూరు లోక్‌సభ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసేవారిలో మాజీ ఎంపీ బీ.వీ.నాయక్, మాజీ ఎమ్మెల్యే తిప్పరాజ్ హవల్దార్, సిట్టింగ్ ఎంపీ రాజా అమరేశ్వర నాయక్‌ల పేర్లు రేసులో ఉన్నాయి. పార్టీ కార్యకర్తల అభిప్రాయ సేకరణ, అభ్యర్థి ఎంపికపై సమీక్ష నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం తన అభ్యర్థి ఎంపిక కోసం బీజేపీ అభ్యర్థి ఎంపిక కోసం ఎదురు చూస్తోంది. కాంగ్రెస్ పార్టీ తరపున మాజీ ఐఏఎస్ అధికారి కుమార్ నాయక్, గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ, సుప్రీంకోర్టు న్యాయవాది దేవన్న నాయక్, మంత్రి సతీష్ జార్కిహోళి బంధువు రవి పాటిల్‌లు టికెట్ రేసులో ఉన్నారు. ఎంపీ రాజా అమరేశ్వర నాయక్‌కు బీజేపీ టికెట్ నిరాకరిస్తే కాంగ్రెస్ పార్టీలో చేరే యోచనలో ఉన్నారు. బీ.వీ.నాయక్‌కు బీజేపీ టికెట్ ఇవ్వక పోతే ఆయన కూడా హస్తం పార్టీలో చేరే అవకాశాలున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎంపీ రాజా అమరేశ్వర నాయక్‌కు 2002 వరకు కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసిన అనుభవం ఉంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నుంచి ఆయన పోటీ చేసి గెలుపొందారు. మాజీ ఎంపీ బీ.వీ.నాయక్ కాంగ్రెస్ అభ్యర్థిగా 2014లో కాంగ్రెస్ నుంచి ఎంపీగా గెలిచారు. 2019 ఎన్నికల్లో ఓడిపోయారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మాన్వి నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఏదేమైనా ఇద్దరూ కాంగ్రెస్ పార్టీ నుంచి కమలం తీర్థం పుచ్చుకున్న వారే కావడం గమనార్హం.

నీరసాగర నీటిని పంటల సాగుకు వాడొద్దు

హుబ్లీ: నీరసాగర ఆనకట్ట నీటిని పంటల సాగుకు వాడరాదని జిల్లా యంత్రాంగం రైతులకు సూచించింది. ఎండాకాలం ప్రారంభం కావడంతో తాగు నీటి సమస్య తలెత్తింది. గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో వర్షాలు కురవక ప్రజలు నీటి కోసం హాహాకారాలు చేస్తున్నారు. అందువల్ల నీరసాగర జలాశయం నుంచి ఆ చుట్టు పక్కల రైతులు నీటిని వ్యవసాయానికి వాడరాదని అధికార యంత్రాంగం కట్టుదిట్టంగా రైతులకు సూచించింది. ఆ పరిధిలోకి వచ్చే గుడికట్టి, లింగనకొప్ప, బసవనకొప్ప, కళసదకొప్ప, నీరసాగర, కన్యకొప్ప తదితర గ్రామాల రైతులు తమ పొలాలకు ఈ జలాశయం నుంచి నీటిని మోటార్ పంపుసెట్ల ద్వారా మళ్లించుకోవడాన్ని వెంటనే నిలిపేయాలని సూచించారు. మోటార్ పంప్‌సెట్ ద్వారా నీటిని వాడితే సంబంధిత మోటార్లను స్వాధీనం చేసుకొని చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హుబ్లీ ధార్వాడ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ ఈశ్వర్ ఉళ్లాగడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పాత హుబ్లీలో 22 వార్డులకు తాగునీటిని సరఫరా చేసేది ఈ జలాశయం నుంచే అని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం జలాశయంలో నీటిమట్టం రోజురోజుకు తగ్గిపోతోందన్నారు. ప్రస్తుతం 0.3 టీఎంసీల నీటి లభ్యత ఉందన్నారు. ఈ నీటిని హుబ్లీ నగర ప్రజలకు తాగునీటి అవసరాలకు కేటాయించామన్నారు. సీఎం సిద్దరామయ్య వీడియో కాల్ ద్వారా జరిపిన ప్రగతి పరిశీలన సమావేశంలో విపత్తు నిర్వహణకు సంబంధించి తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించిన నేపథ్యంలో జిల్లాధికారి ఈ సూచన చేశారు. వర్షాలు ప్రారంభం అయ్యేదాకా సాగుకు ఈ నీటిని ఎట్టి పరిస్థితిలో వాడరాదని విజ్ఞప్తి చేశారు.

రోగులకు పాలు, పండ్లు పంపిణీ

గంగావతి: దివంగత డాక్టర్ పునీత్‌రాజ్‌కుమార్ జయంతి సందర్భంగా సోమవారం గాంధీనగర్ యువకుడు హనుమేష్ ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్‌ను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డాక్టర్ పునీత్‌రాజ్‌కుమార్ దివ్యాంగులు, అనాథలు, పేదలకు ప్రజా సేవ చేశారని, పలు రకాలుగా ఆర్థికసాయం చేసి ఆదుకొన్నారన్నారు. అలాంటి దానపరుడు మళ్లీ పుట్టాలని దేవుడిని ప్రార్థిస్తున్నామన్నారు. ఈసందర్భంగా యువకులు మహంతేష్, వెంకటేష్, శివరాజ్, కిరణ్‌కుమార్, గాదిలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

పానీపూరి తిని బాలుడి మృతి


హజరత్ బిలాల్ ఇర్ఫాన్(ఫైల్)

రాయచూరు రూరల్: రంజాన్ సందర్భంగా పిల్లలు పానీపూరీ తిని అస్వస్థతకు గురైన ఘటన దావణగెరె జిల్లా హరిహర తాలూకా మలెబెన్నూరులో చోటు చేసుకుంది. గ్రామంలో 19 మంది పిల్లలు పానీపూరీ తిన్నారు. వీరిలో హజరత్ బిలాల్ ఇర్ఫాన్(6) అనే బాలుడు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అస్వస్థతకు గురైన మరో 18 మంది పిల్లలు దావణగెరెలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఓట్ల కోసం వచ్చే అభ్యర్థులను అడ్డుకోండి

హుబ్లీ: తీవ్రమైన కరువుతో అల్లాడుతున్న రైతులు, పశుపక్షాదులకు తాగునీరు, పశుగ్రాసం దొరకని ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామాలకు ఓట్లు అడగడానికి వచ్చే వివిధ పార్టీల అభ్యర్థులను నిలదీయాలని రాష్ట్ర రైతు సంఘం సమాఖ్య అధ్యక్షుడు కురుబూరు శాంతకుమార్ అన్నారు. ఆయన ఉళవి చెన్నబసవేశ్వర దేవస్థానంలో రైతులతో నిర్వహించిన సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కరువు తాండవిస్తుండటంతో గ్రామాల్లో తాగునీరు, పశువులకు మేత కరువైందన్నారు. అయినా రాజకీయ పార్టీల నేతలు అధికారం కోసం తపిస్తున్నారన్నారు. అధికారులు కూడా ఎన్నికల హడావిడిలో ఉండగా రైతులు మాత్రం దిగులుగా ఉన్నారన్నారు. గ్రామాలకు ఓట్లు వేయాలని అడిగేందుకు వచ్చే రాజకీయ పార్టీలను, సంబంధిత అభ్యర్థులను తిరస్కార ధోరణితో స్వాగతించడం ద్వారా తమ తీవ్రమైన సమస్యలను వారి దృష్టికి తేవాలన్నారు. రైతులు గిట్టుబాటు ధర అడిగితే కాల్పులు జరుపుతున్నారు. కేవలం 2 శాతం ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు 27 శాతం వేతనాలు పెంచమని నివేదిక సమర్పిస్తున్నారు. ఏ పరమార్థానికి ఎంపీలను గెలిపించాలని ప్రశ్నించారు. దేశానికి అన్నదాత అయిన రైతులను అనాథలను చేయరాదని ఆయన ఆక్రోశం వ్యక్తం చేశారు.

వైభవంగా సోమేశ్వర రథోత్సవం

రాయచూరు రూరల్: జిల్లాలోని సిరవార తాలూకా నవలకల్‌లో ఆదివారం సాయంత్రం సోమేశ్వర రథోత్సవం వైభవంగా జరిగింది. వేలాది మంది భక్తుల సమక్షంలో రథాన్ని లాగారు. రథోత్సవంలో మఠాధిపతి పంచాక్షరి శివాచార్యులు, శాంతమల్ల శివాచార్యులు, శంభు సోమనాథ, బూది బసవేశ్వర శివాచార్యులతో పాటు రాయచూరు, మాన్వి, సింధనూరు, కొప్పళ, బళ్లారి, లింగసూగూరు తాలూకాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ట్యాంకర్లతో నీరివ్వండి

- కొత్తగా బోర్లు వేయండి
- బెంగళూరులో నీటి కొరతపై సీఎం సూచనలు

బనశంకరి: బెంగళూరులో నీటి కొరత రాకుండా చూడాలని, సమస్య ఏర్పడిన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య అధికారులకు సూచించారు. సోమవారం బీబీఎంపీ, బెంగళూరు జలమండలి అధికారులతో నీటి ఎద్దడిపై సమావేశమయ్యారు. శివారుప్రాంతాలు, కొత్తగా పాలికెలోకి చేరిన 110 పల్లెల్లో నీటి సమస్య తలెత్తినట్లు సమాచారం ఉంది. తక్షణం పరిష్కార చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రైవేటు ట్యాంకర్ల దందా కు అడ్డుకట్ట వేసి, వాటిని స్వాధీనం చేసుకుని నీటి సరఫరా చేయాలన్నారు. కావేరి నీరు సరఫరా అవుతున్న ప్రాంతాల్లో తాగునీటి సమస్య లేదని తెలిపారు. కొరత ఉన్న చోట్ల బోర్లు వేయాలన్నారు. డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఎఫెక్ట్

ఈ సమావేశంపై ఎన్నికల కోడ్ ప్రభావం పడింది. సీనియర్ అధికారులు నేరుగా సమావేశంలో పాల్గొనలేదు. ఈ సమావేశం కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని తెలిసి రాలేదు. వ్యక్తిగతంగా సమస్య పరిష్కారానికి కొన్ని సూచనలు చేశారు.

సమ సమాజాన్ని నిర్మించాలి


జ్యోతి వెలిగిస్తున్న స్మిత

రాయచూరు రూరల్: సమ సమాజ నిర్మాణం కోసం మహిళలు ముందడుగు వేయాలని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ సంచాలకురాలు స్మిత పేర్కొన్నారు. సోమవారం రంగ మందిరంలో వెనుక బడిన వర్గాల మహిళలు ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సమావేశంలో జ్యోతి వెలిగించి మాట్లాడారు. వివేక తుల్యమైన చింతనలు, విలువలతో కూడిన సమాజంలో అభివృద్ధికి అనుకూలంగా ఉంటుందన్నారు. మహిళలు హక్కులు, విధులు, సమానత్వాల మధ్య మహిళలను పనులకు తీసుకోకపోవడం విచిత్రమన్నారు. విద్యా, సామాజిక, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు వీలవుతుందన్నారు. మహిళలు రాజకీయాల్లో రిజర్వేషన్ల కోసం ఆందోళన చేపట్టాలన్నారు. సమావేశంలో దేవన్న నాయక్, శాంతప్ప, లలిత, నాగవేణి, ఖాజన గౌడ, హన్మంతప్ప, జంబణ్ణ, సురేఖ, ఈరమ్మ, గంగుబాయిలున్నారు.

ప్రేమించి.. నమ్మించి.. వంచించి..

- ప్రియురాలికి అబార్షన్ చేయించి ప్రియుడు పరారీ


ప్రేమికుల జంట(ఫైల్)

రాయచూరు రూరల్: ప్రేమించిన ప్రియురాలిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెను లోబర్చుకుని గర్భం దాల్చిన అనంతరం ఆమెకు అబార్షన్ చేయించి ప్రేమికుడు పరారైన ఘటన కొప్పళ జిల్లా కనకగిరి తాలూకా వరనఖేడలో వెలుగు చూసింది. గ్రామానికి చెందిన మంజునాథ్, అదే గ్రామానికి చెందిన యువతి రెండేళ్ల నుంచి ప్రేమించుకున్నారు. రెండు నెలల క్రితం ఇద్దరు గ్రామం నుంచి పరారయ్యారు. ఈ ఘటనపై కనకగిరి పోలీస్ స్టేషన్‌లో యువతి అదృశ్యంపై కేసు నమోదైంది. అయితే మూడు రోజుల క్రితం మంజునాథ్ యువతిని పిలుచుకొచ్చాడు. అతని సోదరుడు హనుమేష్ నాయక్ సహకారంతో హిరేవంకలకుంటలో వైద్యుడితో అబార్షన్ చేయించి అక్కడే వదిలి పెట్టి వెళ్లాడు. రక్తస్రావం అధికం కావడంతో ఆమెను మహిళా సాంత్వన కేంద్రంలో ఉంచారు. మెరుగైన చికిత్స కోసం గంగావతి ఆస్పత్రిలో చేర్పించినట్లు పోలీసులు తెలిపారు. సోదరుడు హనుమేష్ నాయక్, హిరే వంకలకుంట వైద్యుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మి తెలిపారు.

పది పరీక్షలను సజావుగా నిర్వహించండి

- అధికారులకు డీడీపీఐ సూచన


మాట్లాడుతున్న డీడీపీఐ కృష్ణమూర్తి

కోలారు: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 25 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలను సజావుగా నిర్వహించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని డీడీపీఐ కృష్ణమూర్తి సూచించారు. సోమవారం నగరంలోని ఎస్‌డీసీ కళాశాలలో 65 పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి గందరగోళానికి తావు లేకుండా పరీక్షలను నిర్వహించాలన్నారు. పరీక్ష సిబ్బంది తప్పనిసరిగా గుర్తింపు కార్డును ధరించాలన్నారు. అనధికారిక వ్యక్తులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించవద్దన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రతి పరీక్ష గదిలోను వెలుగు, గాలి సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రశ్నపత్రాలను పరీక్షా కేంద్రాలకు గట్టి బందోబస్తు మధ్య తరలించాలన్నారు. అదేవిధంగా సమాధాన పత్రాలను ట్రెజరీకి తరలించే సమయంలో కూడా గట్టి బందోబస్తు ఉండాలన్నారు. సమావేశంలో శిక్షణాధికారి సహీదా అంజుం, ముళబాగిలు బీఈఓ గంగరామయ్య, శ్రీనివాసపురం బీఈఓ మునిలక్ష్మయ్య పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తీవ్ర రూపం


బిందెలతో నీటిని మోసుకెళుతున్న వ్యక్తి

రాయచూరు రూరల్: నగరంలో తాగునీటి ఎద్దడి ప్రారంభమైంది. పట్టణ ప్రాంతాల్లో ప్రజలు నీటి కోసం పలు ఇబ్బందులకు గురయ్యారు. నగరంలో ఏపీఎంసీ కాలనీలో నీటిఎద్దడి నెలకొంది. రక్షిత నీటి పథకాలున్నా పని చేయక పోవడంతో కి.మీ.ల దూరంలో ఉన్న బోరుబావి నీటిని తాగడం కష్టతరమని ప్రజలు వాపోతున్నారు. రాయచూరు ప్రభుత్వ వైద్య కళాశాల వద్ద ఉన్న నీటిని పంపింగ్ చేసే మోటారు కాలిపోవడంతో నీటి ఎద్దడి తీవ్రమైంది. నగరసభ అధికారులు మోటారు మరమ్మతు పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని అధికారులు అంటున్నారు. వెయ్యి మంది నివాసం ఉంటున్న ఏపీఎంసీ హమాలీల కుటుంబాలు నీటి కోసం పరితపిస్తున్నాయి. సోమవారం కాలనీలో ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం


ఉత్తమ ఉపాధ్యాయిని లక్ష్మిని అభినందిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర శ్లాఘనీయమని, విద్యార్థులకు అన్ని విధాలుగా ఉత్తమ శిక్షణనందిస్తున్న ఉపాధ్యాయులు గౌరవనీయులని కర్ణాటక జ్ఞాన విజ్ఞాన సమితి జిల్లా అధ్యక్షుడు జి.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం తాలూకాలోని రోణూరు ఉన్నత పాఠశాలలో సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో ఆయన మాట్లాడారు. సైనికుడు, వైద్యుడు, న్యాయవాది ఇలా అన్ని హోదాల కంటే ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైందన్నారు. ఉపాధ్యాయ వృత్తి గౌరవాన్ని కాపాడడానికి ప్రతి ఉపాధ్యాయుడు ప్రయత్నించాలన్నారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు గ్రహీత, రోణూరు పాఠశాల ఉపాధ్యాయిని హెచ్‌కె లక్ష్మిని సన్మానించారు. సమితి జిల్లా కోశాధికారి జగన్నాథ్, జిల్లా కార్యదర్శి శరణప్ప జమాదార్, జిల్లా సమన్వయ కార్యదర్శి ముకుంద, జిల్లా సంచాలకుడు సురేష్, తాలూకా గౌరవ అధ్యక్షుడు రమణప్ప పాల్గొన్నారు.

పెచ్చులూడి పడిన బస్టాండు పైకప్పు

- విద్యార్థినులకు గాయాలు


పెచ్చులూడి కిందపడిన బస్టాండు పైకప్పు సీలింగ్

మాలూరు: బస్టాండు పైకప్పు పెచ్చులూడి కింద పడి విద్యార్థినులకు గాయాలైన ఘటన సోమవారం పట్టణంలోని బస్టాండులో జరిగింది. ఘటనలో బస్సు కోసం వేచి ఉన్న విద్యార్థినులు రేణుక, మధుశ్రీలకు గాయాలు కావడంతో వారిని వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. కంప్యూటర్ తరగతిని ముగించుకుని తమ గ్రామానికి తిరిగి వెళుతుండగా ఘటన చోటు చేసుకుంది. శిథిలావస్థలో ఉన్న బస్టాండు పైకప్పునకు వెంటనే మరమ్మతులు చేయాలని పట్టణ వాసులు డిమాండ్ చేశారు.